సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 346

శనివారం 8-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'







నేడు
అంతర్జాతీయ
మహిళా దినోత్సవం



విత్తనంలో మహావృక్షం దాగి ఉంటుందనేది అనుభవజ్ఞులు చెప్పిన మాట. ఆ మాటలను ఆచరణలో పెట్టి ఫలాలను పంచేవారు ఎప్పుడూ సమాజంలో స్ఫూర్తి మంతంగా నిలుస్తారు.
మహిళగా ఏడుపదుల అనుభవాన్ని, తన ఆలోచనలను పంచుకున్నారు సికింద్రాబాద్ బోయినపల్లిలో ఉంటున్న కావేరీ సీడ్స్ డైరెక్టర్ జి.వి.వనజాదేవి.
'కుటుంబం, సమాజం పట్ల బాధ్యతలు నిర్వర్తించాలంటే మహిళలు అన్నింటికన్నా ముందు స్వీయ ప్రేమ కలిగి ఉండటం అవసరం' అంటున్నారామె.

జి.వి.వనజాదేవి

స్వీయ ప్రేమ ముఖ్యం

- కావేరీ సీడ్స్ డైరెక్టర్ జి.వి.వనజాదేవి

గత కాలం, ప్రస్తుతం కాలం అంటూ మహిళ విషయంలో ప్రత్యేకించి చెప్పలేం. ఏ రోజుల్లోనైనా మహిళ సంఘర్షణలతోనే దోస్తీ చేస్తుంది. ఆమె ఆలోచనలన్నీ కుటుంబం చుట్టూతానే కేంద్రీకృతమై ఉంటాయి. తల్లిదండ్రులు, తోబుట్టువులు, పెళ్లయ్యాక భర్త, అత్తింటివాళ్లు, పిల్లలు .. ఒత్తిడితో కూడిన జీవనంలోనే తనని తాను నిరూపించుకోవడానికి, నిలబడటానికి పోరాటం చేస్తూనే ఉంటుంది. అయితే, ఈ క్రమంలో తనని తాను మర్చిపోతుంది. పెళ్లి తర్వాత కుటుంబ పోషణలో లీనమైపోతూ తన ఆరోగ్యం గురించి పట్టించుకోదు, చక్కగా ముస్తాబు అవడాన్ని పట్టించుకోదు. నిజానికి తనని తాను ప్రేమించుకోవడం మర్చిపోతుందనిపిస్తుంది.

ఆత్మస్థైర్యమే బలం

మాది కరీంనగర్ జిల్లాలోని గట్ల నరసింగాపూర్ గ్రామం. పెద్ద కుటుంబం. ఎప్పుడూ నలుగురికి పెట్టగలిగే స్థితిలోనే ఉన్నాం. ఉమ్మడి కుటుంబంలో అందరినీ కలుపుకుని పోతూ, బాధ్యతలను నెరవేరుస్తూ, నా ఉనికిని కోల్పోకుండా కాపాడుకున్నాను. పెళ్లినాటికి డిగ్రీ చదువు పూర్తయ్యింది. మా వారు జి.వి.భాస్కరరావుకి వ్యవసాయ రంగం అంటే ప్రేమ. అగ్రికల్చర్ బీఎస్సీ చేశారు. పుట్టిన గడ్డపైన తనని తాను నిరూపించుకోవాలని తపన. అందుకు నేను మద్దతుగా నిలిచాను. కావేరీ సీడ్స్ మొదలుపెట్టినప్పుడు ఒడిదొడుకులు ఎదుర్కొన్నాం. సమస్య వచ్చింది కదా అని అక్కడే వదిలేస్తే ఈ రోజు కావేరీ సీడ్స్ ఉండేది కాదు. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో 50కి పైగా మా సీడ్ యూనిట్స్ ఉన్నాయి. ఈ ఏడాది వ్యవసాయ రంగంలో విద్యార్థులను తీర్చిదిద్దడానికి కావేరీ యూనివర్సిటీ కూడా ప్రారంభించాం.

దిద్దుబాటు

కుటుంబం, పిల్లల బాగోగులు, కంపెనీలో చేదోడుగా ఉండటం .. ఒక దశ తర్వాత బాధ్యతలు తీరి కాస్త తీరిక దొరకడంతో చేయాలా అని ఆలోచిస్తున్నప్పుడు చిన్నజీయర్ స్వామి వారి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకర్షించాయి. అప్పుడే జైలుశిక్ష అనుభవిస్తున్న మహిళల గురించి తెలిసింది. ఖైదీలుగా ఉన్నవారి సమస్యలను అర్థం చేసుకోవడానికి చంచల్‌గూడ, చర్లపల్లి జైలుకు 'వికాస తరంగిణి'సభ్యులతో కలిసి వెళ్లాను. క్రమం తప్పకుండా మహిళా ఖైదీలను కలవడం, కౌన్సెలింగ్ ఇవ్వడం, వారి పిల్లలను తిరిగి స్కూళ్లలో చేర్పించడం వంటి కార్యక్రమాలు చేశాం. మంచి ఫలితాలు రావడంతో కరీంనగర్, రాజమండ్రి, వరంగల్, విజయవాడ, వైజాగ్‌లలోని జైళ్లలోనూ కౌన్సెలింగ్ కార్యక్రమాలకు ఆహ్వానం అందింది. మహిళాఖైదీలు జైలు నుంచి విడుదలయ్యాక వారి జీవనం సానుకూలంగా గడిచే ఏర్పాట్లు చేయడం ఎంతో తృప్తిని కలిగించింది. క్యాన్సర్ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనడం, కాన్సర్ రోగులకు చికిత్స అందేలా చూడటం, మా ఊరితోపాటు చుట్టుపక్కల గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేయడం, మహిళారైతుల సమస్యలను తీర్చడం, చదువుకునే విద్యార్థులకు క్యాంపులు, మహిళలకు శిక్షణాతరగతులు నిర్వహించడం.. ఇలా సామాజిక కార్యక్రమాలలో పాల్గొనే అవకాశాలు లభించాయి. వ్యవసాయ రంగంలో మహిళలు రావడం అంటే గత కాలం కూలీలుగానే చూసేవాళ్లం. కానీ, ఇప్పుడలా కాదు. ఉన్నతవిద్యతో వ్యవసాయం రంగంలో మార్పులు తీసుకురావడానికి యువతరం ముందుకు వస్తుంది. మా యూనివర్శిటీలో చేరిన విద్యార్థుల సంఖ్యే అందుకు నిదర్శనం.

ముందుగా మహిళలు తమని తాము ప్రేమించుకోవాలి. ఆరోగ్యం, సంరక్షణ, చదువుతో తనకు తానుగా ఎదుగుతూనే కుటుంబ బాధ్యతలను నిర్వర్తించాలి. ఒక్కో విజయాన్ని అందుకుంటూ సమాజంలో వెనకబడినవారిని తనతో కలుపుకుంటూ ముందుకు వెళ్లాలి. దైనందిన జీవనం ప్రశాంతంగా, సంతోషంగా ఉండేలా ప్లాన్ చేసుకుంటే ఒత్తిడులను కూడా సులువుగా అధిగమించవచ్చు.'' తన అనుభవసారాన్ని కళ్లకు కట్టారు వనజాదేవి.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

విమెన్స్ డే 2025 థీమ్
మరింత వేగంగా... మరింత నిర్మాణాత్మకంగా

ఈ సంవత్సరం విమెన్స్ డే క్యాంపెయిన్ థీమ్... యాక్సిలరేట్ యాక్షన్.

లింగ సమానత్వాన్ని సాధించడానికి ఉత్తమమైన మార్గాలను ఎంచుకోవడంతో పాటు ఆ పనిని మరింత వేగంగా, నిర్మాణాత్మకంగా చేయాలి.
'యాక్సిలరేట్ యాక్షన్'లో మహిళల పురోగతికి ఉపయోగపడే వ్యూహాలు, ఆలోచనలు ఉంటాయి. 'లింగ సమానత్వానికి ఎన్నో అడ్డంకులు ఉన్నాయి' అని నిరాశపడిపోవడం కంటే ఆశావహ దృక్పథంతో తగిన కార్యాచరణతో ముందుకు వెళ్లడం అవసరం.



'యాక్సిలరేట్ యాక్షన్'కు సంబంధించిన ఒక నినాదం... సపోర్ట్ ది సపోర్టర్స్.
మనకు ఎవరైతే మద్దతు ఇస్తున్నారో వారికి మద్దతు ఇవ్వడం ద్వారా లింగ సమానత్వం కోసం వేసే అడుగులను వేగవంతం చేయవచ్చు. మహిళలకు సహాయపడేందుకు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో సంస్థలు పనిచేస్తున్నాయి. వాటికి సంఘీభావం తెలియజేయాలి.
మనం ఏ రకంగా యాక్సిలరేట్ యాక్షన్‌లో భాగం కావచ్చు?
వివక్షను సవాలు చేయడం, మహిళల విజయాన్ని సెలబ్రేట్ చేసుకోవడం, మనకు తెలిసిన విషయాలను ఇతర మహిళలతో కలిసి పంచుకోవడం, మహిళల నాణ్యమైన విద్య, ఆరోగ్యం గురించి పనిచేయడం, మహిళల సృజనాత్మకతను ప్రోత్సహించడం లాంటివి ఎన్నో ఉన్నాయి.



లైఫ్@360

* హార్టికల్చర్

అవగాహన ఉంటే అద్భుతాలు సృష్టించవచ్చు

- డాక్టర్ నీరజా ప్రభాకర్

'అన్నం ముద్దను మన నోటికి చేర్చే రైతు కష్టానికి అవగాహన, సాంకేతికత, ఆర్థిక వెన్నుదన్ను అందిస్తే వ్యవసాయ రంగంలో అద్భుతాలు సృష్టించవచ్చు' అంటున్నారు డాక్టర్ నీరజా ప్రభాకర్.
శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్శిటీకి ఫస్ట్ ఉమన్ వైస్ ఛాన్సలర్‌గా చేసి, అగ్రికల్చర్ యూనివర్శిటీలో హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్‌కి హెడ్‌గా,సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్నారు.
42 ఏళ్లుగా ఈ రంగంలో చేస్తున్న కృషిని, చోటుచేసుకుంటున్న మార్పులను, నేటి తరం ఆలోచనలనూ మన ముందు ఆవిష్కరించారు.

''రైతు నేలలో విత్తనాలు వేసిన రోజు నుంచి నీటి సదుపాయాలు, భూసారం, వాతావరణం, తెగుళ్లు.. అన్నింటినీ దాటుకొని రైతు కష్టం మన చేతికి వచ్చేవరకు ఏయే దశలు దాటుతుంది అనే విషయాల పట్ల అందరికీ అవగాహన ఉండాలి. అప్పుడే ఈ రంగంలో అద్భుతాలు సృష్టించగలం.

ఉల్లిపాయలు వేసిన మార్గం..

మాది వ్యవసాయం కటుంబం. చదువుకునే రోజుల నుంచి ఉల్లిపాయలపై మార్కెట్లో వచ్చే హెచ్చు తగ్గులు ఎప్పుడూ విస్మయానికి లోను చేస్తుండేవి. ఆ ఆలోచనతోనే 1983లో ఎమ్మెస్సీ హార్టీకల్చర్, అటు తర్వాత 'ఉల్లిపాయలు– నీటి యాజమాన్యం' మీద పీహెచ్‌డీ చేశాను. 1994లో సంగారెడ్డి ఎఆర్‌వో నర్సరీ ఇంచార్జ్‌గా జాయిన్ అయ్యాను. ఆ తర్వాత మూడేళ్లకు ఉల్లి ధరలు పెరగడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో రైతులు ఉల్లి సాగులో ఎక్కువ దిగుబడి సాధించడానికి శిక్షణాతరగతులు నిర్వహించాం. అక్కణ్ణుంచి మామిడి, జామ, సపోట, సీతాఫలం అంటు మొక్కలతో పాటు జామ, పనస వంటి పండ్లు, మల్లె మొక్కల... అమ్మకాలు కూడా ప్రారంభించాం.

ప్రాంతానికి తగిన విధంగా

ఏ ప్రాంతానికైనా అక్కడి వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పండే పంటలు కొన్ని ఉంటాయి. వాటిని గుర్తించి అన్ని సీజన్‌లలో ఎలా పండించవచ్చో సాధించి చూపాం. వెజిటబుల్ రీసెర్చ్ స్టేషన్ (అఖిల భారత సమన్వయ సంస్థ కూరగాయల పరిశోధన)లో ఆరేళ్ల పని చేశాను. రైతుల దగ్గరకు వెళ్లి, వాళ్ల ఎంచుకున్న సాగు పద్ధతులు స్వయంగా తెలుసుకొని, మార్పులూ చేశాం. బీర, దోస, సొరకాయ, గుమ్మడి.. మొదలైన వాటిలో క్రాసింగ్,, హైబ్రీడ్స్ మీద వర్క్ చేశాను.

పారిశ్రామిక రంగానికి జత చేయాలి

ఆ తర్వాత 15 ఏళ్ల అధ్యాపకురాలిగా ఉన్నాను. సీనియర్ ప్రొఫెసర్‌గా ప్రమోషన్ ఆ తర్వాత 20 రోజుల్లోనే కొండాలక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్శిటీకి ఫస్ట్ రెగ్యులర్ వైస్ ఛాన్స్‌లర్ పోస్టింగ్ వచ్చింది. దేశంలోనే హార్టికల్చర్ యూనివర్శిటీస్‌లో ఫస్ట్ ఉమన్ వైస్ ఛాన్సలర్‌గానూ గుర్తింపు లభించింది. మొదటిసారి విద్యార్థులను పారిశ్రామిక రంగానికి అటాచ్ చేస్తూ స్కిల్స్ నేర్పించే విధంగా ప్రోగ్రామ్స్ చేశాం. కమర్షియల్ హార్టికల్చర్, నర్సరీ, ఫ్లోరికల్చర్, మష్రూమ్స్‌పై పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ, డ్రై ఫ్లవర్ టెక్నాలజీ, ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్‌తో తయారుచేసే నిల్వ పదార్థాలు, సుగంధ తైలాల తయారీలోనూ ట్రైనింగ్ ఇచ్చాం. టెర్రస్ గార్డెన్ కాన్సెప్ట్స్, మామిడిపై పరిశోధన, ప్రదర్శనలు, డ్రాగన్ ఫ్రూట్ సాగులను ప్రోత్సహించాం. వివిధ దేశాల నుంచి వచ్చిన వ్యవసాయ శాస్త్రవేత్తలతో మన రైతులకు, స్టూడెంట్స్‌కు మధ్య చర్చలు జరిపాం.

నవతరం దృష్టి మారాలి..

ఐదారేళ్ల నుండి ఈ రంగంలోకి వచ్చే అమ్మాయిల సంఖ్య పెరుగుతోంది. అయితే, అమ్మాయిలు ఫీల్డ్‌కి వెళ్లడానికి ఇష్టపడటం లేదు. అవగాహన కలిగినవారు వెనుకంజ వేస్తే వ్యవసాయ రంగం సమతుల్యత దెబ్బతింటుంది. ఈ రంగంలోకి వచ్చేవారు పొలాలకు వెళ్లడానికి ఉదయం, సాయంత్రం సమయాలను ఎంచుకోవడం వంటి స్మార్ట్ వర్క్ నేర్చుకోవడం కూడా ముఖ్యం.

రైతులు ఏ విధంగా కష్టపడతారో ఈ రంగంలోకి వచ్చి శిక్షణ తీసుకున్నవారు కూడా అంత కష్టపడాల్సి ఉంటుంది. చేసే పనిలో అంకిత భావం ఉంటే మంచి ఫలితాలను పొందగలం''అని వివరించారు.

సాక్షి సినిమా



''నిజ జీవితాన్ని, నా సినీ జీవితాన్ని పంచుకుని నాకు విజయం అందించిన నా హీరోయిన్స్ అందరికీ, యావన్మంది మహిళలకు చేతులెత్తి నమస్కరిస్తూ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు'' అంటూ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా ఈ ఫొటోను షేర్ చేసి, చిరంజీవి పేర్కొన్నారు

ధైర్యంగా బతకాలి... ప్రశాంతంగా ఉండాలి

– నదియా



"మీ విలువ మీరు తెలుసుకోండి... మీకు నచ్చినట్లు మీరు బతకండి" అంటున్నారు నదియా. హీరోయిన్‌గా 1980-1990లలో విజయవంతమైన కెరీర్‌ని చూసిన నదియా బిజీగా ఉన్నప్పుడే పెళ్లి చేసుకుని, అమెరికాలో సెటిలయ్యారు. 1994లో సినిమాలకు దూరమై, 2004లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సిల్వర్ స్క్రీన్‌కి వచ్చారు. 'కారవాన్' వాహన సౌకర్యాలు లేని రోజులను, ఇప్పుడు ఆ సౌకర్యాలు ఉన్న రోజులనూ చూస్తున్నారు నదియా. 'మహిళా దినోత్సవం' సందర్భంగా 'సాక్షి'కి నదియా ఇచ్చిన స్పెషల్ ఇంటర్వ్యూలోని విశేషాలు తెలుసుకుందాం.

● **టీనేజ్‌లో హీరోయిన్ అయిన మీకు అప్పటి షూటింగ్ వాతావరణం, అంతమంది వ్యక్తులతో పని చేయడం వంటివి ఇబ్బందిగా అనిపించేదా?**

మలయాళంలో నా తొలి సినిమా 'నోక్కెత్త దూరత్తు కన్నుమ్ నాట్టు' (1984). ఈ సినిమా తమిళంలో 'పూవే పూచ్చూడవా'గా రీమేక్ అయింది. తమిళంలోనూ నేనే నటించాను. తమిళంలో నాకు తొలి సినిమా. ఆర్రెడీ ఒక భాషలో చేసిన సినిమా కావడం ఒక ప్లస్. మలయాళం సినిమా డైరెక్టర్ ఫాజిల్ తమిళంలోనూ చేశారు. అలాగే నాకు తమిళ్ అస్సలు రాకపోవడంతో ఓ ట్యూటర్‌ను పెట్టి, నేర్పించారు. దాంతో ఈజీ అయింది. షూటింగ్ పరంగా ఎలాంటి చేదు అనుభవాలు ఎదురు కాలేదు. దాంతో భయపడాల్సిన అవసరం రాలేదు. అలాగే ఆ సినిమా హిట్ కావడంతో వెనక్కి తిరిగి చూసుకోనంతగా బిజీ అయ్యాను.

● **సినిమా ఇండస్ట్రీలో అమ్మాయిలు నిలదొక్కుకోవాలంటే చాలా కష్టం అంటారు... ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుందనే టాక్ కూడా వినిపిస్తుంటుంది...**

నేను నా అనుభవాల గురించి మాట్లాడతాను. నాతో పాటు మా నాన్న షూటింగ్‌కి వచ్చేవారు. ఒక్క నిమిషం కూడా ఆయన నన్ను ఒంటరిగా వదిలిపెట్టేవారు కాదు. ఆయన అంతగా ప్రొటెక్ట్ చేయడంతో నాకు ప్రెజర్ ఉండేది కాదు. అలాగే వచ్చిన ప్రతి సినిమా కమిట్ చేయించేసి, నాతో ఓవర్ వర్క్ చేయించలేదు. వర్క్‌ని ఎంజాయ్ చెయ్ అన్నారు. నా పక్కన ఓ గైడింగ్ ఫోర్స్ (తండ్రిని ఉద్దేశించి) ఉండటంతో నాకెప్పుడూ 'అన్‌సేఫ్' అనిపించలేదు.

● **షూటింగ్ స్పాట్‌లో స్టార్స్‌కి ఏర్పాటు చేసే 'కారవాన్' వాహన సౌకర్యం అప్పట్లో లేదు. పల్లెల్లో షూటింగ్స్ చేసినప్పుడు కాస్ట్యూమ్స్ మార్చుకోవడానికి, ఇతర వ్యక్తిగత విషయాలకూ పడిన ఇబ్బందుల గురించి?**

మాకు బోలెడంత ప్రేమ దక్కేది. విలేజెస్‌లో ఎవరో ఒకరింట్లో కాస్ట్యూమ్స్ మార్చుకునేంత అభిమానం మా మీద ఉండేది. 'ఏం ఫర్వాలేదు. మీ ఇల్లులా అనుకోండి' అనేవాళ్లు. ఎలాంటి భయాలూ ఉండేవి కావు. ఇప్పుడున్నన్ని సౌకర్యాలు లేకపోయినా హ్యాపీగానే ఉండేది.

● **అప్పట్లో సౌకర్యం లేకపోయినా హ్యాపీగానే గడిచిందన్నారు... సో.. ఇప్పుడు కారవాన్ తదితర సౌకర్యాలు పొందుతున్న నటీమణుల లైఫ్ ఇంకా హ్యాపీ అనుకోవచ్చా...**

మాతో పోల్చుకుంటే ఇప్పటి అమ్మాయిలు హ్యాపీ కాదు. అన్ని సౌకర్యాలతో పాటు సమస్యలూ ఎక్కువే. ప్రతి క్షణం ఎవరో ఒకరు మనల్ని గమనిస్తున్న ఫీలింగ్. సోషల్ మీడియా, స్మార్ట్ ఫోన్ వల్ల పబ్లిక్‌లోకి వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితి. ఈ జనరేషన్‌కి ఆ ప్రెజర్ ఎక్కువ.

● **మరి... ఈ ప్రెజర్‌ని ఎలా అధిగమించాలి?**

ప్రపంచం మారిపోయింది. మనమూ అందుకు తగ్గట్టు మారాలి. పరిస్థితులు ఇలా ఉన్నాయేంటని భయపడకుండా మన జాగ్రత్తల్లో మనం ఉండటమే.

● **నెగటివిటీ ఎక్కువ శాతం ఉన్న ఈ మోడ్రన్ వరల్డ్‌లో అమ్మాయిలు తమ లైఫ్‌ని ఎలా లీడ్ చేయాలంటారు?**

ధైర్యంగా, గర్వంగా బతకాలి. ఎందుకంటే ఆ దేవుడు సృష్టించిన ప్రత్యేకమైనమనుషులం మనం. ఎక్కడ ఉన్నా మనం సౌకర్యంగా ఉండటం మనకు ముఖ్యం. సౌకర్యం అంటే లగ్జరీస్ కాదు. మనకు నచ్చినట్లుగా మనం ఉండటం. అలాగే మనం అనుకున్నది నిర్మొహమాటంగా చెప్పాలి. మన విలువని మనం తెలుసుకోవాలి. మనం మన గురించి ఏమను కుంటున్నామో అదే మనం. తక్కువగా అనుకుంటే తక్కువగా... ఉన్నతంగా అనుకుంటే ఉన్నతంగా. అందుకే మన గురించి మనం ఉన్నతంగా అనుకోవాలి. ఆత్మవిశ్వాసంతో బతకాలి.

● **ఇద్దరు అమ్మాయిల తల్లిగా మీ పిల్లలకు ఈ విషయాలు చెబుతుంటారా?**

చెబుతాం. మా అమ్మాయిలకు బాగా స్వేచ్ఛ ఇస్తాం. వాళ్ల ఇష్టాలను కాదనం. వద్దని చెప్పాల్సి వస్తే ఎందుకు వద్దో చెబుతాం. ఎంత జాగ్రత్తగా ఉండాలో వివరిస్తాం. ఒకప్పుడు పెద్దలు చెప్పిన మాటలను పిల్లలు వినేవాళ్లు. ఇప్పుడు టెక్నాలజీ బాగా పెరిగిన ఈ కాలంలో పిల్లలు చెప్పేది కూడా పెద్దలు వినాలి. మేం మా పిల్లలతో బాగా కమ్యూనికేట్ అవుతాం. మా పిల్లలకే కాదు... ఎవరికైనా నేను చెప్పేదేంటంటే... ధైర్యంగా బతకాలి... ప్రశాంతంగా ఉండాలి.

నా జీవితం హ్యాపీ

నా జీవితం మొత్తం సాఫీ. హీరోయిన్‌గా బిజీగా ఉన్నప్పుడే పెళ్లి చేసుకుని, మా ఆయనతో అమెరికాలో సెటిలయ్యాను. ఇద్దరు పిల్లలు పుట్టారు. ఆ లైఫ్‌ని పరిపూర్ణంగా ఆస్వాదించాను. చాలా గ్యాప్ తర్వాత సినిమాలకు చాన్స్ వచ్చింది. 'నటిగా నీ పూర్తి ప్రతిభని నువ్వు వినియోగించుకోలేదు.. సినిమాలు కంటిన్యూ చెయ్' అని మా ఆయన, 'మళ్లీ యాక్ట్ చెయ్ అమ్మా' అని పిల్లలు అన్నారు. వచ్చాను.. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా బిజీగా ఉన్నాను.

– డి.జి. భవాని

అప్పుడే మహిళ ఎదిగినట్లు లెక్క!

– శ్రుతీహాసన్



"సమస్య ఎక్కడైనా ఉంటుంది. ఎలా ఎదుర్కొంటున్నామన్నదే ముఖ్యం. సమస్యలకు భయపడి పారిపోతే ఓడిపోతాం... ధైర్యంగా ఎదుర్కొంటే గెలుస్తాం" అంటున్నారు శ్రుతీహాసన్. తన తల్లి సారిక సినిమాలు చేసినప్పటి పరిస్థితులను, ఇప్పటి పరిస్థితులను పోల్చి కొన్ని విషయాలు చెప్పారు శ్రుతి. ఇంకా 'మహిళా దినోత్సవం' సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన స్పెషల్ ఇంటర్వ్యూలో శ్రుతీహాసన్ చెప్పిన విషయాలు తెలుసుకుందాం.

● **మీ అమ్మగారి కెరీర్‌ని చూశారు... అప్పటి ఆమె కెరీర్ పరిస్థితులను ఇప్పటి మీ కెరీర్‌తో పోల్చుకున్నప్పుడు ఏమనిపిస్తోంది?**

అప్పటి పరిస్థితుల గురించి అమ్మ నాతో చెప్పేవారు. 'ఈక్వాలిటీ' విషయంలో అప్పుడు ప్రాబ్లమ్ ఉండేదట. ఉమెన్‌కి చాలా తక్కువ ప్రాధాన్యం ఉండేదట. అలాగే అప్పట్లో 'పీరియడ్స్' గురించి బాహాటంగా మాట్లాడడానికి సిగ్గుపడేవాళ్లు. అసలు బయటకు చెప్పకూడదన్నట్లు ఉండేది. ఇబ్బందిగా ఉన్నా బయటకు చెప్పకుండా షూటింగ్ చేసేవాళ్లు. ఇప్పుడు పీరియడ్స్ ఇబ్బంది గురించి ఓపెన్‌గా చెప్పి, ఆ రోజు పని మానుకునే వీలు ఉంది.

● **మరి... మీ జనరేషన్ హీరోయిన్లతో పోల్చితే అప్పటివారు ఏ విషయంలో హ్యాపీ?**

మాటల విషయంలో... అప్పట్లో కాస్త ఓపెన్‌గా మాట్లాడగలిగేవాళ్లు. కానీ ఇప్పుడు ఏం మాట్లాడితే ఏం వస్తుందోనని మాటలకు కత్తెర పెట్టాల్సిన పరిస్థితి. అయితే నేనలా కాదు. ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతాను. అది అందరికీ తెలిసిన విషయమే. సోషల్ మీడియా వల్ల ఏం మాట్లాడలేక పోతున్నారు. అన్ని కళ్లూ మనల్నే చూస్తున్న ఫీలింగ్. అంతెందుకు? పదిహేనేళ్ల క్రితం నేను కెరీర్ స్టార్ట్ చేసినప్పుడు ఇలా లేదు. రిలాక్సింగ్‌గా ఉండేది. ఇప్పుడు ఫొటోలు తీసేసి, సోషల్ మీడియాలో పెట్టేస్తున్నారు. ఆ ప్రెజర్ చాలా ఉంది. ఈ ఒత్తిడి వల్ల పబ్లిక్‌లోకి వచ్చినప్పుడు చాలామంది ఎక్కువ జాగ్రత్తగా ఉంటున్నారు. మా అమ్మ జనరేషన్‌లో ఉన్నంత కూల్‌గా ఉండలేని పరిస్థితి. ఇంకా చెప్పాలంటే స్కూల్ పిల్లలకు కూడా తిప్పలు తప్పడంలేదు. 'అలా ఉన్నావు... ఇలా ఉన్నావు' అంటూ ట్రోల్స్ చేస్తున్నారు. ఇలా చిన్నప్పుడే ప్రెజర్ మొదలైపోతోంది. అయితే ఇప్పటి ఈ పరిస్థితిని నేను విమర్శించడంలేదు. మార్పుని స్వీకరించడమే.

● **ఇండస్ట్రీలో 'క్యాస్టింగ్ కౌచ్' ఎదుర్కొన్న నటీమణులు చాలామంది ఉన్నారు... మీకు అలాంటివి?**

నాకలాంటి చేదు అనుభవాలు లేవు. ఒకవేళ నాకు నచ్చని పరిస్థితి ఎదురైందంటే నిర్మొహమాటంగా చెప్పేస్తాను. నా పాలసీ ఒక్కటే. నేను ఎవరినైనా ఇష్టపడితే టూ హండ్రెడ్ పర్సెంట్ ఇష్టపడతాను... నాకు కంఫర్ట్‌గా ఉన్న చోట ఉంటాను. నాకు నచ్చని చోట ఉండను... నచ్చని మనుషులను నా లైఫ్‌లో నుంచి ఎగ్జిట్ చేసేస్తాను. ఇంకో విషయం ఏంటంటే... మనకు ఏదైనా నచ్చలేదనుకోండి గొడవ పడక్కర్లేదు... అరిచి చెప్పక్కర్లేదు. 'నాకు నచ్చలేదు' అని కూల్‌గా చెప్పి, సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టేయాలి.

● **మీలా చాలామంది ధైర్యంగా ఉండలేరు... నిర్భయంగా మాట్లాడలేరు... వారికి మీరిచ్చే సలహా?**

భయాలు వదలండి. దయచేసి మీ మనసులోని సమస్యలను బయటకు చెప్పండి. మనసులోనే ఉంచుకుంటే ఆరోగ్యం చెడిపోతుంది. మనకు ఫ్యామిలీ మెంబర్స్, ఫ్రెండ్స్ ఉంటారు. వాళ్లతో షేర్ చేసుకోవాలి. అయితే వారికన్నా కూడా ఒక మంచి కౌన్సెలర్ అవసరం. వాళ్లయితే మన మానసిక స్థితిని బాగా అర్థం చేసుకుని సలహాలు ఇవ్వగలుగుతారు. ఫిజికల్‌గా హెల్దీగా ఉండాలంటే 'మెంటల్ హెల్త్' చాలా ముఖ్యం.

● **కమల్‌హాసన్‌గారి కూతురు కావడం వల్లే మీకు ఇండస్ట్రీలో ఇబ్బందులు ఎదురు కాలేదనుకోవచ్చా?**


బ్యాక్‌గ్రౌండ్ అనేది ప్లసే... కాదనడం లేదు. నాన్నగారి పేరు నాకు హెల్ప్ అయింది. అయితే శ్రుతీహాసన్ అంటే కమల్ హాసన్ కూతురు అనే విషయాన్ని మరచిపోయేలా చేయాలి. అప్పుడే నేను సక్సెస్ అయినట్లు. నా వర్క్‌తో నేను నిరూపించుకుని నాకంటూ పేరు తెచ్చుకున్నాను. పని పరమైన ఇబ్బందులు కామన్. అలాంటివి ఎప్పుడూ మా నాన్నగారికి చెప్పలేదు. నేనే సాల్వ్ చేసుకుంటుంటాను.

● **'మహిళా దినోత్సవం' జరుపుకుంటారా?**

నా ఫ్రెండ్స్‌తో 'అన్ని రోజులూ మనవే' అంటుంటాను. 'మేల్ డే' అని లేదు. మరి... 'ఉమెన్స్ డే' ఎందుకు? అంటే... ఇంకా స్త్రీ వెనకబడి ఉన్నట్లేనా? అలాగే 'ఉమెన్ ఓరియంటెడ్ సినిమా' అంటారు. 'మేల్ ఓరియంటెడ్ మూవీ' అనరు. ముందు ఈ తేడా పోవాలి. మహిళా దినోత్సవం అనేది ప్రత్యేకంగా లేని రోజున ఉమెన్ ఎదిగినట్లు లెక్క.

సినిమా ఇండస్ట్రీలో టెక్నికల్ డిపార్ట్‌మెంట్‌లో మహిళలు తక్కువగా ఉండటానికి కారణం?

ఒకప్పటితో పోల్చితే ఇప్పుడు మహిళల శాతం ఎక్కువే ఉంది. లేడీ టెక్నీషియన్స్ ఇంకా పెరుగుతారు. అంతెందుకు? నేను ఈ మధ్య లీడ్ రోల్ చేసిన 'ది ఐ' మూవీకి డైరెక్టర్, ప్రొడ్యూసర్, ఇంకా ఇతర విభాగాల్లో మహిళలే ఎక్కువ. ఆ విధంగా ఈ సినిమా నాకు స్పెషల్.



సత్యమేవ జయతే

సాక్షి

'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

WWW.SAKSHI.COM

పేజీలు: 18 | వెల: ₹ 5.50 | సంపుటి: 17 | సంచిక: 346

శనివారం 8-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పేలిన స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్

స్పేస్‌ఎక్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థ అతిపెద్ద రాకెట్ స్టార్‌షిప్ ప్రయోగించిన కాసేపటికే పేలిపోయింది.

- వివరాలు 6లో



వంటనూనె తగ్గించండి..

ఊబకాయ సమస్యను అధిగమించడానికి వంటనూనెల వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రధాని మోదీ మరోసారి దేశ ప్రజల్ని కోరారు.

- వివరాలు 6లో

మాది టీ20 మోడల్

గుజరాత్ మోడల్ కాలం చెల్లిన టెస్ట్ మ్యాచ్ మోడల్..

ఇండియాటుడే కాన్‌క్లేవ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

- దేశంలో గుజరాత్ మినహా ఏ రాష్ట్రానికి కూడా మోదీ సహకరించడం లేదు
- పెట్టుబడులు ఏమొచ్చినా గుజరాత్‌కే వెళ్లాలంటున్నారు
- మోదీతో వ్యక్తిగత విభేదాల్లేవు.. ఆయన విధానాలతోనే విభేదిస్తున్నా..
- హైదరాబాద్ అభివృద్ధి 450 ఏళ్ల క్రితమే మొదలైంది
- ప్రజాస్వామ్యయుతంగా ఉండటమే కాంగ్రెస్ పార్టీ బలహీనత
- దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గించి ప్రతీకారం తీర్చుకునేందుకు బీజేపీ ప్రయత్నం
- ఇక్కడ అధికారం లేనందునే నియోజకవర్గాల పునర్విభజన ప్రయత్నం
- అహ్మదాబాద్ కంటే హైదరాబాద్ తక్కువేం కాదు.. ఒలింపిక్స్ నిర్వహణకు అవకాశం ఇవ్వాలని డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రానిది టీ–20 మోడల్, దేశానికి రోల్‌మోడల్ అని.. గుజరాత్ మోడల్ కాలం చెల్లిన టెస్ట్ మ్యాచ్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గుజరాత్ మోడల్‌లో ఏ విధమైన సంక్షేమం లేదని, ఏమైనా అభివృద్ధి ఉందనుకుంటే అది మోదీ సీఎంగా ఉన్నప్పుడు ప్రయత్నించినదేనని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి అయిన తర్వాత కూడా మోదీ గుజరాత్ కోసమే పనిచేస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఏదైనా రాష్ట్రానికి పెట్టుబడులు వస్తే సహకరించడం లేదని.. గుజరాత్‌కు వెళ్లి పెట్టుబడులు పెట్టాలని చెబుతున్నారని విమర్శించారు. మోదీ ప్రధాని అయి ఉండీ ఇదేం పద్ధతని ప్రశ్నించారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఇండియాటుడే కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు అంశాలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''గుజరాత్ మోడల్‌కు, తెలంగాణ మోడల్‌కు మధ్య ఎంతో తేడా ఉంది. మాది అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన నమూనా. తెలంగాణ నమూనాతో ఎవరూ పోటీపడలేరు. అహ్మదాబాద్, హైదరాబాద్‌లోని మౌలిక వసతులను పోల్చిచూడాలి. హైదరాబాద్‌తో పోటీపడేలా ఔటర్ రింగు రోడ్డు,



అంతర్జాతీయ విమానాశ్రయం అహ్మదాబాద్‌కు ఉన్నాయా? గుజరాత్‌లో ఫార్మా, ఐటీ పెట్టుబడులు ఉన్నాయా? గుజరాత్‌లో ఏం ఉంది? హైదరాబాద్ ఇప్పుడు అహ్మదాబాద్, ముంబై, బెంగళూరు, ఢిల్లీ నగరాలతో పోటీపడట్లేదు. మేం న్యూయార్క్, సియోల్, టోక్యోలతో పోటీపడాలనుకుంటున్నాం.

చార్మినార్, గోల్కొండ కోట చంద్రబాబు కట్టారా?

హైదరాబాద్ అభివృద్ధి ఇప్పుడు ప్రారంభమైంది కాదు. 450 ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న నగరం. కులీకుతుబ్ షా నుంచి ప్రారంభమై నిజాం సర్కార్, తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం, స్వాతంత్ర్యం తర్వాత

మిగతా 2వ పేజీలో ▶

ప్రగతి సాధించినా కష్టాల్లోనే ప్రజలు



సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో కేటీఆర్, బండ ప్రకాశ్

- కాంగ్రెస్ నిజస్వరూపాన్ని తెలుసుకున్నారు
- బీఆర్‌ఎస్సే రక్షణ కవచమని భావిస్తున్నారు
- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారు
- పార్టీ ముఖ్యనేతలతో మాజీ సీఎం కేసీఆర్
- ఏప్రిల్ 27న వరంగల్‌లో భారీ సభ
- తెలంగాణ సమాజం గర్వించేలా బీఆర్‌ఎస్ రజతోత్సవాలు.. బీసీలకు సరైన వాటా దక్కాల్సిందేనన్న బీఆర్‌ఎస్ అధినేత -13లో

మార్గదర్శి, రామోజీది

45 ఏళ్ల నయవంచన

వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాల్సిందే



12లో

తెలంగాణ హైకోర్టులో మాజీ ఎంపీ ఉండవల్లి వాదనలు

- ఫైనాన్షియర్స్‌కు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల వత్తాసు
- సుప్రీంకోర్టు సూచన మేరకే ప్రతివాదిగా రిజర్వ్ బ్యాంక్
- మార్గదర్శి అక్రమాలకు పాల్పడిందని ఆర్‌బీఐ తేల్చింది
- క్రిమినల్ చర్యలకు హెచ్‌యూఎఫ్ సభ్యులూ బాధ్యులే
- కఠిన శిక్ష విధించకుంటే దేశమే ప్రమాదంలో పడిపోతుంది
- 'మార్గదర్శి' కేసులో వాదనలు వినిపించిన అరుణ్‌కుమార్
- అనుబంధ పిటిషన్‌పై తీర్పు రిజర్వు చేసిన ధర్మాసనం



సమతుల్యత సాధించాలి

- డాక్టర్ సంగీతారెడ్డి



శ్రమతోనే సక్సెస్..

- పీవీ సింధు



కష్టాన్నే నమ్మాలి..

- యాంకర్ సుమ



లీడర్‌షిప్ కావాలి..

- స్వాతి లక్రా

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల మహిళా ప్రముఖుల మనోగతం - 14లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Venkateshwara CHICKEN

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird	73 kg	Dressed with Skin	138 kg
₹ 60	Retail Live Bird	95 kg	Skin Less	157 kg

Issued in the interest of consumers

మహిళకు శక్తి!

- నేడు ఇందిరా మహిళా శక్తి మిషన్–2025 ఆవిష్కరించనున్న సీఎం
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేలా కొత్త పాలసీ
- ఆర్థిక వెసులుబాటు, ఆర్థిక ఎదుగుదలే లక్ష్యమన్న మంత్రి సీతక్క
- నేడు పరేడ్ గ్రౌండ్స్‌లో లక్షమందితో సభ.. పలు పథకాలకు శ్రీకారం - 2లో

10న గ్రూప్-1 ప్రొవిజినల్ మార్కులు

- 11న గ్రూప్–2, 14న గ్రూప్–3 జనరల్ ర్యాంకింగ్ లిస్టులు
- 17న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, 19న ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఫలితాలు
- షెడ్యూల్ విడుదల చేసిన టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం - 16లో

బకాయిలన్నీ చెల్లిస్తాం



- ఏప్రిల్ నుంచి ప్రతి నెలా రూ.500–600 కోట్లు ఇస్తాం..
- ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ
- ఉద్యోగుల ఇబ్బందులను సీఎం, నేను అర్థం చేసుకున్నాం
- ఏప్రిల్ నుంచి ఎలాంటి కొత్త బకాయిలు లేకుండా చూస్తాం
- ఉద్యోగులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు
- ఆర్థికేతర అంశాలను సబ్ కమిటీలో చర్చించి పరిష్కరిస్తామని వెల్లడి

- వివరాలు 3లో

సీపీఐకి ఒకటి.. ఎస్టీ నేతకు మరొకటి!

- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీట్లపై కాంగ్రెస్ సూత్రప్రాయ నిర్ణయం
- మిగతా రెండు స్థానాలపై రాష్ట్ర నేతల్లో కుదరని ఏకాభిప్రాయం
- ఎస్సీ, బీసీ, ఓసీ నేతల్లో ఇద్దరికి ఇవ్వాలనే యోచన
- నేడు ఢిల్లీ పెద్దల సమక్షంలో చర్చలు.. రేపు అధికారికంగా అభ్యర్థుల ప్రకటన!

12లో

ఇదండీ సంగతి



వీళ్లిచ్చిన స్టేట్‌మెంట్‌తో మనం వాళ్లతో కలిసి పని చేస్తున్నామని అనుకుంటార్సార్!






క్లుప్తంగా...

ఉదయం 11 గంటల నుంచి సాధ్యమేనా?

సచివాలయ సందర్శనపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: సచివాలయం ప్రజా సందర్శన వేళలను ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పెంచడం సాధ్యమేనా? అని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై వివరాలు తెలుసుకుని చెప్పాలని అడిషనల్ అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్‌ను ఆదేశించింది. ప్రస్తుతం సచివాలయం సందర్శనకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల అనుమతి ఉంది. దీనిని ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొడిగించాలని కోరుతూ సీనియర్ న్యాయవాది చంద్రసేన్‌రెడ్డి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. అలాగే, ఫిర్యాదుదారులకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రధాన ద్వారం దగ్గర లేదా ఏదైనా అనుకూలమైన ప్రదేశంలో ఉమ్మడి ఇన్‌వర్డ్ సెక్షన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ పిల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. దీనిపై వివరాలు కనుక్కొని చెప్పేందుకు రెండు వారాలు సమయం కావాలని ఏఏజీ కోరారు. దీనికి ధర్మాసనం సమ్మతిస్తూ విచారణ వాయిదా వేసింది.

ఈఎస్ఐ కొత్త డిస్పెన్సరీల ఏర్పాటుకు కసరత్తు

కార్మికుల సంఖ్యకు అనుగుణంగా ప్రతిపాదనలు

సాక్షి, హైదరాబాద్: తమ చందాదారులకు వైద్య సేవలను మరింత విస్తృతం చేయాలని, కార్మికుల సంఖ్యకు అనుగుణంగా డిస్పెన్సరీలు ఏర్పాటు చేయాలని ఈఎస్ఐ భావిస్తోంది. గతవారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్మిక శాఖ సమీక్షలో కొత్త డిస్పెన్సరీల ఏర్పాటుకు సంబంధించి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 71 ఈఎస్ఐ డిస్పెన్సరీలున్నాయి.

తక్షణ ఏర్పాటుకు 18 డిస్పెన్సరీలు

రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) 18 డిస్పెన్సరీలు మంజూరు చేసింది. మంచిర్యాల, ఖమ్మం, ఆదిలాబాద్, హనుమకొండ, మెదక్, రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్, సూర్యాపేట జిల్లాల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు అనుమతులు జారీ చేసింది. కొత్తగా మరో 20 డిస్పెన్సరీలు అవసరమని అధికారులు ప్రాథమికంగా గుర్తించి ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. తుది ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించిన తర్వాత ఆర్థికశాఖ అనుమతితో కొత్త డిస్పెన్సరీలకు సంబంధించి ఉత్తర్వులు వెలువడే అవకాశముంది.

ఇంటి పోరుతో రేవంత్‌రెడ్డి సతమతమవుతున్నారు

బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: ఒకవైపు ఇంటిపోరు, మరో వైపు హైకమాండ్ పోరు, ఇంకోవైపు తెలంగాణ ప్రజల హోరుతో ముఖ్యమంత్రి సతమతమవుతున్నారని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. పాలన మీద పట్టు సాధించుకోలేక ఢిల్లీ చుట్టూ పచార్లు కొడుతున్నారన్నారు. టెస్ట్ మ్యాచ్‌లు కాదు ఇప్పుడంతా 20–20లే అంటున్న రేవంత్‌రెడ్డి.. 38 సార్లు ఢిల్లీకి వచ్చారని, త్వరలో ఢిల్లీ పర్యటనల్లో సెంచరీ కొడతారని ఎద్దేవాచేశారు. శుక్రవారం ఢిల్లీలో లక్ష్మణ్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ లేదని, పీసీసీ కార్యవర్గాన్ని కూడా ఏర్పాటు చేసుకోలేని దుస్థితిలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందన్నారు. డబుల్ ఎమ్మెల్సీ స్థానాలు సాధించి బీజేపీ చరిత్ర సృష్టించిందని, ఈ ఫలితాలు డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటుకు నాంది పలుకుతోందని లక్ష్మణ్ తెలిపారు.

ఐటీడీఏల్లో కెరీర్ గైడెన్స్

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ వినూత్న ఆలోచన అమలు



కెరీర్ గైడెన్స్‌పై ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్‌కు వివరిస్తున్న ఏపీఓ జనరల్

భద్రాచలం: గిరిజన విద్యార్థుల భవిష్యత్ కోసం భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ చేసిన వినూత్న ఆలోచన ఇక రాష్ట్రమంతటా అమలు కానుంది. పదో తరగతి అనంతరం విద్యార్థులకు అందుబాటులో ఉన్న కోర్సులు, ప్రభుత్వ ఉద్యోగాలపై అవగాహన కల్పించేందుకు ఇటీవల భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో 'కెరీర్ గైడెన్స్ వాల్' అనే నూతన కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలల గోడలపై కోర్సులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలకు అవకాశం, ఏం చదవాలి అనే దానిపై విపులంగా ఫ్లెక్సీల ద్వారా వివరిస్తున్నారు. అలాగే అన్ని పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించి అధికారుల ద్వారా మోటివేషన్ తరగతులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయం గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ శరత్ వద్దకు చేరడంతో వెంటనే రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధుల్లో ఉన్న గిరిజన సంక్షేమ పాఠశాలల్లో అమలు చేయాలని ఆదేశించారు.

మహిళకు శక్తి!

నేడు ఇందిరా మహిళా శక్తి మిషన్ - 2025 ఆవిష్కరించనున్న సీఎం

- మహిళా సాధికారత దిశగా రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాలు
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేలా కొత్త పాలసీ
- ఆర్థిక వెసులుబాటు, ఆర్థిక ఎదుగుదలే లక్ష్యమన్న మంత్రి సీతక్క
- నేడు పరేడ్ గ్రౌండ్స్‌లో లక్షమంది మహిళలతో సభ
- పలు పథకాలు, కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్న సర్కారు



పరేడ్ గ్రౌండ్స్‌లో మహిళా దినోత్సవం ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో లక్ష మంది మహిళల సమక్షంలో ఇందిరా మహిళా శక్తి మిషన్–2025ను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. రాష్ట్రంలో మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాలను, ఈ ఏడాది మహిళలు సాధించిన విజయాలను మిషన్‌లో పొందుపరిచారు. కోటి మంది మహిళలను ఎస్‌హెచ్‌జీల పరిధిలోకి తీసుకొచ్చేందుకు వీలుగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లను విలీనం చేయనున్నారు. ఈ మిషన్‌కు సంబంధించిన పాలసీకి గురువారం రాత్రి రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా కొత్త పాలసీకి ప్రభుత్వం రూపకల్పన చేసింది. పరేడ్ గ్రౌండ్స్ సభకు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధ్యక్షత వహించనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్ తదితర మంత్రులు పాల్గొననున్నారు.

ప్రభుత్వాన్ని దీవించండి: మంత్రి సీతక్క

మంత్రి సీతక్క శుక్రవారం పరేడ్ గ్రౌండ్స్‌ను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..' మహిళలకు సైతం సమాన అవకాశాలు ఉండాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఆర్థిక వెసులుబాటు, ఆర్థిక ఎదుగుదలకు దోహదపడే కార్యక్రమాలు చేపడుతోంది. మహిళా సంఘం అంటే ఆర్థిక భద్రత, సామాజిక రక్షణకు నిదర్శనం. అందుకే 60 ఏళ్లు దాటిన వారిని సంఘాల్లో చేర్చుకుంటున్నాం. మహిళలు చదువు మానేసి అనేక రకాల మానసిక వేదనలకు గురైన సందర్భాలు ఉన్నందున..15 నుంచి 18 ఏళ్ల లోపు ఉన్నవారికి కూడా సభ్యులుగా చేరేందుకు అవకాశం కల్పించాం. సభ్యుల కోసం అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ముఖ్యంగా రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నాం. మహిళలకు రూ.1200 గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే అందిస్తున్నాం. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరా క్రాంతి పథకం ద్వారా ఐకేపీ సెంటర్లు ఇచ్చాం. ఇప్పుడు ఏకంగా రైస్ మిల్లులు నడిపేలా శిక్షణ ఇవ్వబోతున్నాం. సోలార్ విద్యుత్ ప్లాంట్లను అప్పగిస్తున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి అందరి సోదరుడిలా అండగా ఉంటున్నారు. ఈ ప్రభుత్వాన్ని మహిళలంతా దీవించాలి' అని కోరారు.

మహిళా సమాఖ్యలకు ఆహ్వానం

పరేడ్ గ్రౌండ్స్ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందిరా మహిళా శక్తి మిషన్–2025 ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా మహిళా సంఘాలకు మంత్రి సీతక్క ఇప్పటికే ఆహ్వానాలు పంపారు. ఈ నేపథ్యంలో జిల్లాల నుంచి వచ్చే మహిళల కోసం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) 600కు పైగా ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచింది. సాయంత్రం ఐదు గంటలకు సభ ప్రారంభం కానున్న నేపథ్యంలో మహిళలంతా అరగంట ముందే సభాస్థలికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. దూర ప్రాంతాల నుంచి మహిళలు వస్తుండడంతో ఏడున్నర గంటల లోపే సభను ముగించేలా కార్యక్రమాన్ని రూపొందించారు. పరేడ్ గ్రౌండ్స్ వద్ద అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. సభకు వచ్చే మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని ఆదేశించారు. తాగునీరు, విద్యుత్ నిరంతరాయంగా అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సచివాలయం నుంచి జిల్లా డీఆర్డీఏ, జిల్లా మహిళా సమాఖ్యల సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

నేటి కార్యక్రమాలివీ..

- మండల మహిళా సమైక్య సంఘాల ఆధ్వర్యంలో నడిచే 150 ఆర్టీసీ అద్దె బస్సులను సీఎం ప్రారంభిస్తారు.
- 31 జిల్లా సమాఖ్యల ఆధ్వర్యంలో 31 జిల్లాల్లో పెట్రోల్ బంకుల ఏర్పాటు కోసం ఆయిల్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటారు.
- మహిళా సంఘాల సభ్యులకు రుణ బీమా, ప్రమాద బీమా చెక్కులను అందజేస్తారు
- మహిళా సంఘాలకు రుణ సదుపాయాన్ని కల్పిస్తూ చెక్కులను జిల్లా మహిళా సమాఖ్యల అధ్యక్షులకు అందజేస్తారు.
- జిల్లా మహిళా సమాఖ్యల సభ్యులకు యునిఫాం చీరలు పంపిణీ చేస్తారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం, మంత్రులు సందర్శిస్తారు.

ఈ ఏడాది సాధించిన విజయాలు

- మహిళా సంఘాలకు రూ.21,632 కోట్ల రుణాలు
- 2,25,110 సూక్ష్మ, మధ్య తరహా సంస్థల ఏర్పాటు
- రూ.110 కోట్లతో 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం
- రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి 214 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు
- హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పారామంలో రూ.9 కోట్లతో మహిళా శక్తి బజార్
- విద్యార్థులకు యూనిఫామ్ కుట్టే పని ద్వారా మహిళా సంఘాలకు రూ.30 కోట్ల ఆదాయం
- ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మహిళా సంఘాల ద్వారా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు.

18 లేదా 19న రాష్ట్ర బడ్జెట్

- 12 నుంచి బడ్జెట్ సమావేశాలు.. నోటిఫికేషన్ విడుదల చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ బిల్లులు ఆమోదించే అవకాశం
- 27 వరకు సమావేశాలు కొనసాగే సూచనలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. శాసనసభ, శాసన మండలి 12న ఉదయం 11 గంటలకు సమావేశం అవుతాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. 12న బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండగా, బీఏసీలో చర్చ అనంతరం సభా నిర్వహణ తేదీలను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిర్ణయించనున్నారు.

రెండు కీలక బిల్లులు ఈసారే..: బడ్జెట్ సమావేశాల్లో తొలిరోజు 12వ తేదీన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి. అనంతరం సభ వాయిదా పడనుంది. తర్వాత రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని సీఎం రేవంత్ రెడ్డి సభలో ప్రవేశపెట్టనున్నారు. దీనిపై చర్చ జరిగిన అనంతరం తీర్మానాన్ని ఆమోదించనున్నారు. ఆ తర్వాత హోలీ, ఆదివారం సెలవులు ఉండటంతో సోమవారం మళ్లీ సభ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అదే రోజు ఎస్సీ వర్గీకరణ బిల్లును సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లుపై చర్చ అనంతరం ఆమోదించి, బీసీల రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీ ముందుకు తేనున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందిన అనంతరం ఈ నెల 18 లేదా 19 తేదీల్లో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెడతారని అసెంబ్లీ వర్గాలు వెల్లడించాయి. బడ్జెట్, శాఖలవారీ పద్దులపై చర్చ అనంతరం 27న ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఉగాది, రంజాన్ పర్వదినాల నేపథ్యంలో 27వ తేదీతో సమావేశాలు ముగిస్తారని అధికారులు చెబుతున్నారు.

'అవయవ మార్పిడి'లో కేంద్ర చట్టాన్ని అడాప్ట్ చేసుకోవాలని నిర్ణయం

వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు.. మంత్రిమండలి ఆమోదం

సాక్షి, హైదరాబాద్: మానవ అవయవాల అక్రమమార్పిడిపై కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం 2011లో తీసుకొచ్చిన 'మానవ అవయవాలు.. కణజాలాల మార్పిడి' చట్టాన్ని తెలంగాణకు అన్వయించనున్నారు. ఇందుకు మంత్రివర్గం కూడా ఆమోదం తెలిపింది. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ చట్టాన్ని సభలో పెట్టనున్నారు. అవయవ మార్పిడిలో అనేక అవకతవకలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టం వల్ల తక్కువ జరిమానా, తక్కువ జైలుశిక్ష ఉన్నందున యథేచ్ఛగా అవయవాల మార్పిడి జరుగుతోందని ప్రభుత్వం భావిస్తోంది. 2024లో తెలంగాణలో మొత్తం 1,529 ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ జరిగితే, అందులో మృతదాత అవయవ మార్పిడి 729 కాగా, సజీవ అవయవ మార్పిడి 800 ఉన్నాయి. పాత చట్టంలో చర్మం, ఎముక, మజ్జ, గుండె కవాటాలను చేర్చలేదు.

కొత్త చట్టంతో..: కేంద్ర చట్టాన్ని అన్వయించుకోవడంతో సన్నిహిత బంధువుల నిర్వచనాన్ని విస్తరించడం, ఆస్పత్రుల్లో అవయవ మార్పిడి సమన్వయకర్తల నియామకం, బ్రెయిన్‌డెడ్ సమయంలో సర్జన్, ఫిజీషియన్, అనస్థీషియా నిపుణుల పరిశీలన.. నోటో, సోటోనెట్‌వర్క్ ఏర్పాటు, ఆస్పత్రులకు టిష్యూ బ్యాంకుల నమోదు తప్పనిసరి చేయడం లాంటివి ఉంటాయి. అనుమతి లేకుండా అవయవాలు తొలిగిస్తే పదేళ్ల జైలుశిక్ష, రూ.12 లక్షల జరిమానా, తప్పుడు ధ్రువపత్రాలు సమర్పిస్తే ఐదు నుంచి పదేళ్ల జైలు, రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు జరిమానా విధించడానికి వీలుంటుంది. టిష్యూ అక్రమ వ్యాపారం చేస్తే మూడేళ్ల వరకు జైలుశిక్ష, రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు జరినామా విధిస్తారు. కేంద్ర చట్టాన్ని అన్వయించుకోవడం వల్ల అవయవాల లభ్యత పెరుగుతుందని భావిస్తున్నారు.

25న గోదావరి బోర్డు సమావేశం

గోదావరి-బనకచర్ల అనుసంధానంపై చర్చించే అవకాశం

సాక్షి, హైదరాబాద్: గోదావరి బోర్డు సమావేశాన్ని ఈనెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు బోర్డు ప్రకటించింది. గతంలో బోర్డు సమావేశాలు జలసౌధలోని ఐదో అంతస్తులోని కాన్ఫరెన్స్ హాలులో జరిగేవి. కానీ ఈసారి ఎక్కడ నిర్వహిస్తారన్న సమాచారం తరువాత తెలియజేస్తామని పేర్కొంది. సమావేశ ఎజెండాలో రూ.కోటితో ఈ–ఆఫీస్ సీడ్‌మనీ, బోర్డులో పనిచేసే ఉద్యోగినుల పిల్లల సంరక్షణ కోసం ప్రత్యేకంగా క్రచ్ సౌకర్యం, బోర్డు కోసం ప్రత్యేక కార్యాలయం, అధికారుల నివాసాలకు భూమి, నిధులను కేటాయించాలని ఎజెండాలో ప్రతిపాదించారు. నిరంతర సమావేశాలు, శిక్షణ కోసం ప్రత్యేకంగా సమావేశ మందిరాన్ని కేటాయించాలని కోరారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్.. ఆ పై స్థాయి అధికారులకు ల్యాప్‌టాప్‌లు సమకూర్చాలని, అదనంగా బోర్డు కోసం పోస్టును కేటాయించాలని ఎజెండాలో ప్రతిపాదించారు. గోదావరి–బనకచర్ల అనుసంధానం, పెద్దవాగు ఆధునీకరణపై చర్చిస్తామని పేర్కొన్నారు.

రూ.800 కోట్లతో ప్రీమియర్ ఎనర్జీస్ విస్తరణ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రీమియర్ ఎనర్జీస్ కంపెనీ తెలంగాణలో విస్తరణ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో వేగం పెంచింది. ప్రస్తుతం రెండు గిగావాట్ సోలార్ సెల్, 4.1 గిగావాట్ సోలార్ మాడ్యూల్ తయారీ సామర్థ్యంతో పనిచేస్తున్న ఈ సంస్థ.. మహేశ్వరం సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న ఒక గిగావాట్ సోలార్ సెల్ లైన్, ఒక గిగావాట్ సోలార్ మాడ్యూల్ లైన్ కోసం రూ.800 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్లాంట్లు ఈ ఏడాది డిసెంబర్‌లోగా ఉత్పత్తి ప్రారంభిస్తాయని శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. కొత్త ప్లాంట్లలో 1,500 మందికి అదనంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొంది. రాష్ట్రంలో ఈ సంస్థ ఇప్పటికే సుమారు 5,000 మందికి ఉపాధి కల్పిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ప్రీమియర్ ఎనర్జీస్‌కు మొదట 75 ఎకరాల భూమిని కేటాయించగా, అదనపు పెట్టుబడులను పరిశీలించి మరో 125 ఎకరాల భూమి ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. అయితే, మార్కెట్ పరిస్థితుల కారణంగా కంపెనీ కొంత పెట్టుబడిని ఇతర రాష్ట్రాలకు మళ్లించింది. తన 4 గిగావాట్ల సెల్ లైన్‌ను ఆంధ్రప్రదేశ్‌కు మార్చింది.

మాది టీ20 మోడల్..

▶ మొదటి పేజీ తరువాయి

మర్రి చెన్నారెడ్డి, చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖరరెడ్డి.. అలా ఇప్పుడు నేను అభివృద్ధి చేస్తున్నా. చార్మినార్, గోల్కొండ కోట చంద్రబాబు ఏమైనా కట్టారా? హైదరాబాద్‌లో ప్రముఖ కట్టడాలన్నీ 450 ఏళ్ల కింద ప్రారంభమయ్యాయి. ప్రభుత్వాలు మారినా సీఎంలు మారినా అభివృద్ధి కొనసాగింది.

బీసీలకు బీజేపీ అన్యాయం

జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీల లెక్కలు తీస్తున్నప్పుడు బీసీల లెక్కలు ఎందుకు చేయకూడదు. అందుకే జనగణనలో కులగణన కూడా చేపట్టాలని శాసనసభలో తీర్మానం చేశాం. బీసీలకు బీజేపీ అన్యాయం చేసింది. గతంలో ఎస్సీ, ఎస్టీలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇచ్చింది. ఇప్పుడు ఓబీసీలకు ఇవ్వాలనుకుంటున్నాం.

బీజేపీ అనుబంధ సంస్థలుగా ఈడీ, సీబీఐ, ఐటీ...

కాంగ్రెస్ పార్టీకి అనుబంధ సంస్థలుగా యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, విద్యార్థి కాంగ్రెస్‌లు ఉంటే.. బీజేపీకి అనుబంధ సంస్థలుగా ఈడీ, సీబీఐ, ఐటీలు పనిచేస్తున్నాయి. ప్రజాస్వామ్యయుతంగా, ఉదారంగా ఉండటమే కాంగ్రెస్ పార్టీ బలహీనత. అయినా పార్టీ వేరు, ప్రభుత్వం వేరు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ముఖ్యమంత్రిగా నేను ప్రధాన మంత్రిని గౌరవిస్తా.. అదే సమయంలో పార్టీ వేదికపై పార్టీ విషయాలు మాట్లాడుతా. తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీకి అదానీ రూ.వంద కోట్లు ఆఫర్ చేస్తే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించలేదు. రాష్ట్రంలోని ప్రతిపక్షాలు బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకించాయి. మేం ప్రజల కోసం రూ.100 కోట్లు తేవాలనుకున్నాం. బీజేపీ అదానీ నుంచి తీసుకున్న బాండ్లను ఎందుకు వెనక్కి ఇవ్వలేదో చెప్పాలి?

మోదీతో విభేదాల్లేవు.. ఆయన విధానాలతోనే..

అభివృద్ధి విషయంలో ఎవరిపైనా పక్షపాతం చూపవద్దనే నేను కోరుతున్నాను. ప్రధాని మోదీ గిఫ్ట్ సిటీని గుజరాత్‌కు తీసుకెళ్లారు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఎందుకు ఆ అవకాశం ఇవ్వలేదు? ప్రధాని మోదీతో నాకు వ్యక్తిగతంగా ఎటువంటి విభేదాలు లేవు. నేను మోదీ విధానాలతో విభేదిస్తున్నాను. దేశానికి ప్రధానిగా ఉన్నందున మోదీకి గౌరవం ఇవ్వాలి. ఆయనను కలిసి తెలంగాణకు కావల్సినవి అడగడం నా హక్కు, నా బాధ్యత.



ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో ప్రముఖ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్

హైదరాబాద్‌కు 'ఒలింపిక్స్' చాన్స్ ఇవ్వాలి

ఒలింపిక్స్ నిర్వహించేందుకు అహ్మదాబాద్ కన్నా వంద రెట్లు ఎక్కువగా హైదరాబాద్‌లో వసతులున్నాయి. అహ్మదాబాద్, హైదరాబాద్‌లలో ఏమేం వసతులు ఉన్నాయో తేల్చాలి. ఒలింపిక్స్ గేమ్స్ నిర్వహణలో హైదరాబాద్‌కు అవకాశం ఇవ్వాలి. ప్రపంచ సుందరి పోటీలు హైదరాబాద్‌లో జరుగుతున్నప్పుడు ఒలింపిక్స్ ఎందుకు జరగకూడదు? అహ్మదాబాద్‌కు నరేంద్ర మోదీ బ్రాండ్ అంబాసిడర్.. రాబోయే రోజుల్లో హైదరాబాద్ బ్రాండ్‌ను నేను ఎక్కడికి తీసుకెళతానో చూడండి.

దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గించేందుకు బీజేపీ ప్రయత్నం

ఒకే దేశం– ఒకే ఎన్నిక, నియోజకవర్గాల పునర్విభజన, ఇతర అంశాలపైన మాత్రమే గాకుండా గ్యారంటీలపై, మూలధన వ్యయంపై చర్చ జరగాలి. దక్షిణాదిలో బీజేపీకి అధికారం, ప్రాతినిధ్యం లేనందునే ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తోంది. ఇందుకోసం నియోజకవర్గాల పునర్విభజన అనే ఆయుధాన్ని ఎంచుకుంది. దక్షిణాది ప్రాతినిధ్యాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తోంది. కుటుంబ నియంత్రణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిస్తే దక్షిణాది రాష్ట్రాలు అమలు చేసినందుకు ఇప్పుడు మాపై ప్రతీకారం తీర్చుకుంటారా? కొత్త కొత్త మార్గాల ద్వారా దక్షిణాదిని ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేస్తోంది. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే కుటుంబ నియంత్రణ విధానానికి ముందటి 1971 లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలి. లేకుంటే కేవలం బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాలే ఎక్కువగా లబ్ధిపొందుతాయి. ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలే కాకుండా పంజాబ్ సహా ఉత్తరాది రాష్ట్రాలు కలసి రావాలి.

ఆదాయంతో అన్నీ చేయగలమనుకున్నా..

అందరిలాగే 2023లో అధికారంలోకి వచ్చే వరకు కూడా నేను రాష్ట్రానికి రూ.3.75 లక్షల కోట్లు మాత్రమే అప్పు ఉందని అనుకున్నాను. వచ్చే ఆదాయంతో అన్నీ చేయగలమనుకున్నాను. సీఎం కుర్చీలో కూర్చున్న తర్వాత తెలంగాణకు రూ.7 లక్షల కోట్లు అప్పు ఉందన్న అసలు విషయం బయటపడింది. కేసీఆర్ పదేళ్ల కాలంలోనే రూ.6 లక్షల కోట్లకుపైగా అప్పులు చేసి వెళ్లారు..'' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

సమగ్ర సర్వేపై సామాజికవేత్తలతో స్వతంత్ర కమిటీ

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే అధ్యయనం కోసం సామాజికవేత్తలతో స్వతంత్ర హోదాతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సమగ్ర సర్వేకు సంబంధించిన సమాచారాన్ని విశ్లేషణ చేసి.. చిన్న పొరపాటుకు కూడా అవకాశం లేకుండా మేధావులు, సామాజిక శాస్త్రవేత్తలు కృషి చేయాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో సలహా కమిటీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి చైర్మన్‌గా, రిటైర్డ్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య వైస్ చైర్మన్, ప్రవీణ్ చక్రవర్తి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కమిటీ సభ్యులుగా డాక్టర్ సుఖదేవ్, రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, శాంతా సిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, ప్రొఫెసర్ భూక్య భంగ్యా, ప్రత్యేక ఆహ్వానితులుగా జీన్ డ్రీజ్ ఉంటారన్నారు. ఈ నిపుణుల కమిటీ తమ నివేదికను నెలరోజుల్లో ప్రణాళికా శాఖకు అందజేయాలని తెలిపారు. సామాజిక న్యాయానికి పునాది వేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం రాష్ట్రంలో సర్వే చేసిందన్నారు. చిన్న పొరపాటుకు కూడా అవకాశం ఇవ్వరాదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాలతో సర్వేపై ముందస్తుగా సమావేశాలు నిర్వహించిందన్నారు. ప్రతి 150 ఇళ్లను ఒక బ్లాక్‌గా ఏర్పాటు చేసుకొని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా సర్వే చేశామన్నారు.

సవివర వాదనలు విన్న తర్వాతే నిర్ణయం

'పాలమూరు రంగారెడ్డి' కేసులో సుప్రీం కోర్టు

తదుపరి విచారణ మే 3వ వారానికి వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు వ్యవహారంలో అక్రమాల ఆరోపణలపై ఇరుపక్షాల వాదనలను సవివరంగా విన్న తర్వాతే స్వతంత్ర సంస్థతో దర్యాప్తునకు ఆదేశించాలా వద్దా అన్న అంశాన్ని నిర్ణయిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని, దీనిపై విచారణకు ఆదేశించాలని కోరుతూ మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి 2019 మార్చి 5న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా శుక్రవారం సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కేసుకు సంబంధించి సుప్రీం గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు బీహెచ్ఈఎల్ పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ అఫిడవిట్‌తో పాటు దానిపై నాగం జనార్దన్‌రెడ్డి ఫైల్ చేసిన రిజాయిండర్‌లను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. కాగా ఈ వ్యవహారంలో తెలంగాణ హైకోర్టులో మూడు పిటిషన్లు కొట్టివేశారని, మరికొన్ని ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని ప్రతివాది తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ ధర్మాసనానికి తెలిపారు. అనంతరం తదుపరి విచారణను ధర్మాసనం మే మూడవ వారానికి వాయిదా వేసింది.

నేడు ఫిషరీస్ స్టార్టప్ కాన్‌క్లేవ్ 2.0

హాజరు కానున్న కేంద్రమంత్రి రాజీవ్ రంజన్‌సింగ్



సాక్షి, న్యూఢిల్లీ: మత్స్య రంగంలో నవకల్పన, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి మత్స్య విభాగంలో శనివారం హైదరాబాద్‌లో ఫిషరీస్ స్టార్టప్ కాన్‌క్లేవ్ 2.0 నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్, పంచాయతీరాజ్ సహాయ మంత్రి జార్జ్ కురియన్, మత్స్య పరిశ్రమ రంగంలోని అంకుర సంస్థలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు హాజరవుతారని ప్రభుత్వం తెలిపింది. చేపలు, రొయ్యల పెంపకం రంగంలో అంకుర సంస్థలకు, ఈ-కామర్స్ అవకాశాలపై చర్చలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. చేపలు పట్టే వృత్తికి సంబంధించిన సేవలు, వనరులను డిజిటల్ మాధ్యమం ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చి వ్యవస్థీకృతం చేసేందుకు రూపొందించిన నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ (ఎన్ఎఫ్‌డీపీ) మొబైల్ యాప్‌ను ఈ కాన్‌క్లేవ్‌లో ఆవిష్కరించనున్నారంది. అలాగే 'ఫిషరీస్ స్టార్టప్ గ్రాండ్ చాలెంజ్ 2.0'ను కూడా ప్రకటించనున్నట్లు వెల్లడించింది. మత్స్య పరిశ్రమలో ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న అంకుర సంస్థలు వాటి అనుభవాన్ని ఈ కాన్‌క్లేవ్‌లో పంచుకోనున్నాయి.

ఏఐబీపీ కింద నాలుగు ప్రాజెక్టులకు..

కేంద్రం నుంచి సాయం పొందాలని రాష్ట్రం నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సాగు విస్తీర్ణాన్ని పెంచడం, సాగునీరు అందుబాటులోకి తేవడం కోసం ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై-ఏఐబీపీ) కింద కొత్తగా నాలుగు ప్రాజెక్టులకు కేంద్ర సాయం పొందాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే కేంద్ర జలశక్తిశాఖ సాంకేతిక సలహా మండలి (టీఏసీ) అనుమతి పొందిన మోడికుంటవాగు, చనాకా కొరాటా, ముక్తేశ్వర్ (చిన్నకాళేశ్వరం) ప్రాజెక్టులకు ఆర్థికసాయం కోసం ప్రతిపాదనలు సమర్పించగా.. తాజాగా టీఏసీ అనుమతి కోసం ఎదురుచూస్తున్న సీతారామ ఎత్తిపోతల/ సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు కూడా సాయం కోరాలని నిర్ణయించింది. ముక్తేశ్వర్ ఎత్తిపోతల పథకాన్ని రూ.632 కోట్లతో చేపట్టగా, ఇందులో రూ.171.22 కోట్లు, అలాగే రూ.527.66 కోట్లతో చేపట్టిన మొడికుంటవాగు ప్రాజెక్టుకు రూ.276 కోట్లు, చనాకా కొరాటాలో డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ కోసం రూ.796 కోట్లు వెచ్చించాలని నిర్ణయించగా రూ.103 కోట్ల కేంద్ర సహాయం పొందాలని నిర్ణయించింది. సీతారామ ప్రాజెక్టును రూ.19,954 కోట్లతో చేపట్టగా.. ఇప్పటిదాకా రూ.11,316 కోట్లను వెచ్చించారు. మిగిలిన వ్యయానికి కేంద్ర సహాయం కోరనున్నారు.

ఫోన్‌ట్యాపింగ్‌పై సమాచారం ఎందుకివ్వరు?

వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: సమాచార హక్కు చట్ట ప్రకారం.. ఫోన్ ట్యాపింగ్ వివరాలు కోరినా ఎందుకు ఇవ్వడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై పూర్తి వివరాలు తెలుసుకుని చెప్పాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. తన ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటూ 2015లో హోంశాఖకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి చేసిన ఫిర్యాదుపై ఏం చర్యలు తీసుకున్నది వివరించాలని సమాచార హక్కు కింద కోరితే.. ప్రభుత్వం నుంచి బదులు లేదంటూ పర్హాత్ ఇబ్రహీం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ న్యాయవాది పి.మహేశ్ వాదనలు వినిపిస్తూ.. ఆ ఫిర్యాదుపై వివరాలిచ్చేందుకు అధికారులు నిరాకరించారని చెప్పారు. దానిపై అప్పీలు చేయగా అప్పీలేట్ అథారిటీ అయిన డీజీపీ తనకు మినహాయింపు ఉందంటూ సమాచారం ఇవ్వలేదన్నారు. దీనిపై అప్పీల్ దాఖలు చేద్దామంటే సమాచార హక్కు కమిషన్ పనిచేయకపోవడంతో హైకోర్టుకు రావాల్సి వచ్చిందని తెలిపారు. పిటిషనర్ ఫోన్‌పై కూడా పోలీసులు నిఘా పెట్టినట్లు అనుమానంగా ఉందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పూర్తి వివరాలు అందజేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా...

పంచాయతీ సెక్రటరీలకు 4 వేతన స్కేళ్లు పెంచండి

- డిప్యూటీ సీఎంకు టీపీఎస్‌ఏ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్‌: నూతన పీఆర్సీని అమలు చేయడంలో భాగంగా పంచాయతీ కార్యదర్శులకు నాలుగు వేతన స్కేళ్లు పెంచడంతో పాటు గ్రేడ్‌–4 స్కేల్‌ను సీనియర్‌ అసిస్టెంట్‌ వేతనపు స్కేల్‌గా ఇవ్వాలని డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్‌ అసోసియేషన్‌ (టీపీఎస్‌ఏ) విజ్ఞప్తి చేసింది. శుక్రవారం ఈ మేరకు సచివాలయంలో భట్టికి సంఘం అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌, ఇతర నేతలు వినతిపత్రం అందించారు. మున్సిపల్‌ శాఖలో పంచాయతీల విలీనమప్పుడు గ్రామాలతో పాటు తీసుకున్న రెగ్యులర్‌ పంచాయతీ పోస్టులను తిరిగి పీఆర్‌ శాఖకే కేటాయించాలని విన్నవించారు. రాష్ట్రంలోని అన్ని జీపీలను నాలుగు గ్రేడ్‌లుగా పునర్‌ వ్యవస్థీకరించి, ఆయా గ్రేడ్‌ల వారీగా కేడర్‌ స్ట్రెంత్‌ను పెంచి జోన్‌ల వారీగా కేడర్‌ను కేటాయించాలని కోరారు.

ఉద్యోగుల పెండింగ్‌ బిల్లులకు తక్షణ చర్యలు


ఎస్టీఎఫ్‌కు డిప్యూటీ సీఎం భట్టి స్పష్టత

సాక్షి, హైదరాబాద్‌: ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్‌ బిల్లుల పరిష్కారం కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కార్యాచరణ ప్రకటించినట్టు స్కూల్‌ టీచర్స్‌ ఫెడరేషన్‌ (ఎస్టీఎఫ్‌) తెలిపింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు, ప్రధాన కార్యదర్శి పోచయ్య.. భట్టిని కలిశారు. దశాబ్ద కాలంగా మిగిలిపోయిన ఉద్యోగుల, పెన్షనర్ల బకాయిలను చెల్లించేందుకు శుక్రవారం జరిగిన జేఏసీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఈ కార్యాచరణ ప్రకటించారన్నారు. బిల్లుల కోసం ఉద్యోగులు ఆఫీసుల చుట్టూ తిరిగి, మానసిక ఒత్తిడికి గురవ్వకుండా చేస్తామని, ఇక నుంచి ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని భట్టి చెప్పినట్టు సంఘ నేతలు వెల్లడించారు.

సచివాలయంలో సమగ్ర భద్రతా అవగాహన కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్‌: జాతీయ భద్రతా వారోత్సవ వేడుకల్లో భాగంగా షిండ్లర్‌ ఎలివేటర్‌ ఇండియా ప్రైవేట్‌ లిమిటెడ్‌ సంస్థ శుక్రవారం తెలంగాణ సెక్రటేరియట్‌లో సమగ్ర భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. తెలంగాణ సచివాలయ చీఫ్‌ సెక్యూరిటీ ఆఫీసర్‌ దేవీదాస్‌ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో భద్రత, పర్యావరణ బాధ్యతను ప్రోత్సహించే లక్ష్యాలను షిండ్లర్‌ ఎలివేటర్‌ ఇండియా ప్రైవేట్‌ లిమిటెడ్‌ సంస్థ భద్రతా అధికారి చక్రవర్తి, ఖాతాల అధికారి కల్యాణి, ప్రాంత మేనేజర్‌ కౌసర్‌ వివరించారు.


మధ్యమానేరు జలాశయంలో..


మిషన్‌ భగీరథ పంప్‌హౌస్‌ వద్ద..

మిడ్‌ మా'నీరు' అడుగంటె..

ఎగువ నుంచి చుక్కనీరు వచ్చే అవకాశం లేదు.. మరోవైపు ఎండలు ముదరడంతో మిడ్‌ మానేరు జలాశయం అడుగంటుతోంది. జలాశయ సామర్థ్యం 27.55 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.58 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని 260 గ్రామాలకు తాగునీటిని అందించే ఈ జలాశయం అడుగంటడం ఆందోళనకు గురిచేస్తోంది. నిండు వేసవిలో జలగండం తప్పేలా లేదు.

– సిరిసిల్ల

బకాయిలన్నీ చెల్లిస్తాం

- ఏప్రిల్‌ నుంచి ప్రతి నెలా రూ.500–600 కోట్లు ఇస్తాం..
- ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ
- ఏప్రిల్‌ నుంచి ఎలాంటి కొత్త బకాయిలు లేకుండా చూస్తాం
- ఆర్థికేతర అంశాలను సబ్‌ కమిటీలో చర్చించి పరిష్కరిస్తామని వెల్లడి


డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

సాక్షి, హైదరాబాద్‌: ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.8 వేలకోట్ల బకాయిలను చెల్లిస్తామని.. ఏప్రిల్‌ నుంచి ప్రతీ నెలా ఐదారు వందల కోట్లు చొప్పున ఇస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ఏప్రిల్‌ నుంచి వచ్చే కొత్త బిల్లులను పెండింగ్‌లో పెట్టకుండా.. ఏ నెలకు ఆ నెలలో క్లియర్‌ చేస్తామని చెప్పారు. తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని.. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా, ప్రజా ప్రభుత్వం రూ.10 వేల కోట్ల పెండింగ్‌ బిల్లులను క్లియర్‌ చేసిందని తెలిపారు. జీవితకాలం పనిచేసి దాచుకున్న డబ్బులకోసం ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను సీఎం రేవంత్‌రెడ్డి, తాను అర్థం చేసుకున్నామని చెప్పారు. శుక్రవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టితో ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌ జగదీశ్వర్‌, అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌, టీజీఓ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సహాధ్యక్షుడు శ్యామ్‌, ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, పలువురు ఉద్యోగ సంఘాల నేతలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ''ఉద్యోగులు బకాయిల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. గ్రీన్‌ చానల్‌ ద్వారా పెండింగ్‌ బిల్లులు క్లియర్‌ చేస్తాం. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి గత ప్రభుత్వంలోని రూ.5 వేల కోట్లు, ఈ ప్రభుత్వానివి కలిసి రూ.10,000 కోట్లు పెండింగ్‌ బిల్లులను ఇప్పటివరకు క్లియర్‌ చేశాం. మరో ఎనిమిది వేల కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి''అని చెప్పారు.

ఏప్రిల్‌ నుంచి కొత్త బకాయిలు ఉండవు..

ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చే ఏప్రిల్‌ నుంచి కొత్త బకాయిలు ఉండవని, పాత బకాయిలను ప్రాధాన్యత క్రమంలో ప్రతినెల రూ. 500 నుంచి రూ. 600 కోట్ల వరకు చెల్లిస్తామని భట్టి హామీ ఇచ్చారు. గత పదేళ్ల పాలించినవారి హయాంలో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నెలలో ఏ తేదీలో జీతాలు పడతాయో అర్థంకాని పరిస్థితి ఉండేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా క్రమం తప్పకుండా ఒకటో తేదీన జీతభత్యాలు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో దాదాపు 13 లక్షల మంది సిబ్బంది ఉన్నారని చెప్పారు. కేవలం పదవీ విరమణ ప్రయోజనాలు, మెడికల్‌ తదితర బిల్లులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని.. వాటిని సాధ్యమైనంత త్వరలో క్లియర్‌ చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థికేతర అంశాలపై మంత్రివర్గ ఉప సంఘంలో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ నాన్‌ గెజిటెడ్‌, గెజిటెడ్‌, వివిధ ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాలు, మున్సిపల్‌, వైద్య ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

45 ఆర్థికేతర, 12 ఆర్థిక సమస్యలను విన్నవించాం: ఉద్యోగ జేఏసీ

డిప్యూటీ సీఎం భట్టితో సమావేశం అనంతరం ఉద్యోగ జేఏసీ చైర్మన్‌ మారం జగదీశ్వర్‌, అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌ మీడియాతో మాట్లాడారు. 45 ఆర్థికేతర, 12 ఆర్థిక అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. 4 డీఏలు, పెండింగ్‌ బిల్లుల క్లియరెన్స్‌, హెల్త్‌కార్డులు విడుదల చేయాలని కోరామన్నారు. ప్రతి నెలా రూ.వెయ్యి కోట్ల పెండింగ్‌ బిల్లులను క్లియర్‌ చేయాలని, జాయింట్‌ స్టాఫ్‌ కౌన్సిల్‌ మీటింగ్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశామని వెల్లడించారు. ఆర్థికేతర అంశాల పరిష్కారానికి వీలైనంత త్వరగా కేబినెట్‌ సబ్‌కమిటీ సమావేశం నిర్వహించాలని కోరామన్నారు. దీనికి సంబంధించి ఐదారుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి.. పెండింగ్‌ బిల్లుల సమస్యను పరిష్కరిస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారని వెల్లడించారు. ఇక రెవెన్యూ ఉద్యోగుల పెండింగ్‌ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి డిమాండ్‌ చేశారు.

కలసి వస్తే.. కలదు పరిష్కారం

- రాష్ట్రంలోని అన్ని పార్టీలకు ప్రభుత్వం పిలుపు
- నేడు అన్ని పార్టీల ఎంపీలతో ప్రజా భవన్‌లో భేటీ
- హాజరు కానున్న సీఎం రేవంత్‌, భట్టి

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్‌ ప్రాజెక్టులను సాధించడమే లక్ష్యంగా.. రానున్న లోక్‌సభ బడ్జెట్‌ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. అందులో భాగంగా రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల లోక్‌సభ సభ్యులతో శనివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమావేశం కానున్నారు. సమావేశానికి హాజరు కావాలంటూ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు రాష్ట్ర ఎంపీలందరికీ శుక్రవారం భట్టి స్వయంగా ఫోన్‌ చేసి ఆహ్వానించారు. అపరిష్కృతంగా ఉన్న రాష్ట్ర సమస్యలపై సమావేశంలో ఎంపీలతో సీఎం, డిప్యూటీ సీఎంలు చర్చించనున్నారు. ఇటీవల ప్రధాని మోదీని సీఎం రేవంత్‌ కలిసిన సందర్భంగా.. మోదీ ఇచ్చిన వినతిపత్రంలోని అంశాలకు ఎలాంటి సహకారం అందిస్తామనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వివరించనుంది. కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు విధివిధానాలు, రాష్ట్ర రుణ భారం తగ్గించుకునేందుకు గల వెసులుబాటు, కేంద్రం నుంచి రావలసిన పన్నుల వాటా పెంపు, గ్రాంట్‌ ఇన్‌ ఎయిడ్‌పై చర్చించి కేంద్రంపై సమష్టిగా ఒత్తిడి తెచ్చే కార్యాచరణను రూపొందించనున్నారు.

తుర్లపాటి రాజేశ్వరికి సాహిత్య అకాడమీ అవార్డు



న్యూఢిల్లీ: 2024కి గాను అనువాదంలో ప్రసిద్ధులైన 21 మందికి సాహిత్య అకాడమీ అవార్డులను ప్రకటించింది. ఇంగ్లిష్‌లో అనిసుర్‌ రహ్మాన్‌, హిందీలో మదన్‌ సోనీకి దక్కగా తెలుగులో తుర్లపాటి రాజేశ్వరి ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. 'హజారో ఖ్వాహిసే'ఐసీ అనే ఉర్దూ కవితల సంకలనాన్ని 'వండర్‌ ఫుల్‌ వరల్డ్‌ ఆఫ్‌ ఉర్దూ గజల్స్‌'పేరుతో అనిసుర్‌ ఇంగ్లిషులోకి అనువదించారు. అదేవిధంగా, యశోధరా దాల్మియా ఇంగ్లిష్‌లో రాసిన కళాకారుడు సయ్యద్‌ హైదర్‌ రజా ఆత్మకథను సోనీ హిందీలోకి తర్జుమా చేశారు. ఇంకా, తమిళం, మరాఠీ, పంజాబీ, ఒడియా, కన్నడ, రాజస్తానీ తదితర భాషల అనువాదకులను సైతం అవార్డుకు ఎంపిక చేశారు. సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మదన్‌ కౌశిక్‌ ఆధ్వర్యంలో శుక్రవారం ఢిల్లీలో సమావేశమైన బోర్డు ఈ విషయం ప్రకటించింది. సంబంధిత భాషల్లో ముగ్గురు సభ్యుల జ్యూరీ అందజేసిన ప్రతిపాదనలు, నియమ నిబంధనలకు లోబడి ఎంపిక చేసినట్లు వివరించింది. త్వరలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో వీరికి రూ.50 వేల నగదుతోపాటు తామ్ర పత్రం అందజేయనున్నామంది.

విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక కమిటీలు

ఎస్‌సీఈఆర్‌టీ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు అంచనా వేసేందుకు స్టేట్‌ కౌన్సిల్‌ ఫర్‌ ఎడ్యుకేషన్‌ అండ్‌ రీసెర్చ్‌, ట్రైనింగ్‌ (ఎస్‌సీఈఆర్‌టీ) ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ప్రతీ బృందంలోనూ విద్యా రంగానికి చెందిన ఇద్దరు సీనియర్లు సభ్యులుంటారు. ఈనెల 10వ తేదీ నుంచి ఈ బృందాలు స్కూళ్లలో పరిశీలనకు వెళ్తాయి. పదవ తరగతి యాక్షన్‌ ప్లాన్‌, సిలబస్‌ పూర్తి, లేబొరేటరీల నిర్వహణ, ఎఫ్‌ఎల్‌ఎన్‌, ఎల్‌ఐపీ నిర్వహణ పనితీరు, విద్యార్థుల ప్రగతి, మూల్యాంకన విధానాలు, ఫార్మేటివ్‌ అసెస్‌మెంట్‌, సమ్మేటివ్‌ అసెస్‌మెంట్‌ నిర్వహణ పరిశీలిస్తారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల పురోగతి ఎలా ఉందో తెలియజేస్తూ పాఠశాల విద్య డైరెక్టర్‌కు నివేదిక అందిస్తాయి.









మీ ముఖాన్ని వెలుతురు వైపు ఉంచండి.
మీకు నీడలు కనబడవు.
– హెలెన్ కెల్లర్

సాక్షి
శనివారం, 8 మార్చి 2025

సుపరిపాలనకు దోవ

'సివిల్ సర్వీసు అధికారికి ఎంత తెలుసనేది కాదు... ఆ అధికారి ఎంత జాగ్రత్తగా విధి నిర్వహణ చేస్తారన్నదే అసలైన పరీక్ష' అన్నారు ప్రథమ భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ. అఖిల భారత సర్వీసుల రూపశిల్పి, దేశ తొలి ఉపప్రధాని సర్దార్ పటేల్ సైతం ఈ అధికారుల గురించి చెప్పిన మాటలు వారి బాధ్యతను గుర్తుచేస్తాయి. సివిల్ సర్వీసులకు ఎంపికైనవారు స్వతంత్రంగా, నిజాయితీగా, నిర్భీతితో వ్యవహరించగలిగితేనే పటిష్ఠమైన దేశ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన అభిలషించారు. కానీ ఇప్పటికీ ఆచరణలో సమస్యలు తప్పడం లేదు. ఈమధ్య తమ ముందు కొచ్చిన ఒక పిటిషన్‌పై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఐఏఎస్‌ల తీరుపై కటువుగా వ్యాఖ్యానించింది. ఐఏఎస్‌లు తరచు తాము ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులకన్నా అధికులమని భావిస్తారనీ, అది సరికాదనీ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిలతో కూడిన ధర్మాసనం తెలిపింది. సివిల్ సర్వీసుల రూపకర్తలు ఇలాంటి అంతరాలను చూడలేదు. విధి నిర్వహణకు సంబంధించినంత వరకూ ఈ సర్వీసుల్లోని వారు దేశాభివృద్ధినీ, భద్రతనూ కాంక్షించి అందుకు అనువైన నిర్ణయాలు తీసుకుంటూ తమ విధులు నిర్వర్తించాలని కోరుకుంది. స్వభావరీత్యా విధి నిర్వహణ భిన్నంగా ఉండొచ్చు. ఇందులో ఎక్కువ, తక్కువ అనే సమస్యే రాకూడదు.

సాధారణంగా సివిల్ సర్వీస్ వైపు వచ్చే యువతీయువకులకు సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపైనా, వాటివల్ల కలుగుతున్న అనర్థాలపైనా ఆగ్రహం ఉంటుంది. వాటి పరిష్కారం తమవల్ల సాధ్యమేనన్న విశ్వాసం ఉంటుంది. సంపాదనే ప్రధానమనుకుంటే ఏ బహుళజాతి సంస్థకో మేనేజర్‌గా లేదా సీఈవోగా వెళ్లవచ్చు. సివిల్ సర్వీసుల్లోకన్నా అత్యధిక జీతం, ఇతర సదుపాయాలూ, ఆస్తుల సంపాదన ఉంటాయి. పైగా అక్కడ అధిక శ్రమ, పని ఒత్తిడి ఉండవు. కానీ సివిల్ సర్వీస్‌లు అలా కాదు. ప్రభుత్వంలో ఎక్కడో కిందిస్థాయి అధికారి తీసుకునే పొరపాటు నిర్ణయం ఆ ప్రాంతంలోనో, ఆ జిల్లాలోనో, కొన్ని సందర్భాల్లో రాష్ట్రంలోనో కల్లోలానికి దారి తీయొచ్చు. ప్రభుత్వ పథకాల అమలులో చోటుచేసుకునే చిన్న లోపం కూడా సాధారణ పౌరులను కలవరపరిచి వారు ప్రాణం తీసుకునే ప్రమాదం కూడా ఉండొచ్చు. లేదా అధికారిపై దౌర్జన్యానికి దిగొచ్చు. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవటం, అనుకోని సమస్య ఎదురైతే సమయస్ఫూర్తితో వ్యవహరించటం తప్పనిసరి. అలాగని ఈ అంతరాలు లేవని కాదు. ప్రాధాన్యత క్రమంలో ఐఏఎస్‌లు మొదటి స్థానంలో ఉంటారు. ఆ తర్వాత ఐపీఎస్‌లు వస్తారు. ఇది పాలనా సౌలభ్యం కోసం చేసిన ఏర్పాటు. స్వల్ప వ్యత్యాసంతో ఇద్దరి ప్రారంభ వేతనాలూ... ఆరోగ్యం, ఆవాసం, సెలవులు, ఇతర సదుపాయాలూ ఒకేలావుంటాయి. మొదటి మూడు నాలుగు నెలలు ఉమ్మడిగా శిక్షణనిచ్చినా బాధ్యతలరీత్యా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లకు వేర్వేరుచోట్ల ప్రత్యేక శిక్షణనిస్తారు. ఒక జిల్లాకో, ఒక ప్రాంతానికో బాధ్యత వహించే ఐఏఎస్ అధికారి అక్కడి పాలనా వ్యవస్థను పటిష్ఠపరచటానికి నిర్ణయాలు తీసుకోవాల్సి వుంటుంది. ఎవరిని ఏ స్థానంలో పనిచేయించాలో, అందుబాటులో ఉన్న వనరుల ఆధారంగా అక్కడి ప్రజల అభ్యున్నతికి ఏమేం చేయవచ్చునో అధ్యయనం చేయటం, దాని ఆధారంగా నిర్ణయాలు తీసుకోవటం కూడా ఐఏఎస్ అధికారుల బాధ్యత. ఐఏఎస్‌లకు భిన్న శాఖల్లో పనిచేసే అవకాశం లభిస్తుంది. ఐపీఎస్‌లకు శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి ఉంటుంది. దానికి అనుగుణంగా వారికి ప్రత్యేక శిక్షణ అవసరమవుతుంది. అలాగే ఐఎఫ్ఎస్‌లు అడవుల పరిరక్షణలో, భద్రతలో, వాటి నిర్వహణలో అవగాహన పెంచుకుంటారు. పర్యావరణం, వాతావరణ మార్పులు, సహజ వనరుల సంరక్షణ వారి ప్రధానాంశాలు.

అందరి అంతిమ ధ్యేయమూ మెరుగైన పాలనా వ్యవస్థను ప్రజల అందుబాటులోకి తీసుకురావటమే అయినప్పుడు ఎవరికీ ఆధిక్యతా భావన ఉండకూడదు. అటువంటి మనస్తత్వం పాలనపై దుష్ప్రభావం కలిగిస్తుంది. ప్రభుత్వ తీరుతెన్నులపై విమర్శలకు తావిస్తుంది. కానీ దురదృష్టమేమంటే, ధర్మాసనం చెప్పినట్టు చాలాచోట్ల ఇలాంటి పోకడలు కనిపిస్తున్నాయి. రెండేళ్ల క్రితం కర్ణాటకలో ఐఏఎస్, ఐపీఎస్ బాధ్యతల్లోవున్న ఇద్దరు మహిళా అధికారులు సామాజిక మాధ్యమాల్లో ఎలా దూషించుకున్నారో ఎవరూ మరిచిపోరు. అప్పట్లో ప్రధాని కార్యాలయం ఆనాటి ముఖ్యమంత్రిని వివరణ కోరింది. సుప్రీంకోర్టు ధర్మాసనం ఉత్తరాఖండ్‌లో అడవుల సంరక్షణ, అభివృద్ధి అవసరాలు సమతౌల్యం చేయటానికి ఉద్దేశించిన నిధులు దుర్వినియోగం కావటానికి సంబంధించి దాఖలైన కేసులో ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంలో ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులిద్దరి మధ్య తలెత్తిన వివాదం ప్రస్తావనకొచ్చినప్పుడు న్యాయమూర్తులు ఐఏఎస్‌ల తీరును నిశితంగా విమర్శించారు. ఒకచోట పనిచేయాల్సి వచ్చినప్పుడు వివాదాలు తలెత్తటం అసాధారణమేమీ కాదు. కానీ వ్యక్తిగత స్థాయికి వివాదాల్ని దిగజార్చటంవల్ల వ్యవస్థ దెబ్బతింటుంది. చాలా రాష్ట్రాల్లో ఇలాంటి సమస్యలుంటున్నాయి. వీటికి ఎక్కడో ఒకచోట బ్రేక్ పడాలి. తాత్కాలిక సర్దుబాట్లుకాక మరోసారి సమస్య తలెత్తకుండా ఏం చేయవచ్చునో ఆలోచించాలి. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పరిచిన అధి కార యంత్రాంగం కాస్తా అంతర్గత కలహాల్లో మునిగితే వ్యవస్థ నష్టపోతుంది. అంకితభావంతో, కర్తవ్యనిష్ఠతో పనిచేసిన ఎస్.ఆర్. శంకరన్, బి.డి. శర్మవంటివారు ఇవాళ్టికీ చిరస్మరణీయులు. అధికారులకు వారు ఆదర్శం కావాలి. అప్పుడు అహంభావానికి తావుండదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** శు.నవమి ప.12.02 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** ఆరుద్ర రా.2.45 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** ఉ.11.35 నుండి 1.11 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.16 నుండి 7.53 వరకు, **అమృత ఘడియలు:** సా.5.01 నుండి 9.43 వరకు.

సూర్యోదయం : 6.18
సూర్యాస్తమయం: 6.04
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

ఎందరో మహానుభావులు

దేశం కోసం ఆమె

సందర్భం



డా॥ సౌమ్య స్వామినాథన్

స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని కాంక్షిస్తున్న నేపథ్యంలో వివిధ రంగాలకు నిర్దిష్ట లక్ష్యాలు నిర్వచించుకున్నాం. ఈ లక్ష్యం నెరవేరడంలో సైన్స్ కీలకపాత్ర పోషించనుంది.

అయితే, భారతీయ శాస్త్ర రంగం అక్కడక్కడ కొన్ని సంస్థల్లో కనిపించే అద్భుతంగా ఉండకూడదు. సామాజిక సమస్యల పరిష్కారానికి అన్నిచోట్లా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా మారాలి. ఇవన్నీ జరగాలంటే, ప్రాథమిక విద్య నుంచి స్నాతకోత్తరం వరకూ శాస్త్ర రంగంలో పెట్టుబడులు గణనీయంగా పెరగాలి. ప్రభావశీల పరిశోధనలకు ఇచ్చే ప్రోత్సాహకాలు, బహుమతులు పెరగాలి. స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ రంగంతో ప్రభుత్వ భాగస్వామ్యం, సమాజంలోని అట్టడుగు వర్గాలు ముఖ్యంగా మహిళల ప్రాతినిధ్యం పెరగాలి.

హేతుబద్ధమైన, ససాక్ష్యాలతో కూడిన పరిష్కారాలను చూపడం మొదలుపెడితే ప్రజాభిప్రాయం శాస్త్రవేత్తల నిర్ణయాలతో ఏకీభవిస్తుందని కోవిడ్ సమయంలో నిరూపితమైంది. మన అభివృద్ధిని అడ్డుకునే... పరిష్కారం లేని, రిస్క్ కారణంగా ప్రైవేట్ రంగం పెట్టుబడులు పెట్టని శాస్త్రపరమైన సమస్యలపై తక్షణం ప్రభుత్వం దృష్టి పెట్టాలి. బయో–ఈ3, నేషనల్ క్వాంటమ్ మిషన్, డీప్ ఓషన్ మిషన్ వంటివి ఇలాంటి సమస్యల పరిష్కారం దిశగా శాస్త్రవేత్తల దృష్టిని కేంద్రీకరించేందుకు ప్రయత్నించాయి. ప్రోత్సాహకరమైన విషయం ఏమిటంటే, ఈ ఏడాది బడ్జెట్‌లో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో చేపట్టిన కార్యక్రమాలకు కేటాయింపులు రెట్టింపు కంటే పెరగడం.

దేశంలోని శాస్త్ర పరిశోధనశాలల్లో మూలనపడ్డ అద్భుతమైన ఆవిష్కరణలు ఉన్నాయడంలో నాకు ఎలాంటి సందేహమూ లేదు. ప్రోత్సాహకాల లేమితో ఇవి ముందుకు కదలడం లేదు. వాయు కాలుష్యం, నీటిలోని సీసం, ఆర్సెనిక్ విషాల ఏరివేత, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ కాలుష్యం, ముఖ్యంగా జలవనరులకు సంబంధించిన సమస్యలను శాస్త్ర పరిశోధన సంస్థలు కలిసికట్టుగా చేపట్టాలి.

దేశ సమస్యలకు శాస్త్ర ఆధారిత పరిష్కారాలు కనుక్కునేందుకు అవసరమైన మౌలిక పరిశోధనలకు కేంద్రం సంస్థాగత గ్రాంట్ల రూపంలో అధికంగా సాయపడాలి. ఇదే సమయంలో అప్లికేషన్స్, వాటి వాణిజ్యీకరణ, పరిశోధనలను మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లడం వంటివి భాగస్వామ్య ఏర్పాట్లతో ప్రోత్సహించవచ్చు. దేశంలో శాస్త్ర పరిశోధన సంస్థల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న సంస్థలు క్రమేపీ పెరుగుతున్నాయి. టాటా గ్రూపు లాంటివి వందేళ్లుగా ఈ పని చేస్తున్నాయి. ప్రభుత్వ నిధులకు ప్రైవేట్ పెట్టుబడులు, దేశీ దాతలు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు తోడైతే సమాజానికి ఉపయోగపడే పరిశోధనలకు ఊతమివ్వవచ్చు.



నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

> మహిళలు నాయకత్వ స్థానాల్లో ఉంటే సంస్థల సమర్థత పెరుగుతుందనీ, వ్యవహారాలు పారదర్శకంగా ఉంటాయనీ, పనులు సమతుల్యతతో సాగుతాయనీ అధ్యయనాలు చెబుతున్నాయి.

మహిళలకు సముచిత స్థానం...

భారతీయ మహిళలు చాలా రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. పురిటిబిడ్డను కోల్పోయిన బాధ ఆనందీబాయి జోషీని ఎన్నో అడ్డంకులు అధిగమించి వైద్యశాస్త్రం చదువుకునేలా చేసింది. అది కూడా అమెరికాలోని పెన్సిల్వేనియా మహిళా కళాశాలలో. 1886లోనే ఈ ఘనత సాధించిన తొలి భారతీయ వైద్యురాలు ఆమె. దురదృష్టవశాత్తూ ఆ మరుసటి ఏడాదే ఆమె క్షయ వ్యాధికి బలైనా... ఎంతో మంది మహిళలు వైద్యం, వైద్య పరిశోధనల రంగాలను ఎంచుకునేందుకు స్ఫూర్తిగా నిలిచారు.

ఇలాంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి కానీ... 'స్టెమ్' రంగాల్లో (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్ అండ్ మేథమేటిక్స్) భారతీయ మహిళల భాగస్వామ్యం తక్కువ. ఈ రంగాల్లో కోర్సులందిస్తున్న సంస్థలపై ఇటీవల ఒక అధ్యయనం జరిగింది. అక్కడి బోధన సిబ్బందిలో కేవలం 16.6 శాతం మంది మాత్రమే మహిళలు. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ రీసెర్చ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) జాబితాలోని టాప్ ఎనిమిది సంస్థల్లో ఇది 10 శాతానికి మించడం లేదు. ఈ మహిళల్లోనూ 26.2 శాతం మంది మాత్రమే సీనియర్ స్థానాల్లో ఉన్నారు. దీన్నిబట్టే మహిళల విషయంలో ఎన్ని అసమానతలు ఉన్నాయో అర్థమవుతుంది. మహిళలు నాయకత్వ స్థానాల్లో ఉంటే సంస్థల సమర్థత పెరుగుతుందనీ, వ్యవహారాలు పారదర్శకంగా ఉంటాయనీ, పనులు సమతుల్యతతో సాగుతాయనీ దశాబ్దాల అధ్యయనాలు చెబుతున్నాయి.

దేశంలోని శాస్త్ర, వైద్య సంస్థల్లోని ఈ అసమానతలను సరిదిద్దాలంటే మొత్తం వ్యవస్థలో మార్పులు చేయాల్సి ఉంటుంది. వనరుల కేటాయింపు, టాలెంట్ మేనేజ్‌మెంట్, పదోన్నతులు, బదిలీల వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకునే వ్యవస్థల్లో మహిళలకు తగిన భాగస్వామ్యాన్ని తప్పనిసరి చేయాలి. అన్ని స్థాయుల్లోనూ మహిళలకు ఉద్యోగాల విషయంలో తగిన సలహాలు ఇచ్చేందుకు, శిక్షణ వంటివి కల్పించేందుకు ఏర్పాట్లు ఉండాలి. శిశు సంరక్షణ, డే కేర్ సర్వీసులు, ప్రసూతి సెలవులు, పిల్లలకు పాలు పట్టేందుకు ప్రత్యేకమైన గదులు, పని వేళల్లో వెసలుబాటు, ఇంట్లోంచే పని చేసే అవకాశాలు అన్ని స్థాయుల్లోనూ కల్పించాలి. మహిళలు మళ్లీ ఉద్యోగాల్లో చేరేందుకు ఈ చర్యలు ఉపయోగపడతాయి.

వ్యవసాయం, ఆహార భద్రత, అంతరిక్ష ప్రయోగాలు, రక్షణ రంగ తయారీ, టీకాలు, వ్యాధి నిర్ధారణ, ఫార్మా, ఐటీ వంటి అనేక రంగాల్లో భారతీయ శాస్త్రవేత్తల సామర్థ్యం, నాయకత్వం రెండింటికీ ఇప్పటికే ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. ఈ విజయాల నుంచి స్ఫూర్తి పొందుదాం.

వ్యాసకర్త 'ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్' చైర్‌పర్సన్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

ఆమె కోసం అతను

సందర్భం



కె.ఎన్. మల్లీశ్వరి

స్త్రీలు– ఎవరి నొప్పికి వారే మందు వేసుకుంటూ, ఎవరి యుద్ధం వాళ్ళే చేస్తూ, ఆకాశంలో సగాలమని నినదిస్తూ, పడుతూ, రెట్టింపు బలంతో లేస్తూ– చలిచీమల కవాతుకి అర్ధ శతాబ్ది. కడచి వచ్చిన కాలాలను ఈ మహిళా దినోత్సవం రోజున పాఠకురాలిగా తిరిగి చూడటమంటే వెన్ను నిలబెట్టిన అక్షరాలని కావిలించుకోవడం. ఎన్నెన్ని కథలు, కవిత్వాలు, నవలలు, నాటకాలు, వ్యాసాలు మీకోసం మేమున్నామని భుజంమీద చేయివేసి కన్నీరు తుడిచాయి! అక్షరాలలో దట్టించిన ధైర్యం, విశ్వాసం, విజ్ఞానం, పోరాటం నలుగడలా కమ్ముకుని స్త్రీశక్తి విస్ఫోటనమై ఎన్నెన్ని కొత్త విలువలు బారులు తీరాయి! ఇప్పటి, మునుపటి తరాల ముందుచూపు కవులకి, రచయితలకి వందనాలు.

ఆడపిల్లలను అమ్ముకుంటున్న రోజుల్లో, అతిబాల్య, అతివృద్ధ వివాహాల మారకంలో స్త్రీ వస్తువైన రోజుల్లో– 'మగడు వేల్పన పాతమాట, ప్రాణసఖుడ'ని చెప్పి, 'ఆధునిక మహిళ చరిత్ర పునర్లిఖిస్తుంద'ని నమ్మిన క్రాంతదర్శికి కృతజ్ఞతలు. ఒకటీ అరా ఘటనలు పట్టుకుని స్త్రీలు ఎంత నేరస్థులో నిరూపించడానికి వర్తమాన మీడియా ప్రయత్నిస్తున్న కాలాన– 'స్త్రీల మీద ప్రపంచానికి యింత అపనమ్మకం గనుకనూ స్త్రీని శీలం విషయమై damn చెయ్యడమూ, గాయం చెయ్యడమూ ఇంత సులభం గనుకనూ స్త్రీ శీలం తన సొమ్మని పురుషుడు అనుకోవడం వల్లనూ స్త్రీని శిక్షించే అధికారం ప్రతి పురుషునికీ ఉండటం వల్లనూ స్త్రీ ఇంత మోసగత్తె అబద్ధీకురాలు ఐ జీవితమంతా నటిస్తోంద'ని స్త్రీల చెడుగు వెనుక కారణాలను బట్టబయలు చేసిన స్వేచ్ఛామూర్తిని స్మరించుకుంటూ ముంజేతిపై నాలుగు ముద్దులు.

స్త్రీల నవ్వు, నడక, మాట దుస్తులబట్టి ఆమె లైంగిక వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తున్న ఈ మాయదారి కాలంలో– చెడిపోయిన మనుషులను, సవతి తల్లి, కొడుకుల ప్రేమబంధాన్ని ఒప్పించేలా రాసి, 'మనిషి నుంచి మనిషికి సాధ్యమైనంత హెచ్చు ఉపకారమూ సాధ్యమైనంత తక్కువ అపకారమూ జరిగేలా చూసుకోవడమే నీతి. తక్కిన బూటకపు నీతి నియమాలను నమ్మకండి' అన్న భావ విప్లవకారునికి శాల్యూట్. ఉన్నదంతా కుటుంబానికి పెట్టి, అన్నిటికోసం చేయి సాచాల్సి వచ్చే స్త్రీలకి కొదవలేని మనదేశంలో– 'అది నా ఇల్లు కాదా అని అడిగావు. అది నా ఇల్లు కాదు. ఒకప్పుడు నాదే అనుకున్నాను. ఆ ఇల్లు, మా ఆయన పెంచుకొంటున్న కుక్కదెట్లా కాదో, నాదీ అట్లానే కాదు. ఆయన కుక్కనీ అపేక్షగానే చూసుకొంటారు. నన్నూ ఆపేక్షగానే చూసుకొంటారు. అంతమాత్రాన ఆయనకులాగా మాకు ఇంటిమీద హక్కులుండవు. మేము మా బాధ్యతలు నిర్వహించడం ద్వారా ఆయన ఆపేక్షని ప్రతిఫలంగా పొందగలిగాము. అంతే!' అని ధీమాగా చెప్పిన ఆమె కోసం ఒక ఇంటిని దృఢంగా నిర్మించిన మంచి రచయితకు ధన్యవాదాలు.

> కొందరుంటారు, తమ చుట్టూ తనకలాడుతున్న ఆరాట పోరాటాలతో మమేకమయ్యేవారు. కొందరున్నారు తమ జీవితాల్లో మేలిమి భాగమైన స్త్రీల విలువని గుర్తించి అక్షరాలలో నిలబెట్టినవారు.

అరవై దాటితే ఇక జీవితం బోనస్ అంటూ స్త్రీలకి ప్రో ఏజింగ్ మెళకువలను తిరస్కరించే సమాజంలో – 'చీకటిని చూసో, పరిసరాలలోని అపరిచితత్వాన్ని చూసో భయం వేసినప్పుడు, ఆకలితో బెంగతో జ్వరంతో జీవనలౌల్యాల తీరని మంకుతనంతో అల్లాడినప్పుడు, ఒక్కసారి గుక్కపట్టి ఏడ్వాలనిపిస్తుంది. లాలన, రక్షణ ఇవ్వగలిగే ఒకే ఒక్క అమ్మని పిలవాలనిపిస్తుంద'ని తల్లి విలువని గుర్తించిన పసిబాలునికి కావిలింతలు. తన కుటుంబ స్త్రీలు తప్ప తక్కినవారంతా అవైలబుల్ వస్తువులుగా కనపడే మెజారిటీ మగ సమాజంలో– 'బాగ్ ఒక మూలకి పడేసి, కుర్చీలోంచి నా కాళ్ళు తీసి అక్కడ కూర్చుని కళ్ళు మూసుకుని 'యాభై వచ్చాయి. రెండునెలల నుంచి మెన్సెస్ రాలేదు. ఇప్పుడేమో రెండురోజుల నుంచి బ్లీడింగ్' (I know that is not the complete story) ''ఊ'' అంటాను. 'ఆఫీస్ నుంచి ఇంటికి వెళ్ళేటప్పటికి పది అయ్యింది. బ్లూ ఫిలిమ్స్ చూస్తూ కూర్చున్నాడు. ఓపిక లేదన్నా వినలేదు, బ్లీడింగ్ అవుతుందని చెబుతున్నా...' అనేక ఆమెలపై సాగే హింసలను ఒకచోట ముద్దచేసి కళ్లముందు పెట్టుకుని ఆ నెప్పినంతా తానే తీసేసుకోవాలన్నంతగా తపించే పువ్వులాంటి మనసున్న కవికి కరచాలనం.

స్త్రీల విలువను గుర్తించేవారు...

ఇతర మతాలు, ఆచారాలు, అలవాట్ల పట్ల వల్లమాలిన ద్వేషాన్ని నూరిపోస్తున్న మెజారిటీ మత రాజకీయ చదరంగంలో– 'పువ్వులు రాల్చుకునీ రాల్చుకునీ/ నన్ను కాడగా మిగిల్చావు/ ఇంకా ఏం మిగిలిందని/ ఈ కంకాళంపై కారుమబ్బు కప్పి నడిపిస్తున్నావు/ నా ముఖానికి వేలాడేసిన నఖాబ్/ ఎత్తి చూశావా ఎన్నడైనా/ నా కళ్లు/ రెండు అమాస చంద్రుళ్లను మోస్తుంటాయ్' అంటూ స్వజనులు చూపే వివక్షని నిలదీసిన సాహసికి సలాములు. స్త్రీలు, తాము ఎవరిని ఎపుడు పెళ్లి చేసుకోవాలో సొంతంగా నిర్ణయం తీసుకోగల హక్కుని నిరాకరించే కుటుంబాలున్న సామాజిక చట్రంలో– 'మీ ఊరికి మా వాడకి మధ్య ఎడ్డుతునకల దండెం కడదాం /కాస్త మీ ఇంట్లో ఉన్న జంధ్యం తీసుకు రారాదూ /కులం గీతలు దాటిన ప్రేమలు చంపబడుతున్న చోట /పారుతున్న నెత్తుటి ప్రవాహంలో నిలబడి అడుగుతున్నా/ రావే పిల్లా రా/ హద్దులన్నీ చెరిపేసి/ సరిహద్దులు లేని సమాజంలోకి నడుద్దా'మంటూ స్త్రీలు కులాలు దాటగలరని నమ్మి, చేయందించిన ప్రేమికునికి వందనం.

కొందరుంటారు, తమ ఆధిపత్యాలకి తామే గండికొట్టుకుని చుట్టూ తనకలాడుతున్న ఆరాట పోరాటాలతో మమేకమయ్యేవారు. కొందరున్నారు తమ జీవితాల్లో మేలిమి భాగమైన స్త్రీల విలువని గుర్తించి అక్షరాలలో నిలబెట్టినవారు. వారందరి తపనని, ప్రేమని, అక్కరని, బాధ్యతని గుర్తు చేసుకుంటూ, అభినందిస్తూ అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

వ్యాసకర్త ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఏపీ కార్యదర్శి
malleswari.kn2008@gmail.com

అమ్మ

చీకటి తొలగని వేకువలోనే
అమ్మ దినచర్య ప్రారంభమవుతుంది
అందరి పనులు పూర్తి చేసేదాకా
అది కొనసాగుతూనే ఉంటుంది

ఆమె రాత్రులు చిన్నవి
కుంచించుకు పోయేవి
ఆమె పగళ్లు
రాత్రుల్లోకి జొచ్చుకుపోయి
దీర్ఘంగా సాగేవి



ఆమె రాత్రుల మీద
పగళ్లు చేసే దాడి గూర్చి
ఎవరికీ ఆలోచన రాదు
ఎవరూ ఆలోచించరు

మిగిలిపోయిన చిన్న
రాత్రి ముక్కను కప్పుకుని
ఆమె కాళ్ళు ముడుచుకుని
పడుకుంటుంది

కాళ్ళు కాస్తా చాపుకుని,
హాయిగా పడుకోవడానికి కూడా లేదు
ఆ కొద్దిపాటి రాత్రి –
అందుక్కూడా సరిపోదు!

హిందీ మూలం : జ్యోత్స్న మిలన్
స్వేచ్ఛానువాదం : డా॥ దేవరాజు మహారాజు

మహిళా విముక్తిలో ఓ అంకం

విశ్లేషణ



డా॥ తుర్లపాటి రాజేశ్వరి

'కన్యాశుల్కం' నాటకం గురజాడను అత్యుత్తమ నాటక రచయితగా తెలుగు సాహిత్యంలో నిలిపింది. ఈ నాటకాన్ని 'జగన్నాథ విలాసినీ సభ' 1892 ఆగస్టులో మొదట ప్రదర్శించింది. కన్యాశుల్కంలో ప్రధానమైన సమస్య సుబ్బి పెళ్లి తప్పించటం! ఆడవాళ్లకి ఏ ఆలోచనాశక్తి లేదని, చులకనగా వారిని చూసే నాటి సమాజంలో మహిళలను ధైర్యవంతులుగా చిత్రించి మహిళల చరిత్రను పునర్లిఖించారు గురజాడ.

సుబ్బమ్మ లేక సుబ్బి ఈ కథకి మూలం. నాటకంలో ఎక్కడా కనిపించదు. వెంకమ్మ – కృష్ణరాయపురం అగ్రహారీకుడు అగ్నిహోత్రావధాన్ల భార్య. బుచ్చమ్మ – అగ్ని హోత్రావధాన్ల పెద్ద కూతురు, వితంతువు. మీనాక్షి – రామచంద్రాపురం అగ్రహారీకుడు లుబ్ధావధాన్ల కుమార్తె, వితంతువు. మధురవాణి–విజయనగరానికి చెందిన వేశ్య. పూటకూళ్ళమ్మ విజయనగరంలో పూట కూళ్ళిల్లు నడిపే వితంతువు. వెంకమ్మ అన్నగారు కరటక శాస్త్రి. ఇతడు కృష్ణరాయపురం అగ్రహారంలో ఉన్న చెల్లెలి ఇంటికి వచ్చినపుడు సుబ్బి పెళ్ళి విషయం తెలుస్తుంది. ఈ సంబంధం ఇష్టంలేని వెంకమ్మ అన్న కరటకశాస్త్రిని ఈ సంబంధం తప్పించమని వేడుకుంటుంది. ఎలాగైనా మేనకోడలు పెళ్లి తప్పించాలని పథకాన్ని రూపొందిస్తాడు అతడు.

మధురవాణిది నాటకంలో కీలకమైన పాత్ర. ఆమె వేశ్య. విజయనగరంలో ఉండే మధురవాణి కారణాంతరాల చేత రామచంద్రపురం అగ్రహార నివాసి, ఊరి కరణం రామప్ప పంతులి ఇంటికి చేరుతుంది. సుబ్బితో పెళ్లి ఖాయం చేసుకున్న లుబ్ధావధాన్లు రామచంద్రపుర వాసి. రామప్ప పంతులు నయవంచకుడని ఆమె తొంద ర్లోనే కనిపెట్టేసింది. స్వతహాగా ఎదుటివారికి సాయం చెయ్యాలనే సద్బుద్ధి కలిగిన మధురవాణి... లుబ్ధావధాన్ల పెళ్లి రామప్ప పంతులు కుదిర్చాడని తెలిసిన వెంటనే 'ఈ పెళ్లి మాన్పించకపోతే నేను మీతో మాట్లాడను' అంటుంది. ఆ తరువాత అసలు కథ మొదలైంది.

కరటకశాస్త్రి తన ప్రణాళిక అమలు చెయ్యటానికి రామప్ప పంతులు ఇంటికి వస్తాడు. అక్కడ మధుర వాణిని చూసి తన మేనకోడలి పెళ్లి తప్పించమని కోరతాడు. ఆమె అంగీకరించి కొన్ని సలహాలు ఇస్తుంది. తన 'కంటె'ని పెళ్లిలో పెళ్లికూతురికి పెట్టటానికి కూడా ఒప్పుకుంటుంది. ఆడవేషంలో ఉన్న కరటకశాస్త్రుల శిష్యుడు మహేష్‌ని ఇచ్చి పెళ్ళి జరిపించి, తద్వారా సుబ్బి పెళ్లి ఆపటంలో మధురవాణి చాకచక్యాన్ని ప్రదర్శించింది. తర్వాత లుబ్ధావధాన్లను పెళ్లి చేసుకున్న మహేష్... మధురవాణి దగ్గరకు వచ్చి ఆమె 'కంటె' ఆమెకి ఇచ్చేస్తాడు. మధురవాణి ఆడపిల్ల వేషంలో ఉన్న మహేష్‌కు దాసరి వేషం వేసి ఊరు దాటిస్తుంది. 'కంటె' కోసం రామప్ప పంతుల్ని ఇబ్బంది పెట్టడంతో అతడే హెడ్ కానిస్టేబుల్‌తో లుబ్ధావధాన్ల మీద ఖూనీ కేసు పెట్టిస్తాడు. ఈ వ్యవహారంలో లుబ్ధావధాన్లను కేసు నుంచి బయటపడెయ్యడానికి మధురవాణి, సౌజన్యా రావు పంతులు ఇంటికి వెళుతుంది. అదే సమయంలో గిరీశం కూడా ఆ ఇంటికి వస్తాడు. బుచ్చమ్మని లేవదీసుకు పోయిన గిరీశం అంతటితో తృప్తిపడక లుబ్ధావధాన్ల ఆస్తి చేజిక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తూ అక్కడికి వచ్చాడు. గిరీశం నిజస్వరూపం తెలుసుకున్న సౌజన్యా రావు పంతులు బుచ్చమ్మను పూనాలో విడోస్ హోమ్‌కు పంపే ఏర్పాట్లు చేస్తాడు. నాటకంలో మీనాక్షి పాత్ర కూడా ముఖ్యమైనదే. ముసలి తండ్రి పెళ్లి కరటకశాస్త్రి శిష్యుడు మహేశంతో జరిపించటంలో సిద్ధాంతికి సంపూర్ణ సహకారం అందిస్తుంది. ఒక రాత్రివేళ రామప్ప పంతులితో తమ ఇంట్లో తండ్రికి దొరికిపోతుంది. తండ్రి బయటికి గెంటేస్తాడు. ఈ చర్యకి మీనాక్షి ఏమీ జంకకుండా ''... ఈ జన్మలో ఈ ఇంట్లో అడుగుపెట్టను'' అంటూ రామప్ప పంతు లుతో వెళ్లిపోతుంది.



ఇక గంపెడు చాకిరీ చేస్తూ నెత్తిన ముసుగేసుకుని జీవితాన్ని గడుపుతున్న బుచ్చమ్మ ఆలోచనాశక్తి, తెంపరితనం ఉన్న మహిళ. బుచ్చమ్మకి గిరీశం తన కళ్లముందు నిలిపిన రంగుల లోకం... అందరి ముత్తయిదువలలాగ జీవించాలనే ఆశని కల్గించింది. ఇంకో పక్క గిరీశం తన ఈ నిర్ణయం వల్ల ముసలాడితో చెల్లెలి పెళ్లి ఆగిపోతుందని నచ్చ చెప్పాడు. ధైర్యంగా ఆమె గిరీశంతో అగ్ని హోత్రావధాన్ల కళ్లుగప్పి వెళ్లిపోయింది. విజయనగరంలో పూటకూళ్ల ఇల్లు నడుపుకునే పూటకూళ్లమ్మ ఇంట్లో పనీపాటూ చేసుకుంటూ, ఆకతాయిగా తిరిగే మాయలాడు గిరీశం ... ఆమెని మోసగించినందుకు అతడిని చీపురు తీసుకుని వెంటబడుతుంది. దానితో కృష్ణరాయపురం అగ్రహారం వెంకటేశంతో చేరతాడు గిరీశం. లుబ్ధా వధాన్లకి వరసకి తమ్ముడైన గిరీశం: సుబ్బిని పెళ్లి చేసుకోవద్దంటూ లుబ్ధావధాన్లకి అర్థం అయ్యేటట్లు, భయపెడుతూ ఉత్తరం రాస్తాడు. కాబట్టి సుబ్బి పెళ్లి ఆపటంలో పూటకూళ్లమ్మ కూడా తెలీకుండానే పెద్దసాయం చేసింది. గిరీశం కృష్ణరాయపురం చేరేటట్లు చేసింది.

కన్యాశుల్కం నాటకం సుబ్బి కొరకే, సుబ్బికోసమే నడిచింది. చెప్పాలంటే అదృశ్యంగా కథ నడిపింది సుబ్బే. తలా ఒక చెయ్యివేసి దుర్మార్గాన్ని అడ్డుకున్నది మహిళా శక్తి! అదే గురజాడ మహిళలకు చూపిన వెలుగుదారి.

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అనువాద పురస్కార విజేత । 90787 43851

సమానత్వ సాధనే లక్ష్యం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రకటించి 115 సంవత్సరాలయింది. అమానవీయమైన అణచివేతను, వివక్షను ఎదుర్కొన్న మహిళా కార్మికులు నెత్తురు ధారబోసి హక్కులకోసం తెగించి పోరాడారు. ఫలితంగా 8 గంటల పని దినాన్ని, వేతన పెంపుదలను, మరికొన్ని హక్కులను సాధించుకున్నారు. అయినప్పటికీ మహిళలు నేటికీ అనేక సవాళ్లను ఎదుర్కొంటూ కనిపిస్తున్నారు. మన సమాజంలో, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలో మహిళా లోకం పురుషుల కంటే తక్కువగానే ఉంటూ వస్తోంది. ఇంట్లోనూ, బయట ఉద్యోగాల్లోనూ – మహిళలు పూర్తి బాధ్యతను మోస్తున్నప్పటికీ – ఈ అసమానత కొనసాగుతుంది.

మహిళలు బలమైన పోరాటాలు చేస్తున్నప్పటికీ, వారి మీద లైంగిక హింస పెరుగుతూనే వుంది. దళిత, మైనారిటీ మహిళలు ఎక్కువగా దాడులకు గురి అవుతున్నారు. ప్రొఫెసర్లు, సైంటిస్టులు, డాక్టర్ల దగ్గర నుండి పారిశుద్ధ్య కార్మికుల వరకు – అందరికీ కాంట్రాక్టు, తాత్కాలిక పనులే తప్ప ప్రభుత్వ ఉద్యోగాలు లేవు. ఈ పనుల్లో కూడా మహిళలకు సమాన పనికి సమాన వేతనాలు రావడం లేదు. ఉద్యోగ బీమా పథకాన్ని కోల్పోవడం అంటే మహిళలను ప్రసూతి ప్రయోజనాలకు దూరంగా పెట్టినట్లే.

1970లో పురుడు పోసుకున్న 'ప్రగతిశీల మహిళా సంఘం' ఎన్నో సమరశీల పోరాటాలు నిర్వహించింది. నిర్బంధానికి అణచివేతకు గురయ్యింది. అనేక మంది వీరవనితలు అమరులయ్యారు. 12 రాష్ట్రాల్లో గుర్తింపు కలిగిన మహిళా పోరాటాలు నిర్వహించింది. భూమికోసం, ఇళ్ళస్థలాలకోసం, స్త్రీ పురుష సమానత్వంకోసం లైంగిక హింసకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను నిర్మించాం. ఈ క్రమంలో 2013లో సంస్థ చీలికకు గురయ్యింది. ఫలితంగా మహిళా ఉద్యమాలు తీవ్రంగా నష్టాన్ని చవిచూసాయి. వీటిని సమీక్షించుకొన్న తర్వాత రెండు సంస్థలు కలిసి భవిష్యత్‌లో ఒకే సంస్థగా పనిచేయాలని నిర్ణయించుకున్నాయి. మార్చి 8వ తేదిన అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా విలీనం కావాలని రెండు సంస్థలు భావించాయి. ఈ విలీనానికి ఒంగోలు వేదిక కాబోతుంది.

– బి.పద్మ, ప్రధాన కార్యదర్శి,
ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ), ఏపీ

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

టీహబ్ కొత్త సీఈఓగా కవికృత్

• ఈ నెల 10న బాధ్యతల స్వీకరణ



రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ నూతన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా కవికృత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మూడేళ్ల కాలపరిమితి ముగియడంతో ఇప్పటి వరకు సీఈఓగా ఉన్న మహంకాళిశ్రీనివాసరావు ఆ బాధ్యతల నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇన్‌చార్జి సీఈఓగా టీహబ్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ సుజిత్ జాగిర్దార్ కొనసాగుతున్నారు. కవికృత్ ఈనెల 10వ తేదీన టీహబ్ ప్రాంగణంలో సీఈఓగా బాధ్యతలు స్వీకరిస్తారు. హైదరాబాద్‌కు చెందిన కవికృత్ హార్వర్డ్ బిజినెస్ స్కూల్ నుంచి ఎంబీఏ, బిట్స్ పిలాని నుంచి ఫైనాన్స్‌లో పీజీ పూర్తి చేశారు. హెల్త్ కేర్ స్టార్టప్ వ్యవస్థాపకుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన ఓయో, అమెజాన్, పిరమల్ తదితర ప్రముఖ కంపెనీల్లో పనిచేశారు. ఈ సందర్భంగా కవికృత్ మాట్లాడుతూ టీహబ్‌ను మరింత బలోపేతం చేస్తానని చెప్పారు. కవికృత్ నియామకం పట్ల ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, టీహబ్ వ్యవస్థాపక డైరెక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. టీహబ్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా చేయడంలో కవికృత్ కృషి చేయాలని సూచించారు.

ఓయూలో వికలాంగ విద్యార్థుల అరెస్ట్

• 12 మందిని అరెస్టుచేసి అఫ్జల్‌గంజ్ పీఎస్‌కు తరలింపు

ఉస్మానియా యూనివర్సిటీ: మెస్ బిల్లులు చెల్లించాలని ఉస్మానియా యూనివర్సిటీ యాజమాన్యం ఇచ్చిన ఆదేశాలను నిరసిస్తూ రెండు రోజులుగా వైస్ చాన్స్‌లర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న 12 మంది వికలాంగ విద్యార్థులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్న వీరు.. ఫెలోషిప్‌లో భాగంగా హెచ్‌ఆర్ఏ, ఎస్కార్ట్, కంటింజెన్స్ ఖర్చులకు నిధులు పొందుతున్నందున మెస్ బిల్లులు చెల్లించాలని యాజమాన్యం నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసులను వ్యతిరేకిస్తూ 6వ తేదీ నుంచి విద్యార్థులు ధర్నా నిర్వహిస్తున్నారు. దీంతో వారిపై న్యూసెన్స్ కేసు నమోదుచేసి అరెస్టు చేసినట్లు ఓయూ పోలీస్ స్టేషన్ సీఐ రాజేందర్ తెలిపారు. అరెస్టు విషయం తెలుసుకున్న పలు విద్యార్థి సంఘాల నేతలు.. ఆ విద్యార్థులను విడుదల చేయాలని ధర్నా నిర్వహించారు.

బాలికల హాస్టల్‌లో రహస్య కెమెరా

• గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యార్థినులు
• హాస్టల్ నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



మహేశ్వర్

పటాన్‌చెరు టౌన్: ప్రైవేట్ బాలికల హాస్టల్లో స్పై కెమెరా కలకలం రేపింది. కెమెరాను గుర్తించిన విద్యార్థినులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో హాస్టల్ నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. అమీన్‌పూర్ మునిసిపాలిటీ కిష్టారెడ్డిపేట పరిధిలోని మైత్రి విల్లాస్‌లో బండారు మహేశ్వర్ లక్ష్మీ గర్ల్స్ హాస్టల్‌ను నిర్వహిస్తున్నాడు. శుక్రవారం హాస్టల్‌లో విద్యార్థినులు స్పై కెమెరాను గుర్తించి అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు స్పై కెమెరాలోని రికార్డులను పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ నరేశ్, ఎస్ఐ సోమేశ్వరి తెలిపారు.

సైలో బంకర్‌కు మరొకరు బలి

• శ్వాసకోశ సమస్యతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



లక్ష్మీనారాయణ

సత్తుపల్లి: సైలో బంకర్ కారణంగా శ్వాసకోశ సమస్యలతో మరో వ్యక్తి మరణించాడు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలో సింగరేణి ఓపెన్ కాస్ట్ (ఓసీ) గనుల నుంచి బొగ్గు రవాణాకు ఏర్పాటుచేసిన సైలో బంకర్ వల్ల శ్వాసకోశ సమస్యలతో కిష్టారం గ్రామంలోని అంబేడ్కర్‌నగర్ వాసులు పలువురు ఇప్పటికే మృతి చెందారు. దీంతో బంకర్‌ను తొలగించాలని స్థానికులు చేపట్టిన దీక్షలు శుక్రవారం 26వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో పాల్గొన్న పిల్లి లక్ష్మీనారాయణ (40) రెండు రోజుల క్రితం శ్వాసకోశ సమస్యతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆయనను ఖమ్మం ఆసుపత్రికి తరలించగా, ఆరోగ్యం విషమించి శుక్రవారం మృతి చెందాడు. దీంతో స్థానికులు సత్తుపల్లి–ఖమ్మం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించటంతో భారీ సంఖ్యలో వాహనాలు ఇరువైపులా నిలిచిపోయాయి. సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్ సర్దిచెప్పడంతో రాస్తారోకో విరమించారు.



వైభవంగా ఎదుర్కోలు మహోత్సవం

నేడు లక్ష్మీనరసింహస్వామి తిరు కల్యాణోత్సవం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా.. శుక్రవారం రాత్రి ఎదుర్కోలు మహోత్సవం జరిపించారు. ఉదయం ఆలయ మాడ వీధుల్లో శ్రీస్వామి వారు జగన్మోహిహిని అలంకారంలో దర్శనమిచ్చారు. సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవంలో భాగంగా శ్రీస్వామి వారిని అశ్వవాహనంపై పెళ్లికొడుకుగా, ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై అమ్మవారిని సేవోత్సవంగా మాడవీధిలో ఊరేగించారు. శ్రీస్వామి అమ్మవార్ల తిరుకల్యాణోత్సవంలో భాగంగా శనివారం రాత్రి 8.30 గంటలకు గజవాహనంపై శ్రీస్వామి, ప్రత్యేక పల్లకీపై అమ్మవారు ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతారు. తుల లగ్న ముహూర్తంలో రాత్రి 10 గంటలకు శ్రీస్వామి వారు అమ్మవారికి మాంగల్యధారణ చేయనున్నారు.


టీబీఎం కింద కార్మికుల జాడ!

• జీపీఆర్ నిపుణులు సూచించిన చోటులోనే గుర్తించిన కడావర్ డాగ్స్
• ఆ స్పాట్లలో టన్నెల్ బోరింగ్ మెషీన్ భాగాలను కట్ చేస్తూ తవ్వకాలు జరుపుతున్న రెస్క్యూ బృందాలు
• సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యలు
• రోబోటిక్ బృందాలతో పరిశీలన

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాద స్థలంలో మట్టిలో కూరుకుపోయిన కార్మికుల జాడను కడావర్ డాగ్స్ శుక్రవారం గుర్తించాయి. ప్రమాద స్థలంలో 150 మీటర్ల మేర శిథిలాలు, మట్టి నిండిపోయిన ప్రాంతంలో.. ఇంతకుముందు గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) నిపుణులు అంచనా వేసిన రెండు స్పాట్లనే కడావర్ డాగ్స్ కూడా గుర్తించాయి. మనుషుల ఆనవాళ్లను, అవశేషాలను వాసన ద్వారా గుర్తించడంలో ప్రత్యేక శిక్షణ పొందిన శునకాలే కడావర్ డాగ్స్. ఇప్పటికే జీపీఆర్‌తో అంచనా వేసిన చోట్ల 3 మీటర్ల వరకు తవ్వగా టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) భాగాలు, ఇనుప రాడ్లు, పైపులు కనిపించాయి. ఇప్పుడు కడావర్ డాగ్స్ అవే ప్రాంతాలను గుర్తించడంతో.. టీబీఎం భాగాల కింద మట్టి, బురదలో కార్మికులు కూరుకుపోయి ఉంటారని భావిస్తున్నారు. ఈ మేరకు మరింత లోతుగా తవ్వకాలు చేపడుతున్నారు. సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్స్ బృందాలు టీబీఎం భాగాలను కట్ చేస్తూ.. ఊట నీటిని, మట్టిని తొలగిస్తున్నారు. టీబీఎం శిథిలాలను తొలగిస్తూ, పూర్తి స్థాయిలో తవ్వకాలు జరిపేందుకు మరికొన్ని రోజులు సమయం పట్టే అవకాశం ఉందని సహాయక బృందాలు పేర్కొంటున్నాయి.

రంగంలోకి రోబోటిక్ బృందాలు

ప్రమాదస్థలంలో రెస్క్యూ బృందాలకు సైతం ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో.. ఎలాంటి ప్రాణహాని లేకుండా రోబోల సాయంతో సహాయక చర్యలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు అన్వి రోబోటిక్స్ సంస్థకు చెందిన నిపుణుడు అక్షయ్ నేతృత్వంలోని నలుగురు సభ్యుల బృందం శుక్రవారం టన్నెల్ లోపలికి వెళ్లి పరిస్థితులను పరిశీలించింది. రోబోలతో రెస్క్యూ విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తర్వాత పనులు ప్రారంభించే అవకాశం ఉంది. దీనిపై నిర్ణయం తీసుకున్నాక.. టన్నెల్ నుంచి మట్టి, రాళ్లు, బురద తొలగించే రోబోలను సిద్ధం చేసేందుకు కనీసం వారం రోజులు సమయం పడుతుందని తెలిసింది. వీరితో పాటు సొరంగాల పరిశోధనలో అనుభవమున్న ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ డా.బీవీ మాజి కూడా సొరంగంలో ప్రమాద స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. ఆయన గతంలో సొరంగాల్లో రాతి ఆకృతులు, రాక్ జాయింట్స్, వేవ్ రెస్పాన్స్, సెస్మిక్ లోడింగ్ అంశాలపై పనిచేశారు.



సొరంగం లోపల సింగరేణి రెస్క్యూ సిబ్బంది ఆధ్వర్యంలో కొనసాగుతున్న తవ్వకాలు

నేడు టన్నెల్ వద్దకు మంత్రి ఉత్తమ్

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు శనివారం నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రానున్నారు. ఉదయం 9.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా టన్నెల్ వద్దకు చేరుకోనున్న ఆయన రెస్క్యూ బృందాలు, అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని ఒంటి గంట నుంచి 3 గంటల వరకు నిర్వహించే సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. తిరిగి 3.30 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

బిల్లులు చెల్లించండి మహాప్రభో!

• ప్రభుత్వానికి సివిల్ కాంట్రాక్టర్ల మొర
• సచివాలయానికి వచ్చిన 100 మంది నిర్వహణ కాంట్రాక్టర్లు
• డిప్యూటీ సీఎంను కలిసేందుకు ప్రయత్నం
• ప్రీ బడ్జెట్ సమావేశాల్లో బిజీగా ఉన్న భట్టి
• కాంట్రాక్టర్లను బయటకు పంపేసిన సెక్యూరిటీ సిబ్బంది
• రూ.750 కోట్లు రావాలి.. రెండేళ్లుగా తిరుగుతున్నాం: కాంట్రాక్టర్లు



సచివాలయంలో ఆందోళన చేస్తున్న కాంట్రాక్టర్లు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ విభాగాల్లో అత్యవసర మరమ్మతు పనులు చేసిన సివిల్ కాంట్రాక్టర్లు బిల్లులు రాక లబోదిబోమంటున్నారు. తెలంగాణ రాష్ట్ర సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాదాపు 100 మంది కాంట్రాక్టర్లు శుక్రవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసేందుకు వచ్చారు. అయితే భట్టి విక్రమార్క అంతకు ముందే ఖరారైన షెడ్యూల్ ప్రకారం ప్రీ బడ్జెట్ సమావేశాల్లో బిజీగా ఉండడంతో వారిని కలవలేకపోయారు. దీంతో కాంట్రాక్టర్లంతా భట్టి విక్రమార్క కార్యాలయం సమీపంలో గుమికూడడంతో సచివాలయ భద్రతా సిబ్బంది వారిని బయటకు పంపేశారు. కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల నుంచి కాంట్రాక్టర్లు డిప్యూటీ సీఎంను కలిసేందుకు వచ్చారు.

బిల్లుల కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నాం

చేసిన పనులకు రెండేళ్లుగా బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్లు వాపోయారు. అత్యవసర సమయంలో మరమ్మతు పనులు చేశామని, బిల్లుల కోసం ఎన్నిసార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం ఉండడం లేదని అసోసియేషన్ అధ్యక్షుడు డి. శంకరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుల మోహన్, ప్రధాన కార్యదర్శి ఆర్ కిషన్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. 'స్థానిక ఎమ్మెల్యేలను సంప్రదిస్తే.. మేము వెళ్తే కమీషన్ల కోసం వస్తున్నారని అనుకుంటున్నారు. మీకు మేము పనులు చెప్పడం లేదు కదా అని సమాధానమిస్తున్నారు' అని ఓ కాంట్రాక్టర్ వాపోయారు. ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకు బిల్లు బకాయిలున్నాయని, మొత్తం దాదాపు రూ.750 కోట్ల వరకు ఉంటాయని తెలిపారు. ఏడాదిన్నర క్రితం ఆర్థిక శాఖ టోకెన్‌లు ఇచ్చినా.. నిధులు మాత్రం విడుదల చేయడం లేదని ఆరోపించారు. అసోసియేషన్ అధ్యక్షుడు శంకరయ్య లెక్కల ప్రకారం ఆర్ అండ్ బీ శాఖ రూ.100 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖ రూ.65 కోట్లు, మునిసిపల్ శాఖ రూ.75 కోట్లు, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ రూ.100 కోట్లు, నీటిపారుదల శాఖ రూ.75 కోట్లు, మనవూరు–మనబడి రూ.100 కోట్లు, సోషల్ వెల్ఫేర్ శాఖ రూ.75 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖలో రూ.90 కోట్ల బకాయిలున్నాయి.

వరంగల్ సీపీగా సన్‌ప్రీత్‌సింగ్

• రామగుండం సీపీగా అంబర్ కిశోర్ ఝా
• మొత్తం 21 మంది ఐపీఎస్‌ల బదిలీ, పోస్టింగులు

సాక్షి, హైదరాబాద్: పలువురు ఐపీఎస్ అధికారులపై ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం వారిని బదిలీ చేసింది. మరికొందరు అధికారులు వెయిటింగ్‌లో ఉండడంతో వారికి పోస్టింగ్‌లు ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) డీజీగా ఉన్న అనిల్‌కుమార్‌కు అడిషనల్ డీజీ (పర్సొనెల్)గా పోస్టింగ్ ఇవ్వడంతో పాటు ఎస్పీఎఫ్ డీజీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. వరంగల్ సీపీగా విధులు నిర్వర్తిస్తున్న అంబర్ కిశోర్ ఝా ను రామగుండం సీపీగా బదిలీ చేశారు. ఇటీవల డీఐజీగా పదోన్నతి పొందిన సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ను వరంగల్ సీపీగా బదిలీ చేశారు. ఆరోపణల నేపథ్యంలో స్థాన చలనం పొందిన వారిలో ప్రధానంగా ఒక ఎస్పీ, మరో సీపీ ఉన్నారు.

బదిలీ అయిన అధికారుల వివరాలు ఇలా..

అధికారి పేరు	ప్రస్తుతం	బదిలీ
డా.అనిల్‌కుమార్	డీజీ, ఎస్పీఎఫ్	అడిషనల్ డీజీ పర్సొనెల్, ఎస్పీఎఫ్ డీజీగా అదనపు బాధ్యతలు
ఎం.శ్రీనివాసులు	సీపీ, రామగుండం	ఐజీ, సీఐడీ
అంబర్ కిశోర్ ఝా	సీపీ, వరంగల్	సీపీ, రామగుండం
సన్‌ప్రీత్‌సింగ్	ఎస్పీ, సూర్యాపేట	సీపీ, వరంగల్
చెన్నూ మైలబుతల	డీసీపీ, పెద్దపల్లి	ఎస్పీ, ఉమెన్‌సేఫ్టీ వింగ్, హైదరాబాద్
సీహెచ్ సింధుశర్మ	ఎస్పీ, కామారెడ్డి	ఎస్పీ, ఇంటెలిజెన్స్
ఎం.రాజేశ్‌చంద్ర	డీసీపీ, యాదాద్రి భువనగిరి	ఎస్పీ, కామారెడ్డి
పోతరాజు సాయిచైతన్య	ఎస్పీ, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో	కమిషనర్, నిజామాబాద్
గౌస్ ఆలం	ఎస్పీ ఆదిలాబాద్	సీపీ, కరీంనగర్
అఖిల్ మహాజన్	ఎస్పీ, రాజన్న సిరిసిల్ల	ఎస్పీ, ఆదిలాబాద్
చెన్నూరి రూపేశ్	ఎస్పీ, సంగారెడ్డి	టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో
అక్షాంశ్ యాదవ్	డీసీపీ, సెంట్రల్ జోన్	డీసీపీ, యాదాద్రి భువనగిరి
పరితోశ్ పంకజ్	ఓఎస్డీ, కొత్తగూడెం	ఎస్పీ, సంగారెడ్డి
గిటే మహేశ్ బాబాసాహెబ్	ఓఎస్డీ ములుగు	ఎస్పీ, రాజన్న సిరిసిల్ల
అంకిత్ కుమార్ శాంక్వర్	వెయిటింగ్	డీసీపీ, వరంగల్ ఈస్ట్
ఎ.భాస్కర్	వెయిటింగ్	డీసీపీ, మంచిర్యాల
కె.నరసింహ	వెయిటింగ్	ఎస్పీ, సూర్యాపేట
కె.శిల్పవల్లి	వెయిటింగ్	డీసీపీ, సెంట్రల్ జోన్, హైదరాబాద్
వై.సాయిశేఖర్	వెయిటింగ్	ఎస్పీ, ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్
పి.కరుణాకర్	వెయిటింగ్	డీసీపీ, పెద్దపల్లి
పి.రవీందర్	వెయిటింగ్	ఎస్పీ, సీఐడీ

ఆలస్యమైనా పథకాలన్నీ అమలు చేస్తాం


• వారంలోగా అన్ని నియోజకవర్గాలకు ఇందిరమ్మ ఇళ్లు
• మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తదితరులు

కూసుమంచి: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా తాము ఇచ్చిన హామీల అమలులో కాస్త ఆలస్యం జరుగుతోందని.. అయినా హామీలు, పథకాలన్నీ కచ్చితంగా అమలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలసి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మహిళా మత్స్యకారులకు రూ.10 లక్షల విలువైన సంచార చేపల విక్రయ వాహనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాము ఎన్నికల వేళ కల్యాణలక్ష్మి పథకం ద్వారా నగదుతో పాటు తులం బంగారం కూడా ఇస్తామని హామీ ఇచ్చామని గుర్తు చేశారు. కానీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనందున కొంత జాప్యం జరుగుతోందని, ఆడబిడ్డలకు ఇచ్చిన మాట త్వరలోనే నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. నాటి ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్రం ఆర్థికంగా అధోగతి పాలవడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఓ వైపు రాష్ట్రాన్ని ఆర్థికంగా బాగుచేస్తూనే ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని వివరించారు. వారంలోగా ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మాణాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే, అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు పేదలకు సన్నబియ్యం ఇస్తామని వెల్లడించారు. తమ ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలే అవుతోందని, ఇంకా సమయం ఉన్నందున ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి మంచి పాలన అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ నర్సింహారావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డీఎస్పీ మృతి



జవహర్‌లాల్

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో మేడ్చల్ పోలీస్ ట్రెనింగ్ సెంటర్ డీఎస్పీ మృతి చెందారు. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి పోలీస్టేషన్ పరిధిలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాజ్‌గోపాల్‌పేట శివారులో స్పెషల్ పార్టీ పోలీస్ ఫైరింగ్ సెంటర్‌లో పోలీసులకు ప్రమోషన్ కోసం ఫైరింగ్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. శిక్షణ నిమిత్తం మేడ్చల్‌లోని పోలీస్ ట్రెనింగ్ సెంటర్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న బి.జవహర్‌లాల్ (50) తన వాహనంలో శుక్రవారం ఉదయం ఫైరింగ్ సెంటర్‌కు వెళ్లారు. శిక్షణ అనంతరం మధ్యాహ్నం తిరిగి వెళ్తుండగా కుకునూరుపల్లి మండలంలోని రాజీవ్ రహదారిపై వేగంగా వస్తున్న మరో కారును తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న హోర్డింగ్‌ను ఆయన వాహనం ఢీ కొట్టింది. దీంతో వెనుక సీట్లో కూర్చున్న డీఎస్పీ జవహర్‌లాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెనుకనే మరో వాహనంలో వస్తున్న ఆర్ఎస్ఐ రాకేశ్‌తో పాటు స్థానికులు జవహర్‌లాల్, డ్రైవరు శీలం శ్రవణ్‌ను వంటిమామిడిలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ డీఎస్పీ జవహర్‌లాల్ మృతి చెందారు. డ్రైవరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



స్తూపం కూల్చాక శిథిలాలపై బలగాలు

మావోయిస్టుల స్మారక స్తూపం కూల్చివేత

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో సుమారు 70 అడుగుల ఎత్తయిన మావోయిస్టుల స్మారక స్తూపాన్ని శుక్రవారం పోలీసు బలగాలు కూల్చివేశాయి. బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధి తుమ్మలబట్టిలో ఏళ్ల క్రితం మావోయిస్టులు ఈ స్తూపాన్ని నిర్మించారు. ఈమేరకు పూజారి కాంకేర్ క్యాంప్‌కు చెందిన సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా విభాగాల బలగాలు జేసీబీతో దీన్ని కూల్చివేశారు. అనంతరం బలగాలు అక్కడ సంబరాలు జరుపుకొన్నాయి.

బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడిగా డీవీఎన్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడిగా డీవీఎన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రాజుజాన శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డీవీఎన్ రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి @SCRailwayIndia
ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును
మార్చి - 2025 నెల కొరకు ప్రత్యేక ఇ-వేలం కార్యక్రమం

ప్రత్యేక ఇ-వేలం	
తేదీ	డివిజన్
24.03.2025	సికింద్రాబాద్

ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్/ సికింద్రాబాద్
A0308
తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం
TGMSIDC ఈస్ట్ సర్కిల్, వరంగల్, ఫోన్ నం. : 0870-3577529, ఇ-మెయిల్ ఐడీ: setsmsidcknr1@gmail.com
సంక్షిప్త టెండరు ప్రకటన
నం. : 14/SE/TGMSIDC Circle/East/2024-25 తేదీ : 07.03.2025
1) "ములుగు జిల్లాలోని CHC ఏటూరునాగారంకు మరమ్మతులు మరియు పునర్నిర్మాణం (ఎస్‌సి కొరకు కేటాయించబడినది) మరియు 2) సూర్యాపేట్ జిల్లాలో నిక్షయ్ శిబిర్ కార్యక్రమ అమలు కొరకు పోర్టబుల్ X-RAY యూనిట్ సేకరణ" పని కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. ఇతర వివరాలను వెబ్‌సైట్ www.tender.telangana.gov.in వద్ద చూడవలెను.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, TGMSIDC ఈస్ట్ సర్కిల్ : వరంగల్
DIPR RO No. 11065-PP/CL/ADVT/1/2024-25, Dt. : 07.03.2025

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ
లాల్ బహదూర్ స్టేడియం, హైదరాబాద్-1, ఫోన్ : 040-23212818, 845, ఫ్యాక్స్ నం.:23243297
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Lr. No. SATG/Engg/Sports equipment/2025 తేదీ : 07.03.2025
"SATG స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్ సరఫరా మరియు సైక్లింగ్ అకాడమీకు స్పోర్ట్స్ సైకిల్స్ సరఫరా" కొరకు పేరొందిన సంస్థలు / ఏజెన్సీల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై టెండర్లు కోరబడుచున్నవి. తదుపరి వివరాల కోసం సంప్రదించండి మరియు ఇ-మెయిల్ ఐడి : satglbhyd@gmail.com మరియు మొబైల్ నం. 9581122300.
సం/- VC & మేనేజింగ్ డైరెక్టర్
DIPR RO No. 11062-PP/CL/ADVT/1/2024-25, Dt. : 07.03.2025

hmda
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్
HMDA చట్టం 2008లోని సెక్షన్ 15(4) క్రింద బహిరంగ ప్రకటన
(G.O.Ms.No.25 MA & UD Dept., తేదీ : 19.02.2025)
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2008 (యాక్ట్ నం.8 ఆఫ్ 2008)లోని సెక్షన్ 15 యొక్క సబ్-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, సదరు సెక్షన్‌లోని సబ్-సెక్షన్ (1) ద్వారా అవసరమైన విధంగా, G.O.Ms.No.288 MA&UD, తేది: 03.04.2008 ప్రకారం ప్రభుత్వంచే ఆమోదించబడిన హయత్‌నగర్ జోన్ సెగ్మెంట్-2021 యొక్క ప్రకటిత పాత HUDA ఏరియా మాస్టర్ ప్లాన్‌లో ఉద్దేశించిన భూమి వినియోగానికి దిగువ మార్పును ప్రభుత్వం ఇందుమూలంగా చేస్తోంది. G.O.Ms.No.288 MA&UD, తేది: 03.04.2008 ప్రకారం ప్రభుత్వంచే ఆమోదించబడిన హయత్‌నగర్ జోన్ సెగ్మెంట్-2021 యొక్క ప్రకటిత పాత HUDA ఏరియా మాస్టర్ ప్లాన్ ప్రకారం ఖాళీ స్థలం వినియోగ జోన్ కొరకు ప్రస్తుతం కేటాయించబడినటువంటి, 668.9 చ.మీటర్ల విస్తీర్ణం గల, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, ఉప్పల్ మండలం, బండ్లగూడ గ్రామంలోని సర్వే నం.లు. 40 మరియు 41లో ప్లాట్ నం.లు 216 మరియు 217లోని స్థలం, ఇప్పుడు నివాస వినియోగ జోన్‌గా నిర్దేశించబడినది. పై వాటి యొక్క వివరాలు వెబ్‌సైట్స్ http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// లో లభిస్తాయి.
సం/- మెట్రోపాలిటన్ కమిషనర్, డైరెక్టర్ ప్లానింగ్-II, HMDA తరఫున
DIPR RO No.11114-PP/CL/Advt/1/2024-25, Dt. 07.03.2025

Navodaya Vidyalaya Samiti,
Regional Office, Hyderabad
Notification - 01/2025-26
Online applications are invited for
ENGAGEMENT OF TEACHERS ON CONTRACT BASIS IN JNVs OF HYDERABAD REGION FOR THE ACADEMIC YEAR 2025-26
For Detailed Notification, Guidelines and Eligibility Criteria, please visit our Website
https://navodaya.gov.in/nvs/ro/Hyderabad/en/home/
Links for Online submission of application
For TGTs - https://forms.gle/Cowc4mNgyPryY13F7
For PGTs - https://forms.gle/dE6LNukVZVbCnJAe6
Links for Submission of Online Application Forms will open from 08/03/2025 at 09:00 AM To - 18/03/2025 at 09:00 PM
Tentative Dates for Physical Interview (offline)
07th to 09th April 2025
Note: Candidates must ascertain their eligibility for the post applied before filling up the application form.

జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ :: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా
లేఖ నెం. /JMC/2025 వేలం ప్రకటన తేది:06-03-2025
జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సమస్త పత్రికల వారికి మరియు సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా పురపాలక సంఘం చట్టం-2019, సెక్షన్ 146 అనుసారం ఆర్థిక సంవత్సరం 2025-26కు సంబంధించి జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తైబజార్ (కూరగాయల మార్కెట్) తేది.19-03-2025 బుధవారం రోజున ఉదయం 11.00 గంటలకు జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణ నందు బహిరంగ వేలం వేయుటకు ఈ క్రింద చూపబడిన విధముగా నిర్వహించబడును.

క్రమ సంఖ్య	వేలము వివరములు	డిపాజిట్ చేయవలసిన రూపాయలు	సాల్వెన్సీ సర్టిఫికెట్ వివరములు
1	తైబజార్ (కూరగాయల మార్కెట్)	రూ.2,00,000/-	రూ.2,00,000/-

వేలం షరతులు
1. తేది: 08-03-2025 నుండి 18-03-2025 వరకు కార్యాలయం పనివేళలలో రూపాయలు 2000/- రుసుము చెల్లించి దరఖాస్తు ఫారం పొందగలరు.
2. వేలం పాట నందు పాల్గొనదలచిన వారు ధరావత్తు సొమ్ము డిపాజిట్ రూపాయలు 2,00,000/- (అక్షరాల రెండు లక్షలు) మున్సిపల్ కమిషనర్, జవహర్‌నగర్ మున్సిపాలిటీ గారి పేరున నేషనల్ బ్యాంకు నందు DD తీసి కార్యాలయంలో అప్లికేషను ఫారంతో మరియు 3 బ్యాంక్ చెక్కులు సమర్పించిన వారు వేలంలో పాల్గొనుటకు అనుమతించబడును. ఇట్టి ధరావత్తు సొమ్ము వేలం ముగిసిన పిదప 10 రోజుల తరువాత చెల్లించబడును.
3. పురపాలక సంఘంనకు ఎలాంటి బకాయి ఉన్న యెడల అట్టి వేలంలో పాల్గొనుటకు అనుమతించబడదు.
4. వేలం పొందినవారు వేలం యొక్క మొత్తంలో 1/4 వంతు రూపాయలు (3) రోజులలో కార్యాలయములో చెల్లించగలరు. అట్టి మొత్తమును చివరి కిస్తు డిపాజిట్‌గా పరిగణిస్తూ జమచేయబడును మరియు మిగతా మొత్తం 3 కిస్తులలో (జూన్, సెప్టెంబర్, డిసెంబర్) 31 డిసెంబర్ 2025లోపు చెల్లించవలెను.
5. ఒకవేళ కిస్తులు చెల్లించని యెడల వారి యొక్క వేలమును రద్దు చేసి, తిరిగి వేలము నిర్వహించు అధికారం మున్సిపల్ కార్యాలయముకు కలదు. వేలంలో ఎలాంటి నష్టం జరిగిన అట్టి నష్టమును వేలందారుని నుండి రాబట్టబడును.
6. వేలం యొక్క కాలపరిమితి తేది: 01-04-2025 నుండి 31-03-2026 వరకు ఉండును.
7. పురపాలక సంఘము ద్వారా సీల్ వేయబడిన రశీదు బిల్లుల ద్వారా ఫీజులు వసూళ్ళు చేయవలెను. అట్టి వాటిని అతిక్రమించకూడదు.
8. వేలంపాటదారుడు వేలం పొందిన పిదప, మున్సిపల్ చట్టములో పొందుపరిచిన నియమ నిబంధనల మేరకు మున్సిపల్ కమిషనర్ గారిచే 100/- రూపాయల రిజిస్టర్ బాండ్ పేపర్‌పై అగ్రిమెంట్ డీడ్ చేయించుకోవలెను. అట్టి అగ్రిమెంట్ తరువాత మాత్రమే తైబజార్ వసూళ్ళు చేయవలెను.
9. పురపాలక సంఘంచే నిర్ణయించిన రేట్ల అనుసారం వసూళ్ళు చేయవలెను.
10. వేలమును ఇతరులకు సబ్ లీజుకు ఇచ్చు అధికారం వేలం పొందిన వ్యక్తికి లేదు.
11. ప్రభుత్వ ఉద్యోగస్తులు వేలములో పాల్గొనుటకు అర్హత లేదు.
12. పై సూచించిన షరతులు ఉల్లంగించిన యెడల వేలము రద్దు చేయుటకు పూర్తి అధికారము మున్సిపల్ కమిషనర్ గారికి కలదు.
NOTE:- తైబజార్‌లో వసూళ్ళు చేయు ఫీజుల వివరములు మున్సిపల్ కార్యాలయము నుండి పొందగలరు.
సం/- మున్సిపల్ కమిషనర్, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్
DIPR RO No.11086-PP/CL/Advt/1/2024-25, Dt.07-03-2025

మళ్లీ అదే మాట!

భారత్‌లో అధిక సుంకాలని అసహనం

ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలకు సిద్ధంగా ఉండాలి: ట్రంప్



న్యూయార్క్: అమెరికా ఉత్పత్తులపై విదేశాలు వసూలు చేస్తున్న టారిఫ్‌ల విషయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అసహనం వెళ్లగక్కారు. భారతదేశంలో అధికంగా టారిఫ్‌లు విధిస్తున్నారని మళ్లీ అసంతృప్తి వ్యక్తంచేశారు. నిజంగా అధిక సుంకాలు విధిస్తున్న దేశం భారత్ అని పేర్కొన్నారు. ఇది న్యాయబద్ధం కాదని చెప్పారు. తమకు న్యాయం జరగాలంటే అదే రీతిలో ప్రతిస్పందించక తప్పదని స్పష్టంచేశారు. ప్రతీకార సుంకాలు విధించబోతున్నామని, వచ్చే నెల 2వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని తేల్చిచెప్పారు. తమ ఉత్పత్తులపై విచ్చలవిడిగా టారిఫ్‌లు వసూలు చేస్తున్న దేశాల ఉత్పత్తులపైనా అదే స్థాయిలో టారిఫ్‌లు విధించబోతున్నామని ఉద్ఘాటించారు. ఇండియా, చైనాతో పాటు ఏ దేశమైనా సరే తమ ఉత్పత్తులు వాడుకుంటే భారీగా సుంకాలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎవరినీ విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఇన్నాళ్లూ అమెరికాను దోచుకున్నారని, ఇకపై అది సాగనివ్వబోమని హెచ్చరించారు. ఆయన గతంలో కూడా ఇండియాను 'టారిఫ్ కింగ్', 'బిగ్ అబ్యూసర్' అని నిందించారు. ఇండియాతో అమెరికా వాణిజ్య లోటు 100 బిలియన్ డాలర్లుగా(రూ.8.70 లక్షల కోట్లు) ఉందని ట్రంప్ చెబుతున్నారు. దీన్ని తగ్గించాల్సిందేనని పట్టుబడుతున్నారు.

అమెరికాకు గేమ్ ఛేంజర్

వైట్‌హౌస్ ఓవల్ ఆఫీసులో గురువారం కొన్ని ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై డొనాల్డ్ ట్రంప్ సంతకాలు చేశారు. అమెరికా పాల ఉత్పత్తులతోపాటు ఇతర వస్తువులపై కెనడాలో 250 శాతం టారిఫ్‌లు విధిస్తున్నారని ఆక్షేపించారు. కెనడా ఉత్పత్తులు ఇకపై తమకు అవసరం లేదని, ఒకవేళ దిగుమతి చేసుకున్నా భారీగా సుంకాలు విధిస్తామని స్పష్టంచేశారు. విదేశీ ఉత్పత్తులపై ఇప్పుడు విధిస్తున్న టారిఫ్‌లు తాత్కాలికమేనని, అసలైన మోత ఏప్రిల్ 2 నుంచి మోగబోతోందని, అందుకు సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించారు. అమెరికాకు ఇదొక గేమ్ ఛేంజర్ కాబోతోందని వివరించారు.

రష్యాకు ట్రంప్ షాక్

ఆంక్షలు, టారిఫ్‌ల యోచన ● సోషల్ మీడియాలో పోస్టు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యాకు ఊహించని షాక్ ఇచ్చారు. ఉక్రెయిన్–రష్యా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం, శాంతి ఒప్పందం కుదిరేదాకా రష్యాపై భారీ స్థాయిలో ఆంక్షలు, టారిఫ్‌లు విధించాలని తీవ్రంగా యోచిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. రష్యా, ఉక్రెయిన్ వెంటనే శాంతి చర్చలకు శ్రీకారం చుట్టాలని స్పష్టంచేశారు. ఆలస్యం కాకముందే ఆ పని ప్రారంభిస్తే బాగుంటుందని హితవు పలికారు. నిన్నటిదాకా రష్యా పట్ల సానుకూలంగా మాట్లాడిన ట్రంప్ హఠాత్తుగా స్వరం మార్చేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే, రష్యాకు ట్రంప్ హెచ్చరికలు జారీ చేయడం కొత్తేమీ కాదు. ఈ ఏడాది జనవరిలో అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రష్యాను ఉద్దేశించి కఠిన వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని నిలిపివేయకపోతే మరిన్ని ఆంక్షలు విధిస్తామని, రష్యా ఉత్పత్తులపై అధికంగా టారిఫ్‌లు వసూలు చేస్తామని తేల్చిచెప్పారు. ఆయన తన వైఖరికి కట్టుబడి ఉన్నట్లు తెలుస్తోంది. యుద్ధాన్ని ముగించే దిశగా రష్యాపై ఒత్తిడి పెంచడానికి ఆంక్షలు, టారిఫ్‌లను మరోసారి తెరపైకి తెచ్చినట్లు సమాచారం. ఉక్రెయిన్‌కు సైనిక సాయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ ట్రంప్ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. యూరప్ దేశాలు వ్యతిరేకిస్తున్నా ఆయన వెనక్కి తగ్గడం లేదు. ఒకవైపు ఉక్రెయిన్‌ను, మరోవైపు రష్యాను ఏకకాలంలో దారికి తీసుకురావాలన్నదే ట్రంప్ వ్యూహంగా కనిపిస్తోంది. రష్యాపై కొత్తగా ఎలాంటి ఆంక్షలు విధిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. పుతిన్ ప్రభుత్వం వాటికి తలొగ్గుతుందా? అనేది చూడాలి.

టారిఫ్ వార్.. ఎవరికి లాభం?

అమెరికాపై సగటున 18 శాతం సుంకాలు

- మనపై అమెరికా విధిస్తున్నది సగటున 5 శాతం లోపే
- పరస్పర సుంకాలు అమలైతే మనపై తీవ్ర ప్రభావమే!
- కేంద్రం దిద్దుబాటు చర్యలు
- పలు సుంకాల తగ్గింపు యోచన

2024లో ద్వైపాక్షిక వాణిజ్యం
129.2 బిలియన్ డాలర్లు
(రూ.11.2 లక్షల కోట్లు)
అమెరికాకు భారత ఎగుమతులు
87.4 బిలియన్ డాలర్లు
(రూ7.6 లక్షల కోట్లు)
అమెరికా నుంచి దిగుమతులు
41.8 బిలియన్ డాలర్లు
(రూ.3.63 లక్షల కోట్లు)
వాణిజ్య లోటు
45.7 బిలియన్ డాలర్లు
(రూ.3.97 లక్షల కోట్లు)
అయితే చైనా (296 బిలియన్లు), మెక్సికో (172 బిలియన్లు) వంటి దేశాలతో పోలిస్తే ఇది చాలా తక్కువేనన్నది భారత్ వాదన

అన్నట్టుగానే భారత్‌పైనా సుంకాల మోతకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెర తీశారు. ఏప్రిల్ 2 నుంచి పరస్పర సుంకాలు తప్పవని పునరుద్ఘాటించారు. దీని ప్రభావం మనపై ఏ మేరకు ఉండనుందంటూ జోరుగా చర్చ జరుగుతోంది. ఎందుకంటే అమెరికా మనకు అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. అందుకే అగ్ర రాజ్యంతో టారిఫ్‌ల రగడకు తెర దించేందుకు భారత్ ప్రయత్నిస్తోంది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ ఇప్పటికే అమెరికాలో పర్యటిస్తున్నారు. ఇరు దేశాలకు ఆమోదయోగ్యమైన ద్వైపాక్షిక వర్తక ఒప్పందం (బీటీఏ)పై చర్చలు జరుపుతున్నారు. ఈలోగా పలు అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లను వీలైనంతగా తగ్గిస్తూ భారత్ ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ తదితర ఉత్పత్తులపైనా టారిఫ్ కోతలు ప్రకటించే అవకాశం కన్పిస్తోంది.

ఏ మేరకు సుంకాలు?

సుంకమంటే ఒక దేశం మరో దేశం నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై విధించే పన్ను. భారత ఉత్పత్తులపై అమెరికా విధిస్తున్న సుంకాలు సగటున 4 నుంచి 5 శాతం మించడం లేదు. భారత్ మాత్రం అమెరికా ఉత్పత్తులపై సగటున 18 శాతం పై చిలుకు దిగుమతి సుంకాలు విధిస్తోంది. లగ్జరీ కార్లు, కెమికల్స్, ఎలక్ట్రానిక్స్‌పై 125 శాతం, మద్యం మీదైతే ఏకంగా 150 శాతం దాకా వసూలు చేస్తోంది! ఈ తేడాలను సరిచేయకుంటే ఏప్రిల్ 2 నుంచి తామూ అంతే మొత్తం బాదుతామని ట్రంప్ బెదిరిస్తున్నారు. అమెరికాపై ప్రధానంగా ఆధారపడ్డ భారత ఎగుమతిదారులపై ఇది గట్టి ప్రభావమే చూపనుంది. ముఖ్యంగా మన ఇనుము, ఉక్కు, జౌళి ఎగుమతులపై ప్రభావం తీవ్రంగా ఉండనుంది. దిద్దుబాటు చర్యలేవీ తీసుకోని పక్షంలో 25 బిలియన్ డాలర్ల విలువైన భారత ఎగుమతులపై ప్రభావం పడవచ్చని అంచనా. అయితే మన జీడీపీలో అమెరికా ఎగుమతుల వాటా కేవలం 2.2 శాతమే. కనుక భారత్ మరీ అంతగా బెంబేలెత్తిపోవాల్సిన పని లేదన్నది ఆర్థికవేత్తల మాట. ''భారత్ వంటి అతిపెద్ద మార్కెట్‌ను అమెరికా విస్మరించలేదు. అక్కడి ఈ కామర్స్ కంపెనీలు, బ్యాంకులు, ఆర్థిక సేవలు, టెక్నాలజీ సంస్థలకు భారత మార్కెట్ అంటే భారీ ఆసక్తి. సోషల్ నెట్‌వర్కింగ్ కంపెనీలకూ భారత్ ప్రధానమే'' అని వారంటున్నారు.

అమెరికాతో భారత్ వాణిజ్యమెంత?

అమెరికాకు అతి పెద్ద ఎగుమతిదారుల్లో భారత్ ఒకటి. 2024లో ఆ దేశానికి 87.4 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేసింది. అమెరికా నుంచి 41.8 బిలియన్ డాలర్ల దిగుమతులు మాత్రమే చేసుకుంది. ఈ వాణిజ్య లోటునూ ట్రంప్ ప్రశ్నిస్తున్నారు. దీన్ని పూడ్చాల్సిందేనని పట్టుబడుతున్నారు.

మనకు మేలే!

ట్రంప్ తెర తీసిన టారిఫ్ వార్ అంతిమంగా భారత్‌కే లబ్ధి చేకూరుస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. చైనా, కెనడా, మెక్సికో తదితర దేశాలపై అమెరికా ఇప్పటికే సుంకాలను పెంచడం తెలిసిందే. బదులుగా అమెరికాపై ప్రతీకార సుంకాలు తప్పవని ఆ దేశాలు కూడా స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో ఆయా దేశాల నుంచి అమెరికాకు ఎగుమతులు బాగా తగ్గేలా కన్పిస్తున్నాయి. ఇది భారత్‌కు సానుకూలంగా మారుతుందని, మనం మరిన్ని ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేసేందుకు వీలు కలుగుతుందని ఆర్థికవేత్తలు అంటున్నారు. ట్రంప్ తొలి హయాంలో కూడా చైనాపై సుంకాలు పెంచడంతో భారత్ బాగా లాభపడింది. ఈసారి కూడా అమెరికాకు మన మిర్చి, జౌళి తదితర ఉత్పత్తుల ఎగుమతులు బాగా పెరిగే అవకాశముంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

అమెరికాకు మన ప్రధాన ఎగుమతులు	అమెరికా నుంచి మన దిగుమతులు
→ ముత్యాలు, విలువైన రాళ్లు	→ ముడిచమురు, అనుబంధ ఉత్పత్తులు
→ ఎలక్ట్రానిక్ యంత్రాలు, పరికరాలు	→ ఆర్టిఫిషియల్ జ్యుయెలరీ
→ ఔషధాలు, అనుబంధ ఉత్పత్తులు	→ న్యూక్లియర్ రియాక్టర్లు, బాయిలర్లు
→ అణు రియాక్టర్లు, మెషీనరీ	→ పవర్ ప్లాంట్ పరికరాలు
→ పెట్రోలియం ఉత్పత్తులు,	→ విమానాలు, వాటి విడిభాగాలు
→ టెలీకమ్యూనికేషన్ పరికరాలు	→ వైద్య, రక్షణ పరికరాలు
→ నూలు వస్త్రాలు	



ఇప్పటికే చర్యలు

అమెరికాపై విధిస్తున్న సుంకాల తగ్గింపుకు భారత్ ఇప్పటికే చర్యలు తీసుకుంటోంది...

- → ఇటీవలి బడ్జెట్లో స్మార్ట్ ఫోన్ దిగుమతులపై ప్రకటించిన 15–16 శాతం సుంకాల నుంచి అమెరికాను మినహాయించాలని కేంద్రం భావిస్తోంది.
- → వైద్య పరికరాలు, లగ్జరీ మోటార్ సైకిళ్ల వంటి పలు అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లను తగ్గించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది.
- → వాణిజ్య లోటును తగ్గించే ప్రయత్నాల్లో భాగంగా అమెరికా నుంచి రక్షణ, చమురు తదితర ఉత్పత్తుల దిగుమతులను ఇతోధికంగా పెంచేందుకు ట్రంప్-మోదీ భేటీలో అంగీకారం కూడా కుదిరింది.
- → ఏఐజీ వంటి అమెరికా బీమా దిగ్గజాలకు లబ్ధి చేకూర్చేలా ఆ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 100 శాతానికి పెంచుతూ తాజా బడ్జెట్లో కేంద్రం నిర్ణయం తీసుకుంది.
- → భారత ఔషధాలపై అమెరికా ఎలాంటి సుంకాలూ వసూలు చేయడం లేదు. కనుక అమెరికా ఔషధ దిగుమతులపై భారత్ విధిస్తున్న 10 శాతం సుంకాన్ని కూడా ఎత్తేయాలని ఫార్మా సంస్థలు సూచిస్తున్నాయి.
- → అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న పలు వ్యవసాయోత్పత్తులపై ఏకంగా 42 నుంచి 120 శాతం దాకా సుంకాలున్నాయి. వీటిని కూడా బాగా తగ్గించే అవకాశముంది.

త్వరలో ఒప్పందం: భారత్

న్యూఢిల్లీ/వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుని తాజా ప్రకటనపై భారత్ ఆచితూచి స్పందించింది. అగ్ర రాజ్యంతో వాణిజ్య బంధాన్ని మరింత పటిష్టం చేసుకోవడమే తమ లక్ష్యమని పేర్కొంది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) ద్వారా టారిఫ్, టారిఫేతర అడ్డంకులను తగ్గించుకునేందుకు కృషి చేస్తున్నట్టు వివరించింది. దీన్ని ఇరు దేశాలకూ ఆమోదనీయ రీతిలో పరిష్కరించుకుంటామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ శుక్రవారం ఒక ప్రకటనలో విశ్వాసం వెలిబుచ్చారు.

సుంకాల తగ్గింపుకు భారత్ ఒప్పుకుంది: ట్రంప్

అమెరికాపై సుంకాలను భారీగా తగ్గించేందుకు భారత్ అంగీకరించినట్టు ట్రంప్ వెల్లడించారు. శుక్రవారం ఉదయం వైట్‌హౌస్ ఓవల్ కార్యాలయంలో ఈ మేరకు ప్రకటించారు. అమెరికాపై ఇన్నాళ్లుగా భారత్ విధిస్తున్న హెచ్చు సుంకాలను తాను బయట పెట్టడమే ఇందుకు కారణమని చెప్పుకొచ్చారు.

మహిళల రక్షణలో ప్రధాని

గాంధీనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ప్రధానికి గుజరాత్‌లో పూర్తిగా మహిళా పోలీసులు బందోబస్తు కల్పించనున్నారు. ప్రధాని రక్షణ కవచంలో ఇలా అందరూ మహిళలే ఉండటం తొలిసారి. శనివారం నవసరి జిల్లాలోని వాన్సీ బోరిలో ప్రధాని హెలికాప్టర్ దిగినప్పటినుంచి వేదిక దాకా మహిళా పోలీసు అధికారిణులే రక్షణ కల్పిస్తారు. లక్‌పతి దీదీ సమ్మేళన్‌లో మోదీ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి 2,100 మహిళా కానిస్టేబుళ్లు, 187 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లు, 61 మంది సీఐలు, 16 మంది డీఎస్పీలు, ఐదుగురు ఎస్పీలు, ఒక ఇన్‌స్పెక్టర్ జనరల్, ఒక అదనపు డీజీపీ.. ఇలా వివిధ స్థాయిల్లోని మహిళా సిబ్బంది భద్రతా వలయంలో ఉండనున్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారిణి, హోంశాఖ కార్యదర్శి నిపుణ తోర్వాణే ప్రధాని మోదీ భద్రతను పర్యవేక్షిస్తారని హోంశాఖ సహాయమంత్రి హర్ష్ సంఘవి తెలిపారు.

రాణా పిటిషన్ తిరస్కరణ

వాషింగ్టన్: భారత్‌కు అప్పగించొద్దంటూ ముంబై ఉగ్రదాడుల నిందితుడు తహవ్వుర్ రాణా వేసిన అత్యవసర పిటిషన్‌ను అమెరికా సుప్రీంకోర్టు గురువారం తిరస్కరించింది. పాక్ సంతతికి చెందిన కెనడా జాతీయుడైన రాణా లాస్ ఏంజెలిస్‌లోని మెట్రోపాలిటన్ జైల్లో ఉన్నాడు. లష్కరే తోయిబా ఉగ్రవాది డేవిడ్ కోల్మన్ హెడ్లీతో అతనికి సంబంధాలున్నాయి. 26/11 దాడుల కేసులో రాణాను భారత్‌కు అప్పగించేందుకు అమెరికా ప్రభుత్వం అంగీకరించింది. అతని రివ్యూ పిటిషన్‌ను జనవరిలో ఫెడరల్ కోర్టు తోసిపుచ్చింది. రాణాకు చికిత్స విషయంలో నిర్ణయం తెలిపేందుకు భారత్ నిరాకరించింది. దాంతో భారత్‌కు అప్పగిస్తే బతికనంటూ రాణా పిటిషన్ దాఖలు చేశారు. పాక్ సంతతి ముస్లిం గనుక తనను చిత్రహింసలకు గురి చేస్తారని ఆరోపించారు.

వంటనూనె తగ్గించండి వ్యాయామం చేయండి

ఊబకాయానికి చెక్ పెట్టండి ● ప్రధాని మోదీ పిలుపు

సిల్వాస్సా: దేశంలో ఊబకాయ సమస్య నానాటికీ తీవ్రరూపం దాలుస్తుండడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. 2050 నాటికి 44 కోట్ల మంది భారతీయులు ఊబకాయులుగా మారుతారని అధ్యయనాలు చెబుతున్నాయని గుర్తుచేశారు. ప్రతి ముగ్గురిలో ఒకరు ఊబకాయంతో అవస్థలు పడే ప్రమాదం ఉందన్నారు. ఇది నిజంగా ప్రమాదకరమైన, దిగ్భ్రాంతి కలిగించే సంఖ్య అని చెప్పారు. ఒబెసిటీ అతిపెద్ద సవాలుగా మారిందని అన్నారు. ఊబకాయ సమస్యను అధిగమించడానికి వంట నూనెల వినియోగాన్ని కనీసం 10 శాతం తగ్గించుకోవాలని మరోసారి దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. వంట నూనెల వినియోగం తగ్గించుకుంటామని అందరూ ప్రతిజ్ఞ చేయాలని చెప్పారు. నిత్యం వ్యాయామం చేయాలని, శరీరంలో అవసరానికి మించి ఉన్న కొవ్వు శాతాన్ని తగ్గించుకోవాలని కోరారు. లేకపోతే భవిష్యత్తులో ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజలకు తక్కువ ధరకే ఔషధాలు అందించడానికి దేశవ్యాప్తంగా 25 వేల జన ఔషధి కేంద్రాలు ప్రారంభించబోతున్నామని తెలియజేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని మెడికల్ షాపుల్లో ఔషధాలు కొనుగోలు చేయడం వల్ల మధ్య తరగతి ప్రజలు, పేదలకు ఇప్పటికే రూ.30,000 కోట్లు ఆదా అయ్యాయని వివరించారు. ప్రధాని మోదీ శుక్రవారం కేంద్ర పాలిత ప్రాంతమైన దాద్రా నగర్ హవేలీలో పర్యటించారు. సిల్వాస్సా పట్టణం లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.2,587 కోట్ల విలువైన పలు అభివృద్ధి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.460 కోట్లతో నిర్మించిన 'నమో హాస్పిటల్'ను ప్రారంభించారు.

11 నుంచి మోదీ మారిషస్ పర్యటన

ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 11వ తేదీ నుంచి మారిషస్‌లో పర్యటించనున్నారు. ఆయన పర్యటన రెండు రోజులపాటు కొనసాగుతుందని విదేశాంగ శాఖ శుక్రవారం వెల్లడించింది. మారిషస్ ప్రధానమంత్రి నవీన్ రామ్‌గూలం ఆహ్వానం మేరకు మారిషస్ జాతీయ దినోత్సవంలో మోదీ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలియజేసింది.



రూ. 32 లక్షల కోట్లలో ఎన్ని సున్నాలో లెక్కించలేరు

కాంగ్రెస్‌ను ఎద్దేవా చేసిన ప్రధాని మోదీ

సూరత్: చట్టసభల్లో సున్నా సీట్లు ఉన్న రాజకీయ పార్టీలు రూ.32 లక్షల కోట్లలో ఎన్ని సున్నాలు ఉంటాయో లెక్కించలేవని ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా కాంగ్రెస్ పార్టీని ఎద్దేవా చేశారు. 'ప్రధానమంత్రి ముద్రా యోజన' కింద పేదలకు ఇప్పటిదాకా రూ.32 లక్షల కోట్ల రుణాలు అందజేశామని చెప్పారు. ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులకు లబ్ధి చేకూర్చడానికి ఆదాయపు పన్ను మినహాయింపును రూ.12 లక్షల వరకు పెంచామని అన్నారు. శుక్రవారం గుజరాత్‌లోని సూరత్‌లో 'సంతృప్తస్థాయిలో ఆహార భద్రత' అనే కార్యక్రమాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఇతర జిల్లాలకు సైతం స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తన సోషల్ మీడియా ఖాతాలను శనివారం పూర్తిగా మహిళలకే అప్పగించబోతున్నానని ప్రధానమంత్రి స్పష్టంచేశారు.

కేంద్రం కుట్రలపై పోరాడుదాం

- జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకిద్దాం
- 22న జేఏసీ తొలి భేటీలో పాల్గొనండి
- ఏడు రాష్ట్రాల సీఎంలు, మాజీ సీఎంలకు స్టాలిన్ లేఖ

సాక్షి, చెన్నై: జనాభా ఆధారంగా చేపట్టే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు వ్యతిరేకంగా అందరూ ఏకం కావాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ పిలుపునిచ్చారు. ఏడు రాష్ట్రాలకు చెందిన ప్రస్తుత, మాజీ ముఖ్యమంత్రులకు శుక్రవారం లేఖ రాశారు. ఈ నెల 22వ తేదీన చెన్నైలో నిర్వహించనున్న జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ప్రారంభ సమావేశంలో పాల్గొనాలని కోరారు. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ జరిగిన పక్షంలో తమిళనాడులో స్థానాల సంఖ్య 39 నుంచి 31కు తగ్గే ప్రమాదం ఉందని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇదే పరిస్థితి మిగిలిన రాష్ట్రాల్లోనూ నెలకొనే ప్రమాదం ఉందని ఆయన చెబుతున్నారు. గత నెల 5వ తేదీన చెన్నైలో తమిళనాడులోని 50కి పైగా పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి దక్షిణాది రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల ఎంపీలు, నేతలతో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో జేఏసీలో భాగస్వామిగా చేరాలని పిలుపునిస్తూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలకు స్టాలిన్ లేఖ రాశారు. అలాగే ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నేతలకు సైతం లేఖలు పంపించారు. జనాభా ఆధారంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం అవుతుండడం వెనుక పెద్ద కుట్ర ఉందని స్టాలిన్ ఆరోపించారు.

సమస్యను మూడు నెలల్లో పరిష్కరిస్తాం

డూప్లికేట్ ఓటర్ ఐడీ నంబర్లపై ఈసీ

న్యూఢిల్లీ: ఎలక్టోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డ్(ఎపిక్) సంఖ్యలు పునరావృతం కావడం వివాదాస్పదమైన నేపథ్యంలో ఎన్నికల కమిషన్(ఈసీ)మరోసారి స్పష్టత ఇచ్చింది. 2000వ సంవత్సరం నుంచి కొనసాగుతున్న ఈ వ్యవహారానికి వచ్చే మూడు నెలల్లో ముగింపు పలుకుతామని శుక్రవారం తెలిపింది. ఓటరు జాబితాలో పేరున్న వ్యక్తి ఎపిక్ సంఖ్యతో నిమిత్తం లేకుండా సంబంధిత పోలింగ్ కేంద్రంలోనే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశముంటుందని, ఇతర పోలింగ్ బూత్‌లలో ఓటేసే అవకాశం ఆ వ్యక్తికి ఉండదని కూడా ఈసీ స్పష్టతనిచ్చింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వేర్వేరుగా ఓటరు జాబితాను తయారు చేస్తుండటం వల్లే ఇలా నంబర్లు పునరావృతమయ్యాయని వివరించింది. నమోదైన 99 కోట్లకు పైగా ఓటర్లతో భారత ఓటర్ల జాబితా ప్రపంచంలోనే అతిపెద్ద డేటాబేస్ అని ఒక ప్రకటనలో ఈసీ పేర్కొంది. రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ అధికారులు, సాంకేతిక నిపుణుల సాయంతో దశాబ్దాల నాటి ఈ అంశంపై మూడు నెలల్లో స్పష్టత తెస్తామంది. ప్రస్తుత ఓటర్లకు యూనిక్ నేషనల్ ఎపిక్ నంబర్‌ను కేటాయిస్తామని, కొత్తగా నమోదయ్యే వారికి సైతం ఈ విధానాన్ని వర్తింపజేస్తామని వివరించింది. దీనివల్ల నంబర్లు పునరావృతమయ్యే అవకాశం ఉండదని తెలిపింది.

సిరియాలో ఘర్షణలు.. 70 మంది మృతి

అసద్ అనుచరులు, పోలీసులకు మధ్య హింస

దమాస్కస్: సిరియా తీర ప్రాంతంలో గురువారం అల్లర్లు చెలరేగాయి. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులపై సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ అనుచరులు దాడి చేయడంతో ఘర్షణ జరిగింది. 70 మందికి పైగా మరణించారు. గత డిసెంబరులో అసద్ గద్దె దిగాక సిరియాలో జరిగిన అత్యంత దారుణమైన హింస ఇదేనని అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ (ఎస్ఓహెచ్ఆర్) తెలిపింది. మృతుల్లో 35 మంది ప్రభుత్వ సిబ్బంది, 32 మంది అసద్ విధేయులు, నలుగురు పౌరులున్నట్టు పేర్కొంది. ఘర్షణలు చెలరేగిన ఓడరేవు నగరాలు హోమ్స్, టార్టోస్, లటాకియాల్లో కర్ఫ్యూ విధించారు. కొత్త ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'కోస్టల్ షీల్డ్ రెజిమెంట్' అనే ప్రతిఘటన బృందం ఏర్పడిందని అసద్ కాలపు కమాండర్ చెప్పారు. దాడి అనంతరం ఈ మేరకు వీడియో విడుదల చేశారు.

పేలిన స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్

ప్రయోగించిన కాసేపటికే కూలిన వైనం ● బహమాస్, ఫ్లోరిడాల్లో శకలాలు

టెక్సాస్: స్పేస్‌ఎక్స్ సంస్థకు ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థ అతి పెద్ద రాకెట్ స్టార్‌షిప్ ప్రయోగ సమయంలోనే పేలింది. గురువారం రాత్రి అమెరికాలో టెక్సాస్‌లోని బొకాచికా నుంచి ప్రయోగించిన రాకెట్ కొద్ది నిమిషాలకే బహమాస్ ప్రాంతంలో కూలి పోయింది. దాని శకలాలు ఫ్లోరిడా, బహమాస్‌లో పడిపోయాయి. శకలాలు తారాజువ్వల్లా ఆకాశంలో దూసుకెళ్తుండటాన్ని పలువురు వీడియోల్లో బంధించారు. స్టార్‌షిప్ స్పేస్‌ఎక్స్ ఇప్పటిదాకా నిర్మించిన అతి పెద్ద, అత్యంత శక్తివంతమైన రాకెట్ ఇదే. మార్స్ మీద కాలనీ ఏర్పాటు చేయాలనుకుంటున్న మస్క్ లక్ష్యాలకు ఇది కీలకమైనది కూడా. గంట ప్రయాణం తర్వాత ఈ వ్యోమనౌక హిందూ మహాసముద్రం మీదుగా భూ కక్ష్యలోకి తిరిగి ప్రవేశించాల్సి ఉంది. రాకెట్‌ను విడిచి పెట్టడానికి సాయపడిన సూపర్ హెవీ బూస్టర్ విజయవంతంగా లాంచ్ ప్యాడ్‌కు తిరిగి వచ్చింది. కానీ రాకెట్ కూలిపోయింది. స్పేస్‌ఎక్స్‌కు ఇది ఎనిమిదో రాకెట్ టెస్టింగ్ మిషన్. కాగా వరుసగా రెండో వైఫల్యం. జనవరిలో ప్రయోగించిన స్టార్‌షిప్ కరీబియన్ దీవులపై పేలి పోయింది. ఆ శిథిలాలు టర్క్స్, కైకోస్ దీవులపై పడ్డాయి. దాంతో సమస్యల పరిష్కారానికి స్పేస్‌ఎక్స్ పలు మార్పులు చేసింది. ఆ పేలుడుపై దర్యాప్తు ముగియకముందే తాజా ప్రయోగాన్ని నిర్వహించింది. ఈ ప్రమాదం వల్ల మియామి, ఓర్లాండో సహా పలు విమానాశ్రయాల్లో చాలా సేపటిదాకా విమానాల రాకపోకలు నిలిచిపోయాయి.

అథెనా కథ ముగిసింది

కేప్ కనవెరాల్: ఇంట్యూటివ్ మెషీన్స్ రెండో మిషన్ కూడా ఫెయిలయ్యింది. చంద్రుడిపైకి పంపిన ల్యాండర్ అథెనా పనిచేయకుండా పోయింది. టెక్సాస్‌కు చెందిన ఇంట్యూటివ్ మెషీన్స్ సంస్థ స్పేస్ ఎక్స్ రాకెట్ ద్వారా ఫిబ్రవరి 26న అథెనాను పంపించింది. ఇందులో 11 పేలోడ్లు, సైంటిఫిక్ పరికరాలు ఉన్నాయి. చంద్రుని దక్షిణ ధ్రువానికి 160 కిలోమీటర్ల దూరంలోని నిర్ణీత ప్రదేశంలో ఇది ల్యాండవ్వాల్సి ఉంది. కానీ, 250 మీటర్ల దూరంలో అతికష్టమ్మీద, అదీ ఇరుకైన గుంతలో దిగింది. తను దిగిన ప్రదేశాన్ని, పొజిషన్‌ను తెలపడంతోపాటు కొన్ని ప్రయోగాలకు సంబంధించిన పరికరాలను సైతం యాక్టివేట్ చేసినట్లు ఫొటోలను పంపించింది. వీటిని బట్టి చూస్తే ఇది ఇరుకైన గుంతలో పక్కకు ఒరిగి ఉన్నట్లు నాసా శాస్త్రవేత్తలు శుక్రవారం తేల్చారు. ల్యాండర్‌కు ఉన్న సౌర ఫలకాలున్న తీరు, గుంతలోని అతి శీతల పరిస్థితులను బట్టి చూస్తే, అథెనా బ్యాటరీలను రీఛార్జి చేయడం అసంభవమని గుర్తించారు. దీంతో, అథెనా పనిచేసే అవకాశాలు లేవని ప్రకటించారు. మిషన్ పూర్తయినట్లు ప్రకటించిన అధికారులు అది పంపించిన చిత్రాలను విశ్లేషించి పనిలో పడ్డారని ఇంట్యూటివ్ మెషీన్స్ తెలిపింది. అథెనా ఇంట్యూటివ్ రెండో మిషన్ కాగా, ఈ సంస్థ ఏడాది క్రితం పంపిన ఒడిస్సియస్ కూడా విఫలమైంది.

ట్రూడో కంటతడి




- ప్రధానిగా మీడియా సమావేశంలో భావోద్వేగం
- మరింత కఠిన పరిస్థితులుంటాయని హెచ్చరిక

ఒట్టావా: ప్రధాని హోదాలో చివరి మీడియా సమావేశంలో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కన్నీటి పర్యంతమయ్యారు. తొమ్మిదేళ్ల పదవీకాలాన్ని గుర్తు తెచ్చుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ''ప్రధానిగా ప్రతి రోజూ కెనడియన్లకే తొలి స్థానమిచ్చా. ప్రజలే నాకు వెన్నుముకగా నిలిచారు. మీకందరికీ కృతజ్ఞతలు. మీవల్లే ఇక్కడున్నా'' అన్నారు. కెనడాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన భారీ సుంకాలు, విలీన ప్రకటనల నేపథ్యంలో రాబోయే రోజుల్లో మరింత కఠిన పరిస్థితులు తప్పవన్నారు. సంక్షోభ సమయంలో కెనడియన్లు ఐక్యంగా ఉండాలన్నారు. ''నా పదవీకాలంలో ఎన్నో సవాళ్లు, ఒడిదుడుకులు ఎదురయ్యాయి. ట్రంప్ పాలన, కరోనా, ద్రవ్యోల్బణం, ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో అసాధారణ క్లిష్ట పరిస్థితులు... ఇవి సంక్లిష్టమైన సమయాలే. వీటన్నింటి నడుమా ప్రధానిగా బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాను. ఈ పోరాట పటిమను చివరి క్షణం వరకు కొనసాగిస్తా'' అన్నారు. ప్రజాదరణ పడిపోవడంతో జనవరిలో ట్రూడో రాజీనామా ప్రకటించడం తెలిసిందే. అధికార లిబరల్ పార్టీ కొత్త నాయకుడిని ఎన్నుకునే దాకా పదవిలో కొనసాగనున్నారు.

సాక్షి
హైదరాబాద్
శనివారం । 8 । మార్చి । 2025





ఆస్తి పన్ను బకాయి వడ్డీలపై 90% మాఫీ

మళ్లీ ఓటీఎస్
సదుపాయం కల్పించిన ప్రభుత్వం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆస్తి పన్ను భారీ బకాయిదారులకు శుభవార్త. ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీల మొత్తం భారీగా పేరుకుపోయిన వారి సదుపాయార్థం ప్రభుత్వం వన్ టైమ్ స్కీమ్ (ఓటీఎస్)గా పేర్కొంటూ 90 శాతం మాఫీతో రాయితీ సదుపాయం కల్పించింది. దీంతో.. ఈ మార్చి నెలాఖరుకు ముగియనున్న 2024–25 ఆర్థిక సంవత్సరం వరకు ఆస్తిపన్ను బకాయిల వడ్డీల్లో పది శాతం, అసలు చెల్లించేవారికి ఈ సదుపాయం వర్తిస్తుంది. జీహెచ్‌ఎంసీ ఆదాయం పెంచుకునేందుకు కమిషనర్ ఇలంబర్తి రాసిన విజ్ఞప్తి లేఖకు స్పందించిన ప్రభుత్వం ఈ రాయితీనిచ్చింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ ఈ ఆర్థిక సంవత్సర ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యం రూ.2 వేల కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.1,540 కోట్లు వసూలైంది. వడ్డీ మాఫీ రాయితీ వర్తించే వారి నుంచి రావాల్సిన బకాయిలు దాదాపు రూ.5 వేల కోట్లున్నాయి. రాష్ట్రప్రభుత్వం గతం సంవత్సరం, అంతకుముందు సైతం ఈ సదుపాయాన్ని కల్పించడం తెలిసిందే. భారీగా బకాయిలు పేరుకుపోయిన వారి నుంచి కనీసం రూ. 500 కోట్లయినా వసూలవుతాయని అంచనా. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే వడ్డీలతో సహా ఆస్తిపన్ను చెల్లించిన వారికి సైతం ఈ రాయితీ సదుపాయం వర్తించనుంది. వారు చెల్లించిన మొత్తాన్ని వారి రాబోయే ఆస్తిపన్ను చెల్లింపులో అడ్జస్ట్ చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



లెమన్ స్పూన్ ఆడుతున్న మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, ఇతర అధికారిణులు

ఆమెదే అధికారం!

జీహెచ్‌ఎంసీలో మహిళా ప్రాధాన్యం

సాక్షి, సిటీబ్యూరో:

- నగర మేయర్, డిప్యూటీ మేయర్ పదవుల్లో వనితలే..
- బల్దియాలోని 150 వార్డుల్లో 78 మంది కార్పొరేటర్లు వీరే..
- 14 మంది అడిషనల్ కమిషనర్లకుగాను ఆరుగురు అతివలే..
- పారిశుద్ధ్య కార్మికుల్లో 18 వేల మందికి పైగా మహిళలే..

కోటిమందికి పైగా ప్రజలకు వివిధ సేవలందిస్తున్న మహా నగరపాలకసంస్థ (జీహెచ్‌ఎంసీ)లో మహిళలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. అటు పాలకమండలిలో, ఇటు అధికారుల్లోనూ వారు తమ సేవలందిస్తున్నారు. పాలకమండలికి నేతృత్వం వహించే మేయర్, డిప్యూటీ మేయర్ ఇద్దరూ మహిళలే కావడం విశేషం. అంతేకాదు 150 మంది కార్పొరేటర్లకు గాను 50 శాతం రిజర్వేషన్లతో 75 మందికి మాత్రమే అవకాశమున్నప్పటికీ, 79 మంది మహిళలు కార్పొరేటర్లుగా ఎన్నిక కాగా, వారిలో ఒకరు మృతి చెందడంతో ప్రస్తుతం 78 మంది.. 78 వార్డులకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వారి వార్డుల్లో ప్రజల సమస్యలు తీర్చడంలో, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అధికారులపై ఒత్తిడి తేవడంలో వారిదే ముఖ్య భూమిక. ఇక పార్టీల పరంగా చూస్తే బీఆర్‌ఎస్‌లో 26 మంది, బీజేపీలో 23 మంది, ఎంఐఎంలో 18 మంది, కాంగ్రెస్‌లో 11 మంది తమ వార్డుల్లో పనులు చేస్తున్నారు.

అధికారుల్లో..

ఇక జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం అధికారుల్లోనూ 14 మంది అడిషనల్ కమిషనర్లకుగాను ఆరుగురు మహిళలే. వారు ఆర్థికం, ఆరోగ్యం, ఎన్నికలు, జీవవైవిధ్యం, డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీస్ వంటి కీలక విభాగాలను నిర్వహిస్తున్నారు. ఇటీవలి వరకు పరిపాలన విభాగం బాధ్యతలు నిర్వర్తించిన అధికారిణి బదిలీ కావడం తెలిసిందే.


జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో మహిళా దినోత్సవ సంబరాలు

సీఎఫ్‌ఏ, ఎస్టేట్స్ ఆఫీసర్, ఏపీఆర్‌ఓ, ఐటీ జాయింట్ కమిషనర్, స్పోర్ట్స్ జాయింట్ కమిషనర్, చీఫ్ హార్టికల్చరిస్ట్, సీఎంఓహెచ్‌లతో పాటు ఎస్ఈలుగా, ఈఈలుగా తదితర ఉన్నత పదవుల్లో మహిళలే ఉన్నారు.

సర్కిళ్లలోనూ..

మరో ఆరుగురు మహిళలు సర్కిళ్లలో డిప్యూటీ కమిషనర్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సర్కిల్ స్థాయిలో ఏ పని కావాలన్నా వారిని సంప్రదించాల్సిందే. అన్ని పనుల పర్యవేక్షణ, అజమాయిషీ వారివే. క్షేత్రస్థాయిలో పనులు చేయాల్సింది వారే. ప్రజల సమస్యలు స్థానికంగానే పరిష్కారమయ్యేందుకు వారిదే కీలకపాత్ర కావడం తెలిసిందే.

పారిశుద్ధ్యంలోనూ వీరే..

అధికారాల్లోనే కాదు. స్వేదం చిందించడంలోనూ అతివలే కష్టపడుతున్నారు. క్షేత్రస్థాయిలో నగరాన్ని శుభ్రపరుస్తున్నదీ మహిళలే. జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల్లో 18 వేల మందికి పైగా మహిళలే ఈ నగరాన్ని శుభ్రం చేస్తున్నారు. నగరాన్ని తల్లుల్లా పరిశుభ్రంగా ఉంచుతున్నారు.

తరుణీ తరుణం!

లక్డీకాపూల్: మహిళా ప్రజాప్రతినిధులు, ఉద్యోగినులు ఆహ్లాదంగా ఆటాపాటలతో గడిపారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్లు పంకజ, సుభద్రాదేవి, అలివేలు మంగతాయారు, సరోజ, గీతా రాధిక, జాయింట్ కమిషనర్ ఉమా ప్రకాష్, డీఎంహెచ్‌ఓ డా.పద్మజ తదితరులు శుక్రవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకలను డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డి, కమిషనర్ ఇలంబర్తి, ఇతర మహిళా ఉన్నతాధికారులతో కలిసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన మహిళా శానిటరీ వర్కర్లను మేయర్, డిప్యూటీ మేయర్ ఘనంగా సత్కరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన మహిళా ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు.

ఒక్క ఫొటో ఎన్నో భావాలను పలికిస్తుంది

మంత్రి సీతక్క


ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మంత్రి సీతక్క తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఒక్క చిత్రం ఎన్నో భావాలను పలికిస్తుందని మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో డీఎం అర్జున్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గిరిజన మహిళలు, పండగలు అనే అంశంపై ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గిరిజన మహిళల జీవన శైలి, పండగలు, వేడుకలు, ఆచారాలు, సంస్కృతి, వారసత్వ సంపదను ఫొటోలతో ప్రదర్శించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. బంజారా, కోయ, గోండు, నాయక్‌పోడు, చెంచు, కొండరెడ్డి, లంబాడీ వంటి గిరిజన తెగల మహిళల నిత్య జీవిత కార్యకలాపాలను చిత్రీకరించి సమాజానికి తెలియజేసే ప్రయత్నం చేయడాన్ని అభినందించారు. ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 10వ తేదీ వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు, చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ సూర్య ధనుంజయ్, వ్యవసాయ కమిషన్ సభ్యురాలు భవానీ రెడ్డి, సామాజిక వేత్త పీడబ్ల్యూఓ సంధ్య, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడితో కలిసి తల్లి, సోదరి హత్య



వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నారనే దారుణం

- జవహర్‌నగర్ పరిధిలో తల్లి మృతదేహం లభ్యం
- విచారణ నేపథ్యంలో అక్కను సైతం హత్య చేసినట్లు అంగీకారం
- లాలాగూడ రైల్వే క్వార్టర్స్‌లో మృతదేహం స్వాధీనం
- పరారీలో ఉన్న ప్రధాన నిందితుడి కోసం పోలీసుల గాలింపు

అడ్డగుట్ట/జవహర్‌నగర్: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నారనే కారణంగా ఓ మహిళ తన ప్రియుడితో కలిసి తల్లిని, సోదరిని దారుణంగా హత్య చేసింది. ఆ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న జవహర్‌నగర్ పోలీసులు.. నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు విచారణ చేస్తున్న క్రమంలో తన అక్కను సైతం హత్య చేసినట్లు ఆమె అంగీకరించడంతో లాలాగూడ రైల్వే క్వార్టర్స్ నుంచి ఆ మృతదేహాన్నీ రికవరీ చేశారు. పరారీలో ఉన్న ప్రియుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. అతడు చిక్కితేనే ఈ హత్యలకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. నార్త్ లాలాగూడ ప్రాంతానికి చెందిన వడుగుల నాగయ్య, సుశీల (60)కు జ్ఞానేశ్వరి (45), లక్ష్మి (40), ఉమామహేశ్వరితో పాటు శివకైలాష్ సంతానం. ముగ్గురు కుమార్తెలూ అవివాహితులే. వివాహితుడైన శివ ప్రస్తుతం అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. అతడి భార్య స్రవంతి అత్తింట్లోనే ఉంటున్నారు.

వివాహేతర సంబంధంపై నిత్యం గొడవలు..

సుశీల పెద్ద కుమార్తె జ్ఞానేశ్వరికి మానసిక సమస్యలు ఉన్నాయి. చిన్న కుమార్తె ఉమామహేశ్వరి లాల్ బజార్‌లోని ఓ కాల్ సెంటర్‌లో పని చేస్తున్నారు. రైల్వేలో పని చేసిన సుశీల భర్త నాగయ్య కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. దీంతో కారుణ్య నియామకం కింద ఆ ఉద్యోగం వారి రెండో కుమార్తె లక్ష్మికి వచ్చింది. 2018 నుంచి ఈ కుటుంబం లాలాగూడలోని రైల్వే క్వార్టర్స్‌లోనే ఉంది. ఆ తర్వాత జవహర్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని కౌకూర్ భరత్‌నగర్‌లో ఇల్లు కట్టుకోవడంతో సుశీల, ఉమామహేశ్వరి, స్రవంతి అక్కడికి మారారు. లక్ష్మి లాలాగూడలోని రైల్వే వర్క్‌షాప్‌లో ఉద్యోగం చేస్తుండడంతో ఆమెతో పాటు అక్క జ్ఞానేశ్వరితో కలిసి ఉంటోంది. సైనిక్‌పురి ప్రాంతానికి చెందిన తాపీమేస్త్రీ బిల్డర్ అరవింద్ కుమార్‌తో (45) ఈ కుటుంబానికి 2010 నుంచి పరిచయం ఉంది. భరత్‌నగర్‌లో ఇల్లు కూడా అతడే కట్టడంతో లక్ష్మితో పరిచయం మరింత పెరిగింది. ఈ క్రమంలో వీరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. నిత్యం వీరిద్దరూ కలుస్తుండటంతో విషయం లక్ష్మి కుటుంబ సభ్యులకు తెలిసింది. దీనిపై పలుమార్లు ఇంట్లో గొడవలు కూడా జరిగాయి.

సుశీల మెడకు చీరతో ఉరి బిగించి..

గురువారం ఉదయం 9.30 గంటలకు ఉమా మహేశ్వరి, స్రవంతి తన ఉద్యోగాల నిమిత్తం బయటకు వెళ్లిపోగా సుశీల ఒక్కరే ఇంట్లో ఉన్నారు. రాత్రి 7.17 గంటలకు ఆ ఇంట్లో నుంచి శబ్దాలు వస్తుండటం గమనించిన పక్కింట్లో ఉండే వెంకటేష్ విషయాన్ని ఫోన్ ద్వారా ఉమా మహేశ్వరికి తెలిపారు. ఆమె తన తల్లి సుశీలకు ఫోన్ చేయగా స్పందన లేదు. దీంతో మళ్లీ వెంకటేష్‌కు ఫోన్ చేసిన ఆమె ఇంట్లోకి వెళ్లి చూడాల్సిందిగా కోరారు. ఆయన సమీపంలో ఉండే సారంగపాణితో కలిసి సుశీల ఇంటి వద్దకు వెళ్లారు. బెడ్రూంలో విగతజీవిగా పడి ఉన్న సుశీలను చూసి ఉమామహేశ్వరికి సమాచారం ఇచ్చారు. అదే సమయంలో అరవింద్ ఆమె ఇంటి మొదటి అంతస్తు నుంచి పక్కింటి పైకి దూకి పారిపోవడాన్నీ గమనించారు. 8 గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగి వచ్చిన ఉమామహేశ్వరి తన తల్లి నోట్లో వస్త్రాలు కుక్కి, చీరతో మెడకు ఉరి బిగించి చంపినట్లు గుర్తించింది. అరవింద్ కుమార్ తన తల్లిని చంపాడని, ఆమె ఒంటిపై ఉన్న మూడున్నర తులాల బంగారం దోచుకుపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. తరచూ తమ ఇంటికి వచ్చే అరవింద్ బుధవారం సాయంత్రం కూడా వచ్చివెళ్లినట్లు పేర్కొంది.

అక్క జ్ఞానేశ్వరిని కూడా హతమార్చినట్లు..

ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న జవహర్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సుశీల మృతదేహాన్ని పోస్టుమార్టం పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. దర్యాప్తు నేపథ్యంలో పోలీసులు లక్ష్మి, అరవింద్ మధ్య ఉన్న వివాహేతర సంబంధాన్ని గుర్తించారు. సుశీల హత్యలో లక్ష్మి పాత్ర ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ నేపథ్యంలో తాను అరవింద్‌తో కలిసి అక్క జ్ఞానేశ్వరి చంపామని ఆమె బయటపెట్టింది. బుధవారమే ఆమెను చంపి, మృతదేహాన్ని మూటకట్టి సమీపంలో రైల్వే క్వార్టర్స్‌లో ఉన్న పాడుబడిన బావిలో పడేసినట్లు అంగీకరించింది. దీంతో లక్ష్మిని తీసుకుని లాలాగూడ వచ్చిన జవహర్‌నగర్ పోలీసుల జ్ఞానేశ్వరి మృతదేహాన్నీ రికవరీ చేశారు. కుళ్లిన స్థితిలో ఉన్న ఈ మృతదేహాన్ని సైతం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ రెండు హత్యలు ఒకే సారి, ఒకే ప్రాంతంలో చేశారా? లేక వేర్వేరుగా చేశారా? అనే దానిపై లక్ష్మి నోరు విప్పట్లేదు. పరారీలో ఉన్న అరవింద్ కోసం గాలిస్తున్న అధికారులు అతడు చిక్కితే పూర్తి వివరాలు తెలుస్తాయని చెబుతున్నారు.

ఇక ‘సీజ్’లే!


హబ్సిగూడలో సీజ్ చేసిన ఓ దుకాణం

ఏళ్ల తరబడి అద్దెలు కట్టని దుకాణాలు

- రంగంలోకి ‘ఎస్టేట్స్’ ఉన్నతాధికారులు
- రెండు దుకాణాల్ని సీజ్ చేసిన జీహెచ్‌ఎంసీ
- వచ్చే వారం నుంచి మరింత ముమ్మరం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ఎస్టేట్స్ విభాగానికి ఎన్నో ఆస్తులున్నాయి. వాటిలోని మున్సిపల్ మార్కెట్లు, మున్సిపల్ కాంప్లెక్స్‌లలో దశాబ్దాల తరబడి తిష్ట వేసిన వారు అద్దెలు చెల్లించడం లేదు. బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే, జీహెచ్‌ఎంసీ కాంప్లెక్స్‌లలోని అద్దెలు ఎంతో తక్కువైనప్పటికీ, వాటిని సైతం చెల్లించడం లేదు. ఇది నాణేనికి ఒక వైపు మాత్రమే. మరోవైపు ఎస్టేట్స్ ఆస్తుల్ని పర్యవేక్షిస్తూ, నిర్ణీత వ్యవధుల్లో అద్దెలు వసూలు చేయాల్సిన సంబంధిత జోనల్, సర్కిల్ స్థాయి అధికారులు వాటిని పట్టించుకోవడం మానేశారు. సర్కిళ్లలోని డిప్యూటీ ఎస్టేట్ ఆఫీసర్లు తదితరులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ తీసుకోవడం లేదు.

- దుకాణాల్లో ఉంటున్న వారితో మిలాఖతై నెల నెలా ఎంతో కొంత సొమ్ము సొంత జేబుల్లో వేసుకుంటూ, జీహెచ్‌ఎంసీకి రావాల్సిన అద్దెలపై శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలున్నాయి. స్థానిక రాజకీయ నేతల అండదండలతో, ఆయా పార్టీల పేరుతో అద్దెలు చెల్లించని మొండి బకాయిదారులున్నారు. ఈ నేపథ్యంలో ఎస్టేట్స్ విభాగం ద్వారా జీహెచ్‌ఎంసీ ఖజానాకు రావాల్సినంత ఆదాయం రావడం లేదు. వాటి ద్వారా కోట్ల ఆదాయం రావాల్సి ఉన్నప్పటికీ రావడం లేదు. సర్కిళ్లలోని అధికారులు, సిబ్బంది కూడా ఇందుకు కారణమని గుర్తించిన జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం అధికారులు గత నాలుగైదు నెలలుగా చర్యలకు సిద్ధమయ్యారు.

నిబంధనలకు అనుగుణంగా..

దీర్ఘకాలంగా అద్దెలు చెల్లించని వారికి చెప్పి చూశారు. సర్కిళ్ల సిబ్బందికీ చేయాల్సిన పనుల గురించి వివరించారు. దుకాణదారులనూ పిలిపించి అద్దెలు చెల్లించాలని సూచించారు. అప్పటికీ అద్దెలు చెల్లించని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం నిబంధనల మేరకు ‘హియరింగ్స్’ నిర్వహించారు. అప్పటికీ పట్టించుకోని వారికి దుకాణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకున్న దుకాణదారులు ‘వారు అలాగే చెబుతారు’ అనుకొని కాబోలు లక్ష్యపెట్టలేదు.

పెరిగిన వసూళ్లు

గతంలో పోలిస్తే గడచిన నాలుగైదు నెలల్లో తీసుకున్న చర్యలతో అద్దెల వసూళ్లు పెరిగాయి. గతంలో ఏటా రూ.4 కోట్లు కూడా వసూలు కాని పరిస్థితి ఉండగా, ఈ సంవత్సరం ఇప్పటికే రూ.8 కోట్లు వసూలు చేశారు. జీహెచ్‌ఎంసీ దుకాణాల్లో ఒకసారి తిష్ట వేసిన వారు ఖాళీ చేయకుండా, అద్దెలు చెల్లించకుండా ఉంటున్న పరిస్థితిని నివారించేందుకు ఇక రెగ్యులర్ చర్యలు తప్పవని ఎస్టేట్స్ విభాగం హెచ్చరిస్తోంది. దీంతో జీహెచ్‌ఎంసీకి ఎస్టేట్స్ ద్వారా రావాల్సిన ఆదాయం పెంచుతామని చెబుతోంది.

సీజ్ చేశారిలా..

సర్కిల్ స్థాయిలో వెనుకడుగు వేస్తున్నారని గుర్తించిన అడిషనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్ శుక్రవారం తన కార్యాలయ సిబ్బందితో ఉప్పల్ సర్కిల్‌లోని హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్– 8లోని మున్సిపల్ కాంప్లెక్స్‌కు వెళ్లారు. ఆయన సమక్షంలో సంబంధిత డిప్యూటీ ఎస్టేట్ ఆఫీసర్ నిబంధనల మేరకు షోకాజ్ నోటీసుతో పాటు పూర్తికావాల్సిన చర్యలు పూర్తి కావడంతో రెండు దుకాణాలకు తాళాలు వేసి సీజ్ చేశారు. ఒక దుకాణం నుంచి రూ. 8 లక్షలు, మరో దుకాణం నుంచి రూ.30 లక్షల అద్దెల బకాయిలు ఉండటంతో ఈ చర్యలు తీసుకున్నారు. ఎక్కువ అద్దెల బకాయిలున్న అన్నింటిపైనా చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చేవారం నుంచి ఈ చర్యలు మరింత ముమ్మరం చేయనున్నారు.

‘మహా ప్రణాళిక’కు కసరత్తు

- సెప్టెంబర్ నాటికి సమగ్ర మాస్టర్ ప్లాన్ ముసాయిదా
- ట్రిపుల్ ఆర్ వరకు హెచ్‌ఎండీఏ పరిధిని విస్తరిస్తూ మాస్టర్‌ప్లాన్

త్వరలో ఆసక్తిగల సంస్థల నుంచి దరఖాస్తుల స్వీకరణ



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ పరిధి విస్తరణకు మంత్రివర్గం ఆమోదం తెలపడంతో సమగ్రమైన మాస్టర్‌ప్లాన్ రూపకల్పన ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. వచ్చే సెప్టెంబర్ నాటికి మాస్టర్‌ప్లాన్ ముసాయిదాను విడుదల చేసే దిశగా హెచ్‌ఎండీఏ కార్యాచరణ చేపట్టింది. ఈ మేరకు కొత్తగా విస్తరించనున్న పరిధికి అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ కోసం మరో వారం, పది రోజుల్లో ఆసక్తి వ్యక్తీకరణ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్) దరఖాస్తులను స్వీకరించేందుకు నోటిఫికేషన్ వెలువరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు మాస్టర్ ప్లాన్‌లో చేర్చాల్సిన అంశాలపై కసరత్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. గతంలో రూపొందించిన హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్ – 2031లో దొర్లిన లోపాలు పునరావృతం కాకుండా పటిష్టమైన ప్రణాళికలను సిద్ధం చేయనున్నట్లు ఒక అధికారి వివరించారు.

- 2050 వరకు హైదరాబాద్ మహానగర విస్తరణకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, టౌన్‌షిప్పులు, రహదారులు, ప్రజారవాణా సదుపాయాలు, పచ్చదనం, నీటివనరులు, తదితర అంశాలను సమగ్రంగా ప్రతిపాదించేలా మాస్టర్‌ప్లాన్ రూపొందించేందుకు ఆసక్తి గల అంతర్జాతీయ కన్సార్షియంల నుంచి దరఖాస్తులను కోరనున్నారు. మరోవైపు ఇప్పటి వరకు ఉన్న అన్ని మాస్టర్‌పాల్‌న్‌లను ఈ బృహత్తర మాస్టర్‌ప్లాన్‌లో విలీనం చేయనున్నారు. ఎంసీహెచ్, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, సైబరాబాద్, హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మాస్టర్‌ప్లాన్‌లు విలీనం కానున్నాయి.

రీజినల్ రింగ్‌రోడ్డు వెలుపల 2 కిలోమీటర్ల వరకు...

హెచ్‌ఎండీఏ పరిధిని విస్తరిస్తూ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం మేరకు రీజినల్ రింగ్‌రోడ్డుకు వెలుపల 2 కిలోమీటర్ల వరకు మాస్టర్‌ప్లాన్‌ను రూపొందిస్తారు. ట్రిపుల్ ఆర్ తరువాత ఒక కిలోమీటర్‌ను బఫర్‌జోన్‌గా పరిగణిస్తారు. ఆ కిలోమీటర్ పరిధిలో ఉన్న గ్రామాలన్నీ హెచ్‌ఎండీఏ పరిధిలోకి వస్తాయి. ప్రస్తుతం 7,527 చదరపు కిలోమీటర్లు ఉన్న హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ పరిధి కొత్తగా 10,560 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించనుంది. మొత్తం 104 మండలాలు, 1,355 గ్రామాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి వస్తాయి. ఇప్పుడు ఉన్న 7 జిల్లాలకు తోడు నల్గొండ, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వికారాబాద్ కొత్తగా చేరడంతో హెచ్‌ఎండీఏ పరిధిలోని జిల్లాల సంఖ్య 11కు చేరనుంది. అలాగే 41 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లు కూడా హెచ్‌ఎండీఏ పరిధిలోకి వస్తాయి. కొత్తగా 3 మున్సిపాలిటీలు చేరనున్నాయి. ఔటర్ లోపల 28 మున్సిపాలిటీలు, ఔటర్ వెలుపల 12 మున్సిపాలిటీలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి రానున్నాయి.

సురక్షిత ప్రయాణం మా బాధ్యత

మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: మెట్రో స్టేషన్లలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన భద్రత చర్యలు చేపట్టడం వల్ల ఇప్పటి వరకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా ఆవిష్కరణలు, వినూత్న ఆలోచనలు, శాస్త్రీయమైన ఇంజినీరింగ్ విధానాలతో ముందుకు వెళ్లడంతో హైదరాబాద్ మెట్రో రైల్‌ను ప్రపంచ దేశాల సాంకేతిక పరిజ్ఞానానికి దీటుగా నిలిపినట్లు చెప్పారు. బాలానగర్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ)లో శుక్రవారం నిర్వహించిన 54వ జాతీయ భద్రతా వారోత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో రైల్ వ్యవస్థలో చేపడుతున్న భద్రతా చర్యలను వివరించారు. మెట్రో రైల్ నిర్మాణాన్ని కేవలం ఒక ఇంజినీరింగ్ కోణంలోనే కాకుండా, ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకున్న సామాజిక అంశంగా చేపట్టామన్నారు. పీపీపీ విధానంలో చేపట్టిన ప్రపంచంలోనే మొట్టమొదటిదైన హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ నిర్మాణంలో అనేక క్లిష్టతరమైన సవాళ్లను అధిగమించినట్లు పేర్కొన్నారు. భద్రతను ఒక బాధ్యతగా అమలు చేస్తున్నామన్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ ప్రకాష్ చౌహాన్, డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిపై వీధికుక్కల దాడి



అంబర్‌పేట: ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి గోల్నాక కమలనగర్‌లో చోటు చేసుకుంది. స్థానికంగా నివసించే లక్ష్మణ్, మమతల కుమార్తె శ్రీలక్ష్మి (19 నెలలు) శుక్రవారం ఇంటి ముందు ఆడుకుంటోంది. అదే సమయంలో అటుగా వచ్చిన వీధికుక్కలు చిన్నారిపై దాడి చేశాయి. దీనిని గుర్తించిన తల్లిదండ్రులు, స్థానికులు కుక్కల్ని తరిమేసి చిన్నారిని రక్షించారు. అప్పటికే చిన్నారికి తీవ్రగాయాలు కావడంతో నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు.

Industrial Site for Sale/ Running Factory Setup

Location: Patancheru, Off National Highway 65, Hyderabad-Mumbai Connecting Road

Total Land Parcel: 11.5 Acres

Google Co-ordinates: 17.517889, 78.282500

Strategic Location & Connectivity:
7 km (Lingampally Railway Station)
57 km (Rajiv Gandhi International Airport)
30 km (Secunderabad)
19 km (City Centre)
19 to 26 km (IT Corridor & Commercial Hubs)

Thriving Industrial Zone: Top industries including ICRISAT, Pennar Industries, BHEL, Agarwal Rubber

Strong Industrial Ecosystem with easy workforce availability. Close to Residential areas (Ramachandrapuram, Miyapur, Serilingampally, BHELTownship)

Ideal for Industrial expansion and commercial establishments

For inquiries, Contact: 6238700218
Email:sellhydland@gmail.com

మోదీ పాలనలో మాట్లాడటమూ నేరమే



మాట్లాడుతున్న జస్టిస్ కోల్‌సేపాటిల్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పోలీసులు, జైళ్లకు భయపడని వ్యక్తి ప్రొఫెసర్ సాయిబాబా అని ప్రజల హక్కులకోసం తన జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని ముంబై హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కోల్‌సేపాటిల్ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో కమిటీ ఫర్ ది డిఫెన్స్ అండ్ రిలీజ్ ఆఫ్ డాక్టర్ జీఎన్ సాయిబాబా ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా స్మారక సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ కోల్‌సే పాటిల్ మాట్లాడుతూ... అంగవైకల్యాన్ని కూడా లెక్క చేయకుండా నియంతృత్వంపై పోరాడిన వ్యక్తి సాయిబాబా అన్నారు. మోదీ పాలనలో రాయడం, మాట్లాడడం కూడా నేరాలుగా మారాయని, మోదీ హయాంలోనే అర్బన్ నక్సలైట్ అనే పదం పుట్టుకొచ్చిందన్నారు. నక్సలైట్ ఎజెండా అయితే తప్పేంటి రాజ్యాంగం ప్రకారం కూర్చోబెట్టి మాట్లాడాలి కానీ చంపేస్తారా అని ప్రశ్నించారు. దేశంలో ప్రతి విచారణ సంస్థ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుకూలంగా పని చేస్తున్నాయన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ... సాయిబాబా ఉద్యమాలు స్ఫూర్తిదాయకమని ఆయన తన జీవితాన్ని ఉద్యమాలకే అంకితం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్, విక్షణం ఎడిటర్ ఎన్ వేణుగోపాల్, సామాజిక వేత్త సజయ, టీపీఎఫ్ అధ్యక్షులు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ 'ట్రేడింగ్ గ్యాంగ్' గుట్టురట్టు

- దేశ వ్యాప్తంగా ఈ ముఠాపై 18 కేసులు నమోదు
- కీలక నిందితుడిని అరెస్టు చేసిన సిటీ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: సోషల్‌మీడియా ద్వారా ట్రేడింగ్ పేరుతో ఎర వేసి, అందినకాడికి దండుకుంటున్న అంతర్జాతీయ ముఠా గుట్టును హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రట్టు చేశారు. సూరత్‌కు చెందిన కీలక నిందితుడు సవలియా రవిని అరెస్టు చేశామని, నేపాల్, చైనాలతో లింకులు ఉన్న ఈ ముఠాపై దేశ వ్యాప్తంగా 18 కేసులు నమోదై ఉన్నాయని డీసీపీ దార కవిత శుక్రవారం తెలిపారు. నగరానికి చెందిన వ్యక్తిని సైబర్ నేరగాళ్లు గ్రూప్ ఎం56 ఫైనాన్షియల్ గ్రూప్ పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూపులో యాడ్ చేశారు. జేపీ మోర్గాన్ ఛేజ్ అనే సంస్థలో చీఫ్ స్ట్రాటజిక్ ఆఫీసర్‌గా పని చేస్తున్నానంటూ విశ్వనాథం అనే వ్యక్తి బాధితుడితో మాట్లాడాడు. ట్రేడింగ్‌లో లాభాలు వచ్చేలా సలహాలు, సూచనలు ఇస్తామంటూ ఎర వేశాడు. తొలినాళ్లల్లో కాస్తా లాభాలు చూపించి... తమ వద్ద భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టించాడు. అతడి నుంచి రూ.87.51 లక్షలు కాజేశాడు. బాధితుడి ఫిర్యాదుతో సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. నగదు బదిలీ అయిన ఖాతాల ఆధారంగా దర్యాప్తు చేసిన అధికారులు గుజరాత్‌కు చెందిన రవి, కిషన్ కీలకమని గుర్తించారు. వీళ్లే పలువురి పేర్లతో నకిలీ బ్యాంకు ఖాతాలు తెరిచారని, వీటి ద్వారానే విదేశాల్లో ఉన్న సూత్రధారులు బాధితుల నుంచి నగదు వసూలు చేశారని తేలింది. దీంతో గుజరాత్ వెళ్లిన పోలీసులు రవిని అరెస్టు చేసి తీసుకువచ్చారు. పరారీలో ఉన్న కిషన్ కోసం గాలిస్తున్నారు. వీళ్లు తెరిచిన బ్యాంకు ఖాతాల ద్వారా మొత్తం రూ.8 కోట్ల లావాదేవీలు జరిగాయని, ఈ మొత్తానికి సంబంధించి నిందితులను కమీషన్ అందిందని అధికారులు చెబుతున్నారు.

నకిలీ ఉత్పత్తుల విక్రయిస్తున్న ఇద్దరు...

రాబిట్ హెయిర్ ఆయిల్ పేరుతో నకిలీ ఉత్పత్తుల్ని తయారు చేసి, ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న ఇద్దరు గుజరాత్ వాసుల్ని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారితో సహా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. రాబిట్ పేరుతో హెయిర్ ఆయిల్‌ను పునర్జీవన ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తయారు చేస్తుంది. గుజరాత్‌కు చెందిన విశేష్ అహూజా, చౌహాన్ నిరాల్ బాబూభాయ్, నీల్ నికోల్ భాయ్, ప్రసాద్, అలీషా ఓ ముఠాగా ఏర్పడ్డారు. వీళ్లు బహిరంగ మార్కెట్‌లో దొరికే నాశిరకమైన ఉత్పత్తులతో ఆయిల్ తయారు చేస్తున్నారు. దీనిని రాబిట్ పేరుతో ఉన్న బాటిల్స్‌లో నింపి, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ షాప్ 101లో ఉంచి విక్రయిస్తున్నారు. అనేక మంది వినియోగదారులు ఇది నిజమైన రాబిట్ ఆయిల్‌గా భావించిన కొని మోసపోతున్నారు. దీనిపై నగర వాసి ఫిర్యాదు చేయడంతో సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. దర్యాప్తు చేసిన అధికారులు చౌహాన్, నీల్‌లను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మిగిలిన ముగ్గురి కోసం గాలిస్తున్నారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో స్వధాత్రి పేరిట కళాకారుడు బీపీ రెడ్డి వేసిన చిత్రాల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో ఉదయం 10.30గంటల నుంచి డిజిటల్ మీడియా – మహిళలు : ప్రభావమూ పరిణామాలు అంశంపై అవగాహన సదస్సు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు థీమాటిక్ ఎగ్జిబిషన్ కొనసాగుతుంది.
- కొండాపూర్‌లోని మాయ లగ్జరీ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సూత్రా వస్త్ర ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- సోమాజీగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఉమెన్స్ రూమ్‌ను సాయంత్రం 7 గంటలకు సినీ దర్శకురాలు నందిని రెడ్డి ప్రారంభిస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

నకిలీ పత్రాలతో ప్లాటు విక్రయం

ఏడుగురు నిందితుల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శ్రీనివాస్

రాజేంద్రనగర్: నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ప్లాటు విక్రయించిన కేసులో రాజేంద్రనగర్ పోలీసులు శుక్రవారం ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో గతంలో ఓ మహిళను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చైన్నైకి చెందిన వినీత చౌదరి గతంలో నగరంలోని సోమాజిగూడ ప్రాంతంలో నివాసంఉండేది. 2005లో ఆమె బండ్లగూడ జాగీర్ పద్మశ్రీ హిల్స్ కాలనీలో 600 గజాల స్థలం కొనుగోలు చేసింది. ఆ తర్వాత కొన్నాళ్లకు చైన్నైకు వెళ్లిన ఆమె అక్కడే నివాసముంటోంది. సదరు స్థలంపై కన్నేసిన నాగయ్య ఆలియాస్ నాగేశ్ అరనే వ్యక్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వినీత చౌదరికి సంబంధించి డాక్యుమెంట్లు తీసుకున్నాడు. అనంతరం ఆమె నివాసం ఉన్న ప్రాంతానికి వెళ్లి వినీతా చౌదరి విషయమై ఆరా తీశాడు. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో తన స్నేహితుడు బండ్లగూడకు చెందిన ఇమాన్యుయేల్‌తో కలిసి పథకం పన్నాడు. ఇద్దరూ కలిసి నకిలీ పత్రాలను సృష్టించారు. వినీత చౌదరి కెనడాలో ఉందని... అక్కడి నుంచి తమ స్నేహితుడైన నాగోల్‌కు చెందిన దివాకర్‌కు జీపీఏ ఇచ్చినట్లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. కోఠి ప్రాంతంలో స్టాంప్‌లు తయారు చేయించి వాటిపై ముద్రించారు. సదరు జీపీఏను మూసాపేట్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వాల్యూయేషన్ చేయించారు. అనంతరం దివాకర్ నాగోల్‌కు చెందిన సుహాసినికి స్థలం విక్రయించినట్లు రిజిస్ట్రేషన్ చేశారు. సుహాసిని ఈ స్థలాన్ని బండ్లగూడకు చెందిన బిల్డర్లు శ్రీనివాస్, భరత్ రెడ్డిలకు రూ. 4.26 కోట్లకు విక్రయించింది. ఇందుకు అనిల్, వలీ, శివరాజ్, చంద్రకాంత్‌తో పాటు మరో ఏడుగురు సహకరించారు. స్థలాన్ని కొనుగోలు చేసిన బిల్డర్లు చదును చేస్తుండగా విషయం తెలుసుకున్న వినీత చౌదరి రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నారు. నిందితుల నుంచి ఫార్చ్యూనర్, రెండు కార్లు, 10 సెల్‌ఫోన్లు, రూ.1.69 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తమకు వచ్చిన డబ్బుతో కొత్త ఫార్చునర్ కారును కొనుగోలు చేయడం విశేషం. కేసును ఛేధించిన సిబ్బందిని డీసీపీ పురస్కారాలతో సత్కరించారు.

హర్ష టయోటా కార్ల ఎక్స్ఛేంజ్ మేళా



సాక్షి, సిటీబ్యూరో: హర్ష టయోటా ఆధ్వర్యంలో వినియోగించిన పాత కార్ల ఎక్స్ఛేంజ్ మేళా శుక్రవారం ప్రారంభమైంది. బాచుపల్లిలోని గోకరాజు రంగరాజు కాలేజీ రోడ్డులో డీమార్ట్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ మేళాను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌గౌడ్ ప్రారంభించారు.ఈ నెల 9 వరకు ఈ మేళా కొనసాగనుంది. కొనుగోలుదారులు, అమ్మకందారులను ఒకచోటకు చేర్చే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ మేళాలో పాల్గొని స్పాట్ బుకింగ్‌లు చేసుకున్నవారికి గ్రామ్ గోల్డ్‌కాయిన్ బహుమతిగా అందజేయనున్నారు. అలాగే ఉచిత కాలుష్య తనిఖీ పరీక్షలు, ఉచిత టెఫ్లాన్ కోటింగ్ సదుపాయం అందుబాటులో ఉంది.

మెట్రో గ్రీన్ ఛానల్ ఏర్పాటు



సాక్షి,. సిటీబ్యూరో: ఎల్‌బీ నగర్ కామినేని హాస్పిటల్ నుంచి శుక్రవారం రాత్రి 9.10 గంటలకు మెట్రో రైల్లో ఒక బ్రెయిన్ డెడ్ పేషెంట్ నుంచి సేకరించిన గుండెను రసూల్ పురాలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఇందుకోసం ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ నుంచి రసూల్ పురా వరకు ప్రత్యేక గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశారు. కేవలం 12 నిమిషాల్లోనే 13 కిలోమీటర్లు పయనించి ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రణాళికబద్ధంగా చేసిన ఏర్పాట్లు విజయవంతమైనట్లు ఎల్ అండ్‌టీ మెట్రో అధికారులు తెలిపారు.

హోటా చీఫ్ ప్యాట్రన్‌గా వ్యవహరించడం ఆనందంగా ఉంది



బంజారాహిల్స్: అండర్-19 క్రికెట్ జట్టులో శిక్షణ కోసం తాను 1986లో స్నేహితులతో కలిసి ఇంగ్లండ్ వెళ్లినట్లు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ (హోటా), జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ (జేఐసీ) సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ 5వ ఎడిషన్ పోటీలను జేఐసీ ప్రాంగణంలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ శిక్షణ కోసం తాను మహ్మద్ అఫాన్, సురేంద్ర వెళ్లి ఆడిన రోజులను ఆయన గుర్తుచేసుకున్నారు. పోటీలకు తాను హోటా చీఫ్ ప్యాట్రన్‌గా వ్యవహరిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. వరుసగా 5వ ఎడిషన్‌ను జేఐసీ నిర్వహించడం అభినందనీయమన్నారు. టెన్నిస్ క్రీడాకారులకు ఇది సదవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా.. సీవీ ఆనంద్ ఎంఏ ఎకనామిక్స్‌లో బంగారు పతకం సాధించినట్లు ఆయనతో కలిసి చదువుకున్న సురేంద్ర ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యక్రమంలో భాగంగా జూబ్లీహిల్స్ క్లబ్ నుంచి 80 ఏళ్లకు పైబడిన టెన్నిస్ ఆటగాళ్ల పి.ఆదిశేషారెడ్డి, వీపీ హరినాథ్, డాక్టర్ డీడీఆర్ రెడ్డి, డాక్టర్ బీవీ రామరాజు, మునికృష్ణ, కృష్ణారెడ్డి, బి.వేణుగోపాల రెడ్డి, టీఎల్ ప్రసాద్, మండవ లక్ష్మీనారాయణ తదితర క్రీడాకారులను సీవీ ఆనంద్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జేఐసీ అధ్యక్షుడు కె.సురేందర్‌రెడ్డి, కార్యదర్శి కిలారు రాజేశ్వర్‌రావు, హోటా అధ్యక్షుడు, అదనపు డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, రామకృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలు ఈ నెల 9న ముగియనున్నాయని, అదే రోజు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం ఉంటుందని కిలారు రాజేశ్వరరావు తెలిపారు.

మద్యం మత్తులో యువతుల హల్‌చల్

- కారుతో ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన వైనం
- డ్రంకన్ డ్రైవ్ కేసు నమోదు

కేపీహెచ్‌బీకాలనీ: మద్యం మత్తులో ఉన్న ముగ్గురు యువతులు కారులో వేగంగా వెళ్తూ రోడ్డుపై హల్‌చల్ సృష్టించారు. ముందున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టడంతో పాటు వారినే బెదిరింపులకు గురి చేసి ట్రాఫిక్ జామ్‌కు కారణమయ్యారు. ఈ ఘటన కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ వద్ద జరిగింది. ట్రాఫిక్ పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ముగ్గురు యువతులు గురువారం రాత్రి మద్యం సేవించి కారులో కూకట్‌పల్లి నుంచి జేఎన్‌టీయూ వైపు వేగంగా వెళ్తున్నారు. కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ వద్దకు రాగానే ముందున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టారు. దీంతో ద్విచక్ర వాహనదారులకు కారులో ఉన్న యువతుల నడుమ వాగ్వాదం జరిగింది. కారులో యువతులు కూర్చున్న సీటు పక్కనే టిన్ బీర్ బాటిళ్లు కనిపించడంతో వారు మద్యం సేవించినట్లు గుర్తించారు. ఇదే క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న స్థానికులు కూడా గుమికూడారు. ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందడంతో ట్రాఫిక్ ఎస్ఐ మాధవరెడ్డి, ఉమెన్ ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో కలిసి అక్కడికి చేరుకున్నారు. కారులో ఉన్న యువతులు సరిగ్గా మాట్లాడలేని స్థితిలో కనిపించగా.. డ్రైవింగ్ స్థానంలో ఉన్న యువతిని బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా.. 212 బీఏసీగా చూపించింది. దీంతో డ్రంకన్ డ్రైవ్ కేసు నమోదు చేసి వారి కారును స్వాధీనం చేసుకున్నారు. రాత్రి వేళ కావడంతో అక్కడి నుంచి వారిని పంపించారు. ముగ్గురు యువతులు మద్యం సేవించి గోకుల్ ప్లాట్స్‌కు కారులో వెళ్తుండగా కేపీహెచ్‌బీ కాలనీ ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి పోలీసులకు పట్టుబడినట్లు ట్రాఫిక్ సీఐ జానయ్య మీడియాకు తెలిపారు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారులు పోలీసులకు ఫిర్యాదు చేయకుండానే వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనను పలువురు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది.

నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి

సాక్షి, సిటీబ్యూరో: ఉపాధి కల్పన, శిక్షణశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 'తెలంగాణను మెరుగైన భవిష్యత్తుకు నైపుణ్య పరచడం' అనే అంశంపై ఇండస్ట్రియల్ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కార్మిక ఉపాధి కల్పనశాఖ ముఖ్యకార్యదర్శి సంజయ్ కుమార్ మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి లభిస్తుందన్నారు. 21 వరకు కొనసాగనున్న ఈ సమావేశాలకు నిర్మాణరంగం, లైఫ్ సైన్సెస్, రిటైల్, తయారీ, ఐటీ, ఐటీఈఎస్ పారిశ్రామిక రంగాల ప్రముఖులు హాజరుకానున్నారు. సమావేశంలో సీజీజీ జనరల్ డైరెక్టర్ రాజేంద్ర నిమ్జే, బీఎఫ్ఎస్ఐ ప్రతినిధి సౌమ్య రంజన్, తదితరులు పాల్గొన్నారు.

నోరూరించే.. శ్రీలంకన్ ఫుడ్ ఫెస్టివల్



మణికొండ: అద్భుతమైన శ్రీలంక వంటకాలకు హైదరాబాద్‌లోని ఐటీ జోన్ వేదికైంది. స్థానికంగా ఉన్న హోటల్ తాన్సేన్‌లో ప్రఖ్యాత శ్రీలంక చెఫ్ అనురా లెనోరా సారథ్యంలో ఈ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 17వ తేదీ వరకూ ఈ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ద్వీపదేశ వంటకాలైన ముల్లీగటనీ సూప్, కుకుల్ మాస్ సమగేఎలావాలు, పోల్ రోటీ సమగే సాంబోల్, హట్టు పేటీస్, పోల్ దవతువ, ఇస్సో, కుకుల్ మాస్ తట్టు, ఎలు మాస్ తట్టు, ఎలావాలు కట్లేట్, పిరావు మలు మిరిస్, తోరా మలు బేదపు లాంటి వంటకాలు అందిస్తున్నారు. మట్టి పాత్రలు, కట్టె పొయ్యిపై వండే పద్ధతులతో ఈ ఫెస్ట్ ప్రత్యేక రుచిని సంతరించుకుంది. ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రుచులను అందిస్తున్నట్లు ఓహ్రీస్ గ్రూప్ చైర్మన్ అమర్ ఓహ్రీ అన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ నీరజ్‌రాజ్, ఎగ్జిక్యూటీవ్ చెఫ్ గగన్‌దీప్, చెఫ్ అనురా లెనోరాలు పాల్గొన్నారు. వందలాది మంది ఐటీ ఉద్యోగులు మొదటి రోజు శ్రీలంక రుచులను ఆస్వాదించారు.

ఓఆర్ఆర్‌పై ప్రమాదం

- యువకుడి దుర్మరణం
- మృతుడు మాజీ కార్పొరేటర్ తీగల సునరితా అజీత్‌రెడ్డి కుమారుడు



తీగల కనిష్క రెడ్డి(ఫైల్)



ఔటర్‌పై ట్రాలీని ఢీకొన్న కారు



గాయపడిన కనిష్కరెడ్డి

మలక్‌పేట: ఓఆర్ఆర్‌పై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మూసారంబాగ్ మాజీ కార్పొరేటర్ తీగల సునరితా అజిత్‌రెడ్డి పెద్ద కుమారుడు కనిష్కరెడ్డి(19) దుర్మరణం పాలయ్యాడు. కనిష్క రెడ్డి మేడ్చల్ టెక్ మహీంద్ర యూనివర్సిటీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం రాత్రి అతను జూబ్లీహిల్స్‌లోని స్నేహితుడి ఇంట్లో ఫంక్షన్‌కు హాజరై బెంజ్ కారులో తుక్కుగూడలోని ఇంటికి తిరిగి వెళుతుండగా ఔటర్ రింగ్‌రోడ్డుపై గొల్లపల్లె కలాన్ వద్ద కారు ముందు వెళుతున్న ట్రాలీని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో కనిష్క రెడ్డి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న శంషాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు అతడిని మెరుగైన చికిత్స నిమిత్తం మలక్‌పేట యశోద ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్‌లోని స్వగృహానికి తీసుకొచ్చారు.

రెండు నిమిషాల్లో ఇంట్లో ఉంటా అన్నాడు..

ఆలస్యమైంది ఎక్కడ ఉన్నావ్ అని ఫోన్ చేయగా.. రెండు నిమిషాల్లో ఇంట్లో ఉంటానని చెప్పాడని, అంతలోనే ఘోరం జరిగిపోయిందని అతడి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. కనిష్కరెడ్డి మృతితో సలీంనగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ప్రముఖుల పరామర్శ...

కనిష్కరెడ్డి మరణ వార్త తెలియడంతో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు కనిష్క రెడ్డి మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అజిత్‌రెడ్డి, సునరితారెడ్డిలను ఓదార్చి ధైర్యం చెప్పారు. మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు అహ్మద్ బలాల, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పలువురు కార్పొరేటర్లు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శుక్రవారం సాయంత్రం నాగోల్ ఫతుల్లాగూడ మహాప్రస్థానం హిందూ శ్మశాన వాటికలో కనిష్కరెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు.

మీ ఆప్తుల అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి, జయంతిల ప్రకటనల కోసం సంప్రదించండి.
Ph: 040-23256000 Ext: 6344, 9912220352

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

LAND FOR SALE
Rs. 5600 గజం (200+200) 400 గజాల ప్లాటు అమ్మబడును @ మన్‌సాన్‌పల్లి క్రాస్ రోడ్, ఇండ్లకు దగ్గర DTCP ఫైనల్ అప్రూవల్. 9966521191 [SCA25002034]
ఈ వారం లోపు స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకొంటే సాగర్ హైవే RRR దగ్గరలో గజం కేవలం 1999/- మాత్రమే. @ 9030405854 [HA-09464]

LEASE / RENT
House for RENT 2BHK 1000sft, 1st floor, car parking no, Satyanarayana Nagar colony pillar no : 83, Ph:9246294696 [SCA25002036]

PLOT FOR SALE
మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు 1 లక్షకే 121 చ॥గజాల ప్లాటు నారాయణ ఖేడ్‌లో మామిడి, జామ, బత్తాయి మొక్కలతో EMI కలదు. 8500664291 [SCA25002040]
ఉగాది మరియు రంజాన్ స్పెషల్ ఆఫర్: 1+1 ప్రకాశం జిల్లా, అద్దంకిలో చ.గ. 2000/-కే ఎన్ని గజాలు కొంటే అన్ని గజాలు ఫ్రీ మరియు కరివేడు దగ్గర 22 సెంట్లు 96 ఎర్రచందనం మొక్కలతో 4,50,000/- మాత్రమే. ✆ 9206666666 [B-1270206]
KANDHUKUR, KADTHAL near 4th City, Farmacity DTCP, & Form Plots LP & RERA Aprvd Open Plots available. M: 9603345774 [HA-99988]

Services

BUSINESS SERVICE
మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800526]

BUSINESS OFFER
10 Lakhs, 15L, 25L, 30L, 50L, 1Crore & 2 Crore Chits 50M, 40M, 30M, 20M, 10months Available. Ph. 8464919899 [SCA25002033]

HOME NEEDS

PEST CONTROL
వాసనలేని మరకలు పడని ISI కెమికల్స్ 5 సం॥ వ్యారంటీతో చెదలు (బొద్దింకలు, నల్లులు, బల్లులు) నివారించే సంస్థ, హిందూస్తాన్ పెస్ట్ కంట్రోల్. సంప్ర: 7981533849, 9059989604 [HA-1202]

PLOT FOR SALE 150 Sq Yrds ₹ 75,000/- per Sq Yd West Facing 40 Ft Road # Road No.9 South End park colony, Mansoorabad, Hyderabad, 500074 Plot 2.5 KM From L B NAGAR ✆ 81210 56707

PERSONAL CARE

CHANGE OF NAME
I, D HARI SHANKER S/o. DOMALA VEERESHAM, R/o. H.No. 3-41, Gowdavelly Village, Medchal Mandal, Medchal-Malkajgiri District. Henceforth, I shall know as DOMALA HARI SHANKER. [H-1214128]
I, Yasmeen W/o, Syed Farooq Ahamed R/o Flat 502, 4-3-0337, Gh Plaza, Friends Colony Puppalguda, Manikonda have changed my name to Syed Yasmeen for all purposes. [DA-13464]
I, KAMTAM LALITHA@ B. LALITHA D/o RAMASWAMY BATHULA R/o. H.No : 1-2-209, PragathiNagar, Kothapet Uppal mandal, RangaReddy-500035 T.S. I Have Changed My Name as KAMTAM LALITHA W/o KAMTAM NARASIMHA Hereafter my Name is known as KAMTAM LALITHA W/o KAMTAM NARASIMHA [SCA25002032]

LOST
I, Rashmi Vithalrao Aakode D/o Vithalrao Aakode, R/o: Flat No. 2 1st Floor Baksh Residency Brindavan Colony Tolichowki. Lost My Cancelled Passport No. M5198441 While Travelling Tolichowki - Hi-tech city. If Anyone Find Call: 9405046692 [SCA25002042]

OLD AGE HOME
వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచానపడున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. 7981467036, 9391039990, 9949520296 [H-783368]

Wanted
పావని చికెన్ & మటన్ సెంటర్ హయత్ నగర్ నందు పనిచేయుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. జీతము ప్లస్ వసతి కలదు. Ph: 8247522969 [HA-1266460]
HYD- రియల్ ఎస్టేట్ Co.కై మార్కెటింగ్ Exe. కావలెను, కోకాపేట్, శంకర్‌పల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై జీ+కమీ+ 2వీలర్+రూం+భోజనం ఫ్రీ,age:34,నె.లక్ష రూ.ఫ్రెష్/Exp.7416396781 [HA-16497]

LAND FOR SALE NELLORE - CHENNAI HIGHWAY TADA SRI CITY ★ 23 Acres Residential Land in TADA Town ★ Suitable for Villas, Apartments & Open Plots Project ★ 2.5 cr per Acre 76 Acres Agriculture Paddy Land @ VARADAIAHPALEM 15 Lacks per Acre ✆ 80887 31995

నెట్‌వర్క్ లీడర్స్, LIC ఏజెంట్స్ కావలెను. కేవలం 1680/- ఒకసారి పెట్టుబడితో సొంత వ్యాపారం ప్రారంభించి 3K-30K సంపాదించండి. 9948208005 [SCA25002017]
శ్రీశ్రీశ్రీ హోటల్ ఖమ్మం నందు పని చేయుటకు సౌత్ ఇండియన్ మాస్టర్ (మీల్స్ + టిఫిన్స్) వెంటనే కావలెను. సంప్ర. సెల్ : 91216 20696. [SCA-25002028]
హైదరాబాద్‌లో ఇంట్లోనే ఉండి ఇంటి, వంట పనికి, పిల్లలను, పెద్దలను చూసుకొనుటకు ఆడవాళ్లు కావలెను. జీతం 18-30K. ఫోన్: 8019373131 [H-800524]
షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు వార్డ్ బాయ్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-15160]
Sales Executive, Telecaller, TVS Two Wheeler Mechanic @ MJ Motors Krishna plaza, Manikonda 8142816161, 8297613131 [SCA25001965]

FACULTY TEACHERS
Req. Teachers Academics: Principals, V.P's, PGT, TGT, Primary & KG For All Subjects, Non- Academic Librarian, Music & Dance Master, H.R, Sports Coaches, Drivers & Transport incharge. Walk in On 8th & 9th Mar. Sloka The School, Balapur X Road. Ph: 7071001222 [SCA25002024]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

		జోన్ సెంటర్స్	
దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

వీఐపీ ఇలాకా.. అంతా మహిళా అధికారులే..

ఒక వైపు ఇంటి బాధ్యతలు చక్కదిద్దుతూనే.. మరో వైపు ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు పురుషులకే పరిమితమైన పదవుల్లో ప్రస్తుతం మహిళలు కొనసాగుతున్నారు. అత్యుత్తమ సేవలు అందిస్తూ ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుంటున్నారు. పౌర సరఫరాల శాఖ ఖైరతాబాద్ సర్కిల్–07 అసిస్టెంట్ సివిల్ సప్లయ్ అధికారిణి జ్యోతి ఇటీవలే బాధ్యతలు చేపట్టారు. జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల పరిధిలోని 81 రేషన్ షాపుల నిర్వహణ బాధ్యతలను ఆమె సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఒక వైపు కుటుంబం, మరో వైపు ఉద్యోగాన్ని ఆమె ప్రణాళికాబద్ధంగా బ్యాలెన్స్ చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. జలమండలి, జీహెచ్ఎంసీ, రెవెన్యూ, విద్యుత్ తదితర ప్రధాన శాఖల్లో మహిళలు పెద్ద సంఖ్యలో విధులు నిర్వర్తిస్తున్నారు. ముఖ్యంగా ప్రముఖులు, వీవీఐపీలు, ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ముఖ్యమంత్రులు, నివసిస్తున్న ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో ఆయా శాఖల్లో మహిళామణులే పెద్ద పెద్ద పోస్టుల్లో ఉన్నారు. కొంత మంది తెల్లవారుజామునే క్షేత్రస్థాయి పర్యటనకు వస్తూ విధుల్లో నిమగ్నం అవుతున్నారు. మరికొంత మంది రాత్రి 9 గంటల వరకు విధుల్లో ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

– బంజారాహిల్స్

ఉన్నతాధికారుల ప్రశంసలు



చాలా మందికి వారు చదువుకున్న దానికి, చేసే ఉద్యోగానికి సంబంధం ఉండదు. కానీ నాకు మాత్రం నేను చదువుకున్న సైన్స్‌కు రిలేటెడ్‌గానే నేను ఎంటమాలజీ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తుండటం సంతోషంగా ఉంది. కాలనీలు, బస్తీల్లో ప్రజలు వైరల్ ఫీవర్స్ రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు వారికి అవగాహన కల్పించినప్పుడు స్పందన లభిస్తోంది. చేసిన పనికి మంచి ఫలితం వచ్చిన ప్రతీసారి ఉన్నతాధికారులు మమ్మల్ని అభినందిస్తుంటారు.

– రజిత, ఎంటమాలజీ అసిస్టెంట్, జూబ్లీహిల్స్



జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్18 కార్యాలయంలో మహిళా దినోత్సవం

పేద మహిళలకు సేవ చేసే అవకాశం



పేద మహిళలను ఆర్థికంగా ఉన్నత స్థితిలో చూస్తున్న ప్రతిసారి ఆనందంగా ఉంటుంది. చాలా మంది మహిళలు చదువుకు దూరమైనా పొదుపు గ్రూపుల ద్వారా వచ్చే రుణాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. పేద మహిళలకు సేవ చేసే అవకాశం రావడం గర్వకారణం. వారు సక్సెస్ అయిన ప్రతిసారి సంతోషంగా ఉంటుంది. స్ట్రీట్ వెండర్, ముద్రతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఎంతో మంది మహిళలను భాగస్వాములను చేస్తున్నాం.

– ఆషా విరానికా, డీపీవో, సర్కిల్–18

బాధతో వస్తారు.. సంతోషంతో వెళ్తారు



రెవెన్యూలో ఎన్నో సవాళ్లు

రెవెన్యూలో ఉద్యోగం అంటేనే సవాళ్లతో కూడుకున్నది. అందులోనూ వీవీఐపీలు ఉండే షేక్‌పేట మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించడం అంటే సాహసంతో కూడుకున్నది. అయినా.. నేను ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకే ప్రయత్నిస్తున్నాను. ప్రజలకు సేవ చేయాలన్నదే ప్రధాన లక్ష్యం.

– అనితారెడ్డి, తహసీల్దార్, షేక్‌పేట మండల



బంజారాహిల్స్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌కు నిత్యం 100 మందికిపైగా రకరకాల సమస్యలతో వస్తుంటారు. మేం వైద్యం చేసిన తర్వాత, ఇచ్చిన మందులు తీసుకొని సంతోషంగా వెళ్తుంటారు. వారి సమస్యలను తీర్చిన ప్రతీసారి చెప్పలేని ఆనందాన్ని పొందుతాను. పేద వారికి సర్వీస్ చేసే అవకాశం రావడం ఎంతో అదృష్టం. మందులు ఇవ్వడం, వైద్యం చేయడమే కాదు వారికి హెల్త్ ఎడ్యుకేషన్‌పై కూడా అవగాహన కల్పిస్తుంటాను

– గుంజాల వేదశ్రీ, డాక్టర్, బంజారాహిల్స్ అర్బన్ హెల్త్ సెంటర్

కష్టపడి పనిచేసే మహిళలకు గుర్తింపు



హార్డ్ వర్క్ చేసే మహిళలు, అధికారులకు ఎక్కడైనా మంచి గుర్తింపు వస్తుంది. నేను ఓల్డ్ సిటీలో ఎన్నో సవాళ్ల మధ్య పనిచేయాల్సి వచ్చింది. అధికారులతో పాటు ప్రజలు కూడా బాగా సహకరించారు. ఇంట్లో కుటుంబ సభ్యుల సహకారం కూడా చాలా బాగుంటుంది. ఎందుకంటే ఒక్కోసారి మేం ఉదయం ఇంటి నుంచి బయల్దేరితే ఏ రాత్రి కోగాని ఇంటికి వెళ్లలేని పరిస్థితి. అయినా మా ఇంట్లో వాళ్లు నన్ను బాగా అర్థం చేసుకుంటారు.

– షీలారాణి, డీజీఎం, బంజారాహిల్స్

కొన్నిసార్లు రాత్రి వరకు డ్యూటీలోనే..



ఒక వైపు ఇంటి బాధ్యతలు, మరో వైపు ఉద్యోగ బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది. ఉదయం 4.30 గంటలకే లేస్తాను. 6 గంటల దాకా యోగా, ప్రాణాయామం చేస్తాను. ఆ తర్వాత వంట మొదలు పెట్టి పిల్లలకు బాక్స్‌లు కట్టేసి నేను ఉద్యోగానికి బయల్దేరుతాను. రాత్రి కొన్నిసార్లు 8 గంటల వరకు డ్యూటీలో ఉండాల్సి ఉంటుంది. అటు పిల్లలు, ఇటు ఉద్యోగం, మరో వైపు సంసారం వీటన్నింటిని బ్యాలెన్సింగ్ చేసుకోవాల్సి ఉంటుంది.

– పవిత్ర, ఏఈ, టీజీఎస్‌పీడీసీఎల్ ఫిలింనగర్

తెల్లవారుజామునే రావాల్సి వస్తోంది



రోడ్లపైన చెత్త ఊడుస్తున్నారా లేదా..? సేకరించిన చెత్తను తరలిస్తున్నారా లేదా..? ఎక్కడైనా చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయా..? స్వీపర్లు హాజరవుతున్నారా లేదా ఇవన్నీ చూడాలంటే కొన్నిసార్లు తెల్లవారుజామునే ఫీల్డ్‌లో ఉండాల్సి వస్తోంది. ఉదయమే విధులకు హాజరవుతుంటాం. ఒక వైపు రోడ్లు, ఇంకో వైపు పన్నుల వసూళ్లు, మరో వైపు చెత్తా చెదారం తొలగింపు, పార్కుల సుందరీకరణ చేసుకుంటూనే ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తుంటాం.

– ప్రశాంతి, డీసీ, జీహెచ్ఎంసీ సర్కిల్–18

వైభవం.. శ్రీవారి పుష్పయాగం



జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవారి 5వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. 12 రోజుల నుంచి వైభవంగా జరిగిన ఉత్సవాలు ఆలయంలో నిర్వహించిన శ్రీవారి పుష్పయాగంతో ముగిసినట్లు అధికారులు తెలిపారు. పుష్పయాగం సందర్భంగా క్వింటాళ్ల కొద్దీ రంగురంగుల పుష్పాలతో శ్రీవారి ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. కనులపండువగా సాగిన ఈ వేడుకను తిలకించేందుకు నగర నలుమూలల నుంచి భక్తులు వందలాదిగా తరలివచ్చారు. గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది.

– బంజారాహిల్స్



మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా..

బంజారాహిల్స్: మహిళలు వ్యాపారవేత్తలుగా మరింత ఉన్నతంగా రాణించాలనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లతో పాటు ఇతర వ్యాపారాలను స్వయం సహాయక బృందాల సభ్యులు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లతో పాటు స్టిచింగ్ సెంటర్లు, కిరాణా దుకాణాలు కూడా ఏర్పాటు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో 845 స్వయం సహాయక గ్రూపులు ఉండగా 30 వరకు మహిళా సమాఖ్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే చాలామంది మహిళలు వ్యాపారాలు పెట్టుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు.



జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహిస్తున్న మహిళలు

కమిషనరేట్‌లో మహిళా దినోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో నగర పోలీసు కమిషనరేట్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు పోలీసు కమిషనర్(శాంతి భద్రతలు) విక్రమ్‌సింగ్ మాన్ కేట్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ ఐటీ ఉద్యోగి ఆత్మహత్య

వెంగళరావునగర్: మాజీ ఐటీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం స్థానికంగా నివాసం ఉంటున్న సంతోష్(35) గతంలో ఐటీ ఉద్యోగి. కొంతకాలం క్రితం భార్య నుంచి విడిపోయి శంషాబాద్‌లో పునరావాస కేంద్రంలో ఉంటున్నాడు. కార్మికనగర్‌లోని అతడి మామ కృష్ణమూర్తి ఇంటికి వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణమూర్తి పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో అంబులెన్స్ డ్రైవింగ్

బంజారాహిల్స్: మద్యం మత్తులో అంబులెన్స్ నడుపుతుండటంతో అంబులెన్స్‌ను సీజ్ చేసిన ఘటన పంజగుట్టలో చోటుచేసుకుంది. వివరాలు.. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా, పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోస్‌కిరణ్ ఆధ్వర్యంలో పంజగుట్ట చౌరస్తాలో శుక్రవారం అంబులెన్స్‌ల తనిఖీలు చేపట్టారు. హఫీజ్ అనే అంబులెన్స్ డ్రైవర్ మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డాడు. మద్యం మోతాదు 120గా నమోదు కాగా అంబులెన్స్‌ను సీజ్ చేశారు. మద్యం మత్తులో అంబులెన్స్ నడిపిస్తున్న హఫీజ్‌పై కేసు నమోదు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు కూడా ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

పంజగుట్ట: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపార్ట్‌మెంట్లలో రూ.10 లక్షలలోపు సివిల్ కాంట్రాక్ట్ పనులు చేసిన కాంట్రాక్టర్లకు వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని తెలంగాణ సివిల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో అసోసియేషన్ అధ్యక్షుడు దర్శనాల శంకరయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.కిషన్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుల మోహన్ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పటి నుంచి బిల్లులు చెల్లించడంలేదని రెండేళ్లుగా ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లినా ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం ఆరువేల మంది చిన్న కాంట్రాక్టర్లు ఉన్నారని, వారికి సుమారు రూ.500 కోట్లు విడుదల చేయాల్సి ఉందని అన్నారు. వెంటనే విడుదల చేయాలని, కుటుంబాల్ని పోషించుకోలేని దుస్థితి ఉందన్నారు. సమావేశంలో చాఫ్ అడ్వైజర్ కొప్పుల అజయ్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, పి.రాంచందర్, దుగ్గు మహేందర్, ఆనందరావు, బాలకృష్ణారావు, నరోత్తం రెండ్డి తదితరులు ఉన్నారు.

వినాయకనగర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీలో పర్వతాంజనేయస్వామి గుడి పక్కన దీన్‌దయాళ్‌నగర్ బస్తీకి వెళ్లే మార్గంలో ఇటీవల కొంతమంది కబ్జాదారులు ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఈ ఆక్రమణలపై మూడు రోజుల క్రితం స్థానికులు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకోవాలంటూ ఆయన షేక్‌పేట తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో తహసీల్దార్ అనితారెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది శుక్రవారం ఇక్కడ పర్యటించి ఆక్రమణలు గుర్తించి వాటిని నేలమట్టం చేశారు. ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

ట్రాన్స్‌జెండర్‌పై దాడిచేసిన నిందితుల అరెస్టు

పంజగుట్ట: ట్రాన్స్‌జెండర్‌ను వివస్త్రను చేసి రోడ్డుపై దాడిచేసి నగదు లాక్కున్న పలువురు ట్రాన్స్‌జెండర్లను పంజగుట్ట పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మూడు నెలలుగా ట్రాన్స్‌జెండర్లు శ్రీలీల అనే ట్రాన్స్‌జెండర్ వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. గురువారం రాత్రి శ్రీలీల పంజగుట్ట కూడలిలో ఉండగా అంకిత నాయుడు, సిమ్రాన్ సభ్యులైన ట్రాన్స్‌జెండర్లు డింపుల్, అశ్విని, సాయి, హంస, చైత్ర, లిల్లీ, సహస్ర దాడిచేశారు. వివస్త్రను చేసి రూ.2,500 నగదు లాక్కున్నారు. శ్రీలీల ఫిర్యాదుతో అశ్విని, డింపుల్, హంస, లిల్లిలను అదుపులోకి తీసుకున్న పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

సమస్యలుంటే చెప్పండి



జలమండలి ఎండీతో సంఘం ప్రతినిధులు

బంజారాహిల్స్: క్షేత్రస్థాయిలో మురుగు వ్యర్థాలు తొలగించే సిల్ట్ కార్మికులు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే సంబంధిత అధికారితో పాటు తమ దృష్టికి తీసుకురావాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సూచించారు. సిల్ట్ వెహికిల్ కార్మికులు, వాహన యజమానులు శుక్రవారం ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా 90 రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో డి–సిల్టింగ్‌తో పాటు వాటి తరలింపు వివరాలను కార్మికులను అడిగి ఆయన తెలుసుకున్నారు. యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రామ్ చందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయికుమార్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, కోశాధికారి సిద్దు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాటం

లిబర్టీ: ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో మహిళలు ఇంకా వెనుకబడి ఉన్నారని ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా శక్తి విభాగం రాష్ట్ర నాయకురాలు యమునాగౌడ్, సుధారాణి అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా మహిళలపై ఆర్థిక దోపిడీ, లైంగిక వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు.

మహిళలకు ఆరోగ్య యోగం

బంజారాహిల్స్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, యూజీసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఫిట్ ఇండియాలో మహిళల క్రీడా వారోత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, అరుణ యోగా శిక్షణ, పరిశోధన సంస్థ సంయుక్తంగా యోగ శుక్రవారం నిర్వహించారు. విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ పుష్పాచక్రపాణి, డాక్టర్ ఎస్.రజనీ, విశ్వవిద్యాలయ మహిళా విభాగ ఇన్‌చార్జి డైరెక్టర్ మేరీ సునంద, డాక్టర్ శ్రీదేవి, రజనీ, ప్రమీలాకేతావత్, మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తాం

– మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: అంతర్జాతీయ స్థాయి బ్రాండెడ్ సంస్థలు తమ కార్యకలాపాలను నగరంలో కొనసాగించేందుకు ముందుకు వస్తుండటం సంతోషంగా ఉందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్‌లో ఉడ్‌ల్యాండ్ సంస్థ కార్యకలాపాలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరానికి నిత్యం వస్తున్న విదేశీ టూరిస్టులు వారి అవసరాలకు అనుగుణంగా ఆహారం విషయంలో, వస్తువుల విషయంలో ప్రపంచంలోనే ఏ దేశంలో దొరికేవైనా ఇక్కడ లభిస్తుండటం గొప్ప విషయం అన్నారు. ప్రభుత్వ నుంచి వారికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా ఏజీఎం లీలా ప్రసాద్, విష్ణు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్–17లో మహిళా దినోత్సవాలు



బంజారాహిల్స్: మహిళా గ్రూపులు స్వశక్తితో ఎదిగి స్వయం ఉపాధికి బాటలు వేసుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 డీసీ రజనీకాంత్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా గ్రూపు సభ్యులతో కలిసి ఆయన కేక్ కట్ చేసిన అనంతరం సంబరాలు జరుపుకున్నారు. సర్కిల్ పరిధి కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో 7,000 పైచిలుకు మహిళా గ్రూపులు ఉన్నాయని, 40 సమాఖ్యలు ఉన్నాయన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు కూడా ఏర్పాటుచేసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. రుణాలు సక్రమంగా చెల్లించి కొత్త రుణాలు తీసుకుంటూ మహిళలు కోటీశ్వర్లు కావడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సర్కిల్–17 యూసీడీ డీపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలు అభివృద్ధి చెందితేనే.. దేశాభివృద్ధి



పంజగుట్ట: మహిళలు లేనిదే సమాజం లేదని, మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని, మహిళల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఎర్రమంజిల్‌లోని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో సంఘం ప్రధాన కార్యదర్శి డి.రమ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సమాజంలో సగభాగానికి పైగా ఉన్న మహిళలు అన్నిరంగాల్లో సమాన వాటా కావాలని అందరూ ఐక్యంగా పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్, మహిళా నాయకురాళ్లు మంజులత, జ్యోతి శిలం, అనూరాధ, శైలజ, విజయలక్ష్మి, షమీం, సుల్తానా, స్వాతి, సీతారాములు, శ్రీనివాస్, నాయకోటి రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారు

రహమత్‌నగర్: ప్రోత్సహిస్తే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారని ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా కానిస్టేబుళ్లను ఆయన శుక్రవారం సన్మానించారు.





సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

ఈ సృష్టిలో శక్తి మంతమైనవి రెండే అంశాలున్నాయి.. అందులో ఒకటి ప్రకృతి, మరొకటి మగువ అని ఆనాడే ఓ ప్రఖ్యాత రచయిత చెప్పాడు. సమాజమంతా మహిళలను కీర్తిస్తూ.. మహిళా సాధికారత అంటూ గొంతెత్తుతున్నప్పటికీ.. తమ గౌరవాన్ని, గొప్పతనాన్ని కాపాడుకోడానికి ఆ తల్లులు నిరంతరం శ్రమిస్తూనే ఉన్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో పలువురి స్ఫూర్తి దాయక మహిళల ఇతివృత్తాలను తెలుసుకుందాం..

-సాక్షి, సిటీబ్యూరో

తాను నిలబడుతూ.. నలుగురినీ నిలబెడుతూ

పలు రంగాల్లో రాణిస్తూ ఉన్నతమైన గుర్తింపు

సమాజ సేవలో తమ వంతు భాగస్వామ్యం ఇస్తూ

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం


అతిరథులు ఈ అతివలు..

సాహిత్యం.. సావాసం..

తన ప్రయాణమంతా సాహిత్యంతోనే.. తన మనసంతా ప్రకృతిమయం. గొప్ప గొప్ప విషయాలు ఎక్కడో ఉండవు.. కాస్త తరచి చూస్తే మనచుట్టూనే, మన మధ్యే ఉంటాయంటారు ప్రముఖ రచయిత స్వర్ణ కిలారి. సామాజిక ఇతివృత్తాలతో పలు ప్రభావ వంతమైన కథలు, రచనలు, అనువాదం చేసిన స్వర్ణ కిలారి.. మహిళల ట్రావెలింగ్ అనుభవాలతో ఇంతియానం అనే పుస్తకానికి సంపాదకీయం రాశారు. విశ్వవ్యాప్త ప్రయాణాలు చేసిన మగువలు.. విభిన్న అంశాల పై వారి అనుభవాలు, ఆలోచనలకు అక్షరరూపం తీసుకొచ్చారు. మరికొద్ది రోజుల్లో ఇంతియానం 2.0 సైతం రాబోతోంది. ఈ నేపథ్యంలో తన స్ఫూర్తివంతమైన ఆలోచనలు ఆమె మాటల్లోనే..

ది షూటింగ్ స్టార్ స్ఫూర్తితో..





రచనలన్నా, సాహిత్యమన్నా నాకెంతో ఇష్టం. ఇందులో భాగంగానే నాకు బాగా నచ్చిన కొన్ని పుస్తకాలను తెలుగులోకి అనువాదం చేశాను. ఇందులో కేరళకు చెందిన బాల మేధావి క్లింట్ బయోగ్రఫీ లిప్తకాలపు స్వప్నం, ది గోట్ లైఫ్ అనే ప్రముఖ రచనను మేక బతుకు పేరుతో తెలుగులోకి అనువాదం చేశాను. వ్యక్తిగతంగా నల్ల బంగారం, 13 వంటి రచనలు చేశాను. ఒక రచన కోసం నార్త్ థాయ్‌లాండ్ వెళ్లిన సమయంలో.. ఉన్న కొద్ది ఆస్తిని అమ్మి ప్రపంచ యాత్ర చేసిన అమ్మాయి నవ్య నాథ్ రాసిన ది షూటింగ్ స్టార్ బుక్ చదివి ఆశ్చర్యపోయాను. ఇలా మన తెలుగువారి ట్రావెలాగ్స్‌తో మంచి పుస్తకం తీసుకురావాలని అప్పుడే నిర్ణయించుకుని పని ప్రారంభించాను. ఇందులో భాగంగా మన తెలుగు మహిళలు చేసిన అద్భుత ప్రయాణాలు, అనుభవాలు చూసి స్ఫూర్తిని పొందాను. ఇందులో ఒంటరిగా ప్రయాణాలు చేసిన వారు ఎందరో ఉన్నారు. ఇంటి నుంచి బయటకి వచ్చి ఉద్యోగాలు చేయడమే గగనమైన తరుణంలో స్థానిక ఆదిలాబాద్, కాకినాడ అడవులు మొదలు.. విదేశాల్లోని దండకారణ్యాలు, నగరాలు, సంస్కృతులు ఎన్నెన్నో వింతలు, విశేషాలను ఆస్వాదించిన మహిళ ప్రయాణ కథలు నాకు జీవితకాల సంతృప్తినిచ్చాయి. ఇలా 45 మంది కథలతో మొదటి పుస్తకం ముద్రించాను. ప్రస్తుతం మరో 55 మంది వనితల ప్రయాణ కథలతో ఇంతియానం 2.0ను తీసుకురానున్నాను. ఆడవారి ట్రావెలాగ్ వినూత్నంగా, విభిన్నంగా ఉంటుంది. వారు చూసే కోణం, ఆస్వాదించే విధానం కాస్త భిన్నంగా ఉంటుంది. ఉమెన్ ట్రావెలింగ్ అంత సులభం కూడా కాదు. సామాజికంగా, శారీరకంగా, మానసికంగా పలు అంశాలు సహకరించవు. ఈ సారి మహిళల సోలో కథలతో పాటు తల్లీ కూతుళ్ల వంటి వైవిధ్యాలున్నాయి. వ్యక్తిగతంగా నేను మెక్సికో, బాలి, శ్రీలంక, అమెరికా, భూటాన్ వంటి దేశాలు ప్రయాణించాను. నా రచన 13 కోసం ఉత్తర థాయిలాండ్ వెళ్లి అక్కడ చియాంగ్ రాయ్ గుహలో చిక్కుకున్న 13 మంది పిల్లల నిజ జీవిత కథను, వ్యథను రాశాను. భవిష్యత్తులో మరిన్ని రచనలు చేయాలనుంది.

– స్వర్ణ కిలారి, ప్రముఖ రచయిత్రి, హైదరాబాద్

వైకల్యాన్ని జయించి..



తానోక దివ్యాంగురాలు.. చిన్నప్పటి నుంచి అందరిలానే తానూ వివక్షకు గురైంది. ముందే దివ్యాంగురాలివి, అందులోనూ అమ్మాయివి.. నువ్వేం చేయగలవు, నీ వల్ల ఏమీ కాదు అనే మాటల తూటాలు ఆమె మనసును విచ్ఛిన్నం చేశాయి. ఎలాగైనా తనను తాను నిరూపించుకోవాలి, ఎవరి, జాలి, సహాయంపైన ఆధార పడకూడదని నిశ్చయించుకుని ఇంటిని వదిలి హైదరాబాద్ నగరానికి చేరుకుంది. సంపూర్ణంగా తన పనులు తాను చేసుకోలేకపోయినా, అందరిలా నడవలేకపోయినా.. కుంగిపోకుండా కంప్యూటర్ వర్క్ నేర్చుకుని, డీటీపీ వర్క్ చేసి తన ఖర్చుల వరకూ సంపాదించుకునేది. తానే కాదు తనలాంటి మరికొందరికి ఆశ్రయం ఇవ్వాలని 'ఆద్య నిలయం ట్రస్ట్' ఏర్పాటు చేసి మరి కొందరు మహిళా దివ్యాంగులకు ఉచితంగా ఆశ్రయం, ఆహారం, వసతులను అందిస్తోంది. ఈ క్రమంలో తమకు కూడా మగతోడు ఉంటే బాగుంటుంది.. వైకల్యం దేహానికే కానీ మనసుకు కాదు. అందరిలాగే తమకు కూడా అనుభూతులు, కోరికలు, ఇష్టాలు ఉంటాయని.. మిత్రుల సూచనతో మరో దివ్యాంగ వ్యక్తిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంది. అలా తను సతీష్ అనే దివ్యాంగుడిని పెళ్లి చేసుకోవడమే కాకుండా తనలాంటి మరికొందరికి పెళ్లిల్లు చేయిస్తోంది.







మరికొందరికి బాసటగా..

దివ్యాంగులకు మొదటి వివక్ష వారి కుటుంబాల నుంచే మొదలవుతుంది. నువ్వేం చేయలేవు.. జీవితాంతం వారు పెట్టింది తింటూ ఇంట్లో ఓ మూలన కూర్చో అనే సందర్భాలే ఎక్కువ. ఇలాంటి తరుణంలో మా ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ, మా కష్టంతో ముందుకు సాగుతున్నాం. ఇలా మరికొందరు దివ్యాంగులకు ఆశ్రయం ఇస్తూ ఒక కుటుంబంగా బతుకుతున్నాం. మా ప్రయాణంలో ఆర్థికంగా, సామాజికంగా, మానసికంగా తోడ్పాటును అందించిన వారు ఎందరో ఉన్నారు. నా పెళ్లిని సర్వ్ నీడి అనే స్వచ్ఛంద సంస్థ జరిపించింది. నా మొదటి పెళ్లి రోజు సందర్భంగా ఆత్మీయుల్లో ఒకరు డబ్బులు ఇచ్చి పార్టీ చేసుకోమన్నారు. ఆ డబ్బుతో నేను మరికొందరు దివ్యాంగుల జంటలకు పెళ్లి పరిచయ వేదిక ఏర్పాటు చేశాను. ఇప్పటి వరకూ ఐదు జంటలకు చేశాను. మరికొన్ని చేసే ప్రయత్నంలో ఉన్నాను.

– క్రిష్ణప్రియ, ఆద్య నిలయం ట్రస్ట్, హైదరాబాద్

సంప్రదాయ నగలంటే ఇష్టం..

సినీ నటి నమ్రతా శిరోద్కర్



బంజారాహిల్స్: తనకు సంప్రదాయ నగలంటే ఎంతో ఇష్టమని, కానీ అప్పుడప్పుడూ అవసరానికి తగినట్లు మోడ్రన్ నగలు కూడా ధరిస్తుంటానని ప్రముఖ నటి, మహేష్‌బాబు సతీమణి నమ్రతా శిరోద్కర్ అన్నారు. జూబ్లీహిల్స్ క్లబ్‌లో సిద్ధార్థ ఫైన్ జ్యువెలర్స్ ఆధ్వర్యంలో ఉమెన్స్‌డే సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డైమండ్ జ్యువెలరీ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. సిద్ధార్థ్ ఫైన్ జ్యువెలర్స్ డిజైనర్ నాగిని ప్రసాద్ వేమూరి రూపొందించిన భిన్న రకాల కలెక్షన్‌ను ఆమె పరిశీలించారు. వెడ్డింగ్ కలెక్షన్‌తో పాటు ఫెస్టివల్ కలెక్షన్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రెండు రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని నిర్వాహకులు కృష్ణ ప్రసాద్ వేమూరి తెలిపారు.

వనితా బ్యాంక్

సుందర్‌నగర్‌లో మహిళా బ్రాంచ్‌గా ముద్ర

యూనియన్ బ్యాంక్‌లో నూరు శాతం మహిళా ఉద్యోగులు

సనత్‌నగర్: ఇంటిని అందంగా తీర్చిదిద్దడమే కాదు.. కుటుంబాన్ని నడిపించడంలోనూ మహిళల పాత్ర ఎనలేనిది. ఓ వైపు ఇంటి బాధ్యతలను నెరవేరుస్తూ.. మరోవైపు ఉద్యోగ విధులను బాధ్యతాయుతంగా చేపడుతున్న మహిళలు కోకొల్లలు. అయితే అందరి ఆర్థిక అవసరాలు తీర్చే బ్యాంకింగ్ రంగంలోనూ మహిళలు కీలకంగా వ్యవహరిస్తున్నారు. అయితే నగరంలోని సుందర్‌నగర్ బ్రాంచ్‌లో మాత్రం నూటికి నూరు శాతం మహిళా ఉద్యోగులే ఖాతాదారులకు సేవలందిస్తున్నారు. క్యాషియర్ దగ్గర నుంచి మేనేజర్ వరకూ అందరూ మహిళామణులే విధులు నిర్వహిస్తుండడంతో దీనికి లేడీస్ బ్యాంక్‌గా ముద్ర పడింది. 2023 డిసెంబర్‌లో మేనేజర్‌గా సునీత బాధ్యతలు స్వీకరించిన అనంతరం అన్ని పోస్టుల్లోనూ మహిళలే భర్తీ అయ్యారు. ప్రస్తుతం ఈ బ్యాంకులో రమ్య, శృతి, సృజన, లక్ష్మీ, జ్యోతిర్మయి, ధీరజ తదితర మహిళా ఉద్యోగులు వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తూ.. ఖాతాదారులకు ఎంతో ఓపిగ్గా సేవలందిస్తున్నారు.



మహిమాన్వితం

మనం జీవించి ఉన్నాం, జీవిస్తున్నాం.. అంటే అనుక్షణం ప్రకృతి నుంచి తీసుకుంటూనే ఉన్నామని అర్థం. మనం తీసుకున్నంత తిరిగి ఇవ్వాలని ప్రకృతి కోరుకోదు. విధ్వంసం చేయకపోతే చాలనుకుంటుంది. ప్రకృతి తనను తాను స్వస్థత పరుచుకుంటుంది. కానీ ఆ సమయం కూడా ఇవ్వనంత వేగంగా కాలుష్యభరితం చేస్తున్నాం. ప్రకృతిని పరిరక్షిస్తూ సాగిన మన భారతీయ జీవనశైలిని మర్చిపోయాం. మనం మరిచిపోయిన ఆరోగ్యకరమైన జీవనశైలిని గుర్తు చేయాలి, ఆచరణలోకి తెచ్చే వరకూ చైతన్యవంతం చేస్తూనే ఉండాలనే ఉద్దేశంతో పదిహేనేళ్లుగా గ్రీన్ వారియర్‌గా మారారు సూర్యకళ మోటూరి. జీవనశైలి మార్పు ఇంటి నుంచే మొదలవ్వాలని, అది మహిళ నుంచే ప్రారంభం కావాలని, అందుకోసం ఆమె మహిళలను చైతన్యవంతం చేయడానికి పూనుకున్నారు. గ్రామభారతి అధ్యక్షబాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏకైక మహిళ సూర్యకళ మహిళాదినోత్సవం సందర్భంగా సాక్షితో పంచుకున్న వివరాలివి. - సాక్షి, సిటీబ్యూరో



హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన సూర్యకళ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌లో పీజీ చేసి నగరంలోని ఓ ఎమ్ఎన్‌సీలో ఉద్యోగం చేస్తున్నారు. జాతీయోద్యమ నాయకుల జీవితగాథలను చదివినప్పుడు ఆ కాలంలో పుట్టనందుకు ఆవేదన చెందేవారామె. రాజీవ్ దీక్షిత్ కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు.. 'దేశం కోసం పని చేయడానికి ఎప్పుడూ ఏదో ఒక సామాజిక అవసరం ఉండనే ఉంటుంది. దానిని తెలుసుకుని పని చేయాలి' అనే ఆలోచన రేకెత్తింది. సుభాష్ పాలేకర్ శిక్షణలో వాలంటీర్‌గా పని చేసినప్పుడు జరిగిన సంఘటన ఆమెను ఆర్గానిక్ ఫార్మింగ్ వైపు మళ్లించింది. అక్కడికి వచ్చిన ఒక మహిళారైతు ఇచ్చిన కందిపప్పును ఇంటికి తెచ్చుకుని వండుకున్నారు. ఆ రుచి అమృతంలా అనిపించిందన్నారు సూర్యకళ. ప్రతి ఒక్కరూ అలాంటి ఆహారాన్ని తినాలని కోరుకున్నారు. సేంద్రియ వ్యవసాయం, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ విభాగాల్లో పని చేయసాగారు. 'శిక్షణా తరగతులు నిర్వహించి సేంద్రియ వ్యవసాయంపై 'మా గ్రామభారతి స్వచ్ఛంద సంస్థ' విజయవంతమైంది. కానీ ఆ ఉత్పత్తులకు మార్కెట్ లేకపోతే ఆ రైతు నిలదొక్కుకునేదెలా అనే ప్రశ్నకు సమాధానంగా ఒక వేదికను రూపొందించాను. ఆర్గానిక్ ఫుడ్ విషయంలో అవగాహన కల్పించడంలో మీడియా చాలా బాగా పని చేస్తోంది. చైతన్యం వచ్చింది కానీ ఉత్పత్తులు అందుబాటులో లేవు. దాంతో 'మూలసంత' పేరుతో వాటిని నగరానికి తీసుకొచ్చే బాధ్యత చేపట్టాను. కార్పొరేట్ కంపెనీల్లో మూలసంతలు పెడుతున్నాం. ఇటీవల ఇన్ఫోసిస్‌లో 30 స్టాళ్లతో సంత పెట్టాం. మహిళలను సంఘటిత పరిచి ఆర్గానిక్ ఉత్పత్తులను వారి వంటింటి వరకూ తీసుకెళ్లేలా చేయగలిగాం. నీటి వృథాను అరికట్టడం వంటి విషయాల్లో ఆలోచన రేకెత్తించడం నుంచి పెళ్లి, ఇతర వేడుకల్లో పర్యావరణ హితమైన వేదికల ఏర్పాటు వరకూ కృషి చేశాం. పదిహేనేళ్ల నా ప్రస్థానంలో ఏమి సాధించానని చూసుకుంటే మనవేడుకలు కనిపిస్తాయి. ఆహ్వాన పత్రికలు, రిటర్న్ గిఫ్టులు, భోజనం వడ్డించే ప్లేట్ల వరకూ ప్రతిదీ బయోడీగ్రేడబుల్ థీమ్‌ని అనుసరిస్తున్నారు. మా ప్రయత్నం ఏ మాత్రం వృథా కాలేదు. ఒక మంచి బాట వేయగలిగాం' అన్నారు సూర్యకళ.



> చోదకశక్తి మనమే!
>
> ఇంటిని నడిపేది మహిళే. ఇంట్లోకి వచ్చే ఏ వస్తువూ ప్రకృతికి హానికలిగించేదిగా ఉండకూడదు.. అనే నియమాన్ని మహిళలు పాటిస్తే చాలు. ప్రకృతిని కాపాడుకోడం కోసం మేము వేదికల మీద మాట్లాడితే ఆ ప్రయత్నం చైతన్యవంతం వరకే పరిమితం. ఆచరణ ఇంటి నుంచే మొదలు కావాలి, అది మహిళతోనే మొదలు కావాలి. అందుకే సమాజహితమైన ఏ పని అయినా మహిళల నుంచి మొదలైతే అది విజయవంతమవుతుంది. మన పిల్లల భవిష్యత్తు కోసం నిధులు, పొలాలు సమకూరుస్తుంటాం. అంతకంటే ముఖ్యమైన పని పిల్లలకు ఆరోగ్యకరమైన భూమిని అందించడం. మహిని రక్షించే మహిమాన్వితమైన శక్తి మహిళకే ఉంది. మహిళలుగా మనం చేయాల్సిన సమాజసేవ, దేశసేవ ఇది.
>
> – సూర్యకళ మోటూరి, గ్రీన్ వారియర్, అధ్యక్షురాలు, గ్రామభారతి

కిక్స్‌లో.. నైషా నైపుణ్యం..

* బాక్సింగ్‌స్టార్‌గా ఎదిగిన నగర బాలిక
* 17ఏళ్లకే అద్భుతమైన విజయాలు



సాక్షి, సిటీబ్యూరో : కిక్ బాక్సింగ్ క్రీడలో జాతీయ అంతర్జాతీయ వేదికలపై మెరిసింది. తెలంగాణ కిక్ బాక్సింగ్ పుస్తకంలో తన కంటూ ఒక పేజీ లిఖించింది నైషా బజాజ్. 'ఫిట్‌నెస్ రంగంలో ఉన్న మా అమ్మకి మార్షల్ ఆర్ట్స్ హాబీ. ఆమెతో ఏడేళ్ల వయసులో సరదాగా కలిసి ప్రాక్టీస్ చేశా. అదే ఇప్పుడు నా లైఫ్‌గా మారింది' అంటూ చెప్పింది పంజాగుట్టలో నివసించే టీనేజర్ నైషా.

విజయాలెన్నో..

నగరం నుంచి వేళ్ల మీద లెక్కబెట్టగలిగే సంఖ్యలో కూడా కనబడని మహిళల కిక్‌బాక్సింగ్‌లో 2014లో నైషా పూర్తి స్థాయిలో ప్రవేశించిందని చెప్పొచ్చు. అప్పటి నుంచి రాష్ట్రంలోని అగ్రశ్రేణి మహిళా యోధుల్లో ఒకరిగా రాణిస్తోంది. ఆమె సాధించిన విజయాల్లో ఇండియన్ ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్ (2022, 2024, 2025), నేషనల్ కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ (2024, గోవా), ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్‌బాక్సింగ్ లీగ్ (2024, హైదరాబాద్) తెలంగాణ స్టేట్ ఛాంపియన్‌షిప్‌లలో బంగారు పతకాలు.. సాధించింది. గత అక్టోబర్‌లో ఫ్రాక్చర్‌కు శస్త్రచికిత్స చేయించుకుని వెనువెంటనే 2025 ప్రారంభంలోనే తిరిగి బంగారు పతకాలను సాధించడం ఆమె పోరాట పటిమకు నిదర్శనం.

కఠినమే కానీ..



అమ్మాయిలు క్రీడల్లో రాణించడం ఇప్పుడు సాధారణమే కావచ్చు కానీ.. కిక్ బాక్సింగ్ క్రీడలో మాత్రం ఇప్పటికీ విశేషమే. 'చిన్న వయసులోనే నాలో ఉన్న ఆసక్తిని అమ్మ గమనించి మార్షల్ ఆర్ట్స్ వైపు ప్రోత్సహించింది' అంటూ గుర్తు చేసుకుంది నైషా. తొలుత తైక్వాండోతో తన మార్షల్ ఆర్ట్స్ ప్రయాణాన్ని ప్రారంభించానని, ఆ తర్వాత కిక్ బాక్సింగ్‌లోకి మారానని వివరించింది. ఇది కఠినమైన క్రీడే అయినప్పటికీ.. ఇలాంటి యుద్ధకళల్లో మహిళలు రాణించాల్సిన సమయం వచ్చిందంటోంది నైషా. బయటకు వెళ్లి ఎన్నో రంగాల్లో తమని తాము నిరూపించుకోవాలని తపిస్తున్న మహిళలు.. మార్షల్ ఆర్ట్స్ ద్వారా తమని తాము రక్షించుకోగలుగుతారని అంటోంది.

తనయ నడిచే.. తండ్రిని గెలిపించే

ఆధునిక మహిళల విజయాలు వ్యక్తిగతానికి మాత్రమే పరిమితం కావడం లేదు. తమ పిల్లల నుంచి పేరెంట్స్ వరకూ సక్సెస్ ఫుల్ అనిపించుకునేలా కూడా చేస్తున్నాయి. అలాంటి ఓ యువతి.. కృష్ణా రామా అనుకుంటూ కూర్చోవాలి అని సమాజం నిర్దేశించిన వయసులో ఉన్న తండ్రిని యువకులతో సమానంగా ట్రెక్కింగ్‌లో రాణించేలా తీర్చిదిద్దింది.

- సాక్షి, సిటీబ్యూరో



రిటైర్మెంట్ తర్వాత శ్రమ పడకూడదని తల్లిదండ్రులను ఇంటి దగ్గరే ఉంచి ఇల్లు, నౌకర్లు, కారు వగైరా సౌకర్యాలన్నీ అమర్చి జాగ్రత్తగా చూసుకునే కూతుళ్లు, కొడుకులను చూసి ఉంటాం. కానీ 60 ఏళ్ల వయసులో తండ్రిని కొండలు, గుట్టలు ఎక్కించి వేల కిలోమీటర్లు తనతోపాటు నడిపించిన కూతుర్ని చూశామా? అంటే.. 'మా అమ్మాయే నా చేత తొలి అడుగులు వేయించింది..' అంటూ సంతోషంగా చెబుతారు ఆమె తండ్రి ఏబీఆర్‌పీ రెడ్డి. కొండాపూర్‌లో నివసించే సింధు రెగ్యులర్‌గా కొండలు, గుట్టలు ఎక్కేసే సిటీ ట్రెక్కింగ్ లవర్స్‌లో ఒకరు. వ్యాపార వ్యవహారాల నుంచి విశ్రాంతికి షిఫ్ట్ అయిన వెంటనే తన ట్రెక్కింగ్ హాబీని తండ్రికి వారసత్వంగా అందించారు. తద్వారా ఓ మంచి ట్రెక్కర్‌గా మారేందుకు మాత్రమే కాదు 73 ఏళ్ల వయసులో రికార్డ్స్ సృష్టించేందుకు కూడా దోహదపడ్డారు. మార్కెటింగ్ రంగంలో ఉన్న సింధు ఇప్పటి వరకూ ఎనిమిది చెప్పుకోదగ్గ సాహసవంతమైన ట్రెక్స్‌ని పూర్తి చేశారు. సింధు ఇటు ఆటలు, అటు సాహసాలతో ఆత్మ సంతృప్తికే ప్రాధాన్యత ఇస్తూ.. విలాసాల వెనుక పరుగులు తీసేవారికి ఓ గుణపాఠంలా నిలుస్తున్నారు.

మైండ్‌సెట్‌లోనే అంతా ఉంది..



'వయసు అనేది ఒక నెంబర్ మాత్రమే అంతా మైండ్‌సెట్‌లోనే ఉంది అని నేను నమ్ముతాను' అంటారు సింధు. అందుకే అరవైలో ఉన్న తండ్రిని సైతం తనతో పాటు సాహస యాత్రలవైపు నడిపించారు. 'నాన్న మొదటి నుంచీ చాలా ఫిట్‌గా ఉంటారు. బిజినెస్ నుంచి ఫ్రీ కాగానే జిమ్‌లో చేరడమే కాకుండా నాతో పాటు ట్రెక్‌కి రమ్మని ప్రోత్సహించాను' అంటూ గుర్తు చేసుకున్నారు.. తాను 23 ఏళ్ల వయసులో ట్రెక్కింగ్ ప్రారంభించిన సింధు.. రన్నింగ్, సైక్లింగ్ ఇలా ప్రతి హాబీనీ తండ్రితో కలిసి పంచుకున్నారు. 'నాన్నకు చిన్నప్పుడు సాహస యాత్రలు చేసే అలవాటు ఉండేది, అయితే వర్క్‌లో పడిపోయాక దాన్ని మరచిపోయారు. నేను దానిని మళ్లీ గుర్తు చేశా అంతే' అంటూ చెప్పారామె. గత డిసెంబర్‌లో తన తండ్రితో కలిసి చేసిన ట్రెక్.. ఎప్పటికీ మరచిపోలేనిదని అంటారామె. అప్పటి వరకూ ఒక్కసారి కూడా ట్రెక్కింగ్ అనుభవం లేని తండ్రి తొలిసారే ఉత్తరాఖండ్‌లో 12వేల కిమీ అధిరోహించి రికార్డ్ సృష్టించారు. అయితే నాన్న ఫిట్‌నెస్ గురించి నాకు తెలుసు. అలాగే ఎప్పుడైతే మా అడ్వెంచర్ గ్రూప్‌లో జాయిన్ చేశానో.. దాని నుంచి నాన్న కూడా బాగా ఇన్‌స్పైర్ అయ్యారు.' అంటూ వివరించారామె.

సాక్షి రియల్టీ
11
శనివారం 08-03-2025

International Womens Day



ఇంటిని చూసి ఇల్లాలిని చూడాలంటారు పెద్దలు. కానీ, ఇల్లే ఇల్లాలి పేరు మీద ఉండాలంటారు నిపుణులు! రెండూ నిజమే. మొదటి దాని గురించి చర్చ అవసరం లేకపోయినా.. రెండో దాని గురించి మాత్రం అవసరమే. ఎందుకంటే ఇంటి ఓనర్ లేదా కో–ఓనర్ మహిళ అయితే ఎన్నో ప్రయోజనాలున్నాయి గనక! గృహ రుణం నుంచి మొదలు పెడితే వడ్డీ రాయితీ, ఆదాయ పన్ను మినహాయింపు, స్టాంప్ డ్యూటీ తగ్గింపు.. ఇలా ఎనెన్నో ప్రయోజనాలున్నాయి. అందుకే తెలివైన గృహ కొనుగోలుదారుడు ఇంటిని భార్య, తల్లి లేకపోతే అక్క, చెల్లి మొత్తమ్మీద మహిళ పేరు మీద కొనుగోలు చేస్తారని నిపుణులు చెబుతున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



ఉమెన్ చాయిస్.. బ్యూటిఫుల్ హోమ్!

ఇంటి కొనుగోలులో మహిళల నిర్ణయానికి ప్రాధాన్యం

సాధారణంగా మహిళలు వంట గది విశాలంగా ఉండాలని కోరుకుంటారు. కానీ, నేటి అవసరాలు, అభిరుచులు మారుతుండటంతో ఆధునిక వసతులనూ కోరుకుంటున్నారు. జిమ్, మెడిటేషన్ వంటి సౌకర్యాలతో పాటు వాకింగ్, జాగింగ్ ట్రాక్స్, గ్రీనరీ స్పేస్, పిల్లల కోసం పార్క్, స్పోర్ట్స్ వంటి వసతులను ఎంచుకుంటున్నారని ఆర్క్ గ్రూప్ సీఈఓ మేఘన గుమ్మి తెలిపారు. గృహిణి, ఉద్యోగిని ఎవరైనా సరే ఇంటిని, కుటుంబ సభ్యుల బాగోగులను చూసుకునేది మహిళే. దీంతో ఇంట్లో ఏ గదికి ఎంత స్పేస్ అవసరమో నిర్ణయించగలదు. వాస్తవానికి పురుషుల కంటే మహిళలకే దృశ్యీకరణ (విజువలైజేషన్) శక్తి ఎక్కువగా ఉంటుంది. తాను ఉండబోయే కిచెన్, బెడ్ రూమ్, బాల్కనీ ఇంట్లోని ప్రతీది ఏ విధంగా ఉండబోతుందో ఊహించగలదు.

–సాక్షి, సిటీబ్యూరో

ఐదారేళ్ల క్రితం వరకూ రియల్ ఎస్టేట్ రంగంలో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉండేది. అయితే స్థిరాస్తి రంగంలో వృత్తి నైపుణ్యం, ఆదాయ వనరులు పెరగడం, వర్క్ కల్చర్ మారడంతో క్రమంగా ఈ విభాగంలో మహిళలు ప్రవేశిస్తున్నారు. అడ్మినిస్ట్రేషన్, హెచ్‌ఆర్, మార్కెటింగ్, సేల్స్ విభాగంలోనే కాదు సైట్ల మీద కూడా మహిళలు పనిచేసే స్థాయికి ఎదిగారు. దీంతో రియల్టీ సెక్టార్ అసంఘటిత రంగం నుంచి సంఘటిత రంగంగా అభివృద్ధి చెందుతుంది. ఐటీ, ఫార్మా వంటి రంగాల్లో మాదిరిగా రియల్టీ సెగ్మెంట్‌లోనూ వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి.

ఆమెకు నచ్చితేనే..

ఇల్లు కొందామని నిర్ణయించుకున్నాక.. ప్రాంతం, ధర, ప్రాజెక్ట్, వసతులు ఏవైనా సరే భర్తకు నచ్చినా సరే అంతిమంగా నిర్ణయించాల్సింది, ఓకే చేయాల్సింది ఇల్లాలే. ఆమెకు నచ్చకుండే ఇంటి కొనుగోలు చేయరు. సొంతింటి ఎంపికలో మహిళల పవర్ అదీ. అపార్ట్‌మెంట్లతో పోలిస్తే విల్లాలలో ఓపెన్ స్పేస్ ఎక్కువగా ఉండే అవకాశాలు ఉండటంతో నేటి యంగ్ ఉమెన్స్ విల్లాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. మరోవైపు నిర్ణయాధికారం, కొనుగోలు శక్తి పెరగడంతోనూ ప్రాపర్టీలకు డిమాండ్ ఏర్పడింది.



ఇన్‌ఫ్రాకు నీడ రియల్టీ..

మనల్ని అంటిపెట్టుకొని నీడ ఎలాగైతే ఫాలో అవుతుందో.. ఇన్‌ఫ్రాకు రియల్ ఎస్టేట్ కూడా అంతే. మౌలిక వసతులు అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలోనే రియల్ పరుగులు పెడుతుంది. భూముల ధరలు పెరగడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం ప్రభుత్వం సౌత్ హైదరాబాద్ వైపు ఫోకస్ పెట్టింది. కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, రాయదుర్గం వంటి పశ్చిమ ప్రాంతాలు ఇప్పటికే కిక్కిరిసిపోయాయి. ఇక్కడ సామాన్యులు కొనే పరిస్థితి లేదు. సౌత్‌లో ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్‌తో కొత్తూరు, షాద్‌నగర్, ఆదిభట్ల, ముచ్చర్ల వంటి దక్షిణ ప్రాంతాలు బాగా డెవలప్ అవుతాయి. ప్రస్తుతం ఆయా ప్రాంతాలలో ధరలు తక్కువగా ఉన్నాయి కాబట్టి సామాన్య, మధ్యతరగతి ఈ టైమ్‌లో కొనుగోలు చేయడం ఉత్తమం. ఏ నగరమైనా సమాంతరంగా అభివృద్ధి చెందాలి. కానీ, మౌలిక వసతుల కల్పనలో హెచ్చు తగ్గులు కారణంగా అభివృద్ధి కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది. దీంతో హైదరాబాద్‌లో వెస్ట్, సౌత్ జోన్‌లో భూముల ధరలు బాగా పెరిగాయి. మూసీ సుందరీకరణ, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్డు, ఫ్యూచర్ సిటీ.. హైదరాబాద్ స్థిరాస్తి రంగాన్ని నెక్ట్స్ లెవల్‌కు తీసుకెళ్లడం ఖాయం. ఈ బృహత్తర ప్రాజెక్టులతో రియల్ ఎస్టేట్ మార్కెట్ మళ్లీ పుంజుకోవడం ఖాయం.

ఆతివ ఆస్తి



మహిళలకు పీఎంఏవైలో వడ్డీ రాయితీ, గృహ రుణ వడ్డీ రేట్లలో తగ్గింపులు

స్టాంప్ డ్యూటీ రాయితీ, ఆదాయ పన్ను మినహాయింపు కూడా..

గృహ రుణ వడ్డీ రేట్ల తగ్గింపు..

బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలు మహిళలను విశ్వసనీయ రుణ గ్రహీతలుగా పరిగణిస్తుంటాయి. అందుకే స్థిరాస్తి రంగంలో మహిళా పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక రుణ కార్యక్రమాలను, స్కీమ్‌లను అందుబాటులోకి తీసుకొస్తుంటాయి. తక్కువ వడ్డీ రేట్లకు రుణాలను అందిస్తున్నాయి. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ వంటి బ్యాంకులలో పురుష రుణ గ్రహీతలతో పోలిస్తే మహిళలకు హోమ్ లోన్ వడ్డీ రేట్లు 0.5 నుంచి 1 శాతం తక్కువగా ఉంటాయి. ఈ శాతం తక్కువగా కనిపిస్తున్నప్పటికీ దీర్ఘకాలంలో డబ్బు, ఈఐఎంను ఆదా చేస్తుంది. ప్రధాన్‌మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద లో ఇన్‌కం గ్రూప్(ఎల్‌ఐజీ) కేటగిరీ కింద మహిళలకు రూ.6 లక్షల రుణానికి 6.5 శాతం వడ్డీ రాయితీతో.. రూ.2.67 లక్షల వరకు సబ్సిడీని పొందవచ్చు. ఇన్‌కం సోర్స్ లేని మహిళలకు బ్యాంక్‌లు రుణాలను అందించవు.



వారసులకు బదిలీ సులువు..

మహిళ పేరిట ప్రాపర్టీ ఉంటే అది ఆమె ఎస్టేట్‌లో భాగమవుతుంది. ఎటువంటి చట్టపరమైన చిక్కులు లేకుండా ఆమె వారసులకు సులభంగా బదిలీ అవుతుంది. అయితే విడాకుల సమయంలో సేల్‌డీడ్ ఆధారంగా ఆస్తి కేటాయింపులు ఉంటాయి. ఏదైనా చట్టపరమైన వివాదాలు తలెత్తితే ఆస్తి మహిళ పేరు మీద ఉన్నప్పటికీ భర్త ఉమ్మడిగా బాధ్యత వహించాల్సి ఉంటుంది.



ఐటీ ప్రయోజనాలు..

గృహ యజమాని లేదా సహ–యజమాని మహిళ అయితే **ఆదాయ పన్ను మినహాయింపులు కూడా** ఉన్నాయి. భార్యభర్తలు ఇద్దరూ **ఉద్యోగులైతే ఇద్దరు వేర్వేరుగా అసలు**, వడ్డీలపై ఐటీ తగ్గింపులను క్లయిమ్ **చేసుకునే వీలుంది. ఆదాయ పన్ను చట్టం**లోని సెక్షన్ 80సీ ప్రకారం సహ దరఖాస్తుదారుడు ప్రిన్సిపల్ అమౌంట్‌పై ఏడాదికి రూ.1.5 లక్షల వరకు, చెల్లించిన వడ్డీపై రూ.2 లక్షల వరకు ప్రయోజనాన్ని పొందవచ్చు. అలాగే సెక్షన్ 80ఈఈ కింద ఇతర క్లెయిమ్‌లతో పాటు తొలిసారి గృహ యజమానురాలు మహిళ అయితే ప్రిన్సిపల్ అమౌంట్ మీద రూ.50 వేలు తగ్గింపు కూడా అందుతుంది.


స్టాంప్ డ్యూటీలో తగ్గింపు..

పలు రాష్ట్రాలు **ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ల సమయంలో** మహిళలకు **స్టాంప్ డ్యూటీ రాయితీని** అందిస్తున్నాయి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మహిళలకు 1 శాతం రాయితీ ఉండేది. ప్రస్తుతం లేదు. ఢిల్లీలో ప్రాపర్టీ కొనుగోలుదారులకు మగవారికైతే ప్రాపర్టీ విలువలో 6 శాతం స్టాంప్ డ్యూటీ వసూలు చేస్తుండగా.. మహిళ ఓనర్లైతే 4 శాతం చెల్లించాల్సి ఉంటుంది. జమ్మూ అండ్ కశ్మీర్‌లో అయితే మహిళ ప్రాపర్టీ కొనుగోలుదారులకు స్టాంప్ డ్యూటీనే లేదు. ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోనూ మహిళా ఓనర్లకు స్టాంప్ డ్యూటీ మినహాయింపులు ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో అయితే పట్టణ, గ్రామీణ ప్రాంతాల వర్గీకరణ ఆధారంగా కూడా స్టాంప్ డ్యూటీలో మినహాయింపు ఉంది.



అద్దె ఆదాయంపై కూడా..

మహిళలు ఆస్తిని విక్రయించేటప్పుడు క్యాపిటల్ గెయిన్ మినహాయింపులను కూడా పొందవచ్చు. అంతేకాకుండా ప్రాపర్టీని మహిళలు అద్దెకు ఇస్తే.. ఆమె రెండు రకాల తగ్గింపులకు క్లయిమ్ చేసుకోవచ్చు. అద్దెకు ఇచ్చిన ప్రాపర్టీపై ఏదైనా లోన్‌పై చెల్లించే వడ్డీపై పన్ను తగ్గింపుతో పాటు రెంటల్ ఆదాయంపై 30 శాతం స్టాండర్డ్ డిడెక్షన్ లభిస్తుంది. అయితే పన్ను ప్రయోజనాలను క్లెయిమ్ చేయాలంటే మహిళలకు ఆదాయ వనరులు ఉండాల్సిందే.



బంగారం, గృహం, స్టాక్ మార్కెట్.. ఈ మూడింట్లో ఎందులో పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నారని మహిళలను అడిగితే.. ఠక్కున చెప్పే సమాధానం బంగారమే! కానీ, నేటి మహిళల పెట్టుబడి ఆలోచనల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. మొదట సొంతిల్లు.. ఆ తర్వాతే బంగారం, స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్ అంటున్నారు. 69 శాతం మంది మహిళలు సొంత ఇంటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తుండగా.. 31 శాతం మంది పెట్టుబడి కోసం ప్రాపర్టీలను కొనుగోలు చేస్తున్నారని అనరాక్ కన్స్యూమర్ సెంటిమెంట్ సర్వే వెల్లడించింది.

– సాక్షి, సిటీబ్యూరో

ఇల్లే బంగారమాయె..

గృహ కొనుగోళ్లకు 69 శాతం మంది ఆసక్తి

- 12 శాతం గోల్డ్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్‌కు జై
- స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులకు 2 శాతమే మొగ్గు
- పెట్టుబడుల్లో మహిళల ప్రాధాన్యత ఇదీ
- అనరాక్ ప్రాపర్టీ సర్వేలో వెల్లడి

మన దేశంలో గృహ కొనుగోలు ప్రక్రియలో మహిళలు ఎల్లప్పుడూ కీలక నిర్ణయాధికారులే. మహిళలు స్వతంత్ర, వ్యక్తిగత ఆస్తుల కొనుగోళ్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రాపర్టీ కొనుగోళ్లలో మెజారిటీ మహిళలు తుది వినియోగదారులే. పెట్టుబడి రీత్యా ఆస్తుల కొనుగోళ్లు ఆశించిన స్థాయిలోనే ఉండటం గమనార్హం. పెరుగుతున్న స్వాతంత్ర్యం, వ్యక్తిగత స్వేచ్ఛ, నిర్ణయాధికారం, మెరుగైన ఆదాయ వనరులు కారణంగా గృహ విభాగంలో మహిళా పెట్టుబడిదారులు ఎక్కువగా వస్తున్నారు. 2022 హెచ్2 (జులై–డిసెంబర్)లో మహిళా గృహ కొనుగోలుదారుల్లో తుది వినియోగం: పెట్టుబడి నిష్పత్తి 79:21గా ఉండగా.. 2024 హెచ్2 నాటికి 69:31గా ఉందని తెలిపింది.

లాంచింగ్ ప్రాజెక్టుల్లోనే..

సర్వేలో పాల్గొన్న 69 శాతం మహిళలకు రియల్ ఎస్టేట్ అత్యంత ప్రాధాన్యత కలిగిన ఆస్తి తరగతిగా భావిస్తున్నారు. 2022 హెచ్2లో ఇది 65 శాతంగా ఉండగా.. కోవిడ్ కంటే ముందు 2019 హెచ్2లో 57 శాతంగా ఉంది. గతంలో కొత్తగా ప్రారంభించిన ప్రాజెక్టలలో కొనుగోళ్లకు 10 శాతం మంది మహిళలు మొగ్గుచూపగా.. ఇప్పుడది 18 శాతానికి పెరిగింది. నిర్మాణం పూర్తయి, గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇళ్ల (రెడీ టు మూవ్) కొనుగోళ్ల ప్రాధాన్యత 29 శాతం మేర తగ్గింది.

లగ్జరీకే మొగ్గు..

లగ్జరీ ప్రాపర్టీలకు మహిళలూ ఆసక్తి చూపిస్తున్నారు. రూ.90 లక్షల కంటే ఎక్కువ ధర ఉండే ప్రీమియం ఇళ్ల కొనుగోళ్లకు 52 శాతం ఉమెన్స్ మొగ్గు చూపిస్తున్నారు. వీటిలో 33 శాతం మంది రూ.90 లక్షల నుంచి రూ.1.5 కోట్ల ధర ఉండే ప్రాపర్టీలను ఇష్టపడుతుండగా.. 11 శాతం మంది రూ.1.5 కోట్ల నుంచి రూ.2.5 కోట్ల ధర ఉండే గృహాలను, 8 శాతం మంది రూ.2.5 కోట్ల కంటే ఎక్కువ ధర ఉండే అల్ట్రా లగ్జరీ ప్రాపర్టీల కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు. దేశంలో మహిళా హై నెట్ వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్‌ఎన్‌ఐ) పెరుగుదలకు ఇదే నిదర్శనం.

గోల్డ్, స్టాక్ మార్కెట్..

ప్రాపర్టీ తర్వాత మగువలకు అమితాసక్తి బంగారమే. అందుకే రియల్ ఎస్టేట్ తర్వాత గోల్డ్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్‌కే మహిళలు జై కొడుతున్నారు. 2022 హెచ్2లో బంగారంలో పెట్టుబడులకు 8 శాతం మంది మహిళలు ఆసక్తి చూపించగా.. 2024 హెచ్2 నాటికి 12 శాతానికి పెరిగింది. ఇక, ఏటేటా స్టాక్ మార్కెట్ ఆకర్షణ కోల్పోతుంది. రెండేళ్ల క్రితం మార్కెట్‌లో పెట్టుబడులకు 20 శాతం మంది మహిళలు ఆసక్తి చూపిస్తే.. ఇప్పుడది ఏకంగా 2 శాతానికి పడిపోయింది.



స్టైలిష్ ఇంటీరియర్ ఆమె మెచ్చేలా..

సాక్షి, సిటీబ్యూరో: ఇల్లు చిన్నదైనా, పెద్దదైనా అదంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలంటే మహిళలతోనే సాధ్యం. అలాంటిది ఇంటీరియర్ డిజైనరే మహిళ అయితే ఆ అందం ద్విగుణీకృతమవుతుంది. లగ్జరీ, క్లాసికల్ గాంభీర్యం, హస్తకళలతో కూడిన ఫర్నిచర్ బెనాయిట్ స్పెషాలిటీ.



హైదరాబాద్‌లో ఇంటీరియర్ డిజైనింగ్ రంగం అభివృద్ధి చెందుతోంది. మహిళల నేతృత్వంలో లగ్జరీ ఇంటీరియర్‌లు, స్థిరమైన డిజైన్లు, కస్టమర్ కేంద్రీకృత పరిష్కారాల ద్వారా ఇంటీరియర్ పరిశ్రమను రూపొందిస్తున్నారు. మహిళా నేతృత్వంలోని సంస్థలు ప్రాజెక్ట్ అమలుకు భిన్నమైన విధానాన్ని తీసుకువస్తాయి. పక్కా ప్రణాళికలు, సమగ్రత, సౌందర్యం, కార్యాచరణపై దృష్టి సారిస్తాయి. సృజనాత్మకతతో అందమైన డిజైనింగ్‌లను రూపొందించడంలో మహిళా ఇంటీరియర్లు కీలక పాత్ర వహిస్తారు.

ప్యాలెస్ అందాలు..

ఈ రోజుల్లో చిన్నా, పెద్ద ప్రతీ ఒక్కరూ ఉన్నంతలో ఇంటీరియర్‌పై అధికంగా ఖర్చు చేయిస్తున్నారు. ఖరీదైన అపార్ట్‌మెంట్లు, విల్లాలు, వ్యక్తిగత గృహ యజమానులైతే రాయల్, విదేశీ ఫర్నిచర్లతో ఇంటిని అలంకరించేందుకూ వెనకాడట్లేదు. నగరంలో ఫలక్‌నుమా ప్యాలెస్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రతీ ఫర్నిచర్ రాజసం ఉట్టిపడుతుంది. ఇళ్లలో ప్యాలెస్ లాంటి వాతావరణాన్ని కోరుకునే వారికి రాయల్ ఇంటీరియరే సరైనది. బెనాయిట్ ఫర్నిచర్ సంప్రదాయ రాయల్ డిజైన్లను ఆధునిక హస్తకళతో విలీనం చేస్తుంది. చారిత్రాత్మకంగా గొప్పగా ఉండటమే కాకుండా సమకాలీన లగ్జరీ గృహాలకు కూడా ఆచరణాత్మకంగా ఉండేలా చేస్తుంది. నిజాం కాలం నాటి గొప్ప వారసత్వం, ప్రతిష్టను పునరుజ్జీవంతో పాటు రాజభవనాల వైభవాన్ని ప్రతిబింబించే ఫర్నిచర్‌ను అందించడమే దీని ప్రత్యేకత. ప్రీమియం మెటీరియల్స్, ఫాబ్రిక్‌లతో పాటు చేతితో తయారు చేసిన చెక్కతో వీటిని రూపొందిస్తారు. ప్రతి ఉత్పత్తి నాణ్యత, విలాసానికి ప్రతీక.





ఇంటీరియర్ ఓ కళ..

ఇంటీరియర్ డిజైనింగ్ అనేది కళ, సౌకర్యం, ఆధునికతల మిశ్రమం. సౌందర్యం, క్లాసికల్ డిజైన్లను కోరుకునే గృహ యజమానులు ఇంటీరియర్‌పై ఆసక్తి చూపిస్తుంటారు. లివింగ్ రూమ్ నుంచి డైనింగ్ సెట్, బెడ్ రూమ్ డెకర్ వరకూ ప్రతీది ఇంటీరియర్‌లో ప్రత్యేకమైనదే. హెరిటేజ్ డిజైన్లను ఆధునిక ఆవిష్కరణలతో మిళితం చేయడమే దీని స్పెషాలిటీ.

– తయ్యబా, ఎండీ, ఇంటీరియర్ డిజైనర్

స్త్రీరాస్తి రంగంలో..

మహిళా కార్మికులు 70 లక్షలు!

సాక్షి, సిటీబ్యూరో: అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడుతున్న మహిళలు.. స్థిరాస్తి రంగంలో మాత్రం కాస్త వెనకబడే ఉన్నారు. దేశీయ రియల్ ఎస్టేట్ పరిశ్రమలో మహిళా కార్మికులు పరిమితంగానే ఉన్నారు. ప్రస్తుతం రియల్టీలో 7.1 కోట్ల మంది కార్మికులు పని చేస్తుండగా.. మహిళా కార్మికుల సంఖ్య కేవలం 70 లక్షలే. మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు (ఎల్‌ఎఫ్‌పీఆర్) కేవలం 25.1 శాతంగా మాత్రమే ఉందని రియల్టీ సంస్థ మ్యాక్స్ ఎస్టేట్స్, గ్లోబల్ కన్సల్టింగ్ ఇన్ టెన్‌డమ్ అధ్యయనం వెల్లడించింది.

మహిళా జనాభాలో 1.2 శాతమే..

వ్యవసాయం తర్వాత అత్యధిక ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సృష్టించే రంగం రియల్ ఎస్టేటే. కానీ, స్థిరాస్తి రంగ శ్రామిక



శక్తిలో మహిళ భాగస్వామ్యం అంతంత మాత్రంగానే ఉంది. దేశీయ స్థిరాస్తి రంగం క్రాస్ రోడ్స్‌లో ఉంది. అద్భుతమైన వృద్ధికి సిద్ధంగా ఉంది. అదే సమయంలో తారాస్థాయిలో వృద్ధి చెందకుండా నిరోధించేందుకూ సవాళ్లు ముందున్నాయి. దేశ జనాభాలో మహిళలు 48.5 శాతం మంది ఉన్నారు. ఇందులో దాదాపు 1.2 శాతం మంది మహిళలు రియల్ ఎస్టేట్ రంగంలో పనిచేస్తున్నారు.

సవాళ్లు ఇవీ..

స్థిరాస్తి రంగంలోని శ్రామిక శక్తిలో అన్ని స్థాయిలలోనూ మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం, అసమాన వేతనం.. ఇవే ఈ రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సవాళ్లు. లింగ సమానతలు పరిష్కరించడం వల్ల గణనీయమైన ఆర్థిక ప్రయోజనాలు చేకూరతాయి. ఉత్పాదకత, ఆవిష్కరణలు, లాభదాయకత పెరుగుతాయి. అలాగే ఈ రంగంలో బ్లూ, వైట్ కాలర్ మహిళా కార్మికులను శక్తివంతం చేయడానికి నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాల అవసరం ఉంది. సరైన నాయకత్వం, సాంకేతికత వినియోగంతోనే దీన్ని సాధించగలమని నివేదిక సూచించింది.

క్లుప్తంగా...



నాలుగైదు రోజుల్లో 'పటాన్‌చెరు' నివేదిక

మంత్రి దామోదరతో భేటీ అయిన పీసీసీ కమిటీ

సాక్షి, హైదరాబాద్: పటాన్‌చెరు నియోజకవర్గంలో కొత్త, పాత కాంగ్రెస్ నేతల మధ్య జరుగుతున్న పంచాయితీపై నాలుగైదు రోజుల్లో పూర్తి నివేదిక ఇచ్చేందుకు టీపీసీసీ నియమించిన ద్విసభ్య కమిటీ సిద్ధమవుతోంది. ఇప్పటికే క్షేత్రస్థాయి నేతలు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్‌లతో సమావేశమై వారి అభిప్రాయాలను తీసుకున్న కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి శుక్రవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి దామోదరతో మాట్లాడారు. పార్టీలోకి కొత్తవారు రావడంలో ఇబ్బంది ఉండదని, అయితే, కొత్త నేతల రాకతో పాత నాయకత్వం ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత కూడా పార్టీపై ఉంటుందని మంత్రి చెప్పినట్టు సమాచారం. జగ్గారెడ్డితో కూడా మాట్లాడి ద్విసభ్య కమిటీ పూర్తి స్థాయిలో నివేదికను సిద్ధం చేయనుందని తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌ల ఆదేశాల మేరకు నాలుగైదు రోజుల్లోనే ఈ కమిటీ తన నివేదికను పార్టీకి అందజేయనుందని సమాచారం.

చిన్నారి శ్రీ'విద్య'కు అండగా కేటీఆర్

సనత్‌నగర్: సరైన ధ్రువీకరణ పత్రాలు లేని కారణంగా విద్యాంజలి స్కూల్‌లో చేర్చుకోవడానికి నిరాకరించడంతో చదువుకు దూరమైన చిన్నారికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌కు చెందిన ఒకటో తరగతి విద్యార్థిని శ్రీవిద్య విషయం తెలుసుకున్న ఆయన తన కార్యాలయ సిబ్బందిని చిన్నారి ఇంటికి పంపించి తల్లిదండ్రులతో మాట్లాడించారు. ఆధార్, బర్త్ సర్టిఫికెట్ ఇప్పించడంలో సహాయం చేస్తామన్నారు. అంతేకాదు శ్రీవిద్య తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న కేటీఆర్.. ఆమె చదువు ఆగిపోవద్దనే ఉద్దేశంతో రెండు సంవత్సరాల స్కూల్ ఫీజును చెల్లించారు. భవిష్యత్తులో శ్రీవిద్య చదువుకు అయ్యే ఖర్చులను తానే భరిస్తానని చెప్పారు. కేటీఆర్ చొరవతో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కూడా జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి అవసరమైన సర్టిఫికెట్లు ఇప్పిస్తామని హామీఇచ్చారు.

జీతాలు పెంచాల్సింది పోయి తగ్గిస్తారా?

కేంద్ర మంత్రి సంజయ్



సాక్షి, హైదరాబాద్: సీఎం గారూ.. ఇదేం పాలన? పెంచాల్సిన వేతనాలను తగ్గించడమేంటి?.. అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఉద్యోగులకు డీఏ లివ్వరు.. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు పెంచరా అని నిలదీశారు. డ్రైవర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లకు 25 శాతానికి పైగా వేత నా లు తగ్గించడం దుర్మార్గమని మండిపడ్డారు. నాలుగేళ్లుగా ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు ఎందుకు పెంచడం లేదని ఆయన ఒక ప్రకటనలో నిలదీశారు. మున్సిపల్ డ్రైవ ర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లకు చెల్లిస్తున్న వేతనాలను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గమన్నారు.

బీసీ కమిషన్‌కు మరిన్ని అధికారాలివ్వాలి

బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీసీ కమిషన్‌కు ప్రస్తుతమున్న అధికారాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో వీటిపై చర్చించి సవరణలు చేయాలని కోరారు. రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయంలో సభ్యులతో కలిసి ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న మంత్రివర్గ నిర్ణయం ఎంతో గొప్పదన్నారు. పీఎం వద్దకు అఖిలపక్షం వెళ్లినప్పుడు 42 శాతం రిజర్వేషన్లపై అందరిదీ ఒకటే మాట అనే భావన కలిగించాలని విజ్ఞప్తి చేశారు.

'ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్' సెలక్షన్స్‌లో నారాయణ హవా

సాక్షి, హైదరాబాద్: హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్, భారతప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఓరియంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్, ఇంటర్నేషనల్ మ్యాథమేటికల్ ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంప్‌లో నారాయణ విద్యార్థులు సత్తాచాటారు. అత్యధికంగా 65 మంది తమ విద్యార్థులు ఎంపికయ్యారని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ సింధూర నారాయణ, శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్ ట్రైనింగ్ క్యాంప్‌కి ఎంపికైన ప్రతి నలుగురు విద్యార్థుల్లో ఒకరు నారాయణ విద్యార్థి కావడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు.

మార్గదర్శి, రామోజీది 45 ఏళ్ల నయవంచన

వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాల్సిందే - తెలంగాణ హైకోర్టులో మాజీ ఎంపీ ఉండవల్లి వాదనలు

సాక్షి, అమరావతి: మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) కర్త రామోజీరావుల అక్రమ డిపాజిట్ల వసూళ్ల వ్యవహారం 45 ఏళ్ల నయవంచన అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ శుక్రవారం తెలంగాణ హైకోర్టుకు నివేదించారు. ఏపీలోని గత ప్రభుత్వం మార్గదర్శి అక్రమాలపై విచారణ కోసం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను కాపాడేందుకు ప్రయత్నిస్తోందన్నారు. తెలంగాణ సర్కారు కూడా దీనికి తానతందాన అంటోందని తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను (ఆర్‌బీఐ) ప్రతివాదిగా చేర్చాలని, డిపాజిట్ల వసూళ్ల అక్రమమా? సక్రమమా? తేల్చాల్సింది చట్టబద్ధ సంస్థేనని సుప్రీంకోర్టే నేరుగా చెప్పిందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ డిపాజిట్ల వసూళ్లు అక్రమమేనని ఆర్‌బీఐ చాలా స్పష్టంగా ఈ కోర్టుకు చెప్పిందన్నారు. ఇప్పుడు కూడా మార్గదర్శిపై కఠిన చర్యలు చేపట్టకుంటే భవిష్యత్‌కు తప్పుడు సంకేతాలు ఇచ్చినట్లు అవుతుందన్నారు. రామోజీ అక్రమాలకు హెచ్‌యూఎఫ్ సభ్యులు కూడా బాధ్యులేనని చెప్పారు. హెచ్‌యూఎఫ్ కింద మార్గదర్శి ఫైనాన్షియర్స్ కార్యకలాపాలు చేపట్టినందున కర్త రామోజీరావు మాత్రమే బాధ్యడవుతారని, ఇతర కుటుంబసభ్యులకు ఎలాంటి సంబంధం ఉండదంటూ ఆ సంస్థ జనవరి 29న దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై అన్ని పక్షాల వాదనలు విన్న జస్టిస్ పి.శ్యాం కోషి, జస్టిస్ కలాసికం సుజనలతో కూడిన హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఈ అంశంపై తీర్పును రిజర్వ్ చేసింది. అంతకుముందు ఉండవల్లి తన వాదనలను కొనసాగించారు.

బాధ్యత నుంచి పారిపోలేరు

రామోజీరావు మరణించినా.. అక్రమాల కారణంగా లబ్ధి పొందినవారు ఉన్నారు. ఆ లబ్ధిని అనుభవిస్తూ మాకేం సంబంధం లేదని వారు తప్పించుకోలేరు. ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45ఎస్‌ను ఉల్లంఘించారని ఆర్‌బీఐ స్పష్టంగా చెబుతోంది. తన కుటుంబ సభ్యుల కోసమే సేకరిస్తున్నా అన్నట్లు రామోజీరావు 22 మంది కుటుంబ సభ్యుల పేర్లను కూడా హెచ్‌యూఎఫ్‌లో చేర్చారు. అలాంటప్పుడు వారు బాధ్యత నుంచి పారిపోలేరు.

తండ్రి లోన్ తీసుకుని చనిపోతే కుటుంబం బాధ్యులు కారా?

తండ్రి బ్యాంక్ లోన్ తీసుకుని మరణిస్తే.. కుటుంబసభ్యులను బాధ్యులను చేయరా? రామోజీ అక్రమాలకు కుటుంబసభ్యులు కచ్చితంగా బాధ్యులే. వారు శిక్ష అనుభవించాల్సిందే. కాదని.. ఇలానే ప్రోత్సహిస్తే.. దీన్ని అసరాగా తీసుకుని ఇలాంటి ఫైనాన్షియర్లు ఎన్నో పుట్టుకొస్తాయి. అప్పుడు ఈ దేశమే తీవ్ర ప్రమాదంలో పడిపోతుంది. భవిష్యత్‌లో ప్రజల డిపాజిట్లకు గ్యారెంటీ లేకుండా పోతుంది.

– మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్



ఇష్టారాజ్యంగా వసూళ్లు..

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు.. ఇలా వేటి అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను నడిపించారని, ఇదేమని అడిగేవారు లేకుండా తీవ్ర భయభ్రాంతులకు గురిచేశారని ఉండవల్లి పేర్కొన్నారు. ''రాష్ట్రంలోనే అత్యంత ప్రభావవంతమైన వ్యక్తి రామోజీ కావడం, వెంట ఆయన మీడియా మాఫియా ఉండడంతో బాధితులు ఫిర్యాదు చేయడానికి వెనుకాడారు. ఫిర్యాదు చేసినా రామోజీపై పోలీసులు కేసు నమోదు చేయలేదు. 2004 తర్వాత బోగస్ బ్యాంక్‌ల బండారం బయటపడుతుండడంతో మార్గదర్శి అక్రమాలపై కూడా విచారణ జరపాలని నాటి సీఎం, దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిర్ణయించారు. ఎప్పుడైతే మార్గదర్శిపై విచారణ ప్రారంభమైందో నాటి నుంచి వైఎస్సార్‌పై రామోజీరావు తన మీడియాలో అనుచిత వార్తలు ప్రచురించడం, ప్రసారం చేయడం మొదలుపెట్టారు. కథనాలు అల్లి రాసేవారు. ఈ క్రమంలోనే నా తల్లికి మార్గదర్శి నుంచి వచ్చిన చెక్, దానిపై ఉన్న సంతకాలను పరిశీలించగా అవకతవకలన్నీ బయటపడ్డాయి. దీంతో నేను ఫిర్యాదు చేసి, నిజం తేల్చేందుకు 18 ఏళ్లుగా పోరాడుతూనే ఉన్నా''అని ఉండవల్లి కోర్టుకు నివేదించారు.

ఐటీ శాఖ కనీసం పట్టించుకోలేదు..

''కర్త మరణించి, వ్యాపారం ఆగిపోతే ఎలా చర్యలు చేపట్టాలనేది ఆలోచించవచ్చు. రామోజీ చనిపోయినా హెచ్‌యూఎఫ్ వ్యాపారాన్ని వారసులు కొనసాగిస్తూ లబ్ధి పొందుతున్నారు. ఇదో హత్య కేసు లాంటిది. నిందితుడు చనిపోతే ఇక కేసు ఉండదని మార్గదర్శి న్యాయవాదులు చెప్పడం విడ్డూరం. దేశంలోని అన్ని హెచ్‌యూఎఫ్‌ల నుంచి ఆదాయపు పన్ను శాఖ పన్ను వసూలు చేస్తోంది. వాటి సిబిల్ స్కోరు, ఆదాయ వ్యయాలపై పరిశీలన చేస్తుంది. ఈనాడు, ఈటీవీ, ఫిలిం సిటీ.. ఇలా అన్నీ కలిపి దాదాపు రూ.1,359 నష్టాల్లో ఉన్నాయి. ఇవన్నీ సాంకేతిక నష్టాలని మార్గదర్శి చెబుతోంది. ఇంత జరిగినా ఆదాయ పన్ను శాఖ కనీసం హెచ్‌యూఎఫ్ వ్యాపారంపై స్టే కూడా కోరడం లేదు. టీడీఎస్ ప్రస్తావనే లేదు. ప్రస్తుతం తెలంగాణ, ఏపీలో ఉన్న ప్రభుత్వాలకు మీడియా మాటున అక్రమాలు చెలాయిస్తున్న మార్గదర్శిపై ప్రత్యేక అభిమానం ఉంది''అని ఉండవల్లి వాదించారు. ఈ కేసులో ఆర్‌బీఐని తాను ప్రతివాదిగా తొలుత చేర్చలేదని.. సుప్రీంకోర్టు ఎస్ఎల్‌పీ విచారణ చేస్తూ.. ఇది ఓ కుంభకోణంలా కనిపిస్తోందని, ఆర్‌బీఐని ప్రతివాదిగా చేర్చాలని స్పష్టం చేసిందని వివరించారు. ''అక్రమాలు, అవకతవకలు జరిగాయా? లేదా? చట్టప్రకారమే జరిగిందా? తేల్చాల్సింది ఆర్‌బీఐ కదా అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో మార్గదర్శి డిపాజిట్ల వసూలు అక్రమమేనని ఆర్‌బీఐ తేల్చింది''అని ఉండవల్లి పేర్కొన్నారు.

లూథ్రాను మందలించిన ధర్మాసనం

ఉండవల్లి వాదనలు వినిపిస్తుండగా, మార్గదర్శి తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా పదే పదే అడ్డుపడ్డారు. సీనియర్ న్యాయవాది అయి ఉండి ఇలా కలుగజేసుకోవడం సరికాదని ఆయనను ధర్మాసనం మందలించింది. ఉండవల్లి వాదనలు ముగిసేవరకు ఆగాలని ఆదేశించింది. తర్వాత ఏపీ ప్రభుత్వం తరఫున ఆ రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది రాజేశ్వర్‌రెడ్డి వాదిస్తూ ఉండవల్లి వాదనలను తోసిపుచ్చారు. విచారణ చేశామని, ఫిర్యాదు చేసేందుకు ఎవరూ రాలేదని చెప్పారు. హెచ్‌యూఎఫ్ వ్యక్తి కాదని, విచారణ సాధ్యం కాదని మార్గదర్శి తరఫు సీనియర్ న్యాయవాది నాగముత్తు చెప్పారు. కర్త అక్రమాలకు హెచ్‌యూఎఫ్ సభ్యులు బాధ్యత వహించరని పేర్కొన్నారు. రామోజీ మరణం నేపథ్యంలో కేసు విచారణను ముగించాలని కోరుతూ తాము దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను అనుమతించాలని కోరారు.

నాకు డబ్బులు చెల్లించలేదు...

అందరి వాదనలు పూర్తయిన తరువాత లక్ష్మీనరసింహారావు అనే న్యాయవాది జోక్యం చేసుకున్నారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ తన డబ్బు తిరిగివ్వలేదని ఆర్‌బీఐకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తనను కూడా ఈ పిటిషన్లలో ప్రతివాదిగా చేర్చుకుని, వాదనలు వినాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ, అప్పటికే తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించామని, వాదనలను లిఖితపూర్వకంగా అందజేయాలని ఆదేశించింది.

రెవెన్యూ పరీక్ష రాయాల్సిందే!

- ఆ సంఘాల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోని ప్రభుత్వం
- గ్రామ రెవెన్యూ అధికారుల పోస్టుల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్
- రాష్ట్రవ్యాప్తంగా 10,954 పోస్టులు మంజూరు చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: గతంలో పనిచేసిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి పరీక్ష లేకుండా తమను మళ్లీ రెవెన్యూ వ్యవస్థలోనికి తీసుకోవాలని రెవెన్యూ సంఘాలు చేసిన విజ్ఞప్తులను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని తెలుస్తోంది. గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పకడ్బందీగా బలోపేతం చేయాల్సిన అవసరముందని, ఇందుకోసం పరీక్ష నిర్వహించిన తర్వాతే గ్రామ పరిపాలన అధికారుల పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదించిన 10,954 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని భావిస్తోంది. టీజీపీఎస్సీ లేదా ఇతర అధికారిక సంస్థ ఆధ్వర్యంలో ఈ పరీక్షల నిర్వహణకు గల అవకాశాలపై రెవెన్యూ ఉన్నతాధికారులు నివేదిక రూపొందించారు. పరీక్ష విధివిధానాలు, ఎంపిక ప్రక్రియలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను ఈ నివేదికలో పొందుపరిచినట్టు సమాచారం. కాగా, గతంలో వీఆర్వోలు, వీఆర్ఏలుగా పనిచేసిన వారి నుంచి ఆసక్తి వ్యక్తీకరణను ఇప్పటికే సేకరించిన ప్రభుత్వం డిగ్రీ, ఇంటర్ విద్యార్హత ఉన్న వారికి కూడా పరీక్ష నిర్వహించాలని రెవెన్యూ వర్గాలు తీసుకున్న నిర్ణయం మేరకు పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పరీక్ష పెట్టొద్దు

దశాబ్దాల పాటు రెవెన్యూ వ్యవస్థలో పనిచేసిన అనుభవం మాకుంది. భూపరిపాలన, గ్రామస్థాయి కార్యకలాపాల విషయంలో మాకు పూర్తి స్థాయిలో అవగాహన ఉంది. అనుభవం, అవగాహనను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. పరీక్ష పెట్టడం ద్వారా మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దు. మా సిబ్బందితో భర్తీ చేయగా, మిగిలిన పోస్టులకు పరీక్ష నిర్వహించినా మాకు అభ్యంతరం లేదు. ప్రభుత్వం సానుకూలతతో మా విజ్ఞప్తిని పరిశీలించాలి.

– గోల్కొండ సతీశ్, తెలంగాణ వీఆర్వోల జేఏసీ

కొత్త పోస్టులతో రెవెన్యూ శాఖ మరింత బలోపేతం

రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగ సంఘాల నేతలు

సాక్షి, హైదరాబాద్: గతంలో ఎన్నడూ లేని విధంగా రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త పోస్టులు మంజూరు చేయడంపై రెవెన్యూ ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ పరిపాలన అధికారుల (వీపీవో)కు సంబంధించి 10,954 పోస్టులతో పాటు రాష్ట్రంలోని కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలకు 361 పోస్టులు, 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను మంజూరు చేసినందుకు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్ మిత్తల్, జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. సీసీ ఎల్ఏ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సంఘాల నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో రెవెన్యూ శాఖ మరింత బలోపేతమవుతుందని, క్షేత్రస్థాయిలో రెవెన్యూ సేవలు రైతులు, ప్రజలకు మరింత చేరువవుతాయన్నారు. డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సీసీఎల్ఏ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.

సీపీఐకి ఒకటి.. ఎస్టీ నేతకు మరొకటి!

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీట్లపై కాంగ్రెస్ సూత్రప్రాయ నిర్ణయం

- మిగతా రెండు స్థానాలపై రాష్ట్ర నేతల్లో కుదరని ఏకాభిప్రాయం
- రేపు ఢిల్లీ పెద్దల సమక్షంలో చర్చలు.. తర్వాత ప్రకటన!

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక కోసం అధికార కాంగ్రెస్ చేపట్టిన కసరత్తు తుదిదశకు చేరుకుంది. వచ్చే సోమవారంతో నామినేషన్ల దాఖలు గడువు ముగుస్తున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను టీపీసీసీ వేగవంతం చేసింది. ఎమ్మెల్యేల కోటాలో నాలుగు ఎమ్మెల్సీ స్థానాలు దక్కే అవకాశమున్న నేపథ్యంలో.. ఒక సీటును మిత్రపక్షమైన సీపీఐకి ఇవ్వాలని, మిగతా మూడింటిలో ఒక స్థానాన్ని ఎస్టీ వర్గానికి చెందిన నేతకు ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయం తీసుకుంది. అందులోనూ మహిళకు అవకాశమివ్వాలని ఇటీవల సీఎం రేవంత్ నివాసంలో జరిగిన భేటీలో నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. మిగతా రెండింటి కోసం ఎస్సీ, ఓసీ, బీసీ వర్గాలకు చెందిన నేతల పేర్లను పరిశీలిస్తున్నట్టు తెలిసింది.

ఢిల్లీలో అభ్యర్థుల ఖరారు..

కేబినెట్ విస్తరణతో ముడిపెట్టి జరుగుతున్న కసరత్తులో భాగంగా ఈ మూడు సామాజిక వర్గాల నుంచి అవకాశం కల్పించాల్సి ఉంటుందని టీపీసీసీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో రెండు ఎమ్మెల్సీ సీట్లలో ఒకటి, రెండు రాజ్యసభ ఎంపీ స్థానాల్లో ఒకటి చొప్పున బీసీలకు అవకాశం ఇచ్చిన నేపథ్యంలో.. ఈసారి బీసీ నేతలకు ఎమ్మెల్సీ అవకాశం ఉండకపోవచ్చని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇదే జరిగితే ఎస్టీ, ఎస్సీ, ఓసీ వర్గాల నేతలను ఎమ్మెల్సీలుగా ఎంపిక చేయవచ్చని అంటున్నారు. అభ్యర్థుల ఖరారు ప్రక్రియ శని, ఆదివారాల్లో ఢిల్లీ వేదికగా జరగనుంది. అధిష్టానం పెద్దలు కేసీ వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్‌తో భేటీ అయ్యేందుకు గాను సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ శనివారం మధ్యాహ్నం తర్వాత ఢిల్లీ వెళుతున్నారు. ఆదివారం ఉదయం ఏఐసీసీ పెద్దలతో భేటీ అయి ఎమ్మెల్సీ అభ్యర్థులను ఖరారు చేయనున్నారు. మధ్యాహ్నానికల్లా అభ్యర్థులను అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

మిత్ర పక్షానికి..

ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా మిత్రపక్షం సీపీఐకి అవకాశం ఇవ్వడం దాదాపు ఖరారైనట్టేనని టీపీసీసీ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కుదిరిన పొత్తులో భాగంగా, నాడు ఇచ్చిన మాట ప్రకారం సీపీఐకి ఒక ఎమ్మెల్సీ స్థానం ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించిందని.. ఈ మేరకు టీపీసీసీ నాయకత్వానికి సమాచారం ఇచ్చిందని పేర్కొంటున్నాయి.

ఏపీ జల దోపిడీని అడ్డుకోండి

బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జలదోపిడీని అడ్డుకునేందుకు సీఎం రేవంత్ సహా బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనం వీడాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ విధానాలు తెలంగాణలో సాగు, తాగునీటి వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారుతున్నాయని శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. బనకచర్ల ద్వారా 200 టీఎంసీల జలాలను ఏపీకి తరలించుకుపోయేందుకు ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు కుట్ర చేస్తున్నా తెలంగాణ సీఎం రేవంత్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాల్వ నుంచి రోజుకు 10 వేల క్యూసెక్కుల నీళ్లు ఏపీకి తరలిస్తున్నా తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించడం లేదని మండిపడ్డారు. 'చంద్రబాబును అడ్డుకునే ధైర్యం, కేంద్రాన్ని అడిగే దమ్ము రేవంత్‌కు, బీజేపీ ఎంపీలకు లేదా? చంద్రబాబుతో బీజేపీ, రేవంత్ దోస్తీ చేస్తూ తెలంగాణను మోసం చేస్తారా? బాబు, రేవంత్, బీజేపీ మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందం ఏంటి'అని హరీశ్‌రావు నిలదీశారు. సివిల్ కాంట్రాక్టర్లు బిల్లులు చెల్లించాలని అడగడానికి సచివాలయానికి వస్తే.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వారిని కలువకుండా వెనుక గేటు నుంచి వెళ్లిపోయారని హరీశ్‌రావు ఎక్స్‌లో ఎద్దేవా చేశారు. ప్రజా ప్రభుత్వం అంటే పలాయనం చిత్తగించడమేనా? అని ప్రశ్నించారు. మంత్రులు కమీషన్లకు ఆశపడి బిల్లులు నిలిపేశారని ఆరోపించారు.



మహిళా దినోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే.అరుణ, శిల్పారెడ్డి, గీతామూర్తి తదితరులు

స్థానిక ఎన్నికల్లో మహిళలు అన్ని స్థాయిల్లో పోటీ చేయాలి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపు
- బీజేపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని సీట్లకు బీజేపీ పోటీ చేస్తుందని, ఇందులో పార్టీ తరఫున అన్ని స్థాయిల్లో మహిళలు పోటీ చేయాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ వార్డు నుంచి మొదలు పెట్టి జిల్లా పరిషత్ చైర్మన్, అలాగే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో మహిళలు కీలకపాత్ర పోషించాలని ఆయన సూచించారు. రిజర్వేషన్‌స్థానాల్లోనే కాకుండా, జనరల్‌సీట్లలోనూ మహిళలు పోటీలో ఉండాలని ఆకాంక్షించారు. త్వరలోనే ప్రధాని మోదీ నేతృత్వంలో జనగణన జరుగుతుందన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల పునర్విభజన జరగబోతోందని, ఇప్పుడున్న ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో ఏ ఒక్క సీటు తగ్గబోదని స్పష్టం చేశారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు ముందే మహిళల రిజర్వేషన్ల చట్టం అమలు చేస్తామని చెప్పారు. కాగా, రేవంత్‌రెడ్డి సర్కారు, బీఆర్‌ఎస్‌తో పాటు డీఎంకే పార్టీలు కావాలనే పునర్విభజనపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో పార్టీ మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్య, వ్యాపార, సామాజిక రంగాల్లో మహిళలు ముందుకు వెళ్లడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం వచ్చి 14 నెలలు గడిచిపోయినా ఇంకా కేసీఆర్‌హయాం మాదిరిగానే పరిపాలన సాగుతోందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్యారంటీలు, ఇతర హామీల అమలు విషయంలో ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీ ద్వారా మార్పు రావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. డా.శిల్పారెడ్డి అవయవ దానానికి తీసుకున్న నిర్ణయం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు సునీతారెడ్డి, గీతామూర్తి, గొట్టాల ఉమారాణి, ఆకుల విజయ, బండారు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విక్రాంత్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

కాకినాడ సీ పోర్ట్ వాటాల బదిలీ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు

సాక్షి, అమరావతి : కాకినాడ సీ పోర్టు వాటాల బదిలీ వ్యవహారంలో యర్రంరెడ్డి విక్రాంత్‌రెడ్డికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తీర్పు వెలువరించారు. తనను బెదిరించి పోర్టులో వాటాలను అరబిందో సంస్థ కొనుగోలు చేసిందంటూ సీఎం చంద్రబాబు సన్నిహితుడు, పోర్టు ప్రమోటర్ కేవీ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ నమోదు చేసిన ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ విక్రాంత్‌రెడ్డి డిసెంబర్‌లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనల అనంతరం తీర్పు రిజర్వ్ చేసిన న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం తన నిర్ణయాన్ని వెలువరించారు. ఆ తీర్పులో ప్రధానాంశాలు.. 'నాలుగున్నరేళ్ల క్రితం ఘటన జరిగితే ఇప్పుడు ఫిర్యాదు చేశారు. ఈ ఆలస్యంపై ఫిర్యాదుదారు కేవీ రావు నుంచి సంతృప్తికర సమాధానం రాలేదు. జాప్యానికి బెదిరింపులే కారణమని, ప్రభుత్వం మారడంతో ఫిర్యాదు చేశానంటూ ఆయన చేసిన వాదన ఆమోదయోగ్యం కాదు. అయన్ని బెదిరించి ఉంటే, కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు ఎందుకు దాఖలు చేయలేదో వివరణ లేదు. కేవీ రావును బెదిరించడం వల్లే ఆయన వాటాలను నామమాత్రపు ధరకు అరబిందో రియాలిటీకి బదిలీ చేశారన్నదే పిటిషనర్ విక్రాంత్‌రెడ్డిపై ఉన్న ప్రధాన నేరారోపణ. పీకేఎఫ్ శ్రీధర్ సంతానం ఆడిట్ సంస్థతో విక్రాంత్ కుమ్మక్కయి ఆడిట్ రిపోర్ట్‌లో సంఖ్యలను పెంచి చూపారని, దీన్ని అడ్డంపెట్టుకునే కేవీ రావును బెదిరించారని ఆరోపిస్తున్నారు. ఆడిట్ సంస్థతో కలిసి విక్రాంత్‌రెడ్డి సంఖ్యలను పెంచి చూపారనేందుకు ప్రాథమిక ఆధారాలు లేవు. దీనిద్వారా విక్రాంత్ లబ్ధి పొందారని సీఐడీ కూడా చెప్పడంలేదు. ఎఫ్ఐఆర్‌లోనూ ఆడిట్ కంపెనీని విక్రాంత్ కలిసినట్లు లేదు. అంతేకాక అరబిందో కొన్న వాటాల ద్వారా విక్రాంత్‌రెడ్డి ఆర్థికంగా లబ్ధి పొందినట్లు ఎలాంటి ఆరోపణలు లేవు. రిపోర్ట్‌ను ఆడిట్ సంస్థే తయారు చేసిందని కేవీ రావే అంగీకరిస్తున్నారు. అలాంటప్పుడు ఈ నివేదిక విషయంలో విక్రాంత్‌పై నేరారోపణలు చేయడానికి వీల్లేదు. దానిని విక్రాంత్‌రెడ్డి ఫోర్జరీ చేశారన్న ప్రశ్నే తలెత్తదు. 2024 సెప్టెంబర్‌లో తామిచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ప్రాథమిక విచారణ జరిపారని కేవీ రావు చెబుతున్నారు. ఎఫ్ఐఆర్‌ను పరిశీలిస్తే.. 2024 డిసెంబరు 2న కేవీ రావు ఫిర్యాదు చేశారు. అంటే అంతకు ముందు ఎలాంటి ఫిర్యాదు లేదు. ఫిర్యాదు లేకుండానే పోలీసులు ఎలా ప్రాథమిక విచారణ జరిపారో తెలియడంలేదు. నాలుగున్నరేళ్ల జాప్యంతో ఫిర్యాదు చేసినప్పుడు, పోలీసులు ప్రాథమిక విచారణ జరిపి తీరాలి. కానీ, ఇక్కడ ఫిర్యాదు ఇవ్వకపోయినా పోలీసులు ప్రాథమిక విచారణ జరిపారు. దీనినిబట్టి పోలీసులు దర్యాప్తును ఏ తీరున సాగించారన్న దానిపై ఎలాంటి సందేహం అక్కర్లేదు' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

అది కేబినెట్ భేటీ కాదు.. మంత్రుల కుస్తీపోటీ, కలహాల కేబినెట్

- పొంగులేటి కబ్జాలు, భట్టి కమీషన్లు, ఉత్తమ్ ప్యాకేజీల మంత్రులుగా కొనసాగుతున్నారు
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సంచలన ఆరోపణలు



సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర మంత్రులపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. పొంగులేటి కబ్జాల మంత్రిగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కమీషన్ల మంత్రిగా, ఉత్తమ్ ప్యాకేజీల మంత్రిగా కొనసాగుతున్నారని ఆరోపించారు. గురువారం జరిగింది. కేబినెట్ సమావేశం కాదని, అది కుస్తీల పోటీ, కలహాల కేబినెట్ అని అభివర్ణించారు. సీఎం రేవంత్‌రెడ్డి నారాయణపేట–కొడంగల్ ప్రాజెక్టుపై ప్రతిపాదనలు పెడితే, మంత్రులందరూ వ్యతిరేకించినట్టు సమాచారముందని చెప్పారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ పొంగులేటికి చెందిన రాఘవ కంపెనీపై మంత్రుల మధ్య కుస్తీలాట జరిగిందని ఆరోపించారు. ఉద్దండాపూర్ ప్రాజెక్టు రివైజ్డ్ ఎస్టిమేషన్స్ రాఘవ కన్‌స్ట్రక్షన్‌కే రూ.700 కోట్లకు ఎలా పెంచారని మంత్రులు ప్రశ్నించారన్నారు. సీఎం రేవంత్, మంత్రులు ఉత్తమ్, పొంగులేటిల మధ్య గ్యాప్ స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. ఆర్థికశాఖ మంత్రి భట్టి కమీషన్ల మంత్రిగా తయారయ్యారని, పదిశాతం పర్సంటేజీ లేకుండా ఏ పని జరగడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలోని భూములన్నీ పొంగులేటి చేతుల్లో ఉన్నాయని, ఆయన రెవెన్యూ మంత్రి కాదు, కబ్జాల మంత్రి అని వ్యాఖ్యానించారు. ఉత్తమ్.. ఇరిగేషన్ మంత్రి కాదని, ప్యాకేజీల మంత్రి అని ఇరిగేషన్‌లో ప్రతిపని ప్యాకేజీతోనే జరుగుతోందని చెప్పారు. అది ఇరిగేషన్ శాఖనా? ప్యాకేజీల శాఖనా'అని నిలదీశారు. ఉత్తమ్ కన్ను సీఎం కుర్చీపై పడిందని, ప్రతి టెండర్‌లో దోచుకోవడమే కనిపిస్తోందని ఆరోపించారు. రాష్ట్రం దోపిడీకి గురవుతోందని, దీనికి సంబంధించిన అన్ని ఆధారాలు తన దగ్గర ఉన్నాయని, ఏలేటి స్పష్టం చేశారు.

ఉత్పత్తి వ్యయం తగ్గితేనే మరింత సంక్షేమం

సింగరేణి సీఎండీ బలరాం

సాక్షి, హైదరాబాద్: పోటీని తట్టుకొని మార్కెట్‌లో నిలబడాలంటే బొగ్గు ఉత్పత్తి వ్యయం చాలా తగ్గాల్సిన అవసరముందని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం చెప్పారు. కోల్‌ఇండియా, విదేశీ బొగ్గు ధరలతో పోలిస్తే సింగరేణి బొగ్గు ధర ఎక్కువగా ఉంటోందని, ఈ క్రమంలోనే సింగరేణి బొగ్గుకు డిమాండ్ తగ్గుతోందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో గుర్తింపు కార్మిక సంఘమైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌తో జరిగిన 38వ నిర్మాణాత్మక సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు యూనియన్ గౌరవాధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు,గుర్తింపు సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య కార్మికులెదుర్కొంటున్న పలు సమస్యలను యాజమాన్యం దృష్టికి తెచ్చారు. వీటికి సీఎండీ సానుకూలంగా స్పందించారు.

- బొగ్గు మైనింగ్‌లో భాగంగా అధిక ఉత్పత్తి సాధించడంతోపాటు ఆధునిక రక్షణ సాంకేతికతలను వినియోగించుకోవడంలో ఆస్ట్రేలియా కంపెనీలతో కలసి ముందుకు వెళతామని సింగరేణి సీఎండీ ఎన్. బలరాం వెల్లడించారు. సింగరేణిభవన్‌లో శుక్రవారం ఆయన ఆస్ట్రేలియాకు చెందిన 13 కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యారు.

క్లీన్ కోల్ ఎనర్జీ కోసం క్లీన్జ్

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బొగ్గు రంగంలో పర్యావరణ హిత పరిశోధనలు, శిక్షణ కోసం సెంటర్ ఆఫ్ క్లీన్ కోల్ ఎనర్జీ అండ్ నెట్ జీరో (క్లీన్జ్) పేరుతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ను ఏర్పాటు చేస్తున్నట్లు కోల్ ఇండియా లిమిటెడ్, ఐఐటీ హైదరాబాద్ ప్రకటించారు. ఐఐటీ హైదరాబాద్ నేతృత్వంలో ఏర్పాటయ్యే క్లీన్జ్‌కు రూ.98 కోట్ల ప్రారంభ గ్రాంటును కోల్ ఇండియా సంస్థ సమకూరుస్తుంది. శుక్రవారం హైదరాబాద్‌లోని సీజీఓ టవర్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు రెండు సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. బొగ్గు, ఇంధన రంగంలో పరిశోధన సామర్థ్యాన్ని మెరుగుపరిచే దిశగా క్లీన్జ్ ఏర్పాటు ఒక ముందడుగు అని తెలిపారు. కోల్ ఇండియా సిబ్బందికి క్లీన్జ్ నైపుణ్య శిక్షణ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోల్ ఇండియా సీఎండీ పి.ఎం.ప్రసాద్, ఐఐటీహెచ్ డైరెక్టర్ బూదరాజు శ్రీనివాస మూర్తి, సింగరేణి సీఎండీ ఎస్ బలరాం పాల్గొన్నారు.

స్వశక్తి స్వరూపం

- పురుషుల సహకారం లేకుండా విజయాలు సాధిస్తున్న మహిళా పారిశ్రామికవేత్తలు
- స్వీయ ప్రేరణతో ముందుకు.. వ్యాపారాలతో కుటుంబ ఆర్థిక స్థితి మార్చుకుంటున్న మహిళలు

నియోగ్రోత్ సంస్థ సర్వేలో వెల్లడి

సమాజంలో సగమే కాదు.. అంతకంటే ఎక్కువేనని నిరూపిస్తున్నారు మహిళామణులు. కుటుంబాలనే కాదు.. పరిశ్రమలను కూడా విజయవంతంగా నడిపించగలమని చేసి చూపిస్తున్నారు. పురుషుల దన్ను లేకుండా ఏమీ చేయలేరన్న భ్రమలను పటాపంచలు చేస్తూ సొంతంగా వ్యాపారాలు నిర్వహిస్తూ మహిళలు దూసుకుపోతున్నారని నియోగ్రోత్ సంస్థ 'ఆంత్రప్రెన్యూరల్ స్పిరిట్ ఆఫ్ ఉమెన్ బిజినెస్ ఓనర్స్ ఇన్ ఇండియా'పేరిట నిర్వహించిన సర్వేలో తెలింది. దేశంలోని 3,000 మందికిపైగా మహిళా పారిశ్రామికవేత్తలు ఈ సర్వేలో పాల్గొన్నారు.





రెండోస్థానంలో హైదరాబాద్

మహిళా పారిశ్రామికవేత్తలకు సానుకూల వాతావరణం సృష్టించటంలో దేశంలో హైదరాబాద్ నగరం రెండోస్థానంలో నిలిచింది. ఈ అంశంలో హైదరాబాద్ 100కు 94 శాతం పాయింట్లు సాధించింది. 96 శాతంతో కోల్‌కతా మొదటి స్థానంలో ఉంది. 90 శాతంతో అహ్మదాబాద్ మూడో స్థానంలో నిలిచింది.

సర్వేలోని ముఖ్యాంశాలు

* వాణిజ్య, వ్యాపారాలతో తమ కుటుంబాల ఆర్థిక స్థితిగతులను స్వయంగా మెరుగుపర్చుకుంటున్నట్లు సర్వేలో పాల్గొన్నవారిలో 98 శాతం మంది తెలిపారు.
* తమ కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడినట్లు 61% మంది చెప్పగా.. ఆత్మ విశ్వాసం, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పొందినట్లు 54% వెల్లడించారు.
* తమ వ్యాపారాల వల్ల సామాజిక గౌరవం పెరిగినట్లు 90 శాతం మంది పేర్కొన్నారు.

93% మహిళా వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు ఆర్థిక నియంత్రణపై విశేష శ్రద్ధ చూపుతున్నారు.

* 90 శాతం మంది వ్యాపార వృద్ధికి సాంకేతికతను స్వీకరిస్తున్నారు.
* డిజిటల్ పరిష్కారాలు, కస్టమర్ ఎంగేజ్‌మెంట్, ఉత్పాదకత, ఖర్చు తగ్గింపు, చెల్లింపులకు సాంకేతికతను అధికంగా వాడుతున్నారు.
* మహిళా వ్యాపారుల్లో 27 శాతం మంది లింగ వివక్ష, 34 శాతం మంది మార్కెట్ మార్పులు, 32 శాతం మంది వనరుల లోపం వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నారు.
* మహిళా పారిశ్రామికవేత్తల్లో ఎక్కువ మంది తమ లక్ష్యాల సాధనకు స్వయం శక్తి, ప్రేరణతోనే పరిశ్రమలు ప్రారంభించినట్లు చెప్పారు.



* సుమారు 66 శాతం మంది తమ కెరీర్ అనుభవాలతో ఆర్థిక స్వాతంత్ర్యం సాధించాలనే ఉద్దేశంతో వ్యాపారం మొదలు పెట్టామని తెలిపారు. 22 శాతం మంది ఆర్థిక అవసరాలు, 12 శాతం మంది కుటుంబ వ్యాపారాన్ని కొనసాగించాలనే ఉద్దేశంతో వ్యాపారాల్లోకి దిగినట్లు వెల్లడించారు.
* సర్వేలో పాల్గొన్నవారిలో 81 శాతం మంది తమ బిజినెస్‌లను స్వతంత్రంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. 72 శాతం ముఖ్యమైన వ్యాపార నిర్ణయాలను స్వయంగా తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

యువ వర్గంలో (21–30 సంవత్సరాల) ఉన్న వారు వ్యాపార నిర్వహణకు కుటుంబ, స్నేహితుల సహకారంపై అధికంగా ఆధారపడుతున్నట్లు తేలింది. అయితే తమ రంగంలో 40 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న మహిళలు పూర్తి స్వతంత్రంగా వ్యవహరిస్తున్నట్లు వెల్లడైంది.

* సర్వేలో పాల్గొన్నవారిలో 67% మంది తమ వ్యాపారాల ద్వారా ఇతర మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని అందిస్తున్నారు.
* 50 శాతం మంది తమ ఉద్యోగులకు సొంత వ్యాపారం ప్రారంభించేందుకు ప్రేరణ ఇచ్చినట్లు తెలిపారు.




అరుణ్ నయ్యర్, నియో గ్రోత్ ఎండీ, సీఈవో.

నాయకత్వానికి కొత్త నిర్వచనం

వ్యాపారాల్లో భారత మహిళలు ఎదగడం ఎంతో సంతోషకరం. మహిళ నాయకత్వం కేవలం ఆర్థిక విలువనే కాదు, దృఢమైన బిజినెస్ మేనేజ్‌మెంట్, సౌహార్ద్రమైన కార్యాలయ వాతావరణం, సానుకూల పనితీరు ద్వారా నాయకత్వాన్ని పునః నిర్వచిస్తోంది.

సాక్షి, హైదరాబాద్



ఆకాశంలో సగం.. అవకాశాల్లో సగం.. అనే నినాదాన్ని మన దేశ మహిళలు అందిపుచ్చుకుంటున్నారు. అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగంలోనూ మహిళామణులు నాయకత్వ స్థానాల్లో నిలుస్తున్నారు. ఇన్నాళ్లూ భారత ఐటీ రంగంలో నాయకత్వ స్థానాల్లో చాలా వరకు పురుషులే కొనసాగగా.. కొన్నేళ్లుగా పరిస్థితి మారుతోందని 'మెంటార్‌షిప్, లీడర్‌షిప్'కు సంబంధించి పురుషులు–మహిళల మధ్య అంతరం తగ్గుతోందని రిక్రూట్‌మెంట్ కన్సల్టింగ్ ఔట్ సోర్సింగ్ కంపెనీ 'అవ్‌సర్'సర్వే తేల్చింది. సీనియర్ లీడర్‌షిప్ స్థానాల్లో మహిళల నియామకం పెరుగుతోందని వెల్లడించింది.



విస్తృతంగా అధ్యయనం చేసి..

దేశవ్యాప్తంగా 150 ఐటీ కంపెనీల్లోని సీనియర్ లీడర్‌షిప్ పొజిషన్లపై 'అవ్‌సర్'సంస్థ సర్వే చేసింది. ఐటీ పరిశ్రమ సరళి, ఉన్నత స్థానాల్లోని ఉద్యోగుల భర్తీకి అనుసరిస్తున్న ప్రక్రియ, ఈ రంగంలో నాయకత్వం తీసుకొస్తున్న మార్పులు, ఉన్నతస్థానాల్లో పనిచేస్తున్న పురుషులు–మహిళల నిష్పత్తి, ఆయా పోస్టుల్లో ఉన్న వారి ఇస్తున్న వార్షిక వేతనం, మున్ముందు వారికి లభించే అవకాశాలు, పనితీరు, ఉత్తమ ప్రదర్శన ఆధారంగా భవిష్యత్‌లో లభించబోయే నాయకత్వ స్థానాలు తదితర అంశాలను పరిశీలించింది. ఈ మేరకు తాజాగా విడుదల చేసిన నివేదికలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. 2023లో ఐటీ సంస్థలు, వాటిలోని వివిధ విభాగాల్లో సీనియర్ నాయకత్వ స్థానాల్లో 18.7శాతం మంది మహిళలు ఉంటే.. 2024 నాటికి 23 శాతానికి పెరిగినట్టుగా సర్వేలో వెల్లడైంది.

ఐటీ ఎమర్జింగ్ లీడర్‌షిప్ హాట్‌స్పాట్స్..

48% ▶ మహిళలకు ఐటీ లీడర్‌షిప్ హైరింగ్‌లో బెంగళూరు ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక్కడ సీనియర్ పోస్టుల నియామకాల్లో 48శాతం మహిళలు ఉంటున్నారు.

22% ▶ ఈ అంశంలో 22శాతం మహిళల నియామకాలతో హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో పుణె (20%), ఢిల్లీ (12%),చెన్నై (10%), ముంబై (8%) ఉన్నాయి.



నాయకత్వ స్థానాల్లోని మహిళలు

18.7% 2023 | 2024 23%

- సీనియర్ లీడర్‌షిప్ పోస్టుల్లో పెరుగుతున్న మహిళల శాతం
- 150 ఐటీ కంపెనీల్లో విస్తృత సర్వే
- మహిళలకు లీడర్‌షిప్ పోస్టులు బెంగళూరులో అత్యధికం..

'అవ్‌సర్'తాజా నివేదికలో వెల్లడి

నాయకి..



నవ్‌నీత్‌సింగ్, ఫౌండర్–సీఈవో, అవ్‌సర్ సంస్థ

వినూత్న ఆలోచనలతో మహిళల నాయకత్వం

ఐటీలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. ఈ రంగంలో 'సీనియర్ లీడర్‌షిప్'స్థానాల్లో 20శాతానికి పైగానే మహిళలు కొనసాగుతున్నారు. వినూత్న ఆలోచనలు, నూతన దృక్పథాలు, ధోరణులతో మహిళలు నాయకత్వ స్థానాల్లోకి ఎదుగుతున్నారు. నేటి సాంకేతిక, వ్యాపార సంబంధిత చిక్కు సమస్యలను తమదైన వ్యూహాలతో చక్కగా పరిష్కరిస్తున్నారు.

సర్వేకు సంబంధించిన కీలక అంశాలివీ..

* ఐటీ సంస్థల్లో చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీవో), చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఐఎస్‌వో), చీఫ్ డేటా ఆఫీసర్ (సీడీవో), చీఫ్ ఏఐ ఆఫీసర్ (సీఏవో) వంటివి డిమాండ్ ఉన్న 'జాబ్‌రోల్స్'గా గుర్తించారు. ఈ పోస్టుల్లో ఉండేవారు విధుల నిర్వహణలో భాగంగా సాంకేతిక నైపుణ్యాలే గాకుండా వ్యూహాత్మకమైన ముందుచూపు, ఏఐ, డేటా ఆధారిత నిర్ణయాధికారం, సైబర్ సెక్యూరిటీ వంటి అంశాల్లో తమ సంస్థలను ముందుకు తీసుకెళ్లాల్సి ఉంటుంది.
* ఇలాంటి కీలక బాధ్యతలు నిర్వహించే మహిళా ఉద్యోగులకు సంబంధించి.. ఏటా సీటీవోలకు రూ.1.5–4.5 కోట్ల మధ్య వేతనాలు అందుతున్నట్టు సర్వేలో గుర్తించారు. సీఐఎస్‌వోలకు రూ.కోటి నుంచి రూ.3 కోట్లు, సీడీవోలకు రూ. 1.2–3.8 కోట్ల దాకా, సీఏవోలకు రూ.1.5–3 కోట్ల దాకా సంస్థలు ఆఫర్ చేస్తున్నట్టు సర్వేలో తేల్చారు

దీనిని బట్టి నూతన ఆవిష్కరణలతోపాటు మహిళలకు ఆయా రంగాల్లో మంచి అవకాశాలు లభిస్తున్నాయని సర్వే పేర్కొంది.

నా భర్త వల్లే బతికి ఉన్నా

ఆయనతో ఎలాంటి విభేదాలు లేవు
వీడియో విడుదల చేసిన సింగర్ కల్పన



కేపీహెచ్‌బీ కాలనీ: భర్తతో తనకు ఎలాంటి విభేదాలు లేవని ప్రముఖ గాయని కల్పన తెలిపారు. తాను ఈ రోజు ప్రాణాలతో ఉన్నానంటే తన భర్త వల్లేనని చెప్పారు. ఇటీవల నివాసంలో అపస్మారక స్థితిలో కనిపించిన ఆమెను స్థానికులు ఆసుపత్రిలో చేర్పించటంతో చికిత్స పొందుతున్నారు. అయితే, ఆమె కుటుంబ కలహాల వల్ల ఆత్మహత్యాయత్నం చేశారని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ ప్రచారాన్ని ఖండిస్తూ ఆమె శుక్రవారం ఒక వీడియోను విడుదల చేశారు. మానసిక ఒత్తిడి, ఇన్సోమియాకు ట్రీట్‌మెంట్ తీసుకునే క్రమంలో వైద్యుల సూచనల మేరకు నిద్ర మాత్రలు వాడుతున్నానని, ఆ రోజు వేసుకున్న మాత్రలు ఓవర్ డోస్ అవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు వివరించారు. తన భర్త ప్రోత్సాహంతోనే పీహెచ్‌డీ, ఎల్‌ఎల్‌బీ చేస్తున్నానని చెప్పారు. చదువుతో పాటు అన్ని విషయాల్లో తన భర్త మద్దతుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన రోజు నా భర్త సరైన సమయంలో పోలీసులను అప్రమత్తం చేసినందువల్లే తనను కాపాడారని వివరించారు. కుటుంబంతో సంతోషంగా ఉన్నట్లు వెల్లడించారు. తాను అమితంగా ఇష్టపడేది భర్త ప్రభాకర్, కుమార్తె దయాప్రసాద్‌లనేనని తెలిపారు. తన ప్రాణాలు కాపాడడంలో సహకరించిన పోలీసులకు, మీడియాకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కాగా, కల్పన వేగంగా కోలుకుంటున్నారని ఆమెకు చికిత్స అందిస్తున్న వైద్యులు తెలిపారు. రెండుమూడు రోజుల్లో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

మోడల్‌స్కూల్ ప్రవేశాల దరఖాస్తు గడువు 20 వరకు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో ఆరోతరగతి ప్రవేశాలతో పాటు 7, 8, 9, 10 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి సంబంధించి అర్హత పరీక్ష దరఖాస్తు గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు మోడల్ స్కూల్స్ ప్రాజెక్టు డైరెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి దరఖాస్తు గడువు ఈనెల 10వ తేదీ వరకు ఉందని, విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో గడువు తేదీని పదిరోజుల పాటు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఈ అర్హత పరీక్ష కోసం ఇప్పటివరకు 32,900 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు.

నా తల్లే నాకు హీరో

తండ్రి మరణించినా కష్టపడి పెంచిందన్న ఏసీజే

- జిల్లా కోర్టుల్లో మహిళా భాగస్వామ్యం పెరుగుతోంది
- హెచ్‌సీఏఏ మహిళా దినోత్సవంలో జస్టిస్ సుజోయ్‌పాల్
- మహిళా న్యాయమూర్తులతో పాటు జడ్జిల హాజరు





అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న హైకోర్టు తాత్కాలిక సీజే జస్టిస్ సుజోయ్ పాల్. చిత్రంలో హైకోర్టు న్యాయమూర్తులు

సాక్షి, హైదరాబాద్: తన జీవితంలో తల్లే నిజమైన హీరో అని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. తన 15 ఏళ్ల వయసులో తండ్రి మరణించారని, తల్లి ఒక పాఠశాలలో అసిస్టెంట్ టీచర్‌గా చేరి తమను పెంచడానికి చాలా కష్టపడిందని గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయురాలిగా 35 ఏళ్లు పనిచేసి, రాష్ట్రపతి నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుందని చెప్పారు. హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ సుజోయ్ పాల్ మాట్లాడుతూ.. నేషనల్ జ్యుడీషియల్ అకాడమీలో గడిపిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ, జిల్లా కోర్టుల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతోందన్నారు. న్యాయవ్యవస్థలో 70 శాతం జడ్జిల పోస్టుల్లో మహిళలున్నారని, పురుషుల కోసం 30 శాతం రిజర్వు చేశారని చమత్కరించారు.

తమను తాము నిరూపించుకోవాలి

అతిథిగా హాజరైన సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ మౌషుమి భట్టాచార్య మాట్లాడుతూ.. లింగ భేదానికి తావులేకుండా తమను తాము నిరూపించుకున్నప్పుడే మహిళలు నిజంగా సంతోషంగా ఉంటారన్నారు. దేశవ్యాప్తంగా 33 శాతం మహిళా న్యాయమూర్తులున్న అతి కొద్ది హైకోర్టుల్లో తెలంగాణ ఒకటని జస్టిస్ రాధారాణి వెల్లడించారు. జిల్లా కోర్టులతో పోలిస్తే హైకోర్టులు, సుప్రీంకోర్టు ఈ శాతంలో వెనుకబడి ఉన్నాయన్నారు. సమాజంలో మహిళలు శక్తివంతంగా మారితే అది శాంతికి, శ్రేయస్సుకు దారితీస్తుందని జస్టిస్ నందా పేర్కొన్నారు. కార్యక్రమంలో జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ జువ్వాడి శ్రీదేవి, జస్టిస్ పుల్ల కార్తీక్, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి, జస్టిస్ కె.సుజన, జస్టిస్ రేణుక యారా, జస్టిస్ నర్సింగ్‌రావు నందికొండ, జస్టిస్ తిరుమలాదేవి, జస్టిస్ మధుసూదన్‌రావు, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు ఏ.రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు దీప్తి, కార్యదర్శులు శాంతిభూషణ్‌రావు, సంజీవ్‌రెడ్డి, అదనపు కార్యదర్శి నవీన్ వాసిరెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఎంత ఎదిగినా వివక్షే

నేటితరం మహిళలు రాబోయే తరానికి రోల్ మోడల్స్ కావాలి: సీతక్క



సాక్షి, హైదరాబాద్/వెంగళరావునగర్: మహిళలు ఎంత ఎత్తుకు ఎదిగినా వివక్ష కొనసాగుతూనే ఉందని, వారు ఎమ్మెల్యేలు, మంత్రులు, ఐఏఎస్‌లు అయినా అసమానతలను ఎదుర్కొంటున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి రంగంలో మహిళల స్థానాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని చెప్పారు. నేటితరం మహిళలు వ్యాపార, వాణిజ్య రంగాల్లో దూసుకుపోతూ రాబోయే తరానికి రోల్ మోడల్స్ కావాలని ఆకాంక్షించారు. 'మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడాలి, రాజకీయ రంగంతోపాటు మిగతా అన్ని రంగాల్లో నిర్ణయాత్మక శక్తిగా మారాలి'అని సీతక్క పిలుపునిచ్చారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (నిమ్స్‌మే) సంస్థ ప్రాంగణంలో జరిగిన మహిళా సాధికారత యాక్షన్‌ప్లాన్ వర్క్‌షాప్ కార్యక్రమానికి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలకు ఎన్నో ప్రతికూలతలు ఎదురవుతున్నా వాటన్నిటినీ అధిగమించి ముందంజ వేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్, నిమ్స్‌మే డైరెక్టర్ జనరల్ గ్లోరీ స్వరూప, ఇతర అధికారులు పాల్గొన్నారు. వివిధ అంశాల్లో విజయం సాధించిన వారికి బహుమతు ప్రదానం చేశారు.

ముందంజలో ఉండేలా పనిచేస్తున్నాం

ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని, ప్రతి కుటుంబం అభివృద్ధి చెంది అన్ని రంగాల్లో మహిళలను ముందంజలో ఉంచాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని సీతక్క పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు సీతక్క శుభాకాంక్షలు తెలిపారు.

టెన్త్ హాల్ టికెట్లు విడుదల

సాక్షి, హైదరాబాద్: పదవ తరగతి పరీక్ష హాల్ టికెట్లు అన్ని స్కూళ్లకు పంపినట్టు టెన్త్ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు బీఎస్సీ తెలంగాణ వెబ్‌సైట్ నుంచి కూడా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. పరీక్షలకు సంబంధించిన సందేహాలు నివృత్తి చేయడానికి కంట్రోల్ రూం కూడా ఏర్పాటు చేశామన్నారు. 040–23230942 నెంబర్‌కు ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు. టెన్త్ పరీక్షలు ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్నాయి. సైన్స్ సబ్జెక్టు మాత్రం రెండు భాగాలుగా విభజించారు. ఈ పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు జరుగుతుందని తెలిపారు.

ప్రగతి సాధించినా కష్టాల్లోనే ప్రజలు

కాంగ్రెస్ నిజ స్వరూపాన్ని ప్రజలు తెలుసుకున్నారు: కేసీఆర్



మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో హరీశ్, మధుసూదనాచారి, టంకశాల అశోక్, బండ ప్రకాశ్, కేటీఆర్, సురేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్ల పాటు అప్రమత్తంగా పాలించి ప్రగతిలో దేశానికే ఆదర్శంగా నిలిపినా, నేడు తెలంగాణ సమాజం కష్టాల్లో ఉందని బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. గ్యారంటీల పేరిట ఆశలు పెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నిజ స్వరూపాన్ని ప్రజలు తెలుసుకున్నారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీయే తమకు రక్షణ కవచమని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలు కాపాడేందుకు మరింతగా పోరాడాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎర్రవల్లి నివాసంలో పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా భేటీ అయ్యారు. సుమారు ఎనిమిది గంటలకు పైగా జరిగిన ఈ సమావేశంలో కీలక నిర్ణయాలను వెల్లడించడంతో పాటు రాష్ట్ర, జాతీయ రాజకీయాలకు సంబంధించి అనేక అంశాలను కేసీఆర్ ప్రస్తావించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

సభ కోసం త్వరలో కమిటీలు

'ఈ ఏడాది ఏప్రిల్ 27 నాటికి బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో వరంగల్‌లో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహిద్దాం. జనగామ, కామారెడ్డి, కరీంనగర్ తదితర ప్రదేశాలను పరిశీలించినప్పటికీ, మొదటి నుంచి ఉద్యమ కేంద్రంగా ఉన్న వరంగల్ అయితే అందరికీ చేరువలో ఉంటుందని భావిస్తున్నా. సభ నిర్వహణకు అనువైన ప్రదేశాలను మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం వెళ్లి పరిశీలిస్తారు. సభను విజయవంతం చేసేలా నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించేందుకు త్వరలో కమిటీలు ఏర్పాటవుతాయి'అని కేసీఆర్ చెప్పారు.

యువత, మహిళల భాగస్వామ్యం పెరగాలి

'బీఆర్‌ఎస్ తెలంగాణ సమాజ అస్తిత్వానికి చిహ్నంగా, ప్రజలకు రక్షణ కవచంలా పని చేస్తోంది. రజతోత్సవాలు కేవలం బీఆర్‌ఎస్‌కే పరిమితం కాకూడదు. మొత్తం తెలంగాణ సమాజాన్ని భాగస్వాములను చేసేలా ఏడాది పొడవునా కార్యక్రమాలు ఉంటాయి. తెలంగాణ సమాజం గర్వించేలా వేడుకలు నిర్వహించాలి. వరంగల్ సభ తర్వాత పార్టీని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పటిష్టం చేసి కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తాం. కొత్త కమిటీలు ఏర్పాటైన తర్వాతే ప్రతినిధుల సభ (ప్లీనరీ) జరుగుతుంది. పార్టీలో యువత, మహిళల భాగస్వామ్యం పెరిగేలా 'హాల్ మీటింగ్స్'నిర్వహించాలి. సోషల్ మీడియా ద్వారా పార్టీ ఆశయాలు, భావజాలం ప్రచారం చేయాలి. తెలంగాణ స్ఫూర్తిని పెంచాలి..'అని బీఆర్‌ఎస్ అధినేత సూచించారు.

భవిష్యత్తుకు బాటలు వేసేలా కార్యాచరణ

'రాష్ట్రంతో పాటు జాతీయ స్థాయిలో వర్తమాన రాజకీయ పరిస్థితులు ప్రజల కోణంలో ఆశాజనకంగా లేవు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాపాడుకుంటూ వస్తున్నది బీఆర్‌ఎస్ పార్టీయే. గడిచిన 14 నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, అనిశ్చితి నెలకొంది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలు మొదటి నుంచి తెలంగాణ సమాజానికి అన్యాయం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీని పటిష్టం చేసుకుంటూ దేశ రాజకీయ పరిణామాలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. భవిష్యత్తుకు బాటలు వేసే విధంగా కార్యాచరణ అమలు చేయాలి. బీసీలకు జనాభా దామాషాలో రిజర్వేషన్లు కల్పించాలనే అంశానికి బీఆర్‌ఎస్ సంఘీభావం తెలుపుతోంది..'అని కేసీఆర్ చెప్పారు.

ముఖ్య నేతలతో సుదీర్ఘ భేటీ

ఎర్రవల్లి భేటీకి పరిమిత సంఖ్యలోనే ముఖ్య నేతలకు ఆహ్వానం అందింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతో పాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి, జగదీశ్‌రెడ్డి, సబితారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, జోగు రామన్న, శ్రీనివాస్‌గౌడ్, పువ్వాడ అజయ్, ఎంపీలు సురేశ్‌రెడ్డి, రవిచంద్ర, పార్థసారథి రెడ్డి, మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, కవిత, తాతా మధు, ఎమ్మెల్యే పల్లా, పార్టీ నేతలు రసమయి బాలకిషన్, వెంకట వీరయ్య, దాసోజు శ్రవణ్, ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



జాతీయ మహిళా దినోత్సవం

గాన కోకిల జయంతి

మనకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఉన్నట్లే 'జాతీయ మహిళా దినోత్సవం' కూడా ఉంది. ఫిబ్రవరి 13 స్వాతంత్ర్య సమరయోధురాలు, బాల మేధావి, కవయిత్రి సరోజినీ నాయుడు జయంతి. స్వాతంత్ర్యోద్యమంలో సరోజిని నాయుడు పోషించిన ముఖ్యమైన పాత్ర, మహిళల హక్కుల కోసం ఆమె చేసిన కృషికి గుర్తింపుగా జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటారు.



నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సమతుల్యత సాధించాలి

- డాక్టర్ సంగీతారెడ్డి,
అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్



ప్రతిభ, అభివృద్ధికి దోహదపడే వాతావరణాన్ని సృష్టించడం నిరంతరం కృషి ద్వారానే సాధ్యం' అంటున్నారు అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి. మహిళా దినోత్సవ సందర్భంగా డాక్టర్ సంగీతారెడ్డి మహిళా నాయకత్వం, సామర్థ్యాల గురించి వివరించారు..

''ఏ రంగంలోనైనా నాయకత్వం వహించడానికి దూరదృష్టి, కొత్త ఆవిష్కరణలపై అవిశ్రాంత కృషి అవసరం. సాంకేతికతంగా వస్తున్న మార్పులను అమలు చేయడంలో, టీమ్ వర్క్‌ను బలోపేతం చేయడంలో ముందుండాలి. బలమైన నాయకులుగా ఉండాలంటే పనిలో నైపుణ్యాలతో పాటు వైవిధ్యాన్నీ పెంపొందించాలి. సక్సెస్ ఉద్దేశం ఒక్కరమే ఎదగడం కాదు, అర్థవంతమైన మార్పుతో మనతోపాటు ఉన్నవారితో కలిసి నడవడం.

సమతుల్యం చేయడంలోనే సవాళ్లు

వైద్య రంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. అయినప్పటికీ నిత్యం సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నారు. వృత్తిపరంగా ఎదగడంలోనూ, వ్యక్తిగత బాధ్యతలతో బాలెన్స్ చేయడం అనేది అతిపెద్ద అడ్డంకిగా మారింది. కెరీర్–ఇల్లు రెండింటినీ సమర్థంగా నిర్వహించడానికి సమాజం ఇప్పటికీ మహిళలపై చెప్పలేనన్ని అంచనాలను ఉంచుతోంది. రెండుచోట్లా మహిళలు అభివృద్ధి చెందడానికి వీలు కల్పించే వాతావరణం ఉండాలి. అలా లేకపోవడంతో 'ఆమె సమర్థత'కు ప్రతిబంధకాలు ఏర్పడుతున్నాయి. మన సమాజంలో మరొక సవాల్ లోతుగా పాతుకుపోయిన లింగ వివక్ష. నాయకత్వ అవకాశాలను పరిమితం చేసేది ఇదే.

నాయకత్వం జెండర్‌తో కాదు సామర్థ్యం వల్లే సాధ్యం అని నిరూపించడానికి మహిళ మరింత కష్టపడి పనిచేయాలి. మహిళల అభివృద్ధి నుండి మహిళల నేతృత్వంలోని అభివృద్ధికి మరింత చురుగ్గా వ్యవహరించాలి. డెసిషన్ మేకర్స్ జాబితాలో ఎక్కువ మంది మహిళలకు స్థానం ఉండేలా చూసుకోవాలి. మిగతావాటికన్నా వైద్యరంగం భిన్నమైనది, లోతైనది కూడా. ఎందుకంటే ఇక్కడ ప్రాణాలను కాపాడటం, ఆరోగ్య ఫలితాలలో మంచి మార్పులు తీసుకురావడంపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. టెక్నాలజీని అందిపుచ్చుకోవడం, సరిహద్దులను దాటి ఆలోచించడం, యథాతథ స్థితి కొనసాగేలా టీమ్స్‌ను ప్రోత్సహించడం... వంటివి వేగంగా అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలో మనల్ని ముందు ఉంచుతుంది.

మార్పులు తప్పనిసరి

రోల్ మోడల్స్ మార్గదర్శకత్వంతో పాటు అవకాశాలను అందిపుచ్చుకుంటూ ముందుకు వెళ్లాలి. వ్యవస్థాగత అడ్డంకులను పరిష్కరించాలి. పనిప్రదేశంలో సమాన వేతనం, నిష్పాక్షికమైన కెరీర్ పురోగతికి మద్దతు ఇవ్వాలి. ముఖ్యంగా, మహిళల అభివృద్ధి నుండి మహిళల నేతృత్వంలోని అభివృద్ధికి మారాలి. మహిళలు ఆరోగ్య సంరక్షణలో పాల్గొనేవారు మాత్రమే కాదు, భవిష్యత్తుకు చురుకైన రూపశిల్పులుగా మారాలి.

నెట్‌వర్క్‌ను నిర్మించుకోవాలి

సాధారణంగా మహిళలు రిస్క్ తీసుకొని, తమ స్థానాన్ని సాధించేందుకు వెనకాడతారు. మీ ముందు చూపును, అంతర్దృష్టిని నమ్మండి. బలమైన మద్దతునిచ్చే నెట్‌వర్క్‌ను నిర్మించుకోండి. విజయం ఎప్పుడూ ఒంటరి ప్రయాణం కాదు. మిమ్మల్ని సవాలు చేసేవారు, మార్గదర్శకులు, సహచరులు, టీమ్స్‌తో ముందుకు కదలాలి. నేర్చుకోవడాన్ని ఎప్పుడూ ఆపవద్దు. సవాళ్లను సోపానక్రమాలుగా స్వీకరించాలి. ప్రతి అడ్డంకిని నూతనంగా ఆవిష్కరించడానికి, అభివృద్ధి చెందడానికి ఒక అవకాశం అనుకోవాలి. మహిళా వ్యవస్థాపకులు పరిశ్రమలను రూపొందిస్తున్నారు, ఇది మన సమయం అని గుర్తించండి'' అంటూ మహిళాభ్యున్నతికి మార్గదర్శకం చేస్తున్నారు డాక్టర్ సంగీతారెడ్డి.

– నిర్మలారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

శ్రమతోనే సక్సెస్

- పి.వి. సింధు, క్రీడాకారిణి

పూసర్ల వెంకట సింధు... ఒలింపిక్స్‌లో పతకాలు సాధించింది. కామన్‌వెల్త్... వరల్డ్ చాంపియన్‌షిప్‌లలో స్వర్ణాలు సొంతం చేసుకుంది. ప్రపంచవేదికల మీద దేశ పతాకాన్ని సగర్వంగా ఎగురవేసింది. భారత మాత మెడలో పతకాల హారం వేసి బంగారు సింధు అయింది. ఈ ఏడాది మహిళాదినోత్సవాన్ని శ్రీమతి సింధుగా వేడుక చేసుకుంటోంది. సాధికారత దిశగా పయనిస్తున్న మహిళలకు అభినందనలు చెప్పింది.

ఈ తరంలో మహిళలు బిజినెస్, స్పోర్ట్స్‌తో పాటు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. కేవలం తమకు తాము నిలదొక్కుకోవడంతో సరిపెట్టడం లేదు, ఆ రంగంలో నంబర్ వన్‌గా నిలవడానికి శ్రమిస్తున్నారు. నంబర్ వన్ లక్ష్యాన్ని సాధిస్తున్నారు కూడా. ఈ స్ఫూర్తిని, ఇదే పంథాను కొనసాగించాలని అభిలషిస్తున్నాను.



సక్సెస్‌కు దారి!

ప్రతి ఒక్కరూ తమ కోసం తాము కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. వాటిని చేరుకోవడానికి తగినంత శ్రమించాలి. సక్సెస్ అనే లక్ష్యాన్ని చేరడానికి ఉన్న ఏకైక దారి హార్డ్‌వర్క్. హార్డ్‌వర్క్‌తో మాత్రమే విజయానికి చేరువ కాగలుగుతాం. అది కూడా ఒక నెల శ్రమతోనో ఏడాది శ్రమతోనో శిఖరాన్ని చేరాలని ఆశించకూడదు. కొన్నేళ్ల కఠోరశ్రమ, అంకితభావంతో శ్రమించినప్పుడే సక్సెస్ మనదవుతుంది. అయితే కొందరికి సక్సెస్ కొంత త్వరగా రావచ్చు, మరికొందరికి ఆలస్యం కావచ్చు. మన మీద మనం నమ్మకాన్ని కోల్పోకూడదు. ఆశను వదులుకోకూడదు, నిరాశపడకూడదు. మనం మనవంతుగా శ్రమిస్తూ ఉండాలి. సక్సెస్ వచ్చినప్పటి నుంచి మరింత బాధ్యతగా పని చేయాలి. సక్సెస్ అనే శిఖరాన్ని చేరాం అని రిలాక్స్ కాకూడదు. నంబర్ వన్‌కి చేరడానికి నేనలాగే కష్టపడ్డాను, కష్టపడుతూనే ఉంటాను కూడా.

అమ్మానాన్న... భర్త!

ఇప్పటి వరకు నన్ను, నా ఆర్థిక వ్యవహారాలను అమ్మానాన్న చూసుకునేవారు. టోర్నమెంట్‌కి తోడుగా నాన్న వచ్చేవారు. ఇప్పుడు మా వారు వస్తున్నారు. నా గురించి అన్నీ వాళ్లే చూసుకుంటారు. నా ఫోకస్ అంతా ఆట మీదనే కేంద్రీకరించడానికి తగిన వెసులుబాటునిస్తున్నారు.

పేరెంట్స్ నడిపించాలి!

దేశానికి కొత్తతరం క్రీడాకారులు తయారు కావాలి. క్రీడాకారులను తయారు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. పిల్లలకు స్పోర్ట్స్ మీద ఆసక్తి ఉన్నప్పటికీ తల్లిదండ్రుల సహకారం లేకపోతే క్రీడాకారులు తయారుకారు. పిల్లలను క్రీడల దిశగా నడిపించడం పేరెంట్స్ చేతిలోనే ఉంటుంది. ఆటలు, చదువు రెండూ కీలకమే. రెండింటినీ ఎలా బాలెన్స్ చేసుకోవాలో నేర్పించగలిగింది కూడా పేరెంట్సేనని నా అభిప్రాయం. పేరెంట్స్‌కి కోరిక ఉన్నప్పటికీ పిల్లలకు ఆడాలనే ఆసక్తి లేకపోతే ఆ పిల్లలు దీర్ఘకాలం కొనసాగడం కష్టం. అలాగే ఆటల పట్ల ఆసక్తి ఉన్న పిల్లలకు పేరెంట్స్ సహకారం లేకపోతే తొలి అడుగు కూడా పడదు. అందుకే తల్లిదండ్రుల పాత్ర చాలా ముఖ్యం.

సింధుగానే గుర్తించాలి!

సమాజం నన్ను సింధుగానే గుర్తించాలి. 'పీవీ సింధు' అనగానే చేతిలో రాకెట్‌తో నా రూపం కళ్ల ముందు మెదులుతుంది. అలా నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నాను. దేశం కోసం ఆడగలిగే స్థాయికి చేరాను. దేశం కోసం ఆడాను. దేశానికి ఎన్నో పతకాలను సాధించాను. దేశానికి గౌరవాన్ని పెంచడంలో నా శ్రమ కూడా ఉందని సంతోషపడుతున్నాను. ఈ గుర్తింపు ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

హాస్యచతురత.. సమయస్ఫూర్తి అని గూగుల్ చేస్తే సుమ కనకాల అని వస్తుందేమో! అందుకే ఇన్నేళ్లయినా ఆమె యాంకరింగ్‌కి ఆదరణ తగ్గలేదు.. తన పేరుతోనే షోలకు ఫాలోయింగ్‌ని పెంచే స్థాయికి చేరుకుంది.. ఆ తరం నుంచి ఈ తరం దాకా అందరికీ అభిమాన హోస్ట్‌గా మారిపోయింది.. ఇంటర్నేషనల్ విమెన్స్ డే ఉత్సవాన ఆమె గురించి ఆమె మాటల్లోనే..



కష్టాన్నే నమ్ముకోవాలి

- సుమ, యాంకర్

'నేను పుట్టింది కేరళలోని పాలక్కాడ్‌లో. పెరిగింది మాత్రం హైదరాబాద్‌లోనే. అందుకే చిన్నప్పటి నుంచీ తెలుగు తెలుసు. మెట్టుగూడ రైల్వేక్వార్టర్స్‌లో ఉండేవాళ్లం. తార్నాకలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్లో చదివాను. రైల్వే డిగ్రీ కాలేజీలో గ్రాడ్యుయేషన్ చేశాను. తెలుగులో ఫ్లుయెన్సీ ఉండాలని మా అమ్మగారు పట్టుబట్టడం వల్ల స్కూల్లో తెలుగును సెకండ్ లాంగ్వేజ్‌గా తీసుకున్నాను. ఇండస్ట్రీకి వచ్చిన తర్వాత రైటర్స్, డైరెక్టర్స్ ద్వారా కొంత తెలుగు నేర్చుకున్నాను. తెలుగు మీద నాకు పూర్తి పట్టు రావడంలో నా భర్త రాజీవ్ హెల్ప్ కూడా ఉంది. పుట్టింట్లో ఉన్నప్పుడు మాత్రమే మలయాళం .. మిగతా అంతా తెలుగే!

దూరదర్శన్ మాత్రమే..

ఈ ఫీల్డ్‌లోకి చిత్రంగా వచ్చాను. నేను చేసిన ఓ డాన్స్ ప్రోగ్రామ్ నచ్చి, దూరదర్శన్ సీరియల్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఉమామహేశ్వరరావు గారు ఫోన్ చేశారు.. 'ప్రదీప్ గారి డైరెక్షన్‌లోని ఓ సీరియల్‌లో మమ్మల్ని కాస్ట్ చేయాలనుకుంటున్నాం.. మీకు ఇంట్రెస్ట్ ఉందా?' అంటూ! నాకు లేదు కానీ మా పేరెంట్స్ సరదాపడ్డారు. దాంతో ఓకే అన్నాను. అలా తెలుగు టెలివిజన్ రంగంలోకి అడుగుపెట్టాను. అప్పుడు దూరదర్శన్ చానల్ మాత్రమే ఉండేది. అందులో ఎక్కువగా సింగిల్ ఎపిసోడ్సే ఉండేవి. అందుకనే నేను సింగిల్ ఎపిసోడ్స్‌లోనే ఎక్కువగా చేశాను. కొన్ని సినిమా బేస్ట్ ప్రోగ్రామ్స్‌కి యాంకరింగ్ కూడా చేశాను. శాటిలైట్ చానల్స్ స్టార్ట్ అవగానే పూర్తిగా యాంకరింగ్‌కి షిఫ్ట్ అయిపోయాను.

'అంత్యాక్షరి', 'వన్స్ మోర్' నుంచి 'అవాక్కయ్యారా', 'స్టార్ మహిళ' లాంటి ఎన్నో షోస్‌ని హోస్ట్ చేశాను. 'స్టార్ మహిళ' నేను మరచిపోలేని షో. దాదాపు 12 సంవత్సరాలపాటు అయిదు వేల షోస్ చేసి లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాను. ఆ షోతో ఎంతో మంది మహిళలు తమ వ్యక్తిత్వాలతో నన్ను ఇన్‌స్పైర్ చేశారు. సొంత మనిషిలా ఆదరించారు. అవకాశముంటే మళ్లీ ఆ షో చేయాలనుకుంటున్నాను. తెలుగువారితో ఆ అనుబంధం రోజురోజుకీ బలపడుతోంది. జీన్స్, క్యాష్.. ఇప్పుడు 'సుమ అడ్డా' ప్రోగ్రామ్స్‌కి దొరుకుతున్న ఆదరణే అందుకు సాక్ష్యం.

బహుభాషలతో ప్రయోజనం

యాంకరింగ్ పర్సనల్ క్యారెక్టర్‌కి ప్రతిబింబం లాంటిది. ఈ విషయంలో నాకున్న జోవియల్ నేచర్, సమయస్ఫూర్తి చాలా హెల్ప్ అయ్యాయి. దాంతోపాటు నాకు బహుభాషలు తెలిసుండటమూ ప్లస్ పాయింట్ అయింది. మాతృభాష మలయాళం అవడం, తమిళ్, హిందీ కూడా వచ్చి ఉండటం, ఇంగ్లిష్‌లో ఫ్లుయెన్సీ వల్ల.. ఏదైనా అవార్డ్ ఫంక్షన్స్‌కి రెండు, మూడు భాషల వాళ్లు వచ్చినప్పుడు కమ్యూనికేట్ చేయడం, వాళ్ల సినిమాల గురించి మాట్లాడటం చాలా ఈజీ అయిపోతోంది. ప్రొఫెషన్‌లో ఎదురయ్యే సవాళ్లను సమయస్ఫూర్తితోనే నెగ్గుకొస్తాను. నావి ఎక్కువగా లైవ్ షోస్ కాబట్టి ఎడిటింగ్‌కి స్కోప్ ఉండదు. నాకు నేనే ఎడిటర్‌గా వ్యవహరించుకోవాలి. ఆచితూచి మాట్లాడాలి. నేను నటించిన సీరియల్స్, సినిమాలు నాకు చాలా నేర్పించాయి. ఈ ప్రొఫెషన్‌కు చక్కటి బాట వేశాయి. మా అత్తగారివైపు అందరూ ఇదే ఫీల్డ్‌కు చెందిన వాళ్లవడం నాకు కలిసొచ్చింది. వర్క్, లైఫ్ బ్యాలెన్స్ సాధ్యమైంది. మా ఇంట్లో నా షోస్‌కు బిగ్గెస్ట్ ఫ్యాన్స్.. మా అత్తగారు, మా అమ్మగారు.

ఇప్పుడు..

నా యూట్యూబ్ చానల్‌లో 'చాట్ షో'ని స్టార్ట్ చేశాను. అలాగే 'షెఫ్ మంత్ర' అనే కొత్త షో కూడా మొదలైంది, 'ప్రేమంటే' అనే ఒక సినిమాలో కీ రోల్ చేస్తున్నాను. దేవాలయాల మీద 'అవర్ టెంపుల్స్' అనే సిరీస్ చేయాలి అనుకుంటున్నాను. టాలెంట్‌కి ఆకాశమే హద్దు. ఒక రీల్ షూట్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే చాలు.. వైరల్ అయిపోవచ్చు. ఫోన్లలో రీల్స్‌తో ఎంటర్‌టైన్ అవుతున్న కాలం ఇది. కాబట్టి అందులో కూడా నా ఎంటర్‌టైన్‌మెంట్ పోర్షన్‌ను అందిస్తున్నాను. లీజర్‌టైమ్ దొరికితే.. వెబ్ సిరీస్, మూవీస్ చూస్తాను.

నాకు అత్యంత మెమరబుల్ మూమెంట్ నా పిల్లలే! ప్రొఫెషన్‌కి సంబంధించి అయితే .. నంది అవార్డ్ తీసుకోవడం! సామాజిక బాధ్యతనూ పంచుకునేందుకు మహిళల ఆరోగ్యం, సాధికారత, అలాగే ట్రాఫికింగ్ నుంచి బయటపడ్డ అమ్మాయిల స్వావలంబన, పిల్లల ఆరోగ్యం గురించి పనిచేసే 'ఫెస్టివల్స్ ఫర్ జాయ్' అనే ఎన్జీవోను మూడేళ్ల కిందట స్టార్ట్ చేశాను. భవిష్యత్‌లో మరికొన్ని ప్రాజెక్ట్స్ చేపట్టాలని ప్లాన్ చేస్తున్నాం. నేను నమ్మేదొక్కటే.. కష్టాన్ని నమ్ముకుంటే అవకాశాల తలుపులు తెరుచుకుంటాయి. అప్పుడు అందరూ అందరికీ ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తారు' అంటూ ముగించారు సుమ కనకాల.

– శిరీష చల్లపల్లి

స్వాతి లక్రా.. ఐపీఎస్ ఆఫీసర్‌గా ఆమెది ప్రత్యేక ముద్ర! డిపార్ట్‌మెంట్‌లో ఆమె ఏ పోస్టింగ్‌కి వెళితే ఆ హోదాలో తొలి మహిళగా క్రెడిట్ పొందడమే కాదు.. ఆ బాధ్యతలనూ అంతే సమర్థంగా నిర్వహించి మహిళల శక్తిసామర్థ్యాలకూ గుర్తింపు తెచ్చారు. ఆర్గనైజేషన్, హోమ్‌గార్డ్స్ అండ్ కోఆర్డినేషన్‌కి అడిషనల్ డీజీపీగా విధులు నిర్వహిస్తున్న ఆమె విమెన్స్ డే సందర్భంగా ఏం చెబుతున్నారంటే..

లీడర్‌షిప్ కావాలి

- స్వాతి లక్రా, ఐపీఎస్



నేను ఐపీఎస్ జాయిన్ అయినప్పుడు అంటే 1995లో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో రెండు లేదా మూడు శాతం మాత్రమే మహిళలు ఉండేవారు. ఐపీఎస్ క్యాడర్‌లో ఇంకా తక్కువ.. ఎంతంటే నేను ఏ పోస్ట్‌కి వెళ్లినా ఆ పోస్ట్‌లో ఫస్ట్ ఉమన్‌ని నేనే అయ్యేంత! కానీ ఇప్పుడు పరిస్థితి అలా లేదు. మా బ్యాచ్‌లో పదమూడు మంది మహిళలం ఉంటే ఇప్పుడు 60 మంది వరకూ ఉంటున్నారు. ఇంతకుముందు పోలీసులు అంటే కేవలం పురుషులే అన్న ఇమేజ్ ఉండేది. ఇప్పుడది మారిపోయింది. డిపార్ట్‌మెంట్‌లోని అన్ని స్థాయుల్లోకి మహిళలు వస్తున్నారు. తెలంగాణలో 33 శాతం రిజర్వేషన్ కల్పించింది ప్రభుత్వం. దాంతో మహిళల సంఖ్య పెరుగుతోంది. అందుకే ఇప్పుడు పోలీస్ అంటే మహిళలు కూడా అనే ఇమేజ్ స్థిరపడిపోయింది. పోలీస్ స్టేషన్స్‌లో సౌకర్యాలూ విమెన్ ఫ్రెండ్లీగా మారుతున్నాయి. తెలంగాణనే తీసుకుంటే.. ప్రతి స్టేషన్‌లో మహిళల కోసం సపరేట్ వాష్ రూమ్స్‌ని కట్టించాం. కొన్ని జిల్లాల్లో అయితే బేబీ కేర్ సెంటర్స్‌ని కూడా ఏర్పాటు చేశాం. ఈ మధ్య సైబరాబాద్ కమిషనరేట్‌లో కూడా బేబీ కేర్ సెంటర్‌ను పెట్టారు. ఇదివరకు బందోబస్త్‌లు, గణేశ్ నిమజ్జనానికి మహిళా పోలీస్‌లు డ్యూటీకి వెళితే వాష్‌రూమ్స్ ఉండక చాలా అవస్థపడాల్సి వచ్చేది. ఇప్పుడు మొబైల్ వాష్ రూమ్స్ సౌకర్యం వచ్చింది. ఎక్కడ బందోబస్త్ ఉంటే అక్కడికి ఈ మొబైల్ వాష్‌రూమ్‌ని పంపిస్తున్నారు. ఇలా మహిళలు చక్కగా పనిచేసుకోవడానికి అనుగుణమైన వసతులు ఏర్పాటవుతున్నాయంటే మహిళల పనికి గుర్తింపు, డిమాండ్ వచ్చినట్టే కదా!

దృష్టి పెడతారు..

ఏ రంగంలో అయినా ఎంతమంది మహిళలు వస్తే అంత వేగంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ అవుతుంది. మొత్తం వ్యవస్థలోనే విమెన్ ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఏర్పడుతుంది. అంతేకాదు లీడర్‌షిప్ రోల్స్‌ని పొందే అవకాశం వస్తుంది. లీడర్‌షిప్ రోల్స్‌లో మహిళలు ఉంటే స్త్రీల అవసరాల మీద దృష్టిపెడతారు. సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయి.

చెప్పకోదగ్గదే కానీ..

మహిళా సాధికారత సాధించాలంటే ముందు స్త్రీల హక్కుల గురించి స్త్రీలతోపాటు సమాజమూ తెలుసుకోవాలి. స్త్రీ సెకండ్ సిటిజన్ కాదు.. తోటి పౌరురాలే అన్న స్పృహ రావాలి. అది ఇంటినుంచే మొదలవ్వాలి. నన్ను మా బ్రదర్‌తో సమానంగా చదివిస్తేనే కదా నా ఐపీఎస్ కల సాధ్యమైంది. అలా కొడుకైనా కూతురైనా ఇద్దరూ సమానమే.. హక్కులు, అవకాశాలు ఇద్దరికీ సమానమే అనే భావన పేరెంటింగ్‌లో కనిపించాలి. తర్వాత స్కూల్లో టీచింగ్‌లోనూ భాగం కావాలి. అప్పుడే అది సమాజంలో రిఫ్లెక్ట్ అవుతుంది. స్త్రీల పట్ల గౌరవం పెరుగుతుంది. ఆడపిల్లలు చదువును నిర్లక్ష్యం చేయకూడదు. ఆర్థికస్వాతంత్ర్యానికి అదే మెట్టు! కాబట్టి అమ్మాయిలు అందరూ చదువు మీద దృష్టిపెట్టాలి.

ఎలాంటి టాస్క్‌లకైనా సిద్ధమే!

ఏ రంగంలో అయినా మహిళలు శారీరక శ్రమలో కానీ.. బుద్ధికుశలతలో కానీ పురుషులతో సమంగా ఉంటున్నారు. అలాగే పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో కూడా! మహిళలు కదా అని తేలికపాటి టాస్క్‌లు ఇవ్వడం ఉండదు. కీలకమైన బాధ్యతలనూ అప్పగిస్తారు. నన్నే తీసుకుంటే నేను మావోయిస్ట్ ఏరియాల్లో కూడా పని చేశాను. కాబట్టి మహిళలకు సమాన అవకాశాలే ఉన్నాయి.. ఉంటాయి.. ఉండాలి కూడా!

– సరస్వతి రమ

సాక్షి బిజినెస్

శనివారం 8-3-2025



స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ △
8	8
74,333	22,553

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

సూచీ			
నాస్‌డాక్	17,924	▽	145
డోజోన్స్	42,234	▽	345
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,680	▽	3
డాక్స్	23,009	▽	411
షాంఘై	3,373	▽	9
నికాయ్	36,887	▽	818

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	86,059	△	183
బంగారం (99.5 స్వచ్ఛత)	85,714	△	182
వెండి (కేజీ)	96,724	△	264

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	86.70	87.72
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	111.00	113.85
€	యూరో	ఒకటి	92.92	95.59
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	58.38	59.88
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.91	56.12
S$	సింగపూర్ డాలర్	భామనీకుత	62.97	67.66
SAR	సౌదీ రియాల్	భామనీకుత	27.27	23.82
UAE D	యూఏఈ దిర్హామ్	భామనీకుత	22.76	24.54
¥	చైనా యువాన్	భామనీకుత	11.13	12.96

మహిళలు.. 'ఫండ్' రాణులు!

మ్యూచువల్ ఫండ్ మేనేజర్లుగా సత్తా చాటుతున్న మగువలు

- 49కి ఎగబాకిన మహిళా ఫండ్ మేనేజర్ల సంఖ్య..
- వారి నిర్వహణలోని ఆస్తుల విలువ ఏడాదిలో రెట్టింపు..
- జనవరి నాటికి రూ.13.45 లక్షల కోట్లకు జంప్..

అన్ని రంగాల్లోనూ ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న మగువలు... స్టాక్ మార్కెట్లోనూ తగ్గేదేలే అంటూ 'బుల్' రైడ్ చేస్తున్నారు. లక్షల కోట్ల రూపాయల విలువైన మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలో ఇన్వెస్టర్ల నిధులను పక్కాగా నిర్వహిస్తూ ఫండ్ మేనేజర్లుగా సత్తా చాటుతున్నారు. తాము ఇంటినే కాదు.. అవకాశమిస్తే, ఫండ్ హౌస్‌లను కూడా మగాళ్లకు దీటుగా చక్కబెట్టగలమని నిరూపించుకుంటున్నారు. మహిళల నిర్వహణలో ఉన్న ఫండ్ ఆస్తులు 'ఇంతింతై.. అన్నట్లుగా ఏడాది వ్యవధిలో రెట్టింపై రూ.13.45 లక్షల కోట్లకు ఎగబాకడం విశేషం!! అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంఎఫ్ రంగంలో రాణిస్తున్న అతివలపై స్పెషల్ ఫోకస్...

– సాక్షి, బిజినెస్ డెస్క్

దేశంలో మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ దూకుడు లాగే.. మహిళా ఫండ్ మేనేజర్లు కూడా జోరు పెంచారు. ఈ ఏడాది జనవరి నాటికి వారి సంఖ్య 49కి పెరిగింది. ఏడాది క్రితం ఉన్న 42 మందితో పోలిస్తే కొత్తగా ఏడుగురు జతయ్యారు. ఇదే కాలంలో మగ ఫండ్ మేనేజర్లు ఇద్దరు మాత్రమే పెరగడం గమనార్హం. ఇక మగువల నిర్వహణలో ఉన్న ఫండ్ ఆస్తులు కూడా రూ.13.45 లక్షల కోట్లకు ఎగిశాయి. గతేడాది జనవరితో పోలిస్తే రెట్టింపైంది. దేశంలో ఎంఎఫ్ సంస్థల నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తులు (ఏయూఎం) రూ.67.25 లక్షల కోట్లు కాగా, ఇందులో మహిళా ఫండ్ మేనేజర్లు/కో–ఫండ్ మేనేజర్లు నిర్వహిస్తున్న అసెట్స్ విలువ 20 శాతానికి జంప్ చేసింది. అయితే, మొత్తం ఎంఎఫ్ ఫండ్ మేనేజర్లు 482 మందిలో మహిళల వాటా ఇంకా తక్కువగానే ఉన్నప్పటికీ, గత ఏడాది కాలంలో మగాళ్లతో పోలిస్తే మగువల సంఖ్య ఎక్కువగా పెరగడం ఈ రంగంలో వారి భవిష్యత్తుపై మరింత ఆశలు రేకెత్తిస్తోంది.

25 ఎంఎఫ్‌లు... 339 స్కీమ్‌లు

దేశవ్యాప్తంగా 25 మ్యూచువల్ ఫండ్ సంస్థల్లో అతివలు ఫండ్ మేనేజర్లుగా రాణిస్తున్నారు. మొత్తం 339 ఫండ్ స్కీమ్‌లను మేనేజ్ చేస్తున్నారు. కాగా, 6 ఫండ్ సంస్థల్లో ముగ్గురు కంటే ఎక్కువ మహిళా ఫండ్ మేనేజర్లు ఉండగా, 6 ఫండ్ హౌస్‌లలో ఇద్దరు చొప్పున, 13 సంస్థల్లో కనీసం ఒకరు ఉన్నారు. అన్నింటికంటే ఎక్కువగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్‌లో ఏడుగురు మహిళా ఫండ్ మేనేజర్లు రూ.2.27 లక్షల కోట్ల విలువైన 66 స్కీమ్‌లను నిర్వహిస్తున్నారు. భారత్‌లో అతిపెద్ద ఫండ్ హౌస్‌గా నిలుస్తున్న ఎస్‌బీఐ ఎంఎఫ్‌లో ఐదుగురు మగువలు రూ.1.88 లక్షల కోట్ల ఆస్తులను (14 స్కీమ్‌లు) మేనేజ్ చేస్తున్నారు. ఇక నిప్పన్ ఇండియా ఎంఎఫ్‌లో ఇద్దరు అతివలు రూ.1.53 లక్షల కోట్ల అసెట్‌లను (26 స్కీమ్‌లు) నిర్వహిస్తున్నారు.


రూ.6.13 లక్షల కోట్లు ...

తాజా గణాంకాల ప్రకారం దేశంలోని 49 మహిళా ఫండ్ మేనేజర్లలో టాప్–5 మగువలు మేనేజ్ చేస్తున్న ఫండ్ అసెట్స్ రూ.6.13 లక్షల కోట్లు (45.55 శాతం)గా ఉంది. ఇందులో ఎస్‌బీఐ ఎంఎఫ్‌కు చెందిన మాన్సి సజేజా రూ.1.41 లక్షల కోట్ల అసెట్‌లను నిర్వహిస్తూ.. భారత్‌లో నంబర్ వన్ మహిళా ఫండ్ మేనేజర్‌గా నిలిచారు. నిప్పన్ ఇండియా ఎంఎఫ్ కింజల్ దేశాయ్ (రూ.1.37 లక్షల కోట్ల అసెట్స్), యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ కృష్ణా ఎన్ (రూ.1.34 లక్షల కోట్లు) రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. ఇక ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్ అశ్విని షిండే 47 స్కీమ్‌లతో అత్యధిక స్కీమ్‌లను మేనేజ్ చేస్తున్న వారిలో టాప్‌లో ఉన్నారు. తర్వాత స్థానాల్లో మిరే అసెట్ ఇండియా ఎంఎఫ్ ఏక్తా గాలా (30 స్కీమ్‌లు), నిప్పన్ ఇండియా ఎంఎఫ్ కింజల్ దేశాయ్ (24 స్కీమ్‌లు) నిలిచారు. పురుషుల విషయానికొస్తే.. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్‌కు చెందిన మనీష్ బాంతియా రూ.3.49 లక్షల కోట్ల అసెట్లను మేనేజ్ చేస్తూ.. దేశంలో టాప్ ఫండ్ మేనేజర్‌గా కొనసాగుతున్నారు.

రూ.67.25 లక్షల కోట్లు	ఎంఎఫ్ సంస్థల నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తులు (ఏయూఎం)
20%	మొత్తం ఎంఎఫ్ ఏయూఎంలో మహిళా ఫండ్ మేనేజర్ల వాటా
18.8 కోట్లు	జనవరి నాటికి దేశంలో మొత్తం డీమ్యాట్ ఖాతాల సంఖ్య

22.92 కోట్లు – ప్రస్తుతం ఉన్న మ్యూచువల్ ఫండ్స్ ఫోలియోల (ఖాతాల) సంఖ్య

టాప్ - 5 మహిళా ఫండ్ మేనేజర్లు



ఇన్వెస్టర్లుగానూ...

ఇటీవల కాలంలో స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడంతో పాటు ట్రేడింగ్ చేస్తున్న అతివల సంఖ్య కూడా భారీగా పెరుగుతూ వస్తోంది. 2021 నుంచి చూస్తే ఏటా కొత్తగా 3 కోట్ల డీమ్యాట్ ఖాతాలు జతవగా.. ప్రతి నలుగురు ఇన్వెస్టర్లలో ఇప్పుడు 1 మహిళా ఇన్వెస్టర్ ఉండటం వారి జోరుకు నిదర్శనం. జనవరి నాటికి దేశంలో మొత్తం డీమ్యాట్ ఖాతాల సంఖ్య 18.8 కోట్లకు చేరుకుంది. ఇందులో దాదాపు 23.9 శాతం మహిళలవే కావడం గమనార్హం. కాగా, మ్యూచువల్ ఫండ్స్ ఫోలియోల (ఖాతాల) సంఖ్య 22.92 కోట్లకు చేరింది. 2021 మే నెలలో తొలిసారి 10 కోట్ల మైలురాయిని చేరగా.. నాలుగేళ్లలోనే దాదాపు 13 కోట్ల ఫోలియోలు కొత్తగా జతవ్వడం ఫండ్స్‌లోకి పెట్టుబడులు ఏ రేంజ్‌లో వచ్చి పడుతున్నాయనేందుకు నిదర్శనం.

బీవోబీ గ్లోబల్ ఉమెన్ ఎన్ఆర్ఈ, ఎన్ఆర్‌వో ఖాతా

మహిళా దినోత్సవం సందర్భంగా ప్రారంభం



న్యూఢిల్లీ: బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) మహిళల కోసం ప్రత్యేకంగా.. 'బీవోబీ గ్లోబల్ ఉమెన్ ఎన్ఆర్ఈ అండ్ ఎన్ఆర్‌వో సేవింగ్స్ ఖాతాను' ప్రారంభించింది. ఆటో స్వీప్ సదుపాయంతో ఇది ఉంటుంది. తద్వారా ఖాతాలో పరిమితికి మించి ఉన్న బ్యాలెన్స్ డిపాజిట్‌గా మారిపోయి, అధిక వడ్డీ రాబడి లభిస్తుంది. అలాగే, ఈ ఖాతాదారులకు గృహ రుణాలు, ఆటో రుణాలపై రాయితీ రేట్లు, తక్కువ ప్రాసెసింగ్ చార్జీలు ఉంటాయని బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రకటించింది. 17 దేశాల్లో 60,000 టచ్ పాయింట్ల ద్వారా 16.5 కోట్ల అంతర్జాతీయ కస్టమర్లకు బీవోబీ సేవలు అందిస్తోంది. బీవోబీ ప్రీమియం ఎన్ఆర్ఈ, ఎన్ఆర్‌వో సేవింగ్స్ ఖాతా విషయంలోనూ మార్పులు చేసింది. మహిళా దినోత్సవం సందర్భంగా అంతర్జాతీయంగా ఉన్న భారతీయ మహిళలకు ప్రీమియం బ్యాంకింగ్ సేవలను అందించే లక్ష్యంతో బీవోబీ ఉమెన్ ఎన్ఆర్ఈ అండ్ ఎన్ఆర్‌వో ఖాతాను రూపొందించినట్టు బ్యాంక్ ఆఫ్ బరోడా ఈడీ మీనా వహీద్ ప్రకటించారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

టెక్ అంకురాల్లోనూ మహిళల హవా..!	సమిష్టి కృషితోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌కి చెక్

100 రైల్వే స్టేషన్లలో స్విగ్గీ డెలివరీ సేవలు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లోని 100 రైల్వే స్టేషన్లకు ఫుడ్ డెలివరీ సేవలను విస్తరించినట్లు స్విగ్గీ వెల్లడించింది. రాబోయే రోజుల్లో మరిన్ని స్టేషన్లలో ఈ సర్వీసులను అందుబాటులోకి తేనున్నట్లు తెలిపింది. ప్రయాణికుల సౌకర్యార్థం, వివిధ రకాల ఆహార పదార్థాలను అందించేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయని సంస్థ వైస్ ప్రెసిడెంట్ దీపక్ మాలూ వివరించారు. రైలు ప్రయాణికులకు ఆహారాన్ని డెలివరీ చేసేందుకు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్‌తో (ఐఆర్‌సీటీసీ) 2024లో స్విగ్గీ చేతులు కలిపింది.

అమెరికాలో టెక్ మహీంద్రా విస్తరణ

టెక్సాస్‌లో కార్యాలయం ఏర్పాటు



న్యూఢిల్లీ: అమెరికా మార్కెట్లో కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఐటీ దిగ్గజం టెక్ మహీంద్రా తాజాగా టెక్సాస్‌లోని ప్లానోలో ఆఫీసు ఏర్పాటు చేసింది. ఇది 130 సీట్ల సామర్థ్యంతో 27,000 చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటైంది. అమెరికాలో ఇది తమకు పంతొమ్మిదో కార్యాలయమని సంస్థ తెలిపింది. కన్సల్టింగ్, డెలివరీ, కస్టమర్ సపోర్ట్ సర్వీసులు మొదలైన సర్వీసులు దీని ద్వారా అందించనున్నట్లు వివరించింది. ఇదే ప్రాంగణంలో ఇన్నోవేషన్ ల్యాబ్‌ను కూడా ప్రారంభించనున్నట్లు కంపెనీ తెలిపింది. ప్రస్తుతం 90 పైగా దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న టెక్ మహీంద్రాలో 1,50,000 మంది పైగా ఉద్యోగులు ఉన్నారు.

ఆరంభ లాభాలు ఆవిరి

ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ సూచీలు


ముంబై: ఆరంభ లాభాలు కోల్పోయిన స్టాక్ సూచీలు శుక్రవారం ఫ్లాటుగా ముగిశాయి. సెన్సెక్స్ ఎనిమిది పాయింట్లు నష్టపోయి 74,333 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఎనిమిది పాయింట్ల స్వల్ప లాభంతో 22,553 వద్ద నిలిచింది. ట్రంప్ తాజా టారిఫ్ల విధింపు నిర్ణయాలు ఈక్విటీ మార్కెట్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు.., తేరుకొని లాభాలు ఆర్జించాయి. ఒక దశలో సెన్సెక్స్ 246 పాయింట్లు పెరిగి 74,586 వద్ద, నిఫ్టీ 89 పాయింట్లు బలపడి 22,634 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకాయి. మిడ్ సెషన్ నుంచి అమ్మకాలు పెరగడంతో లాభాలన్నీ మాయమయ్యాయి. చిన్న కంపెనీల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించగా, మిడ్ క్యాప్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- పలు అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థలు రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు టార్గెట్ ధరను పెంచడంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు రాణించింది. బీఎస్ఈలో 3% పెరిగి రూ.1249 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 4% లాభపడి రూ.1255 వద్ద గరిష్టాన్ని తాకింది.



రూపాయి 17 పైసలు అప్

86.95 వద్ద ముగింపు



వారాంతాన దేశీ కరెన్సీ బలపడింది. డాలరుతో మారకంలో 17 పైసలు బలపడి 86.95 వద్ద ముగిసింది. ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్ తాజాగా 5 నెలల కనిష్టానికి చేరడం రూపాయికి జోష్‌నిచ్చినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. చమురు ధరలు నీరసించడం దీనికి జత కలసినట్లు తెలియజేశాయి. డాలరు ఇండెక్స్ 0.45 శాతం క్షీణించి 2024 నవంబర్ 5 స్థాయిలో 103.58 వద్ద కదులుతోంది.

సాక్షి స్పోర్ట్స్



బ్రేక్ లేకుండా 147 పాయింట్లు... స్నూకర్ ప్లేయర్ ఇష్‌ప్రీత్ సింగ్ చద్దా ఘనత

పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (పీఎస్‌పీబీ) ప్లేయర్ ఇష్‌ప్రీత్ సింగ్ చద్దా స్నూకర్ క్రీడలో బ్రేక్ లేకుండా గరిష్టంగా సాధించే 147 పాయింట్లను స్కోరు చేశాడు. ముంబైలోని క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా (సీసీఐ) స్నూకర్ క్లాసిక్ టోర్నమెంట్‌లో 28 ఏళ్ల ఇష్‌ప్రీత్ సింగ్ ఈ అద్భుతాన్ని ఆవిష్కరించాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఇష్‌ప్రీత్ 5–0 ఫ్రేమ్‌ల తేడాతో రైల్వేస్ ప్రత్యర్థి దిలీప్ కుమార్‌పై గెలుపొందాడు. స్నూకర్‌లో గరిష్టంగా 147 పాయింట్లు సాధించడం చాలా అరుదు. గతంలో కేవలం ఇద్దరు మాత్రమే ఈ ఘనత సాధించారు. భారత క్యూ స్పోర్ట్స్ దిగ్గజం గీత్ సేథీ 1988లో గుంటూరులో జరిగిన జాతీయ స్నూకర్ పోటీల్లో 147 పాయింట్లతో రికార్డుల్లోకి ఎక్కగా, 2013లో ఆదిత్య బెంగళూరులో జరిగిన పోటీల్లో గరిష్ట పాయింట్లు సాధించాడు. మళ్లీ 12 ఏళ్ల తర్వాత ముంబైకి చెందిన ఇష్‌ప్రీత్ ఈ అద్భుతం చేశాడు.

ప్రపంచ అండర్-20 చెస్ చాంపియన్ ప్రణవ్



పెట్రోవా (మోంటెనిగ్రో): అంతర్జాతీయ చెస్‌లో భారత్ నుంచి మరో ప్రపంచ చాంపియన్ అవతరించాడు. శుక్రవారం ముగిసిన ప్రపంచ జూనియర్ చెస్ చాంపియన్‌షిప్ అండర్–20 ఓపెన్ విభాగంలో తమిళనాడు గ్రాండ్‌మాస్టర్ ప్రణవ్ వెంకటేశ్ విజేతగా నిలిచాడు. 11 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో 18 ఏళ్ల ప్రణవ్ 9 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ప్రణవ్ ఏడు గేముల్లో గెలిచి, మిగతా నాలుగు గేమ్‌లను 'డ్రా' చేసుకొని టోర్నీని అజేయంగా ముగించాడు. ఈ క్రమంలో ఓపెన్ విభాగంలో ప్రపంచ జూనియర్ చెస్ చాంపియన్‌గా నిలిచిన నాలుగో భారతీయ ప్లేయర్‌గా ప్రణవ్ గుర్తింపు పొందాడు. గతంలో భారత్ నుంచి విశ్వనాథన్ ఆనంద్ (1987), పెంటేల హరికృష్ణ (2004), అభిజిత్ గుప్తా (2008) ఈ ఘనత సాధించారు.

ప్రాగ్ మాస్టర్స్ చెస్ టోర్నీ విజేత అరవింద్



చెన్నై: ఆద్యంతం నిలకడగా రాణించిన తమిళనాడు యువ గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చిదంబరం తన కెరీర్‌లోనే గొప్ప విజయం అందుకున్నాడు. చెక్ రిపబ్లిక్‌లో శుక్రవారం ముగిసిన ప్రాగ్ చెస్ ఫెస్టివల్‌లో మాస్టర్స్ విభాగంలో 25 ఏళ్ల అరవింద్ చాంపియన్‌గా అవతరించాడు. 10 మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య 9 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో ఒక్క గేమ్‌లోనూ ఓడిపోని అరవింద్ ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. టర్కీ గ్రాండ్‌మాస్టర్ ఇడిజ్ గురేల్‌తో జరిగిన చివరిదైన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను నల్లపావులతో ఆడిన అరవింద్ 39 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. 5 పాయింట్లతో అనీశ్ గిరి (నెదర్లాండ్స్), యి వె (చైనా), ప్రజ్ఞానంద (భారత్) ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. అనీశ్ రన్నరప్‌గా నిలువగా... యి వె మూడో స్థానంలో, ప్రజ్ఞానంద నాలుగో స్థానంలో నిలిచారు.

గుజరాత్ జెయింట్స్ జోరు

వరుసగా మూడో విజయం

- 5 వికెట్లతో ఢిల్లీ క్యాపిటల్స్ ఓటమి
- యూపీ వారియర్స్ అవుట్

లక్నో: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో గుజరాత్ జెయింట్స్ వరుసగా మూడో విజయాన్ని అందుకొని పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరింది. శుక్రవారం జరిగిన ఈ పోరులో జెయింట్స్ 5 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. గుజరాత్ జెయింట్స్ గెలుపుతో యూపీ వారియర్స్ జట్టు అధికారికంగా 'ప్లే ఆఫ్' రేసు నుంచి దూరమైంది. గుజరాత్‌తో పోరులో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (57 బంతుల్లో 92; 15 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగగా... మరో ఓపెనర్ షఫాలీ వర్మ (27 బంతుల్లో 40; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా రాణించింది. వీరిద్దరు తొలి వికెట్‌కు 54 బంతుల్లోనే 83 పరుగులు జోడించారు. జెయింట్స్ బౌలర్లలో మేఘనా సింగ్ 3 వికెట్లు పడగొట్టగా, డియాండ్రా డాటిన్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం గుజరాత్ జెయింట్స్ 19.3 ఓవర్లలో 5 వికెట్లకు 178 పరుగులు సాధించి గెలిచింది. హర్లీన్ డియోల్ (49 బంతుల్లో 70 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించగా, బెత్ మూనీ (35 బంతుల్లో 44; 6 ఫోర్లు) రాణించింది. వీరిద్దరు రెండో వికెట్‌కు 57 బంతుల్లో 85 పరుగులు జత చేశారు. చివర్లో డాటిన్ (10 బంతుల్లో 24; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆష్లీ గార్డ్‌నర్ (13 బంతుల్లో 22; 1 ఫోర్, 2 సిక్స్‌లు) దూకుడైన బ్యాటింగ్ జెయింట్స్ విజయానికి కారణమయ్యాయి. ఈ మ్యాచ్‌లో గెలిస్తే నేరుగా ఫైనల్ చేరగలిగే స్థితిలో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ నిరాశగా తమ చివరిదైన ఎనిమిదో లీగ్ మ్యాచ్‌ను ముగించింది. నేడు జరిగే మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో యూపీ వారియర్స్ తలపడుతుంది. 'ప్లే ఆఫ్' రేసులో నిలవాలంటే బెంగళూరు జట్టు ఈ మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవాల్సి ఉంటుంది.



హర్లీన్

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: లానింగ్ (బి) డాటిన్ 92; షఫాలీ (సి) లిచ్‌ఫీల్డ్ (బి) మేఘన 40; జొనాసెన్ (బి) డాటిన్ 9; జెమీమా (సి) గార్డ్‌నర్ (బి) మేఘన 4; అనాబెల్ (సి) డాటిన్ (బి) మేఘన 14; కాప్ (నాటౌట్) 7; బ్రైస్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 177. వికెట్ల పతనం: 1–83, 2–108, 3–119, 4–141, 5–171. బౌలింగ్: డాటిన్ 4–0–37–2, కాశ్వీ 3–0–32–0, తనూజ 4–0–31–0, మేఘన 4–0–35–3, గార్డ్‌నర్ 2–0–18–0, ప్రియ 2–0–21–0

గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్: బెత్ మూనీ (సి) అనాబెల్ (బి) మిన్ను మణి 44; హేమలత (సి) లానింగ్ (బి) శిఖా 1; హర్లీన్ (నాటౌట్) 70; ఆష్లీ గార్డ్‌నర్ (సి) మిన్ను మణి (బి) శిఖా 22; డాటిన్ (సి) జెమీమా (బి) జొనాసెన్ 24; లిచ్‌ఫీల్డ్ (సి) షఫాలీ (బి) జొనాసెన్ 0; కాశ్వీ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (19.3 ఓవర్లలో 5 వికెట్లకు) 178. వికెట్ల పతనం: 1–4, 2–89, 3–128, 4–162, 5–162. బౌలింగ్: మరిజానె కాప్ 4–1–29–0, శిఖా పాండే 4–0–31–2, అనాబెల్ సదర్లాండ్ 4–0–45–0, టిటాస్ సాధు 2–0–17–0, మిన్ను మణి 2–0–15–1, జొనాసెన్ 3.3–0–38–2.

డబ్ల్యూపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
ఢిల్లీ క్యాపిటల్స్	8	5	3	10	0.396
గుజరాత్ జెయింట్స్	7	4	3	8	0.334
ముంబై ఇండియన్స్	6	4	2	8	0.267
బెంగళూరు	6	2	4	4	-0.244
యూపీ వారియర్స్	7	2	5	4	-0.785

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

సెమీస్‌లో ఆయుశ్ శెట్టి

పారిస్: ఓర్లియాన్స్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ షట్లర్ ఆయుశ్ శెట్టి సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 48వ ర్యాంకర్ ఆయుశ్ శెట్టి 21–16, 21–23, 21–17తో ప్రపంచ 31వ ర్యాంకర్ రస్మస్ గెమ్కె (డెన్మార్క్)పై విజయం సాధించాడు. ఈ టోర్నీ తొలి రౌండ్‌లో ప్రపంచ మాజీ చాంపియన్ కీన్ యె లో (సింగపూర్)పై గెలిచిన ఆయుశ్... ప్రి క్వార్టర్స్‌లో ప్రపంచ 38వ ర్యాంకర్ జేసన్ గుణవాన్ (హాంకాంగ్)ను ఓడించాడు. అదే జోరు కొనసాగిస్తూ క్వార్టర్స్‌లోనూ తనకంటే మెరుగైన ర్యాంకర్ గెమ్కెపై హోరాహోరీ పోరులో నెగ్గాడు. 48 నిమిషాల పాటు సాగిన పోరులో తొలి గేమ్‌ను సునాయాసంగానే గెలుచుకున్న ఆయుశ్... రెండో గేమ్‌లో చివరి వరకు పోరాడి ఓడాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వని ఆయుశ్ మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. నేడు జరిగే సెమీఫైనల్లో రెండో సీడ్ చున్ యా లిన్ (చైనీస్ తైపీ)తో ఆయుశ్ ఆడతాడు.



'క్రీడాకారులకు ప్రత్యేక ఐడీ'

- ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తాం
- కేంద్ర మంత్రి మాండవియా ప్రకటన



సాక్షి, హైదరాబాద్: దేశంలో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియా అన్నారు. ఇందు కోసం భిన్నమైన పలు కార్యక్రమాలు చేపట్టిందని ఆయన వెల్లడించారు. మాండవియా అధ్యక్షతన భారత క్రీడా రంగం మెరుగుదల, భవిష్యత్తుకు సంబంధించి శుక్రవారం ప్రత్యేక 'చింతన్ శిబిర్' ప్రారంభమైంది. నగర శివార్లలో కన్హా శాంతి వనంలో జరుగుతున్న రెండు రోజుల ఈ శిబిరం శనివారం ముగుస్తుంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన క్రీడా శాఖల మంత్రులు, క్రీడా పరిపాలకులు, సీనియర్ ప్రభుత్వాధికారులతో పాటు కేంద్ర క్రీడాశాఖ సహాయ మంత్రి రక్ష ఖడ్సే కూడా దీనికి హాజరయ్యారు. ప్రపంచ క్రీడల్లో భారత్ స్థాయిని మరింత పెంచే దిశగా పలు ఆలోచనలను పంచుకున్న వీరంతా అందుకు తగిన విధంగా రూట్ మ్యాప్ కోసం తమ వంతు సూచనలు అందించారు. ముఖ్యంగా 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో భారత్ పెద్ద సంఖ్యలో పతకాలు సాధించే లక్ష్యంతోపాటు 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇచ్చే అంశంపై ఈ కార్యక్రమంలో చర్చ జరిగింది. ఒలింపిక్స్‌ను మన దేశం నిర్వహించాలనే కలకు ఈ చింతన్ శిబిర్ నుంచి తొలి అడుగు పడాలని మాండవియా అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో దేశంలో ఉన్న క్రీడా ప్రతిభ వృథా కాకుండా ఉండేందుకు తాము ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు. 'ప్రతిభాన్వేషణలో ఖేలో ఇండియా వంటి పథకాలు కీలక పాత్ర పోషించాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 937 ఖేలో ఇండియా కేంద్రాలు సమర్థంగా పని చేస్తున్నాయి. 9–14 ఏళ్ల మధ్య వయసు ఉన్న ఆటగాళ్లను గుర్తించి తీర్చిదిద్దితే ఒలింపిక్స్‌లో మంచి ఫలితాలు వస్తాయి. ఇప్పుడు సాంకేతికతను వాడుకోవడం కూడా కీలకాంశం. దీని కోసం ప్రభుత్వం ఒక కొత్త ఆలోచనతో ముందుకు వచ్చింది. ఆటగాళ్ల వివరాలను ఒకే చోట నమోదు చేసి ప్రత్యేక ఐడీలు ఇవ్వబోతున్నాం. అలా చేస్తే వారిని తగిన రీతిలో ప్రోత్సహిస్తూ పురోగతిని పరిశీలించేందుకు అవకాశం ఉంటుంది' అని మాండవియా వెల్లడించారు. ఒలింపిక్ మిషన్ కోసం జాతీయ క్రీడా సమాఖ్యలు మరింత సమర్థంగా పని చేయాల్సి ఉంటుందన్న కేంద్ర మంత్రి... ఆటగాళ్ల సెలక్షన్స్‌లో పారదర్శకత పాటిస్తే తల్లిదండ్రులు మరింత పెద్ద సంఖ్యలో తమ పిల్లలను క్రీడల వైపు తీసుకొస్తారని విశ్లేషించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారంతా క్రీడాభివృద్ధి కోసం తమ సలహాలు అందించారు. దేశవ్యాప్తంగా జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌లను ఏర్పాటు చేయాలని, అందుబాటులో ఉన్న స్టేడియంలు తదితర మౌలిక సౌకర్యాలను సమర్థంగా వాడుకునేలా చూడాలని వారు సూచించారు.

శౌర్య-హృతిక్ జోడీకి ఐటీఎఫ్ డబుల్స్ టైటిల్

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) జే30 టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన శౌర్య సామల-హృతిక్ కటకం జోడీ టైటిల్‌ను సొంతం చేసుకుంది. మదురైలో ముగిసిన ఈ టోర్నీలో డబుల్స్ ఫైనల్లో శౌర్య-హృతిక్ ద్వయం 6–3, 7–6 (8/6)తో రెండో సీడ్ ఆరవ్ చావ్లా-ప్రకాశ్ శరణ్ (భారత్) జంటపై నెగ్గింది. తొలి రౌండ్‌లో శౌర్య-హృతిక్ 7–5, 6–4తో నియంత్ బద్రీనారాయణన్ (అమెరికా)-అనురవ్ ప్రకాశ్ (భారత్)లపై గెలిచారు. క్వార్టర్ ఫైనల్లో హైదరాబాద్ జోడీకి దేవ్ విపుల్-జహాన్ సిద్దిఖీ (భారత్) జంట నుంచి వాకోవర్ లభించింది. సెమీఫైనల్లో శౌర్య-హృతిక్ ద్వయం 6–7 (7/9), 7–6 (7/5), 10–7తో 'సూపర్ టైబ్రేక్'లో షౌనక్-ఓం వర్మ (భారత్) జోడీపై గెలిచి ఫైనల్లోకి ప్రవేశించింది.



మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

మత్తు ముఠాలను సమష్టిగా కట్టడి చేద్దాం

- ఇంటర్‌స్టేట్ కోఆర్డినేషన్ మీటింగ్‌లో అధికారుల నిర్ణయం
- పాల్గొన్న ఎన్‌సీబీ, టీజీఏఎన్‌బీ, ఏపీ, ఒడిశా, తమిళనాడు అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న సందీప్‌శాండిల్య

సాక్షి, హైదరాబాద్: గంజాయి, ఇతర డ్రగ్స్ సరఫరా చేస్తున్న మత్తు ముఠాల కట్టడికి ఉమ్మడి వ్యూహాలతో ముందుకు వెళ్లాలని అధికారులు నిర్ణయించారు. నిందితుల వివరాలు, డ్రగ్స్ సరఫరాకు సంబంధించిన సమాచారాన్ని పరస్పర మార్పిడి, డ్రగ్స్ నెట్‌వర్క్ అరెస్టుల్లో సమన్వయం తదితర అంశాలపై ఇంటర్ స్టేట్ కోఆర్డినేషన్ సమావేశంలో అధికారులు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) కార్యాలయంలో ఎన్‌సీబీ సదరన్ రీజియన్ అధికారులు, టీజీఏఎన్‌బీ, ఏపీ, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ బృందాల అధికారులు, కస్టమ్స్, డీఆర్‌ఐ, ఎక్సైజ్, ఇంటెలిజెన్స్ బ్యూరో, ఎన్‌ఐఏ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ)ల అధికారులు శుక్రవారం సమావేశమయ్యారు. మత్తు పదార్థాల సరఫరా ముఠాల కార్యకలాపాలు ఎప్పటికప్పుడు పసిగట్టి, ఆ ముఠాల నెట్‌వర్క్‌ను దెబ్బతీసేలా తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించినట్టు టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. ప్రధానంగా డ్రగ్స్ సరఫరా, డ్రగ్స్ ముఠాల కీలక సమాచారం పరస్పరం పంచుకోవడంపై చర్చించినట్టు తెలిపారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మనల్ని మరో ప్రపంచంలోకి తీసుకెళుతోంది. ఏఐతో ఎన్నో రంగాల్లో అద్భుతాలు సాధిస్తున్నారు. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. అదే ఏఐ టెక్నాలజీ పలు మోసాలకు కూడా ఉపయోగపడుతోంది. వీటిల్లో వాయిస్ క్లోనింగ్ మోసం తాజాది. మనకు తెలిసిన వారి గొంతుతో మాట్లాడుతూ మాయ చేసేదే వాయిస్ క్లోనింగ్. దీని ఆధారంగా సైబర్ కేటుగాళ్లు ఆలోచించడానికి సమయం ఇవ్వకుండా ఒత్తిడిలోకి నెట్టేసి డబ్బులు నొక్కేస్తున్నారు. ఇటీవలి కాలంలో పెరుగుతున్న ఈ వాయిస్ క్లోనింగ్ స్కాముల్లో చిక్కుకోకుండా జాగ్రత్తగా ఉండాలని సైబర్ భద్రత నిపుణులు, పోలీసులు సూచిస్తున్నారు. ఏఐ టూల్స్‌తో రిట్రీవల్ బేస్డ్ వాయిస్ కన్వర్షన్ టెక్నిక్‌ను వాడుతూ.. మన కుటుంబ సభ్యులు, స్నేహితుల గొంతు మాదిరి గొంతులు రూపొందిస్తున్నారని, అత్యవసరంలో ఉన్నామని, వెంటనే డబ్బులు పంపాలంటూ చేసే ఒత్తిడికి గురై మోసపోవద్దని హెచ్చరిస్తున్నారు.

- సాక్షి, హైదరాబాద్



తెలిసిన గొంతుతో మాయ చేసేస్తారు!

వాయిస్ క్లోనింగ్ మోసం అంటే..?

ఎవరి గొంతును అనుకరించాలని అనుకుంటున్నారో వారి వాయిస్ (గొంతు)కు సంబంధించిన శాంపిల్స్ తీసుకుంటారు. రిట్రీవల్ బేస్డ్ వాయిస్ కన్వర్షన్ టెక్నిక్‌ను వాడి ఏఐతో అలాంటి గొంతును తయారు చేస్తారు. ఆ గొంతుకతో మాట్లాడుతూ మోసం చేస్తారు.

సరికొత్త సైబర్ మోసం.. వాయిస్ క్లోనింగ్

- కుటుంబసభ్యులు, సన్నిహితుల వాయిస్‌తో కాల్ చేస్తారు
- ఆపదలో ఉన్నామంటూ.. డబ్బులు పంపాలంటూ ఒత్తిడి చేస్తారు
- పదేపదే ఫోన్ చేస్తారు.. కంగారు పడితే కేటుగాళ్లకు చిక్కినట్టే అంటున్న సైబర్ నిపుణులు

మోసం ఇలా..

- కుటుంబసభ్యులు, సన్నిహితుల గొంతుతో తెలిసిన వారిలా కాల్ చేస్తారు.
- అత్యవసరంగా డబ్బులు కావాలని అడుగుతారు.
- ఆపదలో ఉన్నాను.. నాఫోన్ స్విచ్చాఫ్ అయిపోయింది. పాడైపోయింది. అందుకే వేరే నంబర్‌తో ఫోన్ చేస్తున్నాను. వెంటనే డబ్బులు పంపాలంటూ కంగారు పెడతారు.
- మీరు ఆలోచించుకునే సమయం ఇవ్వకుండా పదే పదే కాల్స్ చేస్తారు.
- కంగారు పడిపోయి సరే అంటే డబ్బులు ఎవరికి, ఎలా పంపాలో చెబుతారు.

మన వివరాలు స్కామర్స్‌కు ఎలా?

- ప్రధానంగా ఈ వాయిస్ క్లోనింగ్ మోసాల్లో ప్రముఖులు, సెలబ్రిటీలకు సంబంధించినవి ఎక్కువగా ఉంటాయి. ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లో మన వివరాల ఆధారంగా మనతో సంబంధం ఉండే సెలబ్రిటీలను ఎంపిక చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు.
- సాధారణ వ్యక్తుల విషయానికొస్తే.. మనం యూట్యూబ్, టిక్‌టాక్, ఫేస్‌బుక్కుల్లో పెట్టే వీడియోల నుంచి వాయిస్ శాంపిల్స్ సేకరిస్తారు.
- ఆయా వాయిస్‌లను ఏఐ టూల్స్‌ను వాడి క్లోనింగ్ చేస్తారు.
- మన ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల్లో ఉండే ఫ్రెండ్స్ లిస్ట్..మనం పెట్టే ఫొటోలు, వీడియోల ఆధారంగా.. వివిధ పద్ధతుల్లో మన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఫోన్ నంబర్లు సేకరించి మోసానికి తెరతీస్తారు.
- ఆఫీసుల్లో పై అధికారులు, సహ ఉద్యోగుల వాయిస్‌లను కూడా క్లోనింగ్ చేస్తున్నారు.

ఎలా అప్రమత్తంగా ఉండాలి?

- వాయిస్ క్లోనింగ్ మోసాల్లో..గొంతు తెలిసిన వారిదే అయినా వచ్చిన ఫోన్ నంబర్ సాధారణంగా వేరేదే అయి ఉంటుంది. ఆ విషయం గమనించాలి.
- మనల్ని కంగారు పెడుతూ డబ్బులు అడిగే సందర్భంలో అవతలి వ్యక్తుల గొంతు ఎలా ఉందన్నది గమనించాలి.
- తొందరపడి డబ్బులు పంపవద్దు. ఎవరి గొంతైతే విన్పిస్తోందో..వారి వ్యక్తిగత ఫోన్ నంబర్‌కు కాల్ చేసి నిర్ధారించుకోవాలి.
- మన సంబంధీకులు ఫోన్ లిఫ్ట్ చేసి మాట్లాడితే అది వాయిస్ క్లోనింగ్ మోసమని గ్రహించాలి.

కొత్త నంబర్ల నుంచి ఫోన్లు వస్తే లిఫ్ట్ చేయొద్దు



ఇటీవలి వాయిస్ క్లోనింగ్ స్కాంలు పెరిగాయి. ఏఐ టెక్నిక్స్, యాప్స్ వాడి ఇలా మోసాలకు పాల్పడుతున్నారు. అన్నిటికంటే ముఖ్యమైనది అది మనకు తెలియని ఫోన్ నంబర్ అనేది. కాబట్టి తెలియని నంబర్ల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌ను లిఫ్ట్ చేయకపోవడమే ఉత్తమం. ఫోన్ నంబర్ సాధారణంగా మనకు తెలిసినట్టు కాకుండా ఏదైనా ప్రత్యేకంగా (విదేశీ కోడ్‌లు) ఉన్నట్టు గమనిస్తే అప్రమత్తం కావాలి. ట్రూ కాలర్ వంటి యాప్స్‌తో అవి ఎవరిది, ఎక్కడి నుంచి అనేది గుర్తించవచ్చు.

-అద్వైత్ కంభం, సైబర్ భద్రత నిపుణుడు

నేడు సాక్షి అవార్డ్స్ స్పెషల్ ఎపిసోడ్

గత పది సంవత్సరాలుగా సాక్షి మీడియా గ్రూప్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ టెన్త్ ఎడిషన్' వేడుక స్పెషల్ ఎపిసోడ్ సాక్షి టీవీలో శనివారం ప్రసారం కానుంది. ఫిబ్రవరి 28, శుక్రవారం హైదరాబాద్‌లో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ వేడుకలో వై.ఎస్.భారతిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. సామాజిక రంగంలో గొప్ప సేవ చేస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన వారికీ, కళారంగంలో గొప్ప ప్రతిభ చూపిన వారికి 2023–24 సంవత్సరాలకు గాను ఈ ఎక్సలెన్స్ అవార్డులు బహూకరించారు. జ్యూరీ చైర్‌పర్సన్‌గా శాంతాసిన్హా వ్యవహరించారు. అవార్డులు అందుకున్న వారిలో పర్యావరణ సేవకు గాను దూసర్ల సత్యనారాయణ, సేంద్రియ వ్యవసాయానికి మల్లికార్జునరెడ్డి, అమర సైనికుడు డొక్కరి రాజేశ్ (మరణానంతరం అతని తల్లిదండ్రులకు), క్రికెటర్ గొంగడి త్రిష, అథ్లెట్ జీవాంజి దీప్తి తదితరులు ఉన్నారు. సినిమా రంగంలో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ సీనియర్ నటి రమాప్రభ అందుకున్నారు. ఎక్సలెన్స్ అవార్డులు అందుకున్న వారిలో దర్శకుడు సాయి రాజేష్, మీనాక్షి చౌదరి, కిరణ్ అబ్బవరం తదితరులు ఉన్నారు. డైరెక్టర్ సుకుమార్ 'తెలుగు పర్సన్ ఆఫ్ ది ఇయర్' పురస్కారం, ఉత్తమ దర్శకుడి పురస్కారం అందుకున్నారు.



10న గ్రూప్‌-1 ప్రొవిజనల్ మార్కులు

11న గ్రూప్‌-2, 14న గ్రూప్‌-3 జనరల్ ర్యాంకింగ్ లిస్టులు

- 17న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, 19న ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఫలితాలు
- షెడ్యూల్ విడుదల చేసిన టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ శాఖల్లో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం చేపట్టిన గ్రూప్స్, ఇతర పరీక్షల ఫలితాలను వరుసగా విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం ప్రకటించారు. ఈ నెల 10వ తేదీ నుంచి గ్రూప్‌–1 పరీక్ష ప్రొవిజనల్ మార్కులను అభ్యర్థులకు అందుబాటులో ఉంచనున్నట్లు శుక్రవారం వెల్లడించారు. 10 నుంచి 19వ తేదీ వరకు గ్రూప్‌–1, గ్రూప్‌–2, గ్రూప్‌–3, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పరీక్షల ఫలితాలను ప్రకటించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆయన ఫలితాల షెడ్యూల్‌ను విడుదల చేశారు. వివిధ ఉద్యోగ నోటిఫికేషన్ల పరిస్థితిపై శుక్రవారం టీజీపీఎస్సీ కార్యాలయంలో వెంకటేశం సమీక్ష నిర్వహించారు. గ్రూప్స్ కేటగిరీలోని 3 నోటిఫికేషన్లతోపాటు మరో రెండు పరీక్షలకు సంబంధించి జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ (జీఆర్ఎల్), ఫలితాలు, మార్కుల వెల్లడికి సంబంధించిన షెడ్యూల్‌ను సమావేశంలో ఆమోదించారు. నిర్దేశించిన తేదీల్లో మార్కులు, ఫలితాలు, జీఆర్ఎల్‌ను అభ్యర్థులు లాగిన్ ద్వారా పరిశీలించుకునే అవకాశం కల్పిస్తారు.

వదంతులు నమ్మొద్దు

గ్రూప్‌–1 ఉద్యోగ నియామకాలకు సంబంధించి తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని బుర్రా వెంకటేశం అభ్యర్థులకు సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మధ్యవర్తులు ఇచ్చే హామీలు, ప్రకటనలను నమ్మి మోసపోవద్దని కోరారు. ఎవరైనా అలాంటి ప్రచారం చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, లేదా 99667 00339 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. vigilance@tspsc.gov.inలో కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఇలాంటి ప్రచారంపై కమిషన్‌కు ఇప్పటివరకు ఫిర్యాదులేవీ అందలేదని చెప్పారు. అలాంటి వారిపైన క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు టీజీపీఎస్సీ సిద్ధంగా ఉందని ప్రకటించారు.

ఇదీ షెడ్యూల్..

పరీక్ష	తేదీ	ఫలితం
గ్రూప్‌-1	10	అభ్యర్థికి వచ్చిన మార్కులు
గ్రూప్‌-2	11	జనరల్ ర్యాంకింగ్ లిస్ట్
గ్రూప్‌-3	14	జనరల్ ర్యాంకింగ్ లిస్ట్
హెచ్‌డబ్ల్యూఓ	17	తుది ఫలితాలు
ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్	19	తుది ఫలితాలు

అంతర్జాతీయ ప్రమాణాలతో ఎంఎస్‌ఎంఈ క్లస్టర్లు

- పరిశ్రమలు తరలిపోతున్నాయని దుష్ప్రచారం చేస్తున్నారు
- ఎంఎస్‌ఎంఈ స్పార్క్ 2.0 సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు


ఎఫ్‌టీసీసీఐ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) క్లస్టర్లను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. ఎంఎస్‌ఎంఈ నిర్వాహకుల సమస్యలు పరిష్కరించడంతోపాటు వారి ఉత్పత్తులను అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేసుకునేందుకు ప్రభుత్వం తరఫున సహకరిస్తామని చెప్పారు. 'ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం 'ఎంఎస్‌ఎంఈ స్పార్క్ 2.0' పేరిట ఏర్పాటు చేసిన సదస్సును మంత్రి శ్రీధర్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు. పెట్టుబడులతో ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటామన్నారు. తెలంగాణ యువత నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టి, ఉపాధి కల్పన దిశగా ఎదగాలని శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు.

రుణ వితరణలో ఉదారంగా వ్యవహరించండి

'ఎంఎస్‌ఎంఈలకు రుణ వితరణలో బ్యాంకులు ఉదారంగా వ్యవహరించే విధంగా ప్రభుత్వం తరఫున చొరవ తీసుకుంటాం. ఎంఎస్‌ఎంఈల నిర్వాహకులు మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకొని ఉత్పత్తి వ్యయం తగ్గించుకోవాలి. వీరికి ఏఐ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీ వినియోగంపై అవగాహన కల్పిస్తాం. ఎంఎస్‌ఎంఈ ప్రోత్సహించేందుకు తీసుకొచ్చిన ప్రత్యేక పాలసీ అమలుకు సంబంధించి త్వరలో ఆపరేషనల్ గైడ్‌లైన్స్ విడుదల చేస్తాం. ఈ నెలాఖరుకు పారిశ్రామికవేత్తలకు ఇవ్వాల్సిన రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్ల బకాయిలను చెల్లిస్తాం. రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయని కొందరు ప్రచారం చేస్తున్నా, పెట్టుబడులు ఆగడం లేదు. ఈ ఏడాది దావోస్‌లో రూ.1.78లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు చేసుకున్నాం' అని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పరిశ్రమల శాఖ డైరెక్టర్ డాక్టర్ మల్సూర్, ఎస్‌బీఐ లోకల్ ఆఫీస్ సీజీఎం రాజేశ్‌కుమార్, ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ సురేష్ కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.

పాలెంవాగు గుట్టలపై హనిబ్యాడ్జర్




వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండల పరిధి పాలెంవాగు ప్రాజెక్టు సమీపంలోని గుట్టలపై అటవీశాఖ అధికారులకు అరుదైన జంతువు హని బ్యాడ్జర్ కనిపించినట్లు అటవీశాఖ అధికారి వంశీకృష్ణ తెలిపారు. గుట్టలపై జంతువుల వేట కోసం అమర్చిన ఉచ్చులో.. జంతువు చిక్కుకున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. ఉచ్చులో హనిబ్యాడ్జర్ అనే జంతువు చిక్కుకున్నట్లు గుర్తించి.. దాన్ని అడవిలోకి పంపించినట్లు వంశీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి దేవయ్య, బీట్ ఆఫీసర్ ప్రణవి తదితరులు ఉన్నారు.

చర్లపల్లి నుంచి మరో రెండు రైళ్లు

నేటి నుంచి రాకపోకలు

సాక్షి, హైదరాబాద్: చర్లపల్లి టెర్మినల్ నుంచి మరో రెండు రైళ్లు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం చెన్నై సెంట్రల్–హైదరాబాద్ (12603/12604) మధ్య నడుస్తున్న రైలు.. ఈ నెల 8వ తేదీ నుంచి నాంపల్లి నుంచి కాకుండా చర్లపల్లి నుంచి రాకపోకలు సాగించనుంది. ఈ మేరకు గోరఖ్‌పూర్–సికింద్రాబాద్ (12589/12590) ఎక్స్‌ప్రెస్ కూడా.. ఈ నెల 12వ తేదీ నుంచి గోరఖ్‌పూర్–చర్లపల్లి ఎక్స్‌ప్రెస్‌గా రాకపోకలు సాగించనుంది.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

ఆమెకు ప్రత్యేకం!

ఖమ్మం కలెక్టరేట్‌లో ఉద్యోగినులకు ప్రత్యేక లాంజ్

- విశ్రాంతి కోసం సకల సౌకర్యాలు ఏర్పాటు
- అత్యవసర సమయాల్లో ఉపయోగం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఉద్యోగినులు


లాంజ్‌రూమ్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఉద్యోగినులు

ఖమ్మం సహకార నగర్: ఉద్యోగ విధుల్లో పురుషులతో సమానంగా.. వారికి తీసిపోని విధంగా మహిళలు రాణిస్తున్న రోజులివి. కానీ మహిళల శరీర ధర్మం ప్రకారం సహజసిద్ధంగానే కొన్ని ఇబ్బందులు వస్తాయి. గృహిణులైతే ఇంట్లో ఉంటారు కాబట్టి విశ్రాంతికి అవకాశం ఉంటుంది.. కానీ ఉద్యోగ విధులు నిర్వర్తించే మహిళలు ఇబ్బంది పడుతూనే బాధ్యతలు నిర్వర్తించాలి. వారి ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ గత ఏడాది అక్టోబర్ 27న ప్రత్యేకంగా కలెక్టరేట్‌లో మహిళా లాంజ్‌ను ప్రారంభించారు. దీంతో మధ్యాహ్న సమయంలోనే కాకుండా.. అవసరమైన ఇతర సమయాల్లోనూ ఉద్యోగినులు ఇక్కడ విశ్రాంతి తీసుకునేందుకు వెసులుబాటు కలిగింది.

సకల సౌకర్యాలతో..

రాష్ట్రంలోనే తొలిసారి ఖమ్మం కలెక్టరేట్‌లోని ఒక గదిలో మహిళా లాంజ్‌ను సకల సౌకర్యాలతో ఏర్పాటు చేశారు. విశ్రాంతి తీసుకునేందుకు రెండు సోఫాలు, కుర్చీలు ఏర్పాటు చేయడమే కాక.. అత్యవసరమైతే అక్కడి నుంచే పనిచేసేలా టేబుళ్లను అందుబాటులో ఉంచారు. మనసుకు ప్రశాంతత కలిగేలా.. రంగురంగుల కర్టెన్లు, పచ్చని మొక్కలతో తీర్చిదిద్దడంతో పాటు స్ఫూర్తి నింపేలా కొటేషన్లు రాయించారు. నాప్‌కిన్స్ మెషీన్‌ను ఏర్పాటు చేసి.. వాష్‌రూమ్‌లోనూ ఆధునిక సౌకర్యాలు కల్పించారు. ఇంటాబయట ఒత్తిళ్ల మధ్య విధులకు హాజరయ్యే తాము.. కార్యాలయంలో కల్పించిన సౌకర్యాలతో రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తున్నామని ఉద్యోగినులు ఆనందంగా చెబుతున్నారు.

550 మంది ఉద్యోగినులకు ఉపశమనం

కలెక్టరేట్‌లో 30 శాఖలు కొనసాగుతుండగా.. ఇందులో రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కలిపి మహిళా ఉద్యోగులు 550 మంది వరకు ఉన్నారు. వీరందరికీ లాంజ్ రూమ్ ఉపయోగపడుతోంది.



లాంజ్ రూమ్‌లో ఏర్పాటు చేసిన సోఫాలు


లాంజ్‌రూమ్ బయట..

ఎంతో ఉపయోగం



"కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన లాంజ్‌రూమ్ మాకు పూర్తిస్థాయిలో ఉపయోగపడుతోంది. మా అవసరాలు గుర్తించి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రత్యేకంగా గది ఏర్పాటు చేయించారు. అనారోగ్యం, ఇతర సమస్యలు ఉన్నప్పుడు ఈ గది ఉపయోగం మాటల్లో చెప్పలేనిది.

– ఎండీ జహేదాబేగం, రెవెన్యూ శాఖ

కలెక్టర్ గారి పుణ్యమే..



ఉద్యోగినుల ఆరోగ్యంపై దృష్టి సారించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మహిళా లాంజ్ రూమ్ ఏర్పాటు చేయించారు. ఈ గది మాకు భోజన విరామం, వ్యక్తిగత, అనారోగ్య సమయాల్లో ఉపయోగపడుతోంది. కాసేపు ఇక్కడ విశ్రాంతి తీసుకుంటే.. కొత్తఉత్సాహంతో పనిచేయగలుగుతున్నాం.

– వై.మంజుల, ఎస్‌టీవో, ఖజానా శాఖ

హాయిగా ఉంది



విధులకు ముందుగా వస్తే.. కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు లాంజ్ రూమ్ ఉపయోగపడుతోంది. భోజన విరామ సమయంలో విశ్రాంతి తీసుకునేందుకు కూడా ఉపయోగపడుతోంది. ఉద్యోగినుల సమస్యలను గుర్తించి కలెక్టర్ మహిళా లాంజ్‌రూమ్ ఏర్పాటు చేయించడం ఆనందంగా ఉంది.

– గాయత్రి, విద్యాశాఖ

ఏసీబీ పేరిట నకిలీ ఫోన్ కాల్స్

- డబ్బు డిమాండ్ చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు
- రాచకొండ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- ఏసీబీ డీజీ విజయ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) పేరిట కొందరు ప్రైవేటు వ్యక్తులు ఫోన్ కాల్స్ చేసి ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ తెలిపారు. ఏసీబీ కేసులు నమోదు చేయకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలని సదరు వ్యక్తులు బెదిరిస్తున్నారని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే తరహాలో జరిగిన బెదిరింపు ఘటనపై రాచకొండ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. కేసులు నమోదు చేయకుండా ఉండేందుకు డబ్బులు ఇవ్వాలని.. ఏసీబీ అధికారులు ఎప్పుడూ ఫోన్ చేయరని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి నకిలీ ఫోన్‌కాల్స్‌కు బెదిరిపోయి ప్రభుత్వ ఉద్యోగులు, సాధారణ ప్రజలెవరూ డబ్బులు చెల్లించవద్దని సూచించారు. ఎవరికైనా ఏసీబీ పేరిట నకిలీ ఫోన్‌కాల్స్ వస్తే.. వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. వాట్సాప్ నంబర్ 9440446106, లేదా ఫేస్‌బుక్‌లో Telangana ACB లో లేదా ట్విట్టర్ (ఎక్స్‌లో) @TelanganaACB కి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

పీఆర్‌లో 524 మందికి జేఏలుగా అప్‌గ్రేడ్

- కారుణ్య నియామకాల ద్వారా 58 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్
- ఆదేశాలు జారీ చేసిన పీఆర్‌ఆర్‌డీ శాఖ కార్యదర్శి

సాక్షి, హైదరాబాద్: ఆఫీస్ సబార్డినేట్స్, నైట్ వాచ్‌మన్లుగా పనిచేస్తున్న వారిని 524 జూనియర్ అసిస్టెంట్(జేఏ) పోస్టులకు అప్‌గ్రేడ్ చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీనితోపాటు సూపర్ న్యూమరరీ పద్ధతిలో 58 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను కల్పిస్తూ నిర్ణయించింది. జిల్లా ప్రజాపరిషత్/మండల ప్రజా పరిషత్‌లలో ఉద్యోగాలు చేస్తూ మరణించిన వారి డిపెండెంట్లకు కారుణ్య నియామకాల 'ఒకేఒక చర్య'(వన్‌టైమ్ మెజర్)కింద ఈ పోస్టులను కేటాయిస్తూ గురువారం పీఆర్‌శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్ ఆదేశాలిచ్చారు. దీంతో ఈ రెండింటిని కలిపితే పీఆర్ శాఖ ద్వారా మొత్తం 582 పోస్టులు (అప్‌గ్రెడేషన్, సూపర్ న్యూమరరీ కలిపి) అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయంలో జిల్లా పరిషత్ సీఈవోలు తమ తమ జిల్లాల పరిధిలోని పోస్టుల అప్‌గ్రెడేషన్, కారుణ్య నియామకాలకు సంబంధించి... వెంటనే చర్యలు తీసుకొని, రెండు, మూడు రోజుల్లోనే ఈ నియామకాలు జరిగేలా చూడాలని పీఆర్‌ఆర్‌డీ డైరెక్టర్ సృజన సూచించారు. ఈ మేరకు శుక్రవారం జెడ్పీ సీఈవోలకు పీఆర్‌ఆర్‌డీ డైరెక్టర్ మెమో ద్వారా తెలియజేశారు. దీనికి సంబంధించిన సమాచారాన్ని జిల్లా కలెక్టర్లకు పంపించారు.

పారిశ్రామికవేత్తలతో సదస్సు 10న

సాక్షి, హైదరాబాద్: విత్తనోత్పత్తి, విత్తనాభివృద్ధి, బయోఆధారిత ఉత్పత్తులు, పంపిణీ, ప్రాసెసింగ్ అంశాలపై పరిశ్రమల వర్గాలతో కలిసి భారత వ్యవసాయ పరిశోధన మండలి-భారత నూనెగింజల పరిశోధనా సంస్థలు సంయుక్తంగా ఈనెల 10వ తేదీన సోమవారం కీలక చర్చా సదస్సు నిర్వహిస్తున్నాయి. సదస్సులో దేశంలో పేరెన్నికగన్న పలు పరిశ్రమలతో ఈ పరిశోధనా సంస్థలు అవగాహన ఒప్పందాలు కూడా కుదుర్చుకోనున్నాయి. సోమవారం జరగనున్న ఈ సదస్సులో పాల్గొనాలనుకునే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, అంకుర సంస్థలు, పరిశ్రమల అధినేతలు 9247336334 లేదా 9010845942 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవచ్చని భారత నూనెగింజల పరిశోధన సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే మాథుర్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. నూనె గింజల్లో పలు అధిక దిగుబడులనిచ్చే వంగడాలను అభివృద్ధి చేయడంతోపాటు, మూడు దశాబ్దాలుగా జీవన నియంత్రణ సాంకేతికత రంగంలో వివిధ ట్రైకోడెర్మా, బీటీ సంబంధిత ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో దేశవ్యాప్తంగా ఘనత సాధించిన విషయాన్ని మాథుర్ గుర్తు చేశారు. రాజేంద్రనగర్‌లోని ఈ పరిశోధన సంస్థలో సోమవారం ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభం కానుందని వెల్లడించారు.

ఆ'వరి'ంచిన నైరాశ్యం



భూగర్భ జలాలు అడుగంటడంతో సాగు నీరందక పంట పొలాలు ఎండిపోతున్నాయి. రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలో కరువు ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. యాసంగి సీజన్‌లో మండలవ్యాప్తంగా 3,600 ఎకరాల్లో అన్నదాతలు వరి పంట వేశారు. బోర్లు, బావుల్లో నీటిమట్టం తగ్గిపోవడంతో ఇప్పటికే 20 శాతం మేర చేలు ఎండిపోయాయి. దీంతో జీవాలు, పశువులను మేపుతున్నారు. - మంచాల

చంద్రగఢ్ కోటకు నిర్లక్ష్యపు బీటలు

- కోట మధ్యలో రామలింగేశ్వరాలయం
- కొండపై రాతి కొలనులు.. ఏడాదంతా నీరు
- చంద్రసేనుడు నిర్మించడంతో 'చంద్రగఢ్'గా ప్రసిద్ధి
- ప్రభుత్వ నిరాదరణతో శిథిలమౌతున్న కోట

ఎత్తయిన కొండపై పురాతన కోట ● చుట్టూ ఆహ్లాదకర వాతావరణం


చంద్రగఢ్ కోట ముఖద్వారం

అమరచింత: పచ్చని పంట పొలాలు.. ఎత్తయిన కొండ.. దానిపై దుర్భేధ్యమైన కోట.. కోట మధ్యలో ఆలయం. రాతి పొరల మధ్య తాగునీటికి ఇబ్బంది కలగకుండా ఎనిమిది చిన్న చిన్న కొలనులు.. ఏడాది పొడవునా నీటితో కళకళలాడతాయి.. పర్యాటకులకు కనువిందు చేస్తాయి.. ఈ అద్భుతాల కోట పేరే చంద్రగఢ్ ఖిల్లా.. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే అత్యంత పురాతన కట్టడాల్లో చంద్రగఢ్ కోట ఒకటి. ఎన్నో విశిష్టతలున్న ఈ పురాతన కోట పర్యాటకంగా అభివృద్ధికి నోచుకోలేదు.

ధర్మాపురం గ్రామానికి ఉత్తర దిశగా..

18వ శతాబ్దంలో మరాఠీ రాజుల కాలంలో బాజీలరావు పేష్వా ఆత్మకూర్ సంస్థానానికి సంబంధించిన పన్నుల వసూలుకు చంద్రసేనుడిని నియమించారు. చంద్రసేనుడు ఈ ప్రాంతంలోని ధర్మాపురం గ్రామానికి ఉత్తర దిశగా ఉన్న ఎత్తయిన కొండపై కోటను నిర్మించాడు. అప్పట్లో ఇక్కడి నుంచే చంద్రసేనుడు వివిధ సంస్థానాధీశుల నుంచి పన్నులు వసూలు చేస్తూ మరాఠాకు పంపుతుండేవాడు. చంద్రసేనుడు నిర్మించిన కోట కావడంతో కాలక్రమంలో దీనికి చంద్రగఢ్ కోటగా నామకరణం చేశారు. వాటిలో పలగల రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఏటా జాతరతో పాటు నిత్య పూజలను నిర్వహించేవారు.

రాతి కొలనులకు జలకళ

అప్పట్లో కోటపై భాగంలో రక్షణ కోసం ఉంటున్న భటులు, సిబ్బంది తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు కొలనులు నిర్మించారు. ఇక్కడి శిలలపై రాతిపొరలను తొలచి నీటి చెలిమలను గుర్తించారు. దీంతో వర్షాకాలంతో పాటు ఇతర కాలాల్లో సైతం కొలనుల్లో తాగునీరు అందుతుండేది. వీటిలో తామర పుష్పాలు సైతం ఉండటం విశేషం. సాక్షాత్తు పరమశివుడు కొలువైన గుట్ట కావడంతోనే గంగమ్మ తల్లి ఇక్కడ కొలువైందని భక్తులు విశ్వసిస్తారు.

శత్రువులను గుర్తించే పరిజ్ఞానం

కోటపై భాగంలో కాపలా ఉండే సైనికులు శత్రుదేశాల రాజులు దండెత్తడానికి వస్తే.. వారిని సుమారు పది కిలోమీటర్ల దూరం నుంచే పసిగట్టి.. ఫిరంగులతో దాడి చేయడానికి వీలుగా కోట గోడ భాగంలో భారీ రంధ్రాలను ఏర్పాటు చేశారు. వీటి నుంచి శత్రువుల రాకపోకలను గుర్తించి ఎదుర్కొనేవారు.


శిథిలమవుతున్న రాతి గోడలు

చంద్రగఢ్ కోట లోపలి రాతి గోడలు ఒక్కొక్కటిగా శిథిలమవుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌యాదవ్.. ఈ కోటను సందర్శించారు. కోటను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని.. పర్యాటకంగా గుర్తింపు తీసుకు వస్తామని ప్రకటించారు. అప్పట్లో కేవలం కోటపైకి వెళ్లడానికి సీసీ రోడ్డును నిర్మించి వదిలేశారు. ఆ తర్వాత ఇప్పటివరకు చంద్రగఢ్ కోటను పట్టించుకునే వారే కరువయ్యారు.

మంత్రివర్యా.. దృష్టి పెట్టండి

పర్యాటక శాఖ మంత్రి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావాసి జూపల్లి కృష్ణారావు అయినా చంద్రగఢ్ కోటపై కాస్త దృష్టి పెట్టి పర్యాటకాభివృద్ధి చేయాలని ఈప్రాంత వాసులు కోరుతున్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సైతం కోటకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేయాలని ఈ ప్రాంతీయులు విజ్ఞప్తి చేస్తున్నారు.


రామలింగేశ్వర స్వామి ఆలయం


కోటలోపల రాతి నీటి కొలనులు

కోటను అభివృద్ధి చేయాలి



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వస్తున్న సందర్శకులు, పర్యాటకులు మూడు కిలోమీటర్ల దూరంలోని చంద్రగఢ్ కోటను చూసేందుకు వస్తుంటారు. పర్యాటక శాఖ గుర్తించి కోటను అభివృద్ధి చేయాలి.

– నాగేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, చంద్రగఢ్

కోట అభివృద్ధితో ఉపాధి



చంద్రగఢ్ కోటను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే.. ఇక్కడి ప్రజలకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. పర్యాటక శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు కోట అభివృద్ధిపై దృష్టి సారించాలి. పురాతన కోటను కాపాడాలి.

– వెంకటేశ్, స్థానికుడు, అమరచింత

త్వరలో కోటకు పూర్వ వైభవం



చంద్రగఢ్ కోటకు పర్యాటకులను నిత్యం వచ్చేలా సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. చంద్రగఢ్ కోటను పర్యాటకంగా తీర్చిదిద్దాలని పర్యాటక శాఖ మంత్రితో పాటు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే చంద్రగఢ్ పూర్వవైభవం సంతరించుకునేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

– డాక్టర్ వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే, మక్తల్

క్లుప్తంగా...

మెప్మా మహిళలకు ఆర్థిక చేయూత

సాక్షి, అమరావతి: విజయవంతంగా వ్యాపారాలు చేస్తూ సత్ఫలితాలు సాధించిన పట్టణ స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలను పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ – మెప్మా (మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పోవర్టీ ఇన్ మునిసిపల్ ఏరియాస్) ఆధ్వర్యంలో సత్కరించనున్నారు. ఆన్‌లైన్ వ్యాపారంలోకి అడుగుపెట్టి తక్కువ కాలంలోనే స్వయం సహాయక సంఘాల మహిళలు రూ.1.5 కోట్ల అమ్మకాలు చేసి ప్రపంచ రికార్డు నమోదు చేసిన నేపథ్యంలో ఈ వేడుకను నిర్వహించనున్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మార్కాపురంలో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నట్టు మెప్మా ఎండీ తేజ్ భరత్ తెలిపారు.

మహిళా ఉద్యోగుల పాత్ర నిరూపమానం

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు

సాక్షి, అమరావతి: ఆర్టీసీ అభివృద్ధిలో మహిళా ఉద్యోగుల పాత్ర నిరూపమానమైందని ఆ సంస్థ ఎండీ సీహెచ్. ద్వారకా తిరుమల రావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 5,300మంది మహిళా ఉద్యోగులు ఆర్టీసీలో సమర్థంగా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. మహిళా ఉద్యోగుల సంక్షేమం కోసం ఆర్టీసీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని వివరించారు.

జనసేనలోకి దొరబాబు

సాక్షి, అమరావతి: పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. దొరబాబుకు మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నిర్మాణరంగానికి మైనర్ మినరల్ రంగం వెన్నెముక

నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ సారస్వత్

సాక్షి, అమరావతి: భారతదేశ మౌలిక సదుపాయాలు, నిర్మాణం, తయారీ పరిశ్రమలకు మైనర్ మినరల్ రంగం వెన్నెముకగా నిలుస్తోందని, ఇది లక్షలాది మంది జీవనోపాధికి మద్దతు ఇస్తోందని నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వి.కె.సారస్వత్ చెప్పారు. 'మైనర్ మినరల్ మైనింగ్‌లో అవకాశాలు–సవాళ్లు' అనే అంశంపై విజయవాడలో శుక్రవారం నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆదాయాలకు గణనీయంగా దోహదపడుతున్న మైనర్ మినరల్ రంగం నియంత్రణ అసమానతలు, అధిక పన్నులు, పర్యావరణ అనుమతుల సమస్య కారణంగా ఆశించిన ప్రగతి లేదని చెప్పారు. ఈ అడ్డంకులను అధిగమించడంతోపాటు జాప్యాన్ని అరికట్టేందుకు సింగిల్‌విండో విధానంలో చట్టపరమైన అనుమతులు ఇచ్చేలా ఉండాలన్నారు. ఒకే దేశం– ఒకే విధానం పేరుతో జాతీయ మైనర్ మినరల్ పాలసీని సమర్థిస్తామని చెప్పారు. పాలసీలో ఇందుకు అవసరమైన మార్పులను చేసేందుకు ప్రతిపాదనలు చేస్తామన్నారు. పుట్టా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ వర్క్‌షాప్‌లో ఫెమ్మి కార్యదర్శి డాక్టర్ సిహెచ్ రావు, ఐఐటీ–ఐఎస్‌ఎం ప్రొఫెసర్ ఆర్‌ఎం భట్టాచార్జీ తదితరులు మాట్లాడారు.

ఏపీఈఆర్‌సీ ఆదేశాల మేరకే ఇంధన సర్దుబాటు చార్జీలు

మంత్రి గొట్టిపాటి రవికుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారుల నుంచి ఇంధన సర్దుబాటు చార్జీల వసూలుకు 2024 అక్టోబరు 10న ఏపీఈఆర్‌సీ ఆదేశాలిచ్చిందని శాసనసభలో వైఎస్సార్‌సీపీ సభ్యుల ప్రశ్నకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఏపీఈఆర్‌సీ ఇచ్చిన ఆదేశాల మేరకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.6,072.87 కోట్ల మేర ఇంధన సర్దుబాటు చార్జీలను 15 నెలల్లో వసూలుకు చర్యలు చేపట్టారన్నారు. అలాగే, 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2024 డిసెంబరు నుంచి 24 నెలల కాలంలో మరో రూ.6,543 కోట్లు వసూలుకు ఆదేశాలిచ్చినట్లు చెప్పారు.

మాయమయ్యాడు.. మామూలు మనిషి

- కనిపించని అనుబంధాలు, ఆత్మీయతలు
- మచ్చుకైనా కనిపించని మానవత్వం
- ఎవరి బతుకు వారిదేనన్న స్వార్థ మనస్తత్వాలు

ఒకప్పుడు ఎటు చూసినా బంధాలు.. అను బంధాలు..ఆత్మీయతలు.. అనురాగాలు.. విలసిల్లేవి.. ప్రపంచీకరణ పుణ్యమాని.. మనిషిలో స్వార్థం పెరిగి మాన సంబంధాలు కనుమరుగవుతున్నాయి. తన జీవితం తనదే, పొరుగువారితో పనే ముందన్న రీతి లో మానవుడు సాగుతున్నాడు. యాంత్రిక జీవనం గడుపుతున్నాడు.. మచ్చుకైనా మానవత్వం కనిపించకపోవడంతో మామూలు మనిషి మాయమైపోయాడనక తప్పదు. నేటి మానవ సంబంధాలపై ప్రత్యేక కథనం.

పలమనేరు: మానవ సంబంధాలను మంటగలిపి కేవలం తమ స్వార్థం చూసుకుంటున్న మనుషులు సమాజంలో ఎక్కువైపోయారు. గమ్యం తెలియని జీవన పయనమెటో తెలియని గందరగోళం నెలకొంది. సమాజంలో మంట కలుస్తున్న మానవత్వాన్ని మేలు కొల్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గత ఏడాదిలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అందరూ ఉండి అనాథల్లా మారి కనీసం అంత్యక్రియలకు నోచుకోని పదిమందికి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు దహన సంస్కారాలు చేశారంటే సమాజంలో ఎలాంటి మానవీయ సంబంధాలున్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఇప్పుడు మానవ సంబంధాలెలా ఉన్నాయంటే?

పలమనేరు మండలంలోని మొరం పంచాయతీకి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి తన కుటుంబంతో బెంగళూరులో కాపురముంటున్నారు. అనారోగ్యంతో అతని తల్లి మృతి చెందింది. దీంతో ఆ ఇంటి యజమాని మానవత్వం లేకుండా తన ఇంట్లో శవాన్ని పెట్టకుండా అడ్డుకున్నాడు. దీంతో విధిలేక వారు స్వగ్రామానికి తీసుకొచ్చారు. బయట చనిపోయినవారు గ్రామంలోకి రాకూదనే సంప్రదాయంతో శవాన్ని ఊరిబయటే పెట్టి ఆపై అంత్యక్రియలను నిర్వహించారు. పలమనేరు సమీపంలోని సాయినగర్‌లో ఓ ఉద్యోగి సొంత ఇంటిని నిర్మించుకుని పదేళ్లుగా కాపురముంటున్నాడు. ఆయన ఇప్పటివరకు ఇరుగుపొరుగు వారితో మాట్లాడలేదు. ఎరింటికీ వెళ్లలేదు. ఆ వీధిలో ఎవరికైనా కష్టమొచ్చినా సాయం చేయలేదు. పొద్దున ఆఫీసుకెళ్లడం పొద్దుపోయాక ఇంటికి రావడం తప్ప అతనికి ఎవరితోనూ సంబంధం లేని జీవితం గడుపుతున్నారు.



మారిన బతుకులు

ఒకటో తరగతి నుంచి కార్పొరేట్ స్కూల్ ఆపై కాలేజీ, మళ్లీ కుటుంబానికి దూరంగా పిల్లల చదువులు. ఆపై ఉద్యోగం రాగానే వారి జీవితం వారిది. ఇక ఇళ్లల్లోని పెద్దలను పిల్లలే వృద్ధాశ్రమాల్లో చేర్పిస్తున్నారు. దీంతో కుటుంబ విలువలు తెలియని పిల్లలు ఎవరికివారేఅన్న భావనతో తమ బతుకులకు అంకితమైపోతున్నారు. స్మార్ట్‌ఫోన్ల పుణ్యమాని మానవ సంబంధాల పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. గతంలో ఓ గ్రామంలో వంద కుటుంబాలుంటే కనీసం 20 కుటుంబాలన్నా ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఇప్పుడు ఊరికి రెండు, మూడు కుటుంబాలు సైతం కలిసి ఉండడం లేదు.

సచ్చినా బాధపడే వారెవరు?

సొంత కుటుంబసభ్యులు ఎవరైనా మృతి చెందితే కనీసం కొన్నేళ్లపాటు బాధపడే రోజులు గతంలో కనిపించేవి. కానీ ఇప్పుడు సొంత కుటుంబసభ్యులు చనిపోయినా కేవలం రెండు మూడు రోజులే బాధ, ఆపై అసలు పట్టించుకోరు.





గతంలో ఉమ్మడి కుటుంబంతో అలా.. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్లలో ఇలా

మాయమవుతున్న మానవసంబంధాలు

ఎవరు ఏమైతే నాకేంటి నా కుటుంబం బాగుంటే చాలనే స్వార్థం ఎక్కువైంది. ఆఖరికి తన సొంత అమ్మా నాన్న, అక్కా చెల్లి, అన్నదమ్ములను సైతం పట్టించుకోవడం లేదు. గతంలో గ్రామంలో ఎవరి ఇంట్లోనైనా శుభ, అశుభకార్యాలు జరిగితే పనులు చేసేందుకు ఇంటికోమనిషి వెళ్లేవారు. ఇప్పుడు పెళ్లికి సైతం రావడం లేదు. దీంతో శుభ, అశుభ కార్యక్రమాలకు ఈవెంట్ మేనేజర్లే దిక్కుగా మారారు.

నాటి పలకరింపులు కరువు



గతంలో ఇంటికి ఎవరైనా బంధువులొస్తే గంటల తరబడి పలకరింలుండేవి. ఆపై బంధువులకు విందుభోజనం చేసిపెట్టేవాళ్లం. ఇప్పుడు ఎవరైనా బంధువులు ఇంటికొస్తే నిమిషం పలకరింపు, బిజీగా ఉన్నాం ఇంకోసారి వస్తాంలేనంటూ పదినిమిషాల్లో వెళ్లడం కనిపిస్తోంది. మన ఇంట్లోని వారు సైతం బంధువులతో మాట్లాడకుండా స్మార్ట్‌ఫోన్లకు అతక్కుపోయి ఉంటున్నారు.

– లక్ష్మీపతినాయుడు, బురిశెట్టిపల్లి, బైరెడ్డిపల్లి మండలం

కష్టమొస్తే పలకరించేవాళ్లుండాలయ్యా!



గతంలో ఎవరికైనా కష్టం వస్తే ఇంటిపక్కనున్నవారో స్నేహితులో మంచి సలహా చెప్పి సమస్యకు పరిష్కారం చూపేవారు. ఇప్పుడు ఆత్మీయ పలకరింపులు లేవు. ఎవరు చూసినా వారి పనుల్లో బిజీబీజీ. రోడ్డుపై ప్రమాదం జరిగినా మనకెందుకులే, కేసవుతుందని వెళ్లిపోయే సమాజమిది. అమ్మా,నాన్న, బిడ్డలకంటే ఎక్కువగా సోషల్‌మీడియాతో గడుపుతున్నారు.

– పుష్పరాజ్, రిటైర్డ్ టీచర్, పలమనేరు

నిమ్మల ఓవర్ యాక్షన్.. లోకేశ్ డబుల్ ఓవరాక్షన్

- చేతికి కాన్యులా పెట్టుకుని సభకి హాజరైన మంత్రి నిమ్మల
- నిమ్మలకు జ్వరమని, ఆయన రెస్ట్ తీసుకునేలా రూలింగ్ ఇవ్వాలన్న లోకేశ్

సాక్షి, అమరావతి: మీడియా హైప్, అధినేతల దృష్టిలో పడటం కోసం రాజకీయ నాయకులు చేసే విన్యాసాలు రకరకాలు. ఇలాంటి విన్యాసకారులకు తెలుగుదేశం పార్టీ ప్రసిద్ధి. గతంలో చిత్తూరు ఎంపీ శివప్రసాద్, కర్నూలు మాజీ మేయర్ బంగి అనంతయ్య రకరకాల వేషాలతో విచిత్ర విన్యాసాలు చేసేవారు. కొందరు నేతలు అభూత కల్పనలు, నమ్మలేని ఆరోపణలతో మీడియాకెక్కేవారు. ఇప్పుడు వారందరినీ తలదన్నేలా ఆ పార్టీ నేత, మంత్రి నిమ్మల రామానాయుడు ఓవర్ యాక్షన్ చేయగా.. సీఎం చంద్రబాబు కుమారుడు, మంత్రి లోకేశ్ డబుల్ ఓవరాక్షన్ చేశారు. జలవనరుల శాఖ మంత్రి అయిన నిమ్మల రామానాయుడు శుక్రవారం అసెంబ్లీ సమావేశాలకు చేతికి కాన్యులా (అనారోగ్యంతో ఉన్న వారికి సెలైన్ ఎక్కించేందుకు చేతికి పెట్టే సూది)తో వచ్చారు. సెలైన్ ఎక్కించుకోవాల్సినంతగా ఆరోగ్యం బాగోలేకపోతే అసెంబ్లీకి రాకపోయినా ఇబ్బంది లేదు. కానీ, అది ఉన్నది మంత్రి నిమ్మల చేతికి.. దాన్ని తీయకుండానే ఆయన శుక్రవారం అసెంబ్లీకి వచ్చేశారు. ఇది చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఆయన ఎంత అనారోగ్యంతో ఉన్నా పని చేస్తున్నానని చూపించేందుకు తాపత్రయపడినట్లు పలువురు సభ్యులు మాట్లాడుకోవడం కనిపించింది.

సభ లోపల ఈ సీన్‌ని లోకేశ్ మరింత రక్తికట్టించారు. రామానాయుడు జ్వరంతో కూడా అసెంబ్లీకి వచ్చారని, ఆయన విశ్రాంతి తీసుకునేలా రూలింగ్ ఇవ్వాలని డిప్యూటీ స్పీకర్‌ను లోకేశ్ కోరారు. 'మీరు విశ్రాంతి తీసుకుంటారా లేక సభ నుంచి సస్పెండ్ చేయించమంటారా' అంటూ చమత్కారంగా మాట్లాడినా అది చూసిన వారికి ఓవర్ యాక్షన్‌ను మించిపోయినట్లు కనిపించింది. అసెంబ్లీ లాబీల్లోనూ రామానాయుడుతో లోకేశ్ ఇదే విషయం మాట్లాడారు. 'ఒక చేతికి సెలైన్ ఇంజెక్షన్ పెట్టుకుని, మరో చేతిలో కాగితాలు పట్టుకుని తిరుగుతూనే ఉంటే ఆరోగ్యం ఏం కావాలి' అని అన్నారు. మాట వినకపోతే తన యాపిల్ వాచ్‌ని ఆయన చేతికి పెట్టి నిద్రను మానిటర్ చేస్తానని లోకేశ్ చెప్పారు. దీంతో రామానాయుడు సీఎం కుమారుడైన లోకేశ్ దృష్టిలో పడి అనుకున్నది సాధించారని పలువురు టీడీపీ నేతలు వ్యాఖ్యానించారు.

నిమ్మల పెద్ద యాక్టరే!

మొదటి నుంచి రామానాయుడు ఓవర్ యాక్షన్‌కి పెట్టింది పేరని టీడీపీ నేతలు చెబుతారు. ఎన్నికల ప్రచారంలో ఒక ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంత మంది ఉంటే అంత మందికి అమ్మఒడి పథకం కింద డబ్బులు ఇస్తానని 'నీకు రూ.15 వేలు.. నీకు 15 వేలు.. నీకు 15 వేలు' అంటూ చెప్పిన విషయం సోషల్ మీడియాలో తెగ ట్రోల్ అవుతోంది. శ్మశానం వద్ద నిద్రపోవడం, కూలీ వేషం వేసుకుని పని చేయడం వంటి ఏదో ఒక డ్రామా ద్వారా మీడియా హైప్ కోసం ప్రయత్నిస్తుంటారు. కొద్ది రోజుల క్రితం బుడమేరు ముంపు సమయంలో వెలగలేరు వద్ద గండ్లు పడితే నిద్రాహారాలు మాని అక్కడే ఉన్నట్లు, వరదల్లో తానే ఛాంపియన్ అని పించుకునేందుకు చంద్రబాబుతో పోటీ పడి నటించారు. రేయింబవళ్లు పని చేసింది అధికారులు, సిబ్బంది అయితే తానే అంతా చేసినట్లుగా మీడియాల్లో హడావుడి చేశారు. ఇప్పుడు అసెంబ్లీ సమావేశాలకు చేతికి కాన్యులాతో వచ్చి మరింత రక్తి కట్టించారు. జ్వరం వచ్చి సెలైన్లు పెట్టుకోవాల్సిన స్థితిలో ఉన్న వ్యక్తి ఇంట్లో ఉండకుండా అసెంబ్లీకి రావడం, దీనిపై ప్రత్యేకంగా చర్చించడం టీడీపీ ప్రచార డ్రామాలో భాగమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మీడియా పాయింట్

అడుగడుగునా అడ్డుపడుతున్నారు

బొత్స సత్యనారాయణ, మండలిలో విపక్ష నేత



సాక్షి, అమరావతి : శాసన మండలిలో ప్రజల పక్షాన మాట్లాడుతుంటే అధికారపక్ష సభ్యులు అడుగడుగునా అడ్డుపడుతున్నారు. వాస్తవాలను జీర్ణించుకోలేకపోతున్నారు. సూపర్ సిక్స్ హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. పింఛన్ మాత్రమే ఇస్తున్నారు. దీపంలో మూడు సిలిండర్లిస్తామని చెప్పి, ఒక్కటే ఇస్తున్నారు. అదీ కొందరికే ఇస్తున్నారు. సూపర్ సిక్స్ ఎప్పుడు అమలు చేస్తారని అడుగుతున్నాం. కనీసం ఏ పథకం ఎప్పుడిస్తారో చెప్పమని అడుగుతున్నాం. ఏ పథకం అమలు చేయకపోయినా ఈ పదినెలల్లో రూ.లక్ష కోట్లకు పైగా అప్పులు చేశారు. ఉద్యోగులకు రూ.25 వేల కోట్లు బకాయిలు, ఐఆర్, పీఆర్‌సీ ఎప్పుడిస్తారు? వ్యవసాయం గురించి మాట్లాడదామనుకున్నాం. మాట్లాడనివ్వడం లేదు. ప్రతిపక్షం కూడా భజన చేయాలని ఆశపడుతున్నట్టుంది ఈ ప్రభుత్వం. ఇలాంటి సంప్రదాయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. మేం విధ్వంసం చేశామని అంటున్నారు. అలాంటప్పుడు అప్పు ఎలా పుట్టింది అని అడుగుతున్నాం.

పవన్‌కు అవగాహన లేదని చెప్పాలనే జగన్ అలా మాట్లాడారు

వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా రాదని, వైఎస్సార్‌సీపీ కంటే జనసేనకే ఎక్కువ సీట్లు వచ్చాయని పవన్ అన్నారు. కానీ, ఉన్నవి రెండే పక్షాలు కాబట్టి ప్రతిపక్ష హోదా మా హక్కు. ఈ అవగాహన లేకే పవన్ మాట్లాడుతున్నారు. మొదటిసారి ఎమ్మెల్యే కదా పవన్‌కు అవగాహన లేదని చెప్పాలనే మా పార్టీ అధ్యక్షుడు జగన్ అలాంటి వ్యాఖ్యలు చేశారు.

'విలేజ్ క్లినిక్స్' కొనసాగించాలి

- సిపాయి సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ

వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన 'విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్' గొప్ప వ్యవస్థలు. వాటి ద్వారా మారుమూల పల్లెకు కూడా 14 రకాల వైద్య పరీక్షలు, 20 రకాల రోగాలకు 150కి పైగా మందులు అందుబాటులో ఉండేవి. ప్రతి 2 వేల ఇళ్లకు ఒక నర్సింగ్ సిబ్బందిని నియమించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ సిబ్బందికి జీతాలు, స్టైఫండ్ కూడా చెల్లించడంలేదు. ఈ వ్యవస్థను కొనసాగించాలి. నిర్వీర్యం చేయకూడదు.

ప్రజలను తప్పదారి పట్టిస్తున్న ప్రభుత్వం

- ఐ. వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ

జీతాల వల్ల ప్రభుత్వంపై 87 శాతం భారం పడుతుందని మండలిలో స్లైడ్ ప్రదర్శించడం కరెక్ట్ కాదు. పీఆర్సీ, ఐఆర్ అని హామీ ఇచ్చి, ఇప్పుడు దానిపై అడిగితే దాటవేస్తున్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి. పిల్లల్ని కనండి అని చెప్పే సీఎం ఆశా వర్కర్లను మాత్రం పట్టించుకోవడం లేదు. లిక్కర్ పాలసీ పేరుతో ప్రభుత్వం వ్యాపారం చేస్తోంది. ఈ రాష్ట్రంలో పాలించడం చేతకాని పాలకపక్షం విశ్వసనీయత కోల్పోయింది.

ప్రత్యేక హోదా తీసుకురండి

- బొర్రా గోపిమూర్తి, పీడీఎఫ్ ఎమ్మెల్సీ

కార్మికులు, ఉద్యోగులకి ఇచ్చిన హామీలు, ఇవ్వాల్సిన బకాయిల గురించి చెప్పడంలేదు. కూటమి ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తుంది అనేది మాత్రమే చెప్తున్నారు. కేంద్రంతో విభజన హామీలు గురించి మాట్లాడి, మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకు రావాలి.

ఓర్వకల్లు నోడ్ అభివృద్ధికి గెజిట్ నోటిఫికేషన్ జారీ

- 2020 ఆగస్టు 19న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే కేంద్రం ఆమోదముద్ర
- మొత్తం 11 గ్రామాల్లోని 9,718.84 ఎకరాల్లో విస్తరించిన పారిశ్రామిక కారిడార్
- మార్చి 2021లో ప్రారంభమైన కర్నూలు ఎయిర్‌పోర్ట్ ఈ నోడ్ పక్కనే ఉండటం సానుకూలాంశం

సాక్షి, అమరావతి : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జాతీయ పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా కర్నూలు జిల్లా ఓర్వకల్లు నోడ్‌కు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ పారిశ్రామిక పార్కుకు కేంద్ర ప్రభుత్వం 2020 ఆగస్టు 19న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ఆమోదం తెలిపింది. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (నిక్‌డిక్ట్) 5వ బోర్డు సమావేశంలో ఓర్వకల్లు నోడ్ అభివృద్ధికి అప్పట్లో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మొత్తం 11 రెవెన్యూ గ్రామాల్లో 9,718.84 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ నోడ్‌లో 4,742.34 ఎకరాలను నిక్‌డిక్ట్ నిధులతో అభివృద్ధి చేయనుండగా, మిగిలిన 4,563.31 ఎకరాలు ఏపీఐఐసీ అభివృద్ధి చేయనుంది. మరో 413.19 ఎకరాల్లో జయరాజ్ ఇస్పాత్ లిమిటెడ్‌కు కేటాయించారు. ఈ నోడ్ హైదరాబాద్–చెన్నై వయా కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి రహదారికి దగ్గరగా ఉండటంతోపాటు ఈ నోడ్ పక్కనే నిర్మించిన కర్నూలు ఎయిర్‌పోర్టు మార్చి, 2021 నుంచి అందుబాటులోకి రావడం కలిసొచ్చే అంశాలుగా పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్ ఈ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

నోడ్ ద్వారా రూ.37వేల కోట్ల పెట్టుబడులు..

ఇక ప్రపంచస్థాయి సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్న ఓర్వకల్లు నోడ్ ద్వారా రూ.37,000 కోట్ల పెట్టుబడులతోపాటు 2.2 లక్షల మందికి ఉపాధి లభించనుంది. ఏరోస్పేస్, డిఫెన్స్, టెక్స్‌టైల్స్, నాన్ మెటాలిక్ మినరల్స్, ఫుడ్ బేవరేజస్ వంటి రంగాల పెట్టుబడులకు ఇది అనుకూలంగా ఉంటుందని అందులో వివరించారు.

వైద్య, ఆరోగ్య రంగానికి బడ్జెట్ పెంచాలి

- సీఎం కలలు నెరవేరాలన్నా ఈ నిధులు సరిపోవు
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్
- అర్హత ఉన్న ప్రతీ పేదవానికి సొంతిల్లు కట్టిస్తాం : మంత్రి పార్థసారథి
- 2028లో అమరావతిలో జాతీయ క్రీడలు నిర్వహిస్తాం : మంత్రి రాంప్రసాదరెడ్డి

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటే వైద్య, ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని ఆ శాఖ మంత్రి సత్యకుమార్ స్పష్టంచేశారు. పటిష్టమైన ఆరోగ్య వ్యవస్థ ఉండాలంటే ఈ ఏడాది కేటాయించిన నిధులు సరిపోవన్నారు. వైద్య ఆరోగ్యరంగం పద్దుపై మంత్రి సమాధానమిస్తూ.. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకారం ఏదైనా ఒక దేశం లేదా రాష్ట్ర జీడీపీలో వైద్య రంగానికి కనీసం ఆరు శాతం నిధులు కేటాయించాలని అప్పుడే రాష్ట్రంలో పటిష్టమైన ఆరోగ్య వ్యవస్థ ఉండి ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారన్నారు. సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర–2047 కలలు నెరవేరాలన్నా ఆరోగ్య రంగానికి కేటాయింపులు పెంచాలన్నారు.

జర్నలిస్టుల ఇంటి స్థలాలపై గత ప్రభుత్వ జీఓలను అమలుచేస్తాం..

అలాగే, పీఎంఏవై–2 కింద రాష్ట్రంలో ప్రతీ పేదవానికీ సొంతిల్లు నిర్మాణం చేసి అందిస్తామని, ఇంటి నిర్మాణ వ్యయాన్ని రూ.2.5 లక్షలకు పెంచడంతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఆర్థికసాయం అందించనున్నట్లు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. జర్నలిస్టుల ఇంటి స్థలాలకు సంబంధించి గత ప్రభుత్వం జారీచేసిన జీఓలను అమలుచేయనున్నట్లు తెలిపారు. మరోవైపు.. అమరావతి కేంద్రంగా 2028 జాతీయ క్రీడలను నిర్వహించడానికి ప్రణాళికలను సిద్ధంచేస్తున్నట్లు క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ తెలిపారు. అనంతరం.. వివిధ శాఖల పద్దులకు శాసనసభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది.

అప్పులపై కూటమి కుట్రలు బట్టబయలు

- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి శివశంకర్‌రెడ్డి

సాక్షి, అమరావతి : రాష్ట్ర అప్పులపై కూటమి పార్టీల నేతలు చేస్తున్న ప్రచారమంతా పచ్చి అబద్ధమని శాసనసభ సాక్షిగా తేలిపోయిందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో వెల్లడించిన వివరాల ప్రకారం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి అంటే మార్చి 2024 వరకు ప్రభుత్వ అప్పులు రూ.4,91,734 కోట్లు, ప్రభుత్వ గ్యారంటీ అప్పులు రూ.1,54,797 కోట్లు. అంటే మొత్తం రూ.6,46,531 కోట్లు అప్పులు ఉన్నాయని లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే రాష్ట్ర అప్పు రూ.14 లక్షల కోట్లు అంటూ కూటమి నేతలు చేసిన ఆరోపణలన్నీ అబద్ధాలేనని తేలిపోయిందన్నారు. ఇప్పటివరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విపరీతంగా దుష్ప్రచారం చేసిన కూటమి నేతలు తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయి మరో శ్రీలంక అయిందంటూ కూటమి నేతలు దుష్ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారని గుర్తు చేశారు.

వెటర్నరీ వైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

సీఎంకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

సాక్షి, అమరావతి: ఆందోళన చేస్తున్న వెటర్నరీ వైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ విషయమై సీఎంకు రాసిన లేఖను శ్రీనివాసరావు శుక్రవారం విడుదల చేశారు. శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం (తిరుపతి) పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 4 జిల్లాల్లో వెటర్నరీ వైద్య విద్యార్థులు తమ స్టైపెండ్‌ను నెలకు రూ.7వేల నుంచి రూ.25 వేలకు పెంచాలంటూ గత నెల 3వ తేదీ నుంచి 33 రోజులుగా కళాశాలల వద్ద దీక్షలు చేపట్టారని పేర్కొన్నారు.

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడిని తగ్గించాలి

ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: ఆదివారాలు, పండుగలు, సెలవులతో సంబంధం లేకుండా గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగులకు నిరంతరం టార్గెట్లు విధించడం వల్ల వారు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. జాని పాషా, ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఒకవైపు ఉద్యోగులను ప్రజా సంక్షేమానికి కీలకమని, ప్రభుత్వం ''ఫ్రెండ్లీ పాలన'' అందిస్తుందని ప్రచారం చేస్తూ, అదే సమయంలో ఉద్యోగులపై అధిక ఒత్తిడిని తీసుకువస్తోందని అన్నారు. ప్రకటన ప్రకారం, ఉద్యోగులు సర్వేలు, టార్గెట్లతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించే వివిధ సర్వేల కోసం ఉద్యోగులు పదే పదే ప్రజల ఇళ్లకు వెళ్లాల్సి వస్తోంది. అయితే, ప్రజలు పూర్తిగా సహకరించకపోవడం, సర్వేకు అవసరమైన ఓటీపీలు చెప్పేందుకు నిరాకరించడం ఉద్యోగులను మరింత సమస్యలో పడేస్తోంది. 'ఈ సర్వేలు మాకు అవసరం లేదు' అని కొందరు చెబుతుంటే, వారిని ఒప్పించడం ఉద్యోగులకు కష్టతరంగా మారింది. గ్రామ, వార్డు స్థాయిలో మొదలుకుని మండల, మున్సిపాలిటీ, జిల్లా, రాష్ట్ర స్థాయిల వరకు, ర్యాంకింగ్‌ల పేరుతో ఉద్యోగులను అనవసరమైన ఒత్తిడికి గురిచేస్తున్నారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడిని తగ్గించేలా చర్యలు తీసుకోవడం తక్షణం అవసరం. ఉద్యోగుల మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని, అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలి.

బిజినెస్ రీల్

మహిళలకు ఫ్రెష్‌బస్ ఫ్రీ కార్డులు

Fresh Bus

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న తమ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు రూ. 500 వరకు పొదుపు చేసే ఫ్రెష్ కార్డులను ఉచితంగా ఇస్తున్నట్లు ఫ్రెష్‌బస్ తెలిపింది. వీటిని తదుపరి 10 రైడ్స్ కోసం ఉపయోగించుకోవచ్చని, ఒక్కో రైడ్‌పై రూ. 50 ఆదా చేసుకోవచ్చని వివరించింది. తమ వెబ్‌సైట్ లేదా యాప్‌లో బుక్ చేసుకున్న వారికి ఇది వర్తిస్తుందని పేర్కొంది. హైదరాబాద్, తిరుపతి, గుంటూరు, విజయవాడ, బెంగళూరు తదితర రూట్లలో సర్వీసులు నడిపిస్తున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు సుధాకర్ రెడ్డి చిర్రా తెలిపారు.

హైదరాబాద్‌లో ఓక్‌ట్రీ క్యాపిటల్ విస్తరణ



హైదరాబాద్: గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ఓక్‌ట్రీ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ కొత్తగా హైదరాబాద్‌లో తమ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు వెల్లడించింది. నిర్వహణ సామర్థ్యాలు మెరుగుపర్చుకోవడానికి, భారత మార్కెట్లో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని సంస్థ కో–చైర్మన్ హోవర్డ్ మార్క్స్ తెలిపారు. ఈ సెంటర్లోని సిబ్బంది ఇటు కంపెనీ అంతర్గతంగా, బైటి భాగస్వాములకు సర్వీసులు అందిస్తారని వివరించారు. మానవ వనరుల విభాగం డైరెక్టరుగా అజయ్ మద్దాలి నియమితులైనట్లు పేర్కొన్నారు.

మహిళా ఎంట్రప్రెన్యూర్లకు ఎస్‌బీఐ ప్రత్యేక రుణాలు



ముంబై: మహిళా ఎంట్రప్రెన్యూర్లకు పూచీకత్తు లేకుండా, తక్కువ వడ్డీ రేటుపై రుణాలు అందించేలా 'అస్మిత' పథకాన్ని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ప్రవేశపెట్టింది. మహిళల సారథ్యంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా యూనిట్లకు డిజిటల్ మాధ్యమం ద్వారా వేగవంతంగా, సులభతరంగా రుణ సదుపాయం లభించేందుకు ఇది ఉపయోగపడుతుందని బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. మరోవైపు, మహిళల కోసమే ప్రత్యేకంగా రూపొందించిన రూపే ఆధారిత 'నారీ శక్తి' ప్లాటినం డెబిట్ కార్డును కూడా బ్యాంకు ఆవిష్కరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

8-3-2025

విశాఖ	410–00
చిత్తూరు	443–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425–00
విజయవాడ	410–00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	410–00
వరంగల్	412–00
రిటైల్ ధర	4.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
RELIANCE	1,246.40	3.04
TATAMOTORS	647.5	1.23
BEL	276.2	1.19
BAJAJ-AUTO	7,551.00	1.19
HINDALCO	689.95	1.17

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	935	-3.78
NTPC	330.4	-2.22
SHRIRAMFIN	631	-2.07
INFY	1,685.00	-1.8
BPCL	260.49	-1.72

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	4,423
ఎన్‌ఎస్‌ఈ	82,346
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,37,977
ఎఫ్ఐఐ	- 2,377
డీఐఐ	+ 1,618

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	67.07 (రాత్రి 11.30 గంటలకు)	$ 66.36 (క్రితం ముగింపు)
బ్రెంట్	70.33 (రాత్రి 11.30 గంటలకు)	$ 69.46 (క్రితం ముగింపు)

టెక్ అంకురాల్లోనూ మహిళల హవా..!



- 26 బిలియన్ డాలర్ల సమీకరణ
- అమెరికా తర్వాత రెండో స్థానం
- దేశీయంగా 7 వేల పైచిలుకు మహిళల సారథ్యంలోని స్టార్టప్‌లు
- ట్రాక్షన్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: వినూత్న ఆవిష్కరణలతో ఆకట్టుకుంటున్న మహిళా స్టార్టప్‌లు, భారీ ఎత్తున నిధుల సమీకరణలోనూ సత్తా చాటుతున్నాయి. మహిళల సారథ్యంలోని అంకుర సంస్థలు ఇప్పటివరకు 26 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సమీకరించాయి. ఆల్‌టైమ్ ఫండింగ్ విషయంలో అమెరికా తర్వాత స్థానంలో నిల్చాయి. రీసెర్చ్, అనలిటిక్స్ సంస్థ ట్రాక్షన్ ఒక నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది. దీని ప్రకారం దేశీయంగా మహిళల సారథ్యంలోని అంకుర సంస్థల సంఖ్య 7,000 పైచిలుకు ఉంది. క్రియాశీలకంగా ఉన్న మొత్తం స్టార్టప్‌లలో వీటి వాటా 7.5 శాతం. ఇవన్నీ కలిసి ఇప్పటివరకు 26.4 బిలియన్ డాలర్లు సమీకరించాయి. 2021లో అత్యధికంగా 6.3 బిలియన్ డాలర్లు దక్కించుకున్నాయి. 2022లో అంతర్జాతీయంగా చూస్తే మహిళా స్టార్టప్‌లు మొత్తం మీద 32.8 బిలియన్ డాలర్లు సమీకరించగా .. దేశీ అంకురాలు 5 బిలియన్ డాలర్లతో 15.18% వాటా దక్కించుకున్నాయి. ఇక 2024లో అంతర్జాతీయంగా మహిళల సారథ్యంలోని స్టార్టప్‌లకు ఫండింగ్ విషయంలో 3.96% వాటాతో అమెరికా, బ్రిటన్ తర్వాత భారత్ మూడో స్థానంలో నిలిచింది. ఈ స్టార్టప్‌లు భారీగా నిధులను సమీకరించడంతో పాటు పరిశ్రమలకు కొత్త నిర్వచనాన్ని ఇస్తూ, ఉద్యోగాలు కల్పిస్తూ, భవిష్యత్ ఎంట్రప్రెన్యూర్లకు కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తున్నాయని ట్రాక్షన్ పేర్కొంది. ఇవి మరింత వృద్ధిలోకి రావాలంటే ఆర్థిక తోడ్పాటు, మెంటార్‌షిప్, వ్యవస్థాగతంగా మద్దతు లభించడం కీలకమని వివరించింది.

నివేదికలోని మరిన్ని విశేషాలు..

- రంగాలవారీగా చూస్తే రిటైల్ స్టార్టప్‌లు అత్యధికంగా 7.8 బిలియన్ డాలర్లు, ఎడ్‌టెక్ 5.4 బిలియన్ డాలర్లు, ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్స్ అంకురాలు 5 బిలియన్ డాలర్లు సమీకరించాయి. బిజినెస్ టు కన్జూమర్ ఈ–కామర్స్, ఇంటర్నెట్ ఫస్ట్ బ్రాండ్లు, ఫ్యాషన్ టెక్ అంకురాలు కూడా గణనీయంగా రాణిస్తున్నాయి.
- మహిళా స్టార్టప్‌ల సంఖ్యాపరంగా, అలాగే ఇప్పటి వరకు సమీకరించిన నిధులపరంగా బెంగళూరు అగ్రస్థానంలో ఉంది. ముంబై, ఢిల్లీ ఎన్‌సీఆర్ ఆ తర్వాత స్థానాల్లో నిల్చాయి.
- 2021లో మహిళల సారథ్యంలోని స్టార్టప్‌లలో అత్యధికంగా ఎనిమిది అంకురాలు యూనికార్న్‌లుగా ఎదిగాయి. 2019లో మూడు, 2020లో నాలుగు, 2022లో అయిదు ఈ హోదా సాధించాయి. అయితే, 2017, 2023, 2024లో ఒక్క యూనికార్న్ కూడా నమోదు కాలేదు.
- 2021లో మహిళా స్టార్టప్‌లు అత్యధికంగా 45 సంస్థలను కొనుగోలు చేశాయి. 2022లో ఇది 36కి, 2023లో 25కి, 2024లో 16కి తగ్గింది.
- 2024లో మహిళల సారథ్యంలోని అయిదు స్టార్టప్‌లు పబ్లిక్ ఇష్యూకి వచ్చాయి. మొబిక్విక్, ఉషా ఫైనాన్షియల్, తన్వాల్, ఇంటీరియర్స్ అండ్ మోర్, లాసీఖో వీటిలో ఉన్నాయి.

మితిమీరిన ట్రేడింగ్ కట్టడికే కఠిన నిబంధనలు

సెబీ హోల్‌టైమ్ సభ్యుడు నారాయణ్ వెల్లడి



ముంబై: ఇండెక్స్ డెరివేటివ్స్‌లో ఎక్స్‌పైరీ రోజున మితిమీరిన ట్రేడింగ్ కట్టడికే నిబంధనలను కఠినతరం చేస్తున్నట్లు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ హోల్‌టైమ్ సభ్యుడు అనంత నారాయణ్ తెలిపారు. డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా నష్టపోతున్నారని అధ్యయనంలో తేలిన మీదట గతేడాది అక్టోబర్‌లో చర్యలు ప్రకటించినట్లు ఆయన చెప్పారు. కనీస కాంట్రాక్టు పరిమాణాన్ని రూ. 5 లక్షల నుంచి రూ. 30 లక్షలకు దశలవారీగా పెంచడం, ప్రీమియంను ముందుగా వసూలు చేయడం తదితర చర్యలను సెబీ ప్రకటించింది. ముందుగా క్యాష్ మార్కెట్‌ను అభివృద్ధి చేసి, ఆ తర్వాత డెరివేటివ్స్‌పై కసరత్తు చేయాలని స్టాక్ ఎక్స్ఛేంజీలకు సూచించారు. మరోవైపు, పరస్పర విరుద్ధ ప్రయోజనాల వివరాలను సెబీ బోర్డు సభ్యులందరూ ప్రజలకు వెల్లడించడాన్ని తప్పనిసరి చేసేలా నిబంధనలను రూపొందిస్తామని సెబీ కొత్త చైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. విశ్వసనీయతను, పారదర్శకతను పెంపొందించడానికి ఇది ఉపయోగపడగలదని ఆయన వివరించారు. ఓవైపు నియంత్రణ సంస్థ అధిపతిగా, మరోవైపు నియంత్రిత సంస్థల్లో భాగస్వామిగా పరస్పర విరుద్ధ ప్రయోజనాల కోసం పని చేశారంటూ సెబీ మాజీ చీఫ్ మాధవి పురి బుచ్‌పై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో పాండే వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సెబీ విచారణ ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్ సంస్థ సహ–ఇన్వెస్టరుగా ఉన్న ఫండ్‌లో ఆమె పెట్టుబడులు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఫండ్స్, సెక్యూరిటీలను క్లెయిమ్ చేయకపోతే?

మార్చి 31 వరకు అభిప్రాయాలు చెప్పాలన్న సెబీ

న్యూఢిల్లీ: క్లెయిమ్ చేయని నిధులు, సెక్యూరిటీలు బ్రోకర్ల వద్దే ఉండిపోతే.. వాటిని 'విచారణ పరిధిలో' పెట్టాలన్న ప్రతిపాదనపై ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేసేందుకు గడువును ఈ నెల 31 వరకు సెబీ పొడిగించింది. ఈ ప్రతిపాదనపై ఫిబ్రవరి 11న సెబీ సంప్రదింపుల పత్రాన్ని విడుదల చేసింది. దీనిపై స్పందనలు తెలియజేయడానికి మార్చి 4వరకు గడువు ఇవ్వడం గమనార్హం. సెబీ నిబంధనల ప్రకారం క్లయింట్ల ఖాతాల్లోని నిధులను (ఫండ్స్) ప్రతి త్రైమాసికానికి ఒకసారి వెనక్కి పంపాల్సి ఉంటుంది. సెక్యూరిటీలను నిబంధనల మేరకు ఎప్పటికప్పుడు వారి డీమ్యాట్ ఖాతాల్లో జమ చేయాలి. ఒకవేళ నిధులు, సెక్యూరిటీలను బదిలీ చేసే విషయంలో క్లయింట్ల ఆచూకీ లేనట్టయితే.. సంబంధిత ఖాతాలను వెంటనే 'ఎంక్వైరీ స్టేటస్' కింద ఉంచాలని సెబీ ప్రతిపాదన తీసుకొచ్చింది. లేఖలు, ఈమెయిల్స్, టెలిఫోన్ ద్వారా బ్రోకర్లు క్లయింట్లను సంప్రదించాలి. ఇలా ఎంక్వైరీ స్టేటస్ కింద 30 రోజులకు పైగా నిధులు, సెక్యూరిటీలు ఉండిపోతే, వాటిని అన్‌క్లెయిమ్డ్‌గా పరిగణిస్తారు. ఆ తర్వాత క్లయింట్ నామినీని సంప్రదించాల్సి ఉంటుందని సెబీ తన ప్రతిపాదనలో పేర్కొంది.



వాహనాలకు డిమాండ్ డౌన్



- ఫిబ్రవరి రిటైల్ అమ్మకాల్లో 7 శాతం క్షీణత
- ఫాడా వెల్లడి

న్యూఢిల్లీ: వాహనాలకు డిమాండ్ తగ్గిన నేపథ్యంలో ఫిబ్రవరిలో ప్యాసింజర్ వాహనాలు, టూ వీలర్లు సహా ఆటోమొబైల్ రిటైల్ అమ్మకాలు 7 శాతం క్షీణించినట్లు ఆటోమొబైల్ డీలర్ల సమాఖ్య ఫాడా వెల్లడించింది. గతేడాది ఫిబ్రవరిలో 20,46,328 వాహన విక్రయాలు నమోదు కాగా తాజాగా గత నెల 18,99,196 యూనిట్లకు తగ్గాయి. ప్యాసింజర్ వాహనాల రిటైల్ విక్రయాలు 10 శాతం క్షీణించి 3,03,398 యూనిట్లకు పరిమితమయ్యాయి. టూ వీలర్ల విక్రయాలు 6 శాతం క్షీణించి 14,44,674 నుంచి 13,53,280 యూనిట్లకు తగ్గాయి. వాణిజ్య వాహనాలు 9 శాతం క్షీణించి 82,763 యూనిట్లకు, ట్రాక్టర్ల విక్రయాలు 14 శాతం తగ్గి 65,574 యూనిట్లకు పడిపోయాయి. నిల్వలపరంగా సమతౌల్యత లేకపోవడం, ధరలపరంగా మార్పులు, వినియోగదారుల్లో బలహీన సెంటిమెంట్, ఎంక్వైరీలు తగ్గిపోవడం, రుణ లభ్యత పరిమిత స్థాయిలోనే ఉండటం తదితర అంశాలు అమ్మకాల క్షీణతకు కారణమైనట్లు ఫాడా పేర్కొంది. ఎంట్రీ లెవెల్ కేటగిరీలో మార్కెట్ సెంటిమెంట్ బలహీనంగా ఉండటం, కొనుక్కోవాలనుకునే ఆలోచన కొనుగోలు రూపం దాల్చడంలో జాప్యం జరుగుతుండటం, అలవికాని లక్ష్యాలు డీలర్లకు సమస్యాత్మకంగా ఉంటున్నాయని ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. ఇదే విషయాన్ని తయారీ సంస్థలకు తెలియజేశారని, తమపై భారీ నిల్వల భారం మోపడాన్ని నివారించాలని కోరారని వివరించారు. మార్చిలో అమ్మకాలపై ఆశావహంగా ఉన్నప్పటికీ డీలర్లు కాస్త ఆచి తూచి వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 50–52 రోజులకు సరిపడే నిల్వలు ఉంటున్నాయని పేర్కొన్నారు.

అంబుజా సిమెంట్స్‌కు ఎన్‌సీఎల్‌ఏటీ నోటీసు

సంఘీ ఇండస్ట్రీస్ మాజీ ప్రమోటర్ ఫిర్యాదు

Ambuja Cement

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ అంబుజా సిమెంట్స్‌కు అపిల్లేట్ ట్రిబ్యునల్ ఎన్‌సీఎల్‌ఏటీ నోటీసు జారీ చేసింది. 2023లో అంబుజా కొనుగోలు చేసిన సంఘీ ఇండస్ట్రీస్ మాజీ ప్రమోటర్ అలోక్ సంఘీ ఫిర్యాదుమేరకు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా అలోక్ సంఘీపై దివాలా చర్యలను తీసుకోవలసిందిగా ఎన్‌సీఎల్‌టీ అహ్మదాబాద్ బెంచ్ గత నెలలో జారీ చేసిన ఆదేశాలపై స్టే ఇచ్చింది. తదుపరి చర్యలు తీసుకోవద్దని ఎన్‌సీఎల్‌ఏటీ తాజా ఆదేశాలలో పేర్కొంది. నోటీసుపై స్పందించేందుకు అంబుజా సిమెంట్స్‌కు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణను 2025 ఏప్రిల్ 14న చేపట్టనున్నట్లు తెలియజేసింది. రూ. 84 కోట్ల వ్యక్తిగత పూచీకత్తుకు సంబంధించి అలోక్ సంఘీపై అంబుజా సిమెంట్స్ ఐబీసీకి ఫిర్యాదు చేసింది. దీంతో ఎన్‌సీఎల్‌టీ సెక్షన్ 95 ప్రకారం అలోక్ సంఘీపై ఫిబ్రవరి 25న చర్యలకు ఆదేశించింది. దీంతో అలోక్ ఎన్‌సీఎల్‌ఏటీని ఆశ్రయించారు.

ఆధార్ ధ్రువీకరణ లావాదేవీలు 225 కోట్లు

- మరో 43 కోట్ల ఈ–కేవైసీ లావాదేవీలు
- ఫిబ్రవరి నెలలో నమోదు



న్యూఢిల్లీ: డిజిటల్ లావాదేవీలకు ఆధార్ కీలకంగా మారుతోంది. ఫిబ్రవరి నెలలో ఆధార్ ఆధారిత ధ్రువీకరణ లావాదేవీలు 225 కోట్లుగా ఉన్నాయి. ఆధార్ ఆధారిత ఈ–కేవైసీ లావాదేవీలు మరో 43 కోట్లు జరిగాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇతర రంగాల్లో ఆధార్ ఆధారిత ధ్రువీకరణకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఆధార్ ధ్రువీకరణలు మెరుగైన కస్టమర్ అనుభవానికి తోడ్పడుతున్నట్లు ప్రభుత్వ ప్రకటన తెలిపింది. ఆధార్ ఆధారిత ఈ–కేవైసీ లావాదేవీలు గతేడాది ఫిబ్రవరి గణాంకాలతో చూస్తే 14 శాతం పెరిగాయి. ఇక 2025 ఫిబ్రవరి నాటికి మొత్తం మీద ఆధార్ ధ్రువీకరణ లావాదేవీలు 14,555 కోట్లను అధిగమించాయి. అలాగే ఇప్పటి వరకు నమోదైన ఆధార్ ఆధారిత ఈ–కేవైసీ లావాదేవీలు 2,311 కోట్లకు చేరాయి. ఆధార్ ముఖ గుర్తింపు ధ్రువీకరణలకూ ఆదరణ పెరుగుతోంది. ఫిబ్రవరిలో ఇలాంటివి 12.54 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. 2021 ఫిబ్రవరిలో ఆధార్ ముఖ గుర్తింపు ధ్రువీకరణను ప్రవేశపెట్టగా.. అప్పటి నుంచి చూస్తే నెలవారీ గరిష్ఠ లావాదేవీలు ఫిబ్రవరిలోనే నమోదు కావడం గమనార్హం. ఇప్పటి వరకు మొత్తం ముఖ గుర్తింపు ధ్రువీకరణ లావాదేవీలు 115 కోట్లకు చేరాయి. ఇందులో 87 కోట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే నమోదు కావడం గమనార్హం. కోటక్ మహీంద్రా ప్రైమ్, ఫోన్‌పే, కరూర్ వైశ్యా బ్యాంక్, జేఅండ్‌కే బ్యాంక్ ముఖ గుర్తింపు ధ్రువీకరణ కోసం కొత్తగా అనుమతి పొందాయి. ఇప్పటి వరకు మొత్తం 97 సంస్థలకు ఇందుకు అనుమతి లభించింది.

సమిష్టి కృషితోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌కి చెక్

- ప్రభుత్వం, బిగ్ టెక్ కంపెనీలు కలిసి పనిచేస్తేనే సాధ్యం
- డిజిటల్ ఇండియా ఫౌండేషన్ నివేదిక



న్యూఢిల్లీ: దేశీయంగా వేగంగా విస్తరిస్తున్న అక్రమ ఆన్‌లైన్ గేమింగ్ రంగాన్ని కట్టడి చేయాలంటే అన్ని వర్గాల నుంచి సమిష్టి కృషి అవసరమని డిజిటల్ ఇండియా ఫౌండేషన్ ఒక నివేదికలో తెలిపింది. ఇందుకోసం ప్రభుత్వం, గూగుల్ .. మెటాలాంటి బడా టెక్ కంపెనీలు కలిసి పని చేయాలని పేర్కొంది. 'ఈ అక్రమ రంగం ఏటా 100 బిలియన్ డాలర్ల పైగా ఉంటోంది. ఏటా 30 శాతం పైగా వృద్ధి చెందుతోంది. డిజిటల్ వినియోగం, సాంకేతిక పురోగతి పెరుగుతుండటం, నియంత్రణపరంగా అనిశ్చితి నెలకొనడం ఇందుకు కారణంగా ఉంటోంది. గ్యాంబ్లింగ్ సంబంధిత ప్రమోషన్లను నియంత్రించడం కష్టతరంగా ఉంటున్న నేపథ్యంలో గూగుల్, మెటాలాంటి బడా సోషల్ మీడియా కంపెనీలతో భారతీయ నియంత్రణ సంస్థలు క్రియాశీలకంగా కలిసి పనిచేయాలి' అని నివేదిక వివరించింది. అక్రమ ఆపరేటర్లు అత్యంత అధునాతనమైన డిజిటల్ అడ్వర్టైజింగ్, మార్కెటింగ్ మాధ్యమాలు, పేమెంట్ వ్యవస్థలు, సాఫ్ట్‌వేర్ ప్రొవైడర్ల నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంటున్నారని వివరించింది. ఆన్‌లైన్ అక్రమ బెట్టింగ్‌లనేవి మనీలాండరింగ్, అక్రమ చెల్లింపుల సమస్య పెరిగిపోవడానికి దారి తీస్తున్నాయని డిజిటల్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అరవింద్ గుప్తా తెలిపారు. గూగుల్, మెటాలాంటి కంపెనీలు సాధారణంగా అడ్వర్టైజింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ (ఎస్ఈవో) ద్వారా లాభాలు ఆర్జిస్తుంటాయి కాబట్టి అవి అక్రమ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ సంస్థలపై నిర్దయాత్మకంగా చర్యలు తీసుకోలేకపోతుంటాయని పేర్కొన్నారు. ''వాటికి వచ్చే ట్రాఫిక్‌లో మూడింట ఒక వంతు ఈ వెబ్‌సైట్ల నుంచే ఉంటోంది. ఈ వెబ్‌సైట్లు విస్తరించే కొద్దీ బిగ్ టెక్ కంపెనీలకు అడ్వర్టైజింగ్ రూపంలో ఆదాయాలు వస్తున్నాయి. దీని దుష్ప్రభావాల గురించి పూర్తి అవగాహన లేక ఇన్‌ఫ్లుయెన్సర్లు వీటిని ప్రమోట్ చేస్తున్నారు'' అని గుప్తా చెప్పారు.

'ఆపరేటర్లు అక్రమంగా ఆర్జిస్తున్నారు. మనీ లాండరింగ్ చేస్తున్నారు. పేమెంట్ నిబంధనలను తోసిరాజని డొల్ల కంపెనీల ద్వారా, డిస్ట్రిబ్యూషన్ చానల్ ద్వారా అక్రమ మార్గాల్లో చెల్లింపులను పొందుతున్నారు. బిగ్ టెక్ కంపెనీలకు నిధులిస్తున్నారు. కాబట్టి బిగ్ టెక్ కంపెనీలు కూడా వారిని కట్టడి చేయడంపై దృష్టి పెట్టడం లేదు' అని గుప్తా పేర్కొన్నారు.

నివేదికలోని మరిన్ని అంశాలు..

- దేశీయంగా అక్రమ గ్యాంబ్లింగ్, బెట్టింగ్ కార్యకలాపాలు భారీ స్థాయిలో ఉంటున్నాయి. 2024 అక్టోబర్–డిసెంబర్ మధ్య పరీమ్యాచ్, స్టేక్, 1ఎక్స్‌బెట్, బ్యాటరీ బెట్ అనే నాలుగు ప్లాట్‌ఫాంలలో 1.6 బిలియన్ పైగా విజిట్స్ నమోదయ్యాయి.
- 48.2 మిలియన్ విజిట్లతో దీనికి సోషల్ మీడియా కూడా దోహదకారిగా నిల్చింది. ఫేస్‌బుక్‌లాంటి ప్లాట్‌ఫాంలలో డైరెక్ట్ పెయిడ్ ప్రకటనలు, కంటెంట్ ప్రమోషన్, ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్, సోషల్ మీడియా ఎంగేజ్‌మెంట్ ప్రచార కార్యక్రమాలు మొదలైన వాటి ద్వారా ఈ ట్రాఫిక్ వచ్చింది. నియంత్రణ నిబంధనలపరంగా వాటి వెబ్‌సైట్ల నిలిపివేతను తప్పించుకునేందుకు ఆయా ఆపరేటర్లు పలు వెబ్‌సైట్లు నిర్వహిస్తున్నారు.
- దాదాపు అన్ని సంస్థలు, (సుమారు 600) ఇతర దేశాల నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తూ, భారత్‌లో జీఎస్‌టీ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి.
- గ్యాంబ్లింగ్ ప్రకటనలను హోస్ట్ చేయకుండా, జీఎస్‌టీలాంటివి చెల్లించని అక్రమ సైట్లను ప్రమోట్ చేయకుండా చర్యలు ఉండాలి. ఆ తరహా సైట్లకు చెల్లింపులు జరగకుండా ఫైనాన్షియల్, పేమెంట్ వ్యవస్థలు నిరోధించాలి.
- అక్రమ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ సైట్లను బ్లాక్ చేస్తే సరిపోదని నార్వే, బ్రిటన్, డెన్మార్క్, బెల్జియం, అమెరికా వంటి దేశాల అనుభవాల ద్వారా తెలుస్తోంది. కాబట్టి వెబ్‌సైట్లను బ్లాక్ చేయడంతో పాటు మార్కెటింగ్‌పరమైన ఆంక్షలు విధించడం, చెల్లింపులను బ్లాక్ చేయడం మొదలైన వ్యూహాలన్నింటి మేళవింపును అమలు చేస్తే మరింత మెరుగైన ఫలితాలు కనిపిస్తాయి.
- అక్రమ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ మనుగడ సాగించేందుకు దోహదకారులను పూర్తిగా కట్టడి చేసేందుకు నియంత్రణ విధానాలు వేర్వేరుగా ఉండకుండా సమగ్ర వ్యవస్థ ఏర్పాటు కావాలి.
- డిజిటల్ మీడియా చానళ్ల ద్వారా యూజర్లకు చేరువ కాకుండా వాటిని కట్టడి చేయడం, అక్రమ లావాదేవీలను బ్లాక్ చేసేందుకు ఆర్థిక నిబంధనలను కఠినతరం చేయడం, వైట్‌లిస్ట్/బ్లాక్‌లిస్ట్ రూపంలో నియంత్రణ విధానాలను పటిష్ఠం చేయడం వంటి చర్యలు చేపట్టాలి.
- పన్నులు చెల్లించే కంపెనీలతో వైట్‌లిస్ట్ తయారు చేసి, మిగతా వాటిని బ్లాక్‌లిస్ట్‌లో చేర్చడం వల్ల కొంత నష్టం తగ్గవచ్చు.

సాక్షి ప్లస్
శనివారం । 8-3-2025

'బంగారం'లాంటి ఆటను వదిలి...

- బాక్సింగ్ రింగ్ బరిలో తైక్వాండో దిగ్గజ క్రీడాకారిణి జేడ్ జోన్స్
- లండన్, రియో ఒలింపిక్స్ క్రీడల్లో స్వర్ణాలు నెగ్గిన బ్రిటన్ స్టార్





లండన్: జేడ్ జోన్స్... బ్రిటన్ ప్రొఫెషనల్ తైక్వాండో ప్లేయర్. అంతేకాదు! స్వదేశంలో జరిగిన 2012 లండన్ ఒలింపిక్స్ క్రీడల్లో... 2016 రియో ఒలింపిక్స్ క్రీడల్లో... మహిళల తైక్వాండో ఈవెంట్‌లో స్వర్ణ పతకాలు గెలుచుకుంది. తదనంతరం 2020 టోక్యో, 2024 పారిస్ విశ్వక్రీడల్లోనూ జేడ్ పాల్గొంది. 2010లో యూత్ ఒలింపిక్స్ స్వర్ణం మొదలు, ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్, ప్రపంచ చాంపియన్‌షిప్, యూరోపియన్ గేమ్స్, యూరోపియన్ చాంపియన్‌షిప్, గ్రాండ్‌ప్రి ఈవెంట్లలో 36 (19 స్వర్ణాలు, 11 రజతాలు, 6 కాంస్యాలు) పతకాలు గెలుచుకుంది. జేడ్ జోన్స్ పతకాల సంఖ్య ఆమె వయసు (31 ఏళ్లు)ను ఎప్పుడో మించిపోయింది. బహుశా 'కిక్' కొడితే పతకాలు రాలుతున్న తైక్వాండో క్రీడాంశం బోర్ కొట్టించిదేమో తెలియదు కానీ ఈ బ్రిటన్ క్రీడాకారిణి ఇప్పుడు కొత్త 'పంచ్'కు సిద్ధమైంది. బాక్సింగ్‌ను తెగ ఇష్టపడటం వల్లే 20 ఏళ్ల తర్వాత కొత్త కెరీర్‌లోకి అడుగుపెడుతున్నట్లు జోన్స్ చెప్పింది. రింగ్‌లో ఆమె అపుడే లక్ష్యాన్ని కూడా నిర్దేశించుకుంది. 'ఇప్పటికే తైక్వాండోలో ప్రపంచ చాంపియన్ అయ్యాను. త్వరలో బాక్సింగ్‌లోనూ ప్రపంచ చాంపియన్ కావాలని ఆశిస్తున్నాను. రెండు వేర్వేరు క్రీడల్లో ఈ ఘనత సాధిస్తే గొప్పగా ఉంటుంది కదా' అని చెప్పింది. బ్రిటిష్, కామన్వెల్త్ ఫెదర్‌వెయిట్ మాజీ చాంపియన్ స్టీఫెన్ స్మిత్ కోచింగ్‌లో తీవ్రస్థాయిలో కసరత్తులు కూడా చేస్తోంది. అయితే మూడు పదుల వయసు దాటిన తర్వాత పూర్తిగా కొత్త క్రీడలో పతకాలు సాధించడం పెద్ద సవాల్ అని చెప్పొచ్చు. 19 ఏళ్ల టీనేజ్‌లోనే జోన్స్ లండన్ విశ్వక్రీడల్లో బంగారు పతకం గెలిచింది. మళ్లీ నాలుగేళ్ల తర్వాత 'రియో'లో నిలబెట్టుకుంది.

భారత పాస్‌పోర్ట్ అప్పగించనున్న లలిత్ మోదీ

- లండన్‌లోని భారత హైకమిషన్‌కు దరఖాస్తు
- వనువాతు దేశ పౌరసత్వం పొందిన ఐపీఎల్ మాజీ చైర్మన్



న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మాజీ చైర్మన్ లలిత్ మోదీ తన భారత పాస్‌పోర్ట్‌ను అప్పగించేందుకు లండన్‌లోని భారత హైకమిషన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం వివరాలు వెల్లడించింది. ఐపీఎల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో భారీగా నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న లలిత్ మోదీ... 2010లో భారత్‌ను వదిలి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి లండన్‌లో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో పసిఫిక్ దీవుల్లోని వనువాతు దేశం పౌరసత్వం కూడా పొందాడు. నిధుల దుర్వినియోగం అంశంలో భారత దర్యాప్తు సంస్థలు చాన్నాళ్లుగా లలిత్ మోదీ కోసం గాలిస్తున్నాయి. 'లండన్‌లోని భారత హైకమిషన్‌లో లలిత్ మోదీ తన పాస్‌పోర్ట్ అప్పగించేందుకు దరఖాస్తు చేసుకున్నాడు. నిబంధనల ప్రకారం లలిత్ దరఖాస్తును పరిశీలిస్తాం. వనువాతు పౌరసత్వం పొందాడనే విషయాన్ని కూడా అర్థం చేసుకున్నాం. చట్ట ప్రకారం అతడిపై కేసులు కొనసాగుతున్నాయి' అని భారత విదేశంగా మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు.




మళ్లీ ఛెత్రి అవసరమా!

స్టార్ ఫుట్‌బాలర్ పునరాగమనంపై భిన్న వాదనలు

న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన ఆటగాడు సునీల్ ఛెత్రి అనడంలో సందేహమే లేదు. జాతీయ జట్టు తరఫున 151 మ్యాచ్‌లు ఆడి 94 గోల్స్ సాధించాడు. గత ఏడాది జూన్‌లో అతను అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటించి తప్పుకున్నాడు. ఇప్పుడు అనూహ్యంగా ఛెత్రి పునరాగమనం చేస్తున్నాడు. 41 ఏళ్ల వయసులో అతను మళ్లీ భారత్‌కు ప్రాతినిధ్యం వహించేందుకు సిద్ధం కావడం ఫుట్‌బాల్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. కోచ్ మనోలో మార్క్వెజ్ విజ్ఞప్తి మేరకు తిరిగి వచ్చాడని చెబుతున్నా... భారత్ ఫుట్‌బాల్ జట్టు తాజా పరిస్థితిని ఇది సూచిస్తోంది. అతను తిరిగి రావడంపై భిన్న స్పందనలు వస్తున్నాయి. 'జట్టు కోణంలో చూస్తే ఇది సరైన నిర్ణయమే. 40 ఏళ్లు దాటిన వ్యక్తిని మళ్లీ ఆడిస్తున్నారేంటి అని అడగవచ్చు. అయితే గతంలోనూ ఇలాంటివి జరిగాయి. మంచి స్ట్రయికర్‌ను సిద్ధం చేసేందుకు భారత్ ఎంత ప్రయత్నిస్తున్నా ఫలితం రావడం లేదు. ఐఎస్‌ఎల్‌లో బాగా ఆడుతున్న వారంతా విదేశీయులే. పైగా ఛెత్రి సూపర్ ఫిట్‌గా ఉన్నాడు' అని మాజీ ఆటగాడు ఎం.విజయన్ అభిప్రాయపడ్డారు. ఆసియా కప్ 2027 కోసం ప్రకటించిన 26 మంది సభ్యుల జట్టులో ఛెత్రికి అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) చోటు కల్పించింది. ప్రస్తుతం జరుగుతున్న ఐఎస్‌ఎల్‌లో మంచి ఫామ్‌లో ఉన్న ఛెత్రి 12 గోల్స్‌తో టాప్‌స్కోరర్‌గా ఉన్నాడు. వయసుకంటే అతని ఆటను చూడాలని ఏఐఎఫ్‌ఎఫ్ అధ్యక్షుడు కళ్యాణ్ చౌబే అన్నారు. 'ఛెత్రి నాయకత్వ లక్షణాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అతని స్థాయి ప్లేయర్ మొత్తం జట్టులో స్ఫూర్తిని నింపగలడు. అలాంటి స్ట్రయికర్ ఉంటే భారత జట్టుకు మేలు జరుగుతుంది' అని ఆయన చెప్పారు. ఛెత్రి రిటైర్మెంట్ తర్వాత నాలుగు మ్యాచ్‌లు ఆడిన భారత్ 3 మ్యాచ్‌లు 'డ్రా' చేసుకొని మరో దాంట్లో చిత్తుగా ఓడింది తప్ప ఒక్క విజయమూ దక్కలేదు. అయితే ఛెత్రి పునరాగమనం భారత ఫుట్‌బాల్ పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో చూపిస్తోంది. అతను తప్పుకున్న తర్వాత కూడా కనీసం ఒక నాణ్యమైన స్ట్రయికర్‌ను జట్టు తయారు చేసుకోలేకపోతోంది. 'ఇప్పుడు కాకపోతే కొద్ది రోజులకైనా సరే ఛెత్రి తప్పుకోవాల్సిందే. అప్పుడు ఏం చేస్తారు. ఎప్పటి వరకు అతనిపై ఆధారపడతారు. ఏ ఆటలోనైనా, ఎంత గొప్పవారైనా ఆటను ముగించాల్సిందే. తర్వాతి తరాన్ని తీర్చిదిద్దడం, ప్రతిభను ప్రోత్సహించి ఫలితాలు రాబట్టడం ఫెడరేషన్ చేయాల్సిన పని. కానీ మళ్లీ వచ్చి ఆడమని అడగటం ఏ రకంగాను సరైంది కాదు. ఇప్పటికిప్పుడు ఫలితాలు రాకపోయినా... యువ ఆటగాళ్లను భవిష్యత్తు కోసం సిద్ధం చేసుకుంటే బాగుంటుంది' అని ఫుట్‌బాల్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రోహిత్ శర్మ భారీ ఇన్నింగ్స్ ఆడితే...

- ఫైనల్లో కివీస్‌ను, టైటిల్‌ను గెలవొచ్చు
- సునీల్ గావస్కర్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: భారత కెప్టెన్, స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ ఫైనల్లో భారీ ఇన్నింగ్స్ ఆడితే అది మ్యాచ్‌నే ప్రభావితం చేస్తుందని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ విశ్లేషించారు. 'హిట్‌మ్యాన్' 25, 30 పరుగులకే పరిమితం కాకుండా ఎక్కువసేపు క్రీజులో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ టోర్నీలో రోహిత్ మెరుపు ఆరంభాల కోసం ప్రతిసారి ఎదురుదాడికి దిగుతున్నాడు. కానీ ఇదే క్రమంలో వెంటనే అవుటవుతున్నాడు. చాంపియన్స్ ట్రోఫీలో బంగ్లాదేశ్‌పై చేసిన 41 పరుగులే రోహిత్ అత్యధిక స్కోరుగా ఉంది. దీనిపై గావస్కర్ మాట్లాడుతూ 'ఒకవేళ రోహిత్ 25 ఓవర్లపాటు బ్యాటింగ్ చేస్తే భారత్ 180 నుంచి 200 పరుగులు సాధిస్తుంది. అప్పుడు రెండు, మూడు వికెట్లు పడినా ఇన్నింగ్స్‌కు ఏ ఇబ్బంది ఉండదు. అక్కడి నుంచి సులువుగా 350 పరుగుల మార్కును దాటేస్తుంది. ఈ విషయాన్ని భారత కెప్టెన్ గుర్తుంచుకోవాలి. ఓపెనింగ్ మెరుపులు మెరిపించి వెళ్లడం కంటే కూడా కాస్త దూకుడుగా ఆడుతూ కనీసం 25–30 ఓవర్ల పాటు క్రీజును అట్టిపెట్టుకుంటే మ్యాచ్ రూపురేఖలే మారుతాయ్. రోహిత్ ఆట ఇన్నింగ్స్‌పై పెను ప్రభావాన్ని చూపిస్తుంది. దీంతో ఫైనల్ మ్యాచ్‌ను ప్రత్యర్థి చేతుల్లోంచి లాగేసుకోవచ్చు' అని అన్నారు. భారత కెప్టెన్ పాక్‌పై 20, న్యూజిలాండ్‌పై 15, ఆస్ట్రేలియాపై 28 పరుగులు చేశాడు. ఇప్పటి వరకు అర్ధసెంచరీ కూడా బాదలేకపోయాడు.

న్యూజిలాండ్‌కు నాసిర్ హుస్సేన్ మద్దతు

చాంపియన్స్ ట్రోఫీలో భారత్ అజేయమైన జట్టే అయినప్పటికీ ఫైనల్లో ట్రోఫీ గెలిచే అర్హత న్యూజిలాండ్‌కే ఉందని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ నాసిర్ హుస్సేన్ అన్నాడు. 'కివీ క్రికెటర్లు చోకర్లు కాదు. ఒత్తిడిలోనూ నిలబడే స్థైర్యం వారికుంది. ప్రపంచ శ్రేణి ఆటగాళ్లు ప్రస్తుత జట్టులో ఉన్నారు. అమీతుమీలో వారంతా శక్తికిమించే పోరాడతారు' అని వివరించాడు.

సెమీస్‌లో రష్మిక జోడీ ఓటమి



గుర్‌గ్రామ్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ35 మహిళల టోర్నమెంట్ డబుల్స్ విభాగంలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో రష్మిక–వైదేహి (భారత్) ద్వయం 2–6, 4–6తో ఎకతెరీనా మకరోవా–ఎకతెరీనా రెన్‌గోల్డ్ (రష్యా) జంట చేతిలో ఓడిపోయింది. 77 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక–వైదేహి తమ సర్వీస్‌ను ఏడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు.

హర్మన్‌ప్రీత్‌కు జరిమానా



లక్నో: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ముంబై ఇండియన్స్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌పై జరిమానా పడింది. గురువారం యూపీ వారియర్స్‌తో మ్యాచ్ సందర్భంగా అంపైర్‌తో వాదనకు దిగినందుకు హర్మన్‌ప్రీత్ మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత పడింది. యూపీ వారియర్స్ ఇన్నింగ్స్ 19వ ఓవర్ ముగిసిన సమయంలో అంపైర్ అజితేశ్ అర్గాల్... సర్కిల్ బయట ముగ్గురు ఫీల్డర్లు మాత్రమే ఉంచాలని హర్మన్‌ప్రీత్‌కు సూచించాడు. స్లో ఓవర్‌రేట్‌కు **పాల్పడినందుకు గానూ చివరి ఓవర్‌లో బౌండరీ సమీపంలో నలుగురు ఫీల్డర్లను మోహరించే అవకాశం లేదని హర్మన్‌కు వివరించాడు. దీంతో అంపైర్‌తో ముంబై సారథి వాగ్వాదానికి** దిగింది. ఆల్‌రౌండర్ అమెలియా కెర్ కూడా హర్మన్‌కు వంతపాడింది. దీంతో ఈ ఘటనపై రిఫరీ క్రమశిక్షణ చర్యలకు పూనుకున్నాడు. 'హర్మన్‌ప్రీత్ లెవల్–1 తప్పిదానికి పాల్పడింది. నియమావళిలోని 2.8 ఆర్టికల్ ప్రకారం అంపైర్లతో వాగ్వాదానికి దిగడం, అంపైర్ నిర్ణయాన్ని ప్రశ్నించడంతో మ్యాచ్‌లో ఫీజులో 10 శాతం జరిమానా విధించాం' అని డబ్ల్యూపీఎల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. యూపీ వారియర్స్‌తో మ్యాచ్ సందర్భంగా ప్రత్యర్థి ప్లేయర్ సోఫీ ఎకిల్‌స్టోన్‌తోనూ హర్మన్‌ప్రీత్ వాదనకు దిగింది. కాగా... ఈ మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌పై విజయం సాధించిన ముంబై ఇండియన్స్ 'ప్లే ఆఫ్స్'కు చేరువైంది.

వరుణ్‌తోనే పెను ముప్పు

- స్పిన్ ఉచ్చులో పడకుండా ఆడటమే సవాల్
- ఫైనల్‌కు వచ్చాక అనుకూలతలేంటి
- కివీస్ కోచ్ గ్యారీ స్టెడ్ వ్యాఖ్య



గ్యారీ స్టెడ్

దుబాయ్: న్యూజిలాండ్ జట్టుకు 'మిస్టరీ స్పిన్నర్' వరుణ్ చక్రవర్తి బెంగపట్టుకుంది. అతనితోనే పెద్ద ముప్పు అని స్వయంగా కివీస్ హెడ్ కోచ్ గ్యారీ స్టెడ్ వెల్లడించారు. ఆదివారం ఇక్కడ జరిగే 'ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ' టైటిల్ పోరులో భారత్, న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. ఈ నేపథ్యంలో కోచ్ స్టెడ్ మీడియాతో మాట్లాడుతూ 'భారత్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో వరుణ్ తిప్పేశాడు. అతని 5 వికెట్ల ప్రదర్శనే మ్యాచ్‌లో మేం కోలుకోకుండా చేసింది. అతనొక క్లాస్ బౌలర్. తన స్పిన్ నైపుణ్యంతో ఎవరికైనా ఉచ్చు బిగించగలడు. ఫైనల్లోనూ అతనే మాకు పెద్ద సమస్య. అందుకే మేం అతని బౌలింగ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించాం. ఎలాగైనా ఫైనల్ రోజు అతని ఉచ్చులో పడకుండా బ్యాటింగ్ చేయాలనే ప్రణాళికతో బరిలోకి దిగుతాం' అని అన్నారు. పలువురు క్రికెటర్లు దుబాయ్ అనుకూలతలపై చేస్తున్న వ్యాఖ్యల్ని ఆయన పెద్దగా పట్టించుకోలేదు. 'టోర్నీ షెడ్యూల్, వేదికలనేవి మన చేతుల్లో ఉండవు. అందుకే దానిపై అతిగా ఆలోచించం. ఆందోళన చెందం. భారత్ అన్నీ మ్యాచ్‌లు అక్కడ ఆడి ఉండొచ్చు. అలాగే మేం కూడా అక్కడ ఓ మ్యాచ్ ఆడాం. కాబట్టి అక్కడి పరిస్థితులెంటో మాకూ బాగా తెలుసు. ఇలాంటి పెద్ద టోర్నీలో అది కూడా ఎనిమిది జట్ల నుంచి రెండు జట్లు ఫైనల్ దశకు వచ్చాక అనుకూలతలు, ప్రతికూలతలనే సాకులు వెతక్కొద్దు. టైటిల్‌కు ఒక మ్యాచ్ దూరంలో ఉన్నాం. దాని గురించే ఆలోచిస్తాం. వ్యూహాలు రచిస్తాం. మిగతా విషయాల్ని పట్టించుకోం' అని కోచ్ వివరించారు. షెడ్యూల్ పాక్ నుంచి దుబాయ్‌కి... అక్కడి నుంచి తిరిగి ఇక్కడికి బిజీబిజీగా ఉన్నప్పటికీ న్యూజిలాండ్ ప్రొఫెషనల్ క్రికెటర్లకు ఎలాంటి బడలిక ఇబ్బందులు ఉండబోవని చెప్పారు.

ఫైనల్‌కు హెన్రీ దూరం!

పేసర్ మ్యాట్ హెన్రీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ ఆడటం అనుమానంగా మారింది. భుజం నొప్పితో బాధపడుతున్న అతను ఆదివారం మ్యాచ్ సమయానికల్లా కోలుకుంటాడని టీమ్ మేనేజ్‌మెంట్ గంపెడాశలు పెట్టుకుంది. 33 ఏళ్ల హెన్రీ భారత్‌పై లీగ్ మ్యాచ్‌లో 5/42 గణాంకాలు నమోదు చేయడంతోపాటు ఈ టోర్నీలో మొత్తం 10 వికెట్లు తీశాడు. తన ప్రదర్శనతో ప్రధాన బౌలర్‌గా మారిన అతను దక్షిణాఫ్రికాతో జరిగిన సెమీస్‌లో గాయపడ్డాడు. 'మ్యాచ్ సమయంలో కిందపడటంతో అతని భుజానికి స్వల్పగాయమైంది. ఇదేమంత తీవ్రమైంది కాదు. ముందుజాగ్రత్తగా స్కానింగ్ కూడా తీశాం. సానుకూల రిపోర్టు వస్తుందనే ఆశిస్తున్నాం. ఫైనల్లో అతను ఎలాగైనా ఆడాలని మేమంతా గట్టిగా కోరుకుంటున్నాం' అని కోచ్ స్టెడ్ చెప్పారు.

మన ఆటలో వేగం పెరగాలి

- అప్పుడే విదేశీ జట్లకు దీటుగా పోటీనివ్వగలం
- భారత మహిళల హాకీ రైజింగ్ స్టార్ సాక్షి రాణా వ్యాఖ్య



సాక్షి రాణా

న్యూఢిల్లీ: అరంగేట్ర మ్యాచ్‌లోనే అనూహ్య గోల్‌తో అదరగొట్టిన భారత మహిళల హాకీ జట్టు యువ ఫార్వర్డ్ సాక్షి రాణా... అంతర్జాతీయ స్థాయిలో నిలకడ కొనసాగించేందుకు ఆటలో వేగం పెంచుకోవడంపై దృష్టి పెట్టింది. ఇటీవల అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్ సందర్భంగా స్పెయిన్‌తో మ్యాచ్ ద్వారా 17 ఏళ్ల సాక్షి రాణా సీనియర్ స్థాయిలో అరంగేట్రం చేసింది. భువనేశ్వర్ వేదికగా ప్రపంచ ఏడో ర్యాంకర్ స్పెయిన్‌తో జరిగిన పోరులో సాక్షి తన ఆటతీరుతో ఆకట్టుకుంది. ఆ మ్యాచ్‌లో భారత్ 3–4 గోల్స్ తేడాతో స్పెయిన్ చేతిలో ఓడినప్పటికీ... సాక్షి మాత్రం చక్కటి 'ఫీల్డ్ గోల్'తో తనదైన ముద్ర వేసింది. జూనియర్ స్థాయిలో చక్కటి ప్రదర్శనతో సీనియర్ జట్టుకు ఎంపికైన సాక్షి రాణా... మొదటి మ్యాచ్‌లోనే గోల్ చేయడం చాలా ఆనందంగా ఉందని చెప్పింది. 'సీనియర్ జట్టు తరఫున అరంగేట్రం చేసేందుకు చాన్నాళ్లుగా ఎదురుచూశా. తొలి మ్యాచ్‌లో సీనియర్ ప్లేయర్లు ఎంతగానో సహకరించారు. అంతర్జాతీయ స్థాయిలో మొదటి పోరును ఆస్వాదించమని సూచించారు. దీంతో ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడగలిగా' అని సాక్షి వెల్లడించింది. స్పెయిన్‌తో మ్యాచ్‌లో ప్రత్యర్థి ప్లేయర్ల నుంచి సర్కిల్‌లో బంతి చేజిక్కించుకున్న సాక్షి దానిని గోల్‌గా మలిచింది. 'తొలి మ్యాచ్‌లోనే గోల్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా. దాని కోసం తీవ్రంగా శ్రమించా. మ్యాచ్ సమయంలో నా చేతికి బంతి దొరికినప్పుడు చుట్టుపక్కల ఎవరూ లేరని గమనించా. అదే అదునుగా షాట్ కొట్టా. దీంతో ఒక్కసారిగా అందరూ అరవడం ప్రారంభించారు. అప్పుడు గోల్ కొట్టానని అర్థమైంది' అని సాక్షి చెప్పింది. ఎఫ్ఐహెచ్ ప్రొ హాకీ లీగ్‌లో భాగంగా స్పెయిన్, జర్మనీ జట్లపై ఆడిన సాక్షి... విదేశీ ప్లేయర్లతో పోటీపడాలంటే ఆటలో మరింత వేగం పెంపొందించుకోవాలని సాక్షి అభిప్రాయపడింది. 'అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే మరింత వేగం, చురుకుదనం పెంచుకోవాలని అర్థమైంది. ఫార్వర్డ్‌గా అది నాకు మరింత కీలకం. అందుకే ఇప్పుడు దానిపై దృష్టి సారించా. ప్రొ హాకీ లీగ్‌కు స్టాండ్‌బై ప్లేయర్‌గా ఎంపికయ్యా. చీఫ్ కోచ్ హరేంద్ర సింగ్ తొలి మ్యాచ్ ఆడుతున్నావు అని చెప్పినప్పుడు చాలా సంతోషం వేసింది. నిన్ను మాత్రమే జట్టుకు ఎంపిక చేయలేదు... నీ ఆటను కూడా సెలెక్ట్ చేశాం... మైదానంలో విజృంభించు అని కోచ్ వెన్ను తట్టారు. దీంతో ఆత్మవిశ్వాసంతో ఆడగలిగాను' అని సాక్షి చెప్పింది. గతేడాది జూనియర్ ఆసియా కప్‌లో పసిడి పతకం గెలిచిన భారత జట్టులో సభ్యురాలైన సాక్షి... ఈ ఏడాది చిలీ వేదికగా జరగనున్న జూనియర్ ప్రపంచకప్‌లో యువ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది.

శిథిలాల నడుమే రంజాన్ దీక్షలు


ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ధ్వంసమైన గాజాలోని జెయిటౌన్ ప్రాంతంలోని అల్-షఫీ మసీదు భవనమిది. రంజాన్ మాసం తొలి శుక్రవారం సందర్భంగా ఈ ధ్వంసమైన భవనంలోనే పాలస్తీనియన్లు ఇలా ప్రార్థనలు చేశారు.



గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో సర్వస్వం కోల్పోయిన పాలస్తీనా కుటుంబమిది. రంజాన్ సందర్భంగా రోజువారీ ఉపవాసం విరమించాక కుటుంబీకులంతా ఇలా శిథిలాల మధ్యే ఇఫ్తార్‌కు సిద్ధమయ్యారు.

యూన్ సుక్ యోల్‌ను జైలు నుంచి విడుదల చేయండి

దక్షిణ కొరియా కోర్టు ఆదేశం

సియోల్: మార్షల్ లా విధించిన కేసులో అభిశంసనకు గురై పదవి కోల్పోయి, జైలుపాలైన దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు భారీ ఊరట లభించింది. తనను జైలు నుంచి విడుదల చేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సియోల్ సెంట్రల్ జిల్లా కోర్టు సానుకూలంగా స్పందించింది. మాజీ అధ్యక్షుడికి జైలు జీవితం నుంచి విముక్తి కల్పించాలని శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. యూన్‌ను అరెస్టు చేయడం చట్టవిరుద్ధమని ఆయన తరఫు లాయర్లు న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. అధికారికంగా అరెస్టును చూపకముందే దర్యాప్తు సంస్థ యూన్‌ను నిర్బంధించిందని తెలిపారు. యూన్‌పై విచారణ చేపట్టడం చట్టబద్ధమేనా? అనే దానిపై పలు సందేహాలు తలెత్తుతున్నాయని, వీటికి సమాధానాలు కనిపెట్టాల్సి ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. అధ్యక్షుడిగా హోదాలో యూన్ గత ఏడాది స్వల్పకాలం పాటు మార్షల్ లా విధించిన సంగతి తెలిసిందే. దేశంలో అత్యవసర పరిస్థితులు లేకపోయినా మార్షల్ లా విధించడం దేశంపై తిరుగుబాటు చేయడమేనని ఆరోపిస్తూ పార్లమెంట్ సభ్యులు ఆయనను అభిశంసించారు. అభిశంసనపై రాజ్యాంగ కోర్టు విచారణ చేపట్టింది. ఒకవేళ అభిశంసన చెల్లదని కోర్టు తీర్పు ఇస్తే యూన్ తన పదవిని మళ్లీ దక్కించుకొనే అవకాశాలున్నాయి. అభిశంసన చెల్లుబాటు అవుతుందని ప్రకటిస్తే యూన్ అధికారికంగా పదవిని కోల్పోయినట్లే. కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి రెండు నెలల్లోగా జాతీయ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. దక్షిణ కొరియాలో పదవిలో ఉండగా అరెస్టయిన మొట్టమొదటి అధ్యక్షుడిగా యూన్ రికార్డుకెక్కారు. దేశ రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడికి పలు కేసుల నుంచి మినహాయింపు ఉంటుంది. కానీ, దేశ ద్రోహం, రాజ్యంపై తిరుగుబాటు వంటి కేసుల్లో ఎలాంటి మినహాయింపు ఉండదు. సాధారణ పౌరుల తరహాలోనే విచారణను ఎదుర్కోవాల్సిందే. నేరం నిరూపణ అయితే శిక్ష అనుభవించాల్సిందే.

ఈ ఏడాదితో ఉత్తరాల బట్వాడా బంద్

డెన్మార్క్ తపాల శాఖ 'పోస్ట్‌నార్డ్' వెల్లడి

కోపెన్‌హాగెన్: డెన్మార్క్‌లో ఉత్తరాల బట్వాడాను ఈ ఏడాది చివరికల్లా నిలిపివేయనున్నట్లు డెన్మార్క్, స్వీడన్‌ల ప్రభుత్వ తపాలా సేవల విభాగం 'పోస్ట్‌నార్డ్' ప్రకటించింది. పార్సిల్ సేవలను మాత్రం యథా ప్రకారం కొనసాగిస్తామని తెలిపింది. ఈ ఏడాది రెండో అర్ధ భాగంలో డెన్మార్క్ వ్యాప్తంగా ఉన్న 1,500 తపాలా బాక్సులను తొలగిస్తామంది. తాజా పరిణామంతో పోస్ట్‌నార్డ్‌లోని 4,600 మంది ఉద్యోగులకు గాను 1,500 మంది తొలగింపునకు గురికానున్నారు. స్వీడన్‌లో మాత్రం ఉత్తరాల బట్వాడాపై ఎటువంటి ప్రభావం ఉండదని పోస్ట్‌నార్డ్ వివరించింది. 2000వ సంవత్సరంతో పోలిస్తే ఉత్తరాల సంఖ్య 90 శాతం మేర పడిపోయిందని, ఇందులో 30 శాతం వరకు ఒక్క 2024లోనే ఉందని తెలిపింది. డెన్మార్క్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా ప్రజలంతా డిజిటల్ మాధ్యమాల వైపు మళ్లడమే ఇందుకు ప్రధాన కారణమని వివరించింది. 2024లో పోస్టల్ ఫీజులను భారీగా పెంచడం ఇందుకు తోడైంది. డెన్మార్క్ పోస్టల్ విభాగానికి 400 ఏళ్ల ఘన చరిత్ర ఉందని పోస్ట్‌నార్డ్ డెన్మార్క్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కిమ్ పెడెర్సన్ చెప్పారు. ప్రస్తుతం చాలా తక్కువ సంఖ్యలోనే ఉత్తరాలు వస్తున్నందున, ఏమంత లాభదాయంగా లేదన్నారు. తమకు ఇప్పుడు ప్రధాన వనరు పార్సిల్ డెలివరీయేనన్నారు. ప్రజలు తమ ఉత్తరాలను పార్సిల్‌ల ద్వారా కూడా పంపుకోవచ్చని చెప్పారు. 2026 నుంచి ప్యాకేజీ విభాగంపైనే ప్రధానంగా దృష్టిపెడతామని చెప్పారు. సుదూర ప్రాంతాల్లోని వారికి ఉత్తరాలే తప్ప వేరే సమాచార మార్గం లేనందున పోస్ట్‌నార్డ్ నిర్ణయం సరికాదని డెన్మార్క్ ఎంపీ డ్రాగ్‌స్టెడ్ చెప్పారు. అయితే, ప్రైవేటు కంపెనీలు ఉన్నందున ఉత్తరాలను పంపించుకోవడం కష్టం కాదని మీడియా అంటోంది. సుదూరంగా ఉండే దీవుల్లోని వారికి, మారుమూల ప్రాంతాల్లోకి ఉత్తరాల బట్వాడాకు అంతరాయం కలగకుండా డెన్మార్క్ ప్రభుత్వం సంబంధిత మౌలిక వసతులను కొనసాగించనుంది. కాగా, జర్మనీ ప్రభుత్వ డచ్‌పోస్ట్ సైతం తపాలా సర్వీసులను కుదిస్తూ 8 వేల మంది ఉద్యోగులపై వేటు వేసేందుకు చర్యలు ప్రారంభించింది.

పోప్ ఫ్రాన్సిస్ ఆడియో సందేశం

రోమ్: అనారోగ్యం నుంచి తాను త్వరగా కోలుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా మారాలని ప్రార్థనలు చేస్తున్నవారికి పోప్ ఫ్రాన్సిస్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు ఒక ఆడియో సందేశం విడుదల చేశారు. ఆసుపత్రి పడకపై నుంచి స్పానిష్ భాషలో పోప్ మాట్లాడిన ఈ ఆడియోను గురువారం వాటికన్ సిటీ వర్గాలు రికార్డు చేశాయి. వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో ప్రజలకు వినిపించాయి. శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుండడంతో చికిత్స కోసం పోప్ మూడు వారాల క్రితం ఆసుపత్రిలో చేరిన సంగతి తెలిసిందే. ఈ మూడు వారాల్లో ఆయన మాట్లాడడం ఇదే మొదటిసారి. ''నా కోసం ప్రార్థిస్తున్నవారికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. నేను మీ వెంటే ఉంటా. దేవుడు మిమ్మల్ని ఆశీర్వదించుగాక. మేరీ మాత మిమ్మల్ని రక్షిస్తుంది''అని పోప్ పేర్కొన్నారు. ఇందులో ఆయన స్వరం కొంత బలహీనంగా వినిపించింది. పోప్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని ఆయనకు చికిత్స అందిస్తున్న వైద్యులు చెప్పారు.

ఫైరింగ్ స్క్వాడ్‌తో మరణ శిక్ష

సౌత్ కరోలినా: మాజీ గర్ల్ ఫ్రెండ్ తల్లిదండ్రులను బేస్‌బాల్ బ్యాట్‌తో కొట్టి చంపడంతోపాటు మాజీ గర్ల్‌ఫ్రెండ్‌ను చంపేందుకు ప్రయత్నించిన నేరానికి గాను ఓ వ్యక్తికి ఫైరింగ్ స్క్వాడ్‌తో మరణశిక్ష అమలు చేయనున్నారు. బ్రాడ్ సిగ్మాన్, ప్రస్తుతం ఇతడి వయస్సు 67 ఏళ్లు. 2001లో గ్రీన్‌విల్లెలోని మాజీ గర్ల్‌ఫ్రెండ్ తల్లిదండ్రులు డేవిడ్, గ్లాడిస్ లార్కేలను వాళ్లింట్లోనే బంధించి బేస్‌బాల్ బ్యాట్‌తో కొట్టి చంపాడు. అనంతరం మాజీ గర్ల్‌ఫ్రెండ్‌ను తుపాకీతో బెదిరించి కిడ్నాప్ చేశాడు. కాల్చి చంపేందుకు ప్రయత్నించగా ఆమె ఎలాగోలా తప్పించుకుంది. అయితే, తనకు దక్కని ఆమె మరెవరి వద్ద ఉన్నా వారినీ చంపుతానంటూ హెచ్చరికలు చేశాడని లాయర్లు తెలిపారు. విచారణ చేపట్టిన సౌత్ కరోలినా న్యాయస్థానం మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.

ఫైరింగ్ స్క్వాడ్‌తోనే ఎందుకు?

మరణ శిక్షను ఎలక్ట్రిక్ చైర్‌తోనా లేదా విషం ఇంజెక్షన్ ఇచ్చి అమలు చేయాలా అని అడగ్గా మరింత క్రూరమైన ఫైరింగ్ స్క్వాడ్ కావాలని బ్రాడ్ అడిగాడని, మిగతా రెండు పద్ధతుల కంటే ఇదే మరింత ప్రభావవంతంగా ఉంటుందన్నది అతడి అభిప్రాయమని లాయర్లు చెప్పారు. దీంతో ఇది 2010 తర్వాత ఫైరింగ్ స్క్వాడ్‌తో అమలవనున్న తొలి మరణశిక్ష కానుంది.

ఎలా కాలుస్తారు?

మరణ శిక్షల్లో ఈ విధానం ఎంతో క్లిష్టమైనది. ఇందులో శిక్ష అమలు చేయాల్సిన వ్యక్తిని ఓ కుర్చీకి కట్టేసి కూర్చోబెడతారు. అతడి శరీరం నుంచి కారే రక్తాన్ని పట్టేలా ఆ కుర్చీకి దిగువన బేసిన్ అమర్చి ఉంటుంది. ఫైరింగ్ చేయాల్సిన ప్రాంతాన్ని గుండెపై మార్క్ చేసి ఉంచుతారు. కదలకుండా అతడి నెత్తిపై బ్యాగ్‌ను ఉంచుతారు. స్క్వాడ్‌కు చెందిన ముగ్గురు సభ్యులు అతడికి 15 అడుగుల దూరంలో తెర వెనుక నుంచి కాల్పులు జరుపుతారు. వీరు వాడే బుల్లెట్లు కూడా గరిష్ట ప్రభావం చూపేలా ప్రత్యేకంగా తయారైనవి. వీటిని వాడితే ఎంత బాధ కలుగుతుందో కూడా ముందుగానే వైద్య నిపుణులతో చర్చిస్తారు. కాల్పుల తర్వాత వైద్యులు వచ్చి సిగ్మాన్ మరణాన్ని ధ్రువీకరిస్తారు. ప్రభుత్వ అనుమతితో శిక్ష అమలును ప్రత్యక్షంగా బుల్లెట్ ప్రూఫ్ అద్దాల వెనుక నుంచి చూడొచ్చు. ఫైరింగ్ స్క్వాడ్ బృందం సభ్యుల గుర్తింపును మాత్రం రహస్యంగా ఉంచుతారు.

పొడవాటి, దట్టమైన తల వెంట్రుకలున్న వనిత

సునీతపై ట్రంప్ వ్యాఖ్యలు

వాషింగ్టన్: తొమ్మిది నెలలుగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చిక్కుకుపోయిన వ్యోమగామి సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌ను వీలైనంత త్వరగా వెనక్కు తీసుకొస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. సునీతను 'దట్టమైన వెంట్రుకలతో కూడిన వనిత'గా ఈ సందర్భంగా అభివర్ణించారు. అంతరిక్షంలో గురుత్వాకర్షణ శక్తి ఉండని కారణంగా సునీత పొడవాటి జుట్టు పైకి లేచి కన్పిస్తుండటంపై ఇలా సరదా వ్యాఖ్యలు చేశారు. ''సునీత, విల్మోర్ 9 నెలలుగా ఐఎస్ఎస్‌లోనే ఉండిపోయారు. ఈ పరస్పర సాంగత్యం వారికిష్టంగానే ఉందని ఆశిస్తున్నా. బహుశా దాన్ని ఆస్వాదిస్తున్నారేమో కూడా! నాకైతే తెలియదు. ఎంతైనా ఇన్ని రోజులుగా ఇద్దరే ఉండిపోయారు. ఒక్కసారి ఆలోచించండి''అంటూ గమ్మత్తైన వ్యాఖ్యలు చేశారు! వారిని సాధ్యమైనంత త్వరగా తీసుకు రావాల్సిందిగా ఎలాన్ మస్క్‌ను గత వారమే ఆదేశించినట్టు చెప్పుకొచ్చారు. వారు మార్చి 19, లేదా 20న భూమికి తిరిగొచ్చే అవకాశముందని నాసా పేర్కొనడం తెలిసిందే.

మెడికల్, ఇంజనీరింగ్ విద్యను తమిళ మీడియంలోకి తెచ్చి చిత్తశుద్ధి చాటండి

సీఎం స్టాలిన్‌కు హోం మంత్రి అమిత్ షా సవాల్

రాణీపేట: మెడికల్, ఇంజనీరింగ్ విద్యను తమిళ మాధ్యమంలో బోధించేలా చర్యలు తీసుకుని, భాషపై చిత్తశుద్ధిని చాటుకోవాలని తమిళనాడు సీఎం స్టాలిన్‌కు కేంద్ర హోం మంత్రి అమిత్ షా సవాల్ విసిరారు. కేంద్ర ప్రభుత్వం హిందీ భాషను తమిళనాడుపై బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తోందన్న స్టాలిన్ ఆరోపణలపై స్పందిస్తూ మంత్రి..కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్) పరీక్షను అభ్యర్థులు ఇకపై తమిళం సహా ప్రాంతీయ భాషల్లోనూ రాసేందుకు మోదీ ప్రభుత్వం వీలు కల్పించిందన్నారు. శుక్రవారం అమిత్ షా చెన్నైకి సమీపంలోని అరక్కోణం తక్కోలంలో ఉన్న కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్ఎఫ్) 56వ రైజింగ్ డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆర్‌టీసీ తక్కోలంలో ఉన్న సీఐఎస్ఎఫ్ సెంటర్‌కు చోళ రాజు ఆదిత్య గౌరవార్థం 'ఆర్‌టీసీ రాజాదిత్య చోళన్'అని పేరు మార్చుతున్నట్లు ప్రకటించారు.

వలసదారుల పడవల మునక ఇద్దరు మృతి, 186 మంది గల్లంతు

కైరో: ఆఫ్రికా వలసదారులతో వెళ్తున్న నాలుగు పడవలు మునిగిన ఘటనల్లో కనీసం ఇద్దరు చనిపోగా, 186 మంది జాడ తెలియకుండాపోయారు. యెమెన్, డిజిబౌటి తీరాలకు సమీపంలో గురువారం రాత్రి ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. యెమెన్ సమీప సముద్ర జలాల్లో మునిగిన రెండు బోట్లలోని ఇద్దరు సిబ్బందిని మాత్రం రక్షించగలిగామని ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ ప్రతినిధి తమీమ్ ఎలియన్ చెప్పారు. యెమెన్‌కు చెందిన ఐదుగురు సిబ్బంది, 181 మంది వలసదారులు గల్లంతయ్యారని వెల్లడించారు. డిజిబౌటి తీరానికి సమీపంలో మరో రెండు పడవలు నీట మునిగాయని తెలిపిన ఆయన వాటిలో ఉన్న వారందరినీ కాపాడామని, ఇద్దరు మాత్రం చనిపోయారన్నారు. తూర్పు ఆఫ్రికా దేశాల్లో ఏళ్లుగా కొనసాగుతున్న అంతర్యుద్ధాలతో భీతిల్లిన ప్రజలు పనుల కోసం గల్ఫ్ దేశాలకు పయనమవుతున్నారు. వీరికి యెమెన్ ప్రధాన మార్గంగా మారింది. స్మగ్లర్ల మాటలు నమ్మి ప్రమాదకరమైన ఎర్ర సముద్రం గుండా పడవల్లో పరిమితికి మించి ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఉక్రెయిన్ ఇంధన వ్యవస్థలే లక్ష్యం

కీవ్: ఉక్రెయిన్‌లోని కీలక ఇంధన మౌలిక వనరులే లక్ష్యంగా గురువారం రాత్రి రష్యా భారీ స్థాయిలో క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. దాడుల్లో కనీసం 10 మంది గాయపడినట్లు ఉక్రెయిన్ ఇంధన మంత్రి హెర్మన్ చెప్పారు. విద్యుత్, గ్యాస్ ఉత్పత్తి వ్యవస్థలను ధ్వంసం చేసి సామాన్యులను ఇబ్బందులకు గురి చేయడమే రష్యా ఉద్దేశమని ఆయన ఆరోపించారు. పౌరులను మానసికంగా దెబ్బకొట్టేందుకు శీతాకాలాన్ని ఆయుధంగా మార్చుకుందని వ్యాఖ్యానించారు. అయితే, ఉక్రెయిన్ మిలటరీ పరిశ్రమలు, ఆయుధాల ఉత్పత్తికి ఇంధనంతో ముడిపడి ఉందని రష్యా అధ్యక్ష భవనం ప్రతినిధి పెస్కోవ్ వ్యాఖ్యానించడం గమనార్హం. నింగి, నేల, ఆకాశం నుంచి రష్యా 67 క్షిపణులను ప్రయోగించిందని, డ్రోన్లతో 194 దాడులు చేసిందని ఉక్రెయిన్ తెలిపింది. సహజ వాయువు ఉత్పత్తి కేంద్రాలే వీటి లక్ష్యమని పేర్కొంది. వీటిలో 34 మిస్సైళ్లను, 100 వరకు డ్రోన్లను కూల్చివేశామని వివరించింది. ఇలా ఉండగా, మొదటిసారిగా ఫ్రాన్స్ అందించిన మిరాజ్-2000 యుద్ధ విమానాలను ఉక్రెయిన్ మోహరించింది. రష్యా దాడులను ఎదుర్కొనేందుకు పశ్చిమదేశాలు అందించిన ఎఫ్-16 ఫైటర్ జెట్లు ఆ దేశం వద్ద ఇప్పటికే ఉన్నాయి.

చంద్రునిపై అపార జలరాశి!

ఎన్నోచోట్ల మంచు నిల్వలు ● చంద్రయాన్-3 శోధనలో వెల్లడి

చంద్రునిపై ఆవాసం ఏర్పరచుకోవాలన్న మనిషి కలకు మరింతగా ఊతమిచ్చే పరిణామం! చందమామపై ముందుగా ఊహించిన దానికంటే అపారమైన మంచు నిల్వలున్నట్టు తేలింది. చందమామ గర్భంలో తొలుత భావించిన దానికంటే చాలా ఎక్కువ చోట్ల అవి నిక్షిప్తమై ఉన్నట్టు చంద్రయాన్-3 మిషన్ తెలిపింది. చంద్రునిపై ఉష్ణోగ్రతలో నమోదయ్యే భారీ హెచ్చుతగ్గులు మంచు ఆవిర్భావానికి వీలు కల్పిస్తున్నట్టు అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ లేబొరేటరీకి చెందిన చంద్రయాన్-3 పరిశోధన బృందం సారథి దుర్గాప్రసాద్ కరణం వెల్లడించారు. చంద్రుని ఉపరితలం నుంచి 10 సెం.మీ. లోతు దాకా ప్రాంతాలవారీగా ఉష్ణోగ్రతలను, వాటిలో హెచ్చుతగ్గులను చంద్రయాన్-3లో భాగంగా పంపిన చేస్ట్ ప్రోబ్ లెక్కగట్టింది. ''చంద్రయాన్-3 మిషన్ దిగిన శివశక్తి పాయింట్ దగ్గర ఉష్ణోగ్రతలు పగలు అత్యధికంగా 82 సెంటీగ్రేడ్‌కు చేరుతున్నాయి. రాత్రి ఏకంగా -170 డిగ్రీలకు పడిపోతున్నాయి''అని వివరించింది. చంద్రుని ఉపరితలంపై సూర్యునికి ఆవలివైపున 14 డిగ్రీలకు మించి వాలుగా ఉండే లోగట్టు ప్రాంతాలు మంచు ఏర్పడేందుకు అత్యంత అనువైనవని ఈ వివరాల ఆధారంగా సైంటిస్టులు నిర్ధారణకు వచ్చారు. అలాంటి ప్రాంతాలు చందమామపై చాలానే ఉన్నట్టు వివరించారు. చందమామపై మానవ ఆవాసాల ఏర్పాటుకు నాసా ఉద్దేశించిన ఆర్టిమిస్ వంటి భావి ప్రయోగాలకు ఈ తాజా వివరాలు ఎంతగానో ఉపయోగపడతాయని భావిస్తున్నారు. అయితే చంద్రునిపై అంతటి మంచురాశి నిజంగానే అందుబాటులో ఉన్నా దాన్ని మానవ అవసరాలకు వాడుకోవడం అత్యంత సవాలుతో కూడిన అంశం. ఎందుకంటే అక్కడి అత్యల్ప గురుత్వాకర్షణ శక్తి కారణంగా మంచు ద్రవ స్థితికి రాకుండానే నేరుగా ఆవిరిగా మారిపోతుంది. చంద్రయాన్-3 మిషన్ 2023 ఆగస్టు 23న చంద్రుని దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగి చరిత్ర సృష్టించడం తెలిసిందే. అత్యంత తక్కువ ఖర్చుతో చేపట్టిన చంద్రయాత్రగా కూడా ఇది రికార్డులకెక్కింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

వక్ఫ్ బిల్లును ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే అడ్డుకుంటాం

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో కేంద్రం ప్రవేశపెట్టే వక్ఫ్ సవరణ బిల్లును ప్రజాస్వామ్య విధానాల ద్వారానే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ చెప్పారు. ప్రతిపాదిత బిల్లులోని 'అంశాలు, లక్ష్యాలు, పరిధి'పై ఇండియా కూటమి పార్టీలు వ్యతిరేకంగా ఉన్నాయని నొక్కి చెప్పారు. బిల్లును వ్యతిరేకించే విషయంలో ఇండియా కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ ముందుకు సాగుతుందని చెప్పారు. పార్లమెంట్ ఉభయ సభల్లోనూ ఈ బిల్లును కలిసికట్టుగా ఎదుర్కొనేందుకు కూటమి పార్టీలతో విస్తృతమైన సంప్రదింపులు జరుగుతాయని కూడా జైరాం శుక్రవారం పీటీఐతో అన్నారు. బడ్జెట్ సమావేశాలు మొదటి విడతలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కొనసాగగా, రెండో విడత సెషన్ వచ్చే సోమవారం నుంచి మొదలుకానుంది. పార్లమెంట్ రెండో విడత సమావేశాల్లోనే వక్ఫ్ సవరణ బిల్లు వచ్చే అవకాశాలున్నాయని జైరాం రమేశ్ తెలిపారు. ఈ వివాదాస్పద బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకించి తీరుతుందని, ఇతర రాజకీయ పార్టీలు సైతం ఇదే వైఖరితో ఉన్నాయన్నారు. ఇది అవసరం లేని బిల్లు అని చెబుతూ దీనిపై ఏర్పాటైన పార్లమెంట్ సంయుక్త కమిటీ పనితీరు సైతం అప్రజాస్వామికంగా సాగిందని ఆరోపించారు. బిల్లుపై కమిటీలో చర్చించే సమయంలో కొందరు ఎంపిక చేసిన వ్యక్తులను పిలిచారని, కొందరిని అసలు పిలవనే లేదని విమర్శించారు. బిల్లుపై అంశాల వారీగా కాకుండా ఏకమొత్తంగా నివేదిక తయారు చేయడం పార్లమెంటరీ సంయుక్త కమిటీల చరిత్రలో ఇదే మొదటిసారన్నారు. పార్లమెంట్‌లో బిల్లును అడ్డుకునే విషయంలో ఒకట్రెండు రోజుల్లోనే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రతిపక్ష పార్టీల నేతలతో చర్చలు జరుపుతారని జైరాం రమేశ్ వివరించారు. వక్ఫ్ బిల్లు విషయంల మొత్తమ్మీద ప్రతిపక్షమంతా ఏకం కానుందని ఆయన స్పష్టం చేశారు. వక్ఫ్ సవరణ బిల్లుపై 31 మంది సభ్యులతో ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ పలుమార్లు సమావేశమై, వివిధ పక్షాల వాదనలు వింది. పలు సవరణలను సూచించింది. ఇందుకు సంబంధించి 655 పేజీల నివేదికను జనవరి 30న స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించింది.

భారతీయ కార్మికులను రక్షించిన ఇజ్రాయెల్

జెరూసలెం: పాలస్తీనా వెస్ట్‌బ్యాంక్‌లో బందీలుగా ఉన్న 10 మంది భారతీయ కార్మికులను ఇజ్రాయెల్ రక్షించింది. భవన నిర్మాణ రంగంలో పని నిమిత్తం వారు ఇజ్రాయెల్ వెళ్లారు. తర్వాత వెస్ట్‌బ్యాంక్‌లోని కొందరి ప్రోద్బలంతో అల్ జాయెమ్ వెళ్లారు. అక్కడ వారి పాస్‌పోర్టులు లాక్కున్నారు. వాటి సాయంతో స్థానికులు ఇజ్రాయెల్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించారు. చెక్‌పాయింట్ వద్ద ఇజ్రాయెల్ దళాలు వారిని అడ్డుకుని పాస్‌పోర్టులను పరిశీలించగా భారతీయుల విషయం బయటికి వచ్చింది. దాంతో ఇజ్రాయెల్ దళాలు రంగంలోకి దిగి రాత్రిపూట ఆపరేషన్ నిర్వహించి మన కార్మికులను కాపాడారు. వారిని సురక్షిత ప్రదేశానికి తరలించారు. దీనిపై విచారణ జరుపుతున్నట్టు ఇజ్రాయెల్‌లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. 2023 అక్టోబర్ 7న హమాస్ దాడి తర్వాత పాలస్తీనా భవన నిర్మాణ కార్మికులను ఇజ్రాయెల్‌లోకి ప్రవేశం నిషేధించారు. తరువాత గతేడాది భారత్ నుంచి 16,000 మంది కార్మికులు నిర్మాణ పరిశ్రమలో పని చేయడానికి ఇజ్రాయెల్‌కు వెళ్లారు.

మారన్‌కు మద్రాస్ హైకోర్టులో ఊరట

చెన్నై: 2024 లోక్‌సభ ఎన్నికల్లో చెన్నై సెంట్రల్ నియోజకవర్గం నుంచి డీఎంకే అభ్యర్థి దయానిధి మారన్ ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. చెన్నై సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థి, లాయర్ ఎంఎల్ రవి వేసిన పిటిషన్‌లో వాదనలకు నిలిచే ఎలాంటి అంశాలు లేవని ఈ కేసును విచారించిన జస్టిస్ ఆనంద్ వెంకటేశ్ తెలిపారు. ఆ నియోజకవర్గంలో ఎన్నికలప్పుడు ఇంటింటికీ అంటించిన స్టిక్కర్లతో మారన్‌కు సంబంధమున్నట్లు ప్రాథమికంగా నిరూపించలేక పోయారన్నారు. పోలింగ్ ఏజెంట్లకు టీ, టిఫిన్లు, భోజనం, బూత్ వెలుపల టెంట్లు, కుర్చీల ఏర్పాటు ఖర్చులను మారన్ సమర్పించిన ఎన్నికల వ్యయంలో కలపాలన్న వాదన సరికాదన్నారు. ఇటువంటి వాటిని ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 77ను ఉల్లంఘించినట్లుగా తాము భావించలేమన్న న్యాయమూర్తి పిటిషన్‌ను కొట్టివేశారు. అదేసమయంలో, ఎంఎల్ రవి ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న కొన్ని అంశాలను పరిశీలించాలంటూ దయానిధి మారన్ వేసిన పిటిషన్‌ను విచారణకు అనుమతించారు.

రాష్ట్రీయ స్మృతి స్థల్‌లో మన్మోహన్ స్మారకం

న్యూఢిల్లీ: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు స్మారక చిహ్నం నిర్మించేందుకు మార్గం సుగమమైంది. రాష్ట్రీయ స్మృతి స్థల్‌లో స్మారక చిహ్నం నిర్మించాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు ఆయన కుటుంబం సమ్మతి తెలిపింది. ఈ మేరకు గృహ, పట్టణాభివృద్ధి శాఖకు లేఖ రాసినట్లు మన్మోహన్ కుటుంబ సన్నిహితులు తెలిపారు. మన్మోహన్ ముగ్గురు కూతుళ్లు, వారి భర్తలు ప్రతిపాదిత స్మారక ప్రాంతాన్ని పరిశీలించారని కూడా వెల్లడించారు. మాజీ ప్రధానమంత్రులు, రాష్ట్రపతుల స్మారక కట్టడాలున్న రాష్ట్రీయ స్మృతి స్థల్‌లోనే 900 చదరపు మీటర్ల స్థలంలో మన్మోహన్‌కు కూడా స్మారక కట్టడం నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ స్మారక చిహ్నం పక్కనే ఇది ఉంది. మాజీ ప్రధాని కుటుంబం అంగీకారం తెలపడంతో ప్రతిపాదిత స్థలాన్ని మన్మోహన్ సింగ్ పేరుతో ఏర్పాటయ్యే ట్రస్ట్‌కు బదిలీ చేయాల్సి ఉంది. ఈ ట్రస్ట్‌ను, అందులోని సభ్యుల పేర్ల తుది జాబితాను ఆయన కుటుంబం సూచించనుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ట్రస్ట్ ఏర్పాటైతే, స్మారక కట్టడం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.25 లక్షల గ్రాంట్‌ను బదిలీ చేస్తుంది. దేశంలో ఆర్థిక సంస్కరణలకు రూపశిల్పిగా పేరు తెచ్చుకున్న మన్మోహన్ సింగ్ గతేడాది డిసెంబర్ 26న వయో సంబంధ సమస్యలతో కన్నుమూయడం తెల్సిందే.

సిద్ధరామయ్య భార్యకు ఈడీ సమన్లు కొట్టివేత

బెంగళూరు: ముడా కేసులో సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)జారీ చేసిన సమన్లను శుక్రవారం కర్ణాటక హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో నిందితుడు కానప్పటికీ ప్రశ్నించేందుకు పట్టణాభివృద్ధి శాఖ రాష్ట్ర మంత్రి బీఎస్ సురేశ్‌కు ఈడీ జారీ చేసిన సమన్లను సైతం న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈడీ చర్యలను సవాల్ చేస్తూ పార్వతి, సురేశ్‌లు వేసిన పిటిషన్లపై జస్టిస్ ఎం. నాగప్రసన్న ఈ మేరకు తీర్పు వెలువరించారు. ఈడీ సమన్లపై జనవరి 27న కోర్టు స్టే విధించింది. ముడా కేసుపై సిట్, లోకాయుక్త పోలీసులు ఇప్పటికే దర్యాప్తు జరుపుతుండగా ఈడీ సమాంతర విచారణ చేపట్టిందంటూ పార్వతి తరఫున లాయర్ సందేశ్ చౌటా తెలిపారు. సీఎం సిద్ధరామయ్య సైతం మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా)లో భార్య పార్వతికి అక్రమంగా 14 ప్లాట్లను కేటాయించారంటూ ఆరోపణలను ఎదుర్కొంటున్నారు.

రన్యా రావుకు 3 రోజులపాటు కస్టడీ

బెంగళూరు: బంగారం అక్రమ రవాణా కేసులో కన్నడ సినీ నటి రన్యా రావును మూడు రోజులపాటు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్‌ఐ) కస్టడీకి అప్పగిస్తూ ప్రత్యేక కోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. దుబాయి నుంచి రూ.12.56 కోట్ల విలువైన 14.2 కిలోల బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తూ రన్యా రావు బెంగళూరులోని కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో అరెస్టయిన సంగతి తెలిసిందే. ఈ కేసులో తదుపరి విచారణ కోసం ఆమెను తమకు అప్పగించాలని డీఆర్‌ఐ కోరడంతో న్యాయస్థానం అందుకు అనుమతించింది. రన్యా రావు పాస్‌పోర్టులో ఆమె పేరు హర్షవర్ధిని రన్యాగా ఉన్నట్లు డీఆర్‌ఐ అధికారులు గుర్తించారు. గత ఆరు నెలల్లో ఆమె 27 సార్లు దుబాయికి వెళ్లివచ్చినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దుబాయిలో రియల్ ఎస్టేట్ రంగంలో తాను ఫ్రీలాన్సర్‌గా పని చేస్తున్నానని రన్యా రావు చెప్పినట్లు సమాచారం. రన్యా రావు నుంచి అధికారులు ఇప్పటివరకు రూ.17.29 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు.

అకల్ తఖ్త్ చీఫ్‌ను తొలగించిన ఎస్‌జీపీసీ

అమృత్‌సర్: సిక్కు మతంలో శక్తివంతమైన అమృత్‌సర్‌లోని అకల్ తఖ్త్‌కు జతేదార్ (అధిపతి) రఘుబీర్ సింగ్ పదవి కోల్పోయారు. ఆయన్ను బాధ్యతల నుంచి తొలగించినట్లు శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ(ఎస్‌జీపీసీ) ప్రకటించింది. 'పెరుగుతున్న సవాళ్లను రఘుబీర్ నాయకత్వం ఎదుర్కోలేకపోతోంది. ఆయన అస్థిర విధానాలు సిక్కు సమాజంలో ఐక్యతను దెబ్బతీస్తున్నాయి'అని ఎస్‌జీపీసీ ఒక ప్రకటనలో తెలిపింది. శుక్రవారం తేజా సింగ్ సముంద్రి హాల్‌లో సమావేశమైన ఎస్‌జీపీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ రూప్‌నగర్ జిల్లా ఆనంద్‌పూర్ సాహిబ్‌లోని తఖ్త్ శ్రీ కేస్‌గఢ్ సాహిబ్ జతేదార్ సుల్తాన్ సింగ్‌ను సైతం బాధ్యతల నుంచి తప్పిస్తూ నిర్ణయం తీసుకుంది. సుల్తాన్ సింగ్ స్థానంలో కుల్దీప్ సింగ్ గద్గాజ్‌ను కొత్త జతేదార్‌గా నియమించింది. శాశ్వత నియామకం జరిగే వరకు అకల్ తఖ్త్‌కు తాత్కాలిక జతేదార్‌గా కూడా కుల్దీప్ సింగ్ బాధ్యతలు నిర్వహిస్తారని వివరించింది. దమ్‌దమా సాహిబ్‌కు జతేదార్‌గా బాబా టెక్ సింగ్‌ను నియమిస్తున్నట్లు ఎస్‌జీపీసీ తెలిపింది. దమ్‌దమా సాహిబ్ జతేదార్ హర్‌ప్రీత్ సింగ్‌కు ఉద్వాసన పలికిన నెల తర్వాత ఈ పరిణామాలు సంభవించాయి. అదే సమయంలో, ఎస్‌జీపీసీ అధ్యక్షుడు హర్జీందర్ సింగ్ ధామి రాజీనామాపై ఈ సమావేశం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. సిక్కుల అత్యున్నత నిర్ణాయక మండలి ఎస్‌జీపీసీ కాగా, ఈ మతానికి సంబంధించి పురాతనమైన అకల్ తఖ్త్, ఇంకా కేస్‌గఢ్ సాహిబ్, దమ్‌దమా సాహిబ్, హజూర్ సాహిబ్, పట్నా సాహిబ్ అనే ఐదు ప్రధాన గురుద్వారాలున్నాయి.

రష్యా సంస్థతో రక్షణ శాఖ ఒప్పందం

న్యూఢిల్లీ: టీ-72 యుద్ధ ట్యాంకులకు అవసరమైన ఇంజిన్లను రూ.2,156 కోట్లతో కొనుగోలు చేసేందుకు ఉద్దేశించిన ఒప్పందంపై రష్యాకు చెందిన రోసోబోరోన్‌ఎక్స్‌పోర్ట్‌తో రక్షణ శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు అవసరమైన సాంకేతికత పరిజ్ఞానాన్ని రష్యా కంపెనీ చెన్నైలోని ఆవడిలో ఉన్న భారత ప్రభుత్వ ఆర్మర్డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్(హెవీ వెహికల్స్ ఫ్యాక్టరీ)కి బదిలీ చేయనుంది. ప్రస్తుతం ఆర్మీలోని టీ-72 ట్యాంకులకు 780 హార్స్ పవర్ ఇంజన్లున్నాయి. తాజా ఒప్పందంలో భాగంగా వీటికి వెయ్యి హార్స్ పవర్ సామర్థ్యమున్న ఇంజన్లను అమరుస్తారు. వీటితో యుద్ధ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.


పారిస్‌లో రెండో ప్రపంచ యుద్ధం నాటి బాంబులు

పారిస్: పారిస్‌లో రెండో ప్రపంచ యుద్ధకాలం నాటి బాంబులు లభ్యమయ్యాయి. నగరంలోనే అత్యంత రద్దీగా ఉండే గారె డు నార్డ్ రైల్వే స్టేషన్‌లో గురువారం రాత్రి పట్టాలపై పనులు చేస్తుండగా అవి దొరికాయి. దాంతో శుక్రవారం రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అనేక రైళ్లు రద్దయ్యాయి. బాంబును సురక్షితంగా తొలగించారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియెట్‌కు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, గైడెన్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

'దేవానాం ప్రియ' అనేది ఎవరి బిరుదు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ



జైనమతం (క్రీ.పూ. 540-468)

జైనమత స్థాపకుడు రుషభనాథుడు. జైన ప్రవక్తలను 'తీర్థంకరులు' అంటారు. మొత్తం 24 మంది తీర్థంకరులు ఉండేవారు. రుషభనాథుడు మొదటి తీర్థంకరుడు. 23వ తీర్థంకరుడు పార్శ్వనాథుడు. చివరివారైన 24వ తీర్థంకరుడు మహావీరుడు.

మహావీరుడు క్రీ.పూ. 540లో వైశాలి నగరానికి సమీపాన ఉన్న 'కుంద' గ్రామంలో క్షత్రియ కుటుంబంలో జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు సిద్ధార్థుడు, వైశాలి. మహావీరుడి భార్య యశోధ, కుమార్తె ప్రియదర్శిని. ఈయన జీవిత సుఖాలతో తృప్తి చెందక కొంత కాలం దిగంబరుడిగా కఠోర నియమాలను పాటించి తపస్సు చేశాడు. 'జృంభిక' గ్రామంలో పరిపూర్ణజ్ఞానాన్ని పొందిన తర్వాత 'మహావీరుడు'గా పేరు పొందాడు. ఈయన ప్రబోధించిన సరైన క్రియ, సరైన విశ్వాసం, సరైన జ్ఞానం అనే మూడు అంశాలను 'త్రిరత్నాలు'గా పేర్కొంటారు. పంచవ్రతాల ద్వారా మోక్షాన్ని సాధించవచ్చని మహావీరుడు ప్రవచించాడు. ఈయన తన 72వ ఏట క్రీ.పూ. 468లో 'పావాపురి' వద్ద నిర్యాణం చెందాడు.

జైనులు కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతారు. ఉపవాసాలు చేసి శరీరాన్ని కృశింపజేసుకొని మరణించడాన్ని 'సల్లేఖన వ్రతం'గా పేర్కొంటారు. చాలా మంది రాజులు జైనమతాన్ని ఆదరించి అభివృద్ధి చేశారు. చంద్రగుప్త మౌర్యుడు ఈ మతాన్ని అనుసరించి, అన్నింటినీ త్యజించి శ్రావణ బెళగొళలో మరణించాడు. జైనులు ప్రజల భాష అయిన ప్రాకృతంలో తమ సందేశాన్ని ప్రచారం చేశారు. చంద్రగుప్తుడి కాలంలో పాటలీపుత్రంలో స్థూలభద్ర ఆధ్వర్యంలో జైనమత మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జైనమత బోధనలను 12 అంగాలుగా విభజించి క్రోడీకరించారు. కొంతకాలం తర్వాత వస్త్రధారణ విషయంలో అభిప్రాయభేదాలు తలెత్తడం వల్ల జైనమతం దిగంబర, శ్వేతాంబర శాఖలుగా చీలిపోయింది. రెండో జైన సంగీతి క్రీ.శ. 512లో వల్లభి (గుజరాత్)లో దేవార్థి క్షమపణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 'గంధర్వ' అనే పవిత్ర గ్రంథాలను క్రమానుసారంగా రాశారు. జైనులు శిల్పకళను అభివృద్ధి చేశారు.

క్రీ.పూ. 4వ శతాబ్దం చివరి రోజుల్లో గంగా లోయ ప్రాంతంలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో చాలామంది జైన గురువులు, సన్యాసులు దక్షిణ భారతదేశానికి తరలివెళ్లారు. ముఖ్యంగా శ్రావణ బెళగొళ ప్రాంతానికి ఎక్కువ మంది వచ్చారు. దక్షిణానికి వచ్చినవారిలో భద్రబాహుడు, చంద్రగుప్త మౌర్యుడు లాంటి ప్రముఖులు ఉన్నారు. మగధలో ఉన్న జైనులు శ్వేతాంబరులయ్యారు. వీరికి గురువు స్థూల బాహుడు.

జైనమత మహత్వ సూత్రాలు:

1) అహింస 2) సత్యభాషణ
3) అపరిగ్రహం (దొంగిలించకపోవడం)
4) అస్తేయం (ఆస్తి లేకుండా ఉండటం)
5) బ్రహ్మచర్యం

వీటిలో మొదటి నాలుగు సూత్రాలు మహావీరుడి ముందు కాలం నుంచే అమల్లో ఉన్నాయి. మహావీరుడు బ్రహ్మచర్యాన్ని పంచమ సూత్రంగా కలిపాడు.

జైనుల ప్రధాన కట్టడాలు:

- అబూ పర్వతం-మహావీరుడి దేవాలయం
- శ్రావణ బెళగొళ-గోమతేశ్వరుడి విగ్రహం
- అజంతా, ఎల్లోరా, ఉదయగిరి గుహలు
- బాదామి - జైన దేవాలయాలు

అజీవికులు: గోశాల మస్కారిపుత్రుడు అజీవిక మతశాఖను స్థాపించారు. ఇది జైన మత సిద్ధాంతాలకు సన్నిహితంగా ఉంది. అశోకుడి కాలంలో ఇది బాగా వ్యాప్తి చెందింది.

హర్యాంక వంశం (క్రీ.పూ.542-490)

క్రీ.పూ. 542-490 మధ్య కాలంలో రాజకీయంగా అనేక పరిణామాలు సంభవించాయి. ఉత్తర భారతదేశంలో మహాజనపదాలుగా పేర్కొనే పదహారు పెద్ద రాజ్యాలు ఏర్పడ్డాయి. వీటినే 'షోడశ మహాజనపదాలు' అంటారు. వీటిలో మగధ రాజ్యం శక్తిమంతమైంది. గిరివ్రజం, పాటలీపుత్రం దీని రాజధాని నగరాలు. మొదటగా దీన్ని బృహద్రధ వంశస్థులు పాలించారు. తర్వాత హర్యాంక వంశస్థులు పరిపాలించారు. వీరిలో బింబిసారుడు గొప్పవాడు. ఈయన తర్వాత అజాతశత్రువు పాలించాడు.

అజాతశత్రువు పాలనా కాలం క్రీ.పూ. 495-464. ఈయన హర్యాంక వంశ స్థాపకులైన బింబిసారుడి కుమారుడు. అజాతశత్రువు భార్య వజీరాదేవి. ఈమె కోసలరాజు ప్రసేనజిత్తు కుమార్తె. అజాతశత్రువు వజ్జి గణరాజ్య సమాఖ్యతో 16 ఏళ్లు యుద్ధం చేసి జయించాడు. కంటక శిల, కంటక బోధన అనే రాళ్లు, విసరు రథాలను యుద్ధంలో ఉపయోగించి శత్రురాజులను జయించాడు. ఈయన పాటలీపుత్రాన్ని నిర్మించాడు. ఈయనకు కుణిక అనే పేరు కూడా ఉంది. ఉదయనుడు ఈయన వారసుడు. అజాతశత్రువు గౌతమబుద్ధుడి సమకాలీకుడు.

హర్యాంక వంశం తర్వాత మగధను శిశునాగ వంశం (క్రీ.పూ. 490-458) పాలించింది. వీరి తర్వాత నంద వంశస్థులు రాజ్యానికి వచ్చారు. నంద వంశంలో మహాపద్మనందుడు గొప్పరాజుగా పేరు పొందాడు. ఈయనకు 'మహాక్షత్రాంతక' అనే బిరుదు ఉంది. ఆ తర్వాత చంద్రగుప్త మౌర్యుడు చాణక్యుని సహాయంతో నందవంశాన్ని నిర్మూలించి మౌర్యవంశాన్ని స్థాపించాడు.

విదేశీ దండయాత్రలు (క్రీ.పూ. 327-325):

భారతదేశంలో రాజకీయ అనైక్యత కారణంగా విదేశీయులు దండయాత్రలు ప్రారంభించారు. పారశీకులు మొదటగా భారత్‌పై దండయాత్ర చేశారు. వీరిలో 'సైరస్', 'డేరియస్' గొప్పవారు. పారశీక చక్రవర్తి 'సైరస్' గాంధారను జయించారు. వీరి తర్వాత గ్రీకులు భారతదేశంపై దండెత్తారు. గ్రీకు రాజ్యాల్లో అగ్రగామి అయిన మాసిడోనియా చక్రవర్తి అలెగ్జాండర్ విశ్వవిజేతగా పేరు పొందారు. గ్రీకు దండయాత్రల ఫలితంగా భారతదేశానికి, యూరప్ దేశాల మధ్య సంబంధాలు ఏర్పడ్డాయి. భారతీయులు గ్రీకుల నుంచి నాణేల ముద్రణ; శిల్ప, ఖగోళ శాస్త్రాలను నేర్చుకున్నారు.

మౌర్య సామ్రాజ్యం (క్రీ.పూ. 322)

మౌర్యుల చరిత్రకు ఆధారాలు:

విదేశీ గ్రంథాలు: మెగస్తనీస్ (గ్రీకు రాయబారి) రాసిన 'ఇండికా', స్ట్రాబో, డియోడరస్, ఏరియస్, ప్లీనీ రచనలు మౌర్యుల చరిత్రకు ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి.

సాహిత్య ఆధారాలు: కౌటిల్యుడి 'అర్థశాస్త్రం', విశాఖదత్తుడి 'ముద్రారాక్షసం'.

మత సంబంధ ఆధారాలు: పురాణాలు, బౌద్ధుల దివ్య వదన, అశోకవదన, శ్రీలంకకు సంబంధించిన దీపవంశ, మహావంశ, జైనులకు సంబంధించిన పరిశిష్ట పర్వన్ మొదలైనవి కూడా మౌర్యుల చరిత్రను తెలుసుకోవడానికి దోహదపడుతున్నాయి.

వీటితో పాటు శిలా శాసనాలు, రాతి చెక్కడాలు, గుహలు కూడా మౌర్యుల చరిత్రకు ఆధారాలుగా ఉన్నాయి.

చంద్రగుప్త మౌర్యుడు: ఈయన మౌర్యవంశ స్థాపకుడు. చంద్రగుప్త మౌర్యుడు తన చివరి రోజుల్లో కర్ణాటకలోని శ్రావణ బెళగొళలో జీవించాడు. 'సల్లేఖన వ్రతం' ద్వారా మరణించాడు. ఈయన క్రీ.పూ. 303లో 'సెల్యూకస్ నికేటర్'తో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా మౌర్య సామ్రాజ్యానికి ఎక్కువ ప్రయోజనం కలిగింది.

బిందుసారుడు (క్రీ.పూ. 298-273): ఈయన చంద్రగుప్త మౌర్యుడి కుమారుడు. బిందుసారుడికి 'అమిత్రఘాత', 'సింహసేనుడు' అనే బిరుదులు ఉన్నాయి. ఈయన రాజ్యాన్ని మైసూరు వరకు విస్తరించాడు. చాణక్యుడు కొంత కాలంపాటు బిందుసారుడికి కూడా మహామంత్రిగా ఉండి ఆయనకు రాజ్య రక్షణలో సాయపడినట్లుగా టిబెట్ చరిత్రకారుడు తారానాథ్ పేర్కొన్నారు. బిందుసారుడి పాలనా కాలంలో తక్షశిలలో తిరుగుబాటు జరిగింది. ఈయన ఆజ్ఞ ప్రకారం అశోకుడు తక్షశిలకు వెళ్లి శాంతి నెలకొల్పాడు. బిందుసారుడు గ్రీకు రాజ్యాలతో స్నేహ సంబంధాలు పెంపొందించాడు.

అశోకుడు (క్రీ.పూ. 273-232): ఈయన బిందుసారుడి కుమారుడు. అశోకుడు పట్టాభిషేకం చేసుకున్న తొమ్మిదేళ్లకు (క్రీ.పూ. 262- 61లో) సామ్రాజ్యకాంక్షతో కళింగ రాజ్యంపై దండెత్తి జయించాడు. ఈ యుద్ధం 'ధర్మాశోకుడు'గా పూర్తిగా పరివర్తనం చెందడానికి కారణమైంది. ఆ తర్వాత ఉపగుప్తుడు అనే బౌద్ధ ఆచార్యుడి వద్ద అశోకుడు బౌద్ధమత దీక్ష స్వీకరించాడు. ధర్మప్రచారానికి పూనుకొని 'దేవానాం ప్రియ', 'ప్రియదర్శిని' బిరుదులు పొందాడు. బానిసలు, సేవకుల పట్ల కరుణ, తల్లిదండ్రులు, పెద్దల పట్ల విధేయత, గురువుల పట్ల గౌరవం, స్నేహితులు, బంధువులు, పరిచయస్థుల పట్ల ఔదార్యం, పురోహితులు, భిక్షువుల పట్ల ఆదరణ అనేవి అశోకుడు ప్రబోధించిన 'ధర్మం'లోని సూత్రాలు. 'అహింసా' అనేది 'ధర్మం'లోని ముఖ్యసూత్రం. అశోకుడు 42 ఏళ్లు పరిపాలించి క్రీ.పూ. 232లో మరణించాడు.

వివిధ శాసనాల ఆధారంగా అశోకుడి సామ్రాజ్య సరిహద్దుల గురించి తెలుస్తోంది. షాహబద్‌గిరి, మాన్‌షేషరా శాసనాలు వాయవ్య సరిహద్దును, రుమిందై శాసనం ఈశాన్య సరిహద్దును, సొపారా, గిర్నార్ శాసనాలు పశ్చిమ సరిహద్దును తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. బబ్రూ శాసనం అశోకుడి బౌద్ధమత స్వీకారం గురించి, ధౌలీ, జునాగఢ్ శాసనాలు ఉదాత్త రాజ ధర్మ స్వరూపం గురించి, బరాబర్ శాసనం పరమత సహనం గురించి, 13వ శిలాశాసనం కళింగ యుద్ధం గురించి తెలుపుతున్నాయి. మస్కీలో అశోక అనే పదం ఉంది. కళింగ యుద్ధం తర్వాత అశోకుడి పాలన గురించి కళింగ శాసనం ద్వారా తెలుస్తోంది. రుమిందై, ఇగ్లివ శాసనాలు అశోకుడికి బుద్ధుడిపై ఉన్న గౌరవాన్ని వివరిస్తాయి. తరాయి శాసనం అశోకుడికి బౌద్ధమతంపై ఉన్న గౌరవాన్ని తెలుపుతుంది.

అన్ని మతాల సారాంశం ఆధారంగా అశోకుడు కొన్ని సూత్రాలతో దమ్మను తయారు చేశాడు. ఈయన దమ్మ ప్రచారం కోసం ధర్మమహామాత్రులు అనే ప్రచారకులను పంపిస్తే వారు బౌద్ధ మతాన్ని ప్రచారం చేశారు. భారత ఉపఖండంలో అశోకుడు వేయించిన 14 ప్రధాన శిలా శాసనాలు, ఏడు స్తంభ శాసనాలు, అనేక చిన్నరాతి శాసనాలు లభించాయి. ఇందులో చాలావాటిపై ప్రజల కోసం చేసిన ప్రకటనలు చెక్కారు. 14 శిలా శాసనాలు అశోకుడి దమ్మ సూత్రాల గురించి తెలుపుతున్నాయి. మస్కీ శాసనంలో 'దేవానాం ప్రియ' అని ఉంది.

మౌర్య వంశ చివరి పాలకులు (క్రీ.పూ. 232 - 185): అశోకుడి తర్వాత వచ్చిన రాజులు అర్ధ శతాబ్దం పాటు పాలించారు. మౌర్య వంశ చివరి రాజైన బృహద్రధుడిని ఆయన సేనాని పుష్యమిత్రుడు వధించి మగధను ఆక్రమించడంతో వీరి పాలన అంతమైంది.

మౌర్యుల పాలనా వ్యవస్థ

భారతదేశంలో ప్రప్రథమంగా కేంద్రీకృత అధికారాలు కలిగిన నిర్దిష్టమైన పరిపాలన రూపొందించింది మౌర్య చక్రవర్తులే. వీరికి పాలనలో సలహా కోసం మంత్రితో పాటు పరిషత్తు ఉండేది. పాలనా సౌలభ్యం కోసం సామ్రాజ్యాన్ని నాలుగు రాష్ట్రాలుగా విభజించి వాటికి రాజప్రతినిధులను నియమించారు. భూమిశిస్తు ప్రభుత్వ ప్రధాన ఆదాయం. పంట దిగుబడిలో 4 నుంచి 6వ వంతు వరకు శిస్తు వసూలు చేసేవారు. పాటలీపుత్ర నగర పాలన ముప్పై మంది సభ్యులున్న బోర్డు నిర్వహణలో ఉండేది. వర్తకుల 'శ్రేణులు' బ్యాంకులుగా పనిచేశాయి. సమాజంలో బహు భార్యత్వం, కన్యల విక్రయం, సతీసహగమనం లాంటి దురాచారాలు ఉండేవి. ఈ కాలంలో స్త్రీల స్థాయి తగ్గింది. మౌర్యులు ఎక్కువగా ప్రజల భాష అయిన ప్రాకృతాన్ని ఉపయోగించారు. శిలా శాసనాల్లో 'ఖరోష్టి', 'బ్రాహ్మి' లిపులను వాడారు.

అప్రయత్నంగా మెరిసిన భావాల అక్షరాకృతి?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
తెలుగు

ఆధునిక కవితోద్యమాలు

భావ కవిత్వం

తెలుగులో భావ కవిత్వానికి ఆద్యుడు రాయప్రోలు సుబ్బారావు. తొలి తెలుగు భావ కవితా రచన రాయప్రోలు రాసిన 'లలిత'.

భావ కవిత్వాన్ని వివిధ కవులు వివిధ పేర్లతో పిలిచారు.

1. రాయప్రోలు సుబ్బారావు - అభినవ కవిత
2. దేవులపల్లి కృష్ణశాస్త్రి - కాల్పనిక కవిత్వం
3. నోరి నరసింహశాస్త్రి - నవ్య కవిత్వం
4. దువ్వూరి రామిరెడ్డి - గీత కవిత్వం

- భావ కవిత్వం అనే పదాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమ రావు ఆంధ్రపత్రిక సహాయ సంపాదకులుగా ఉన్నప్పుడు సృష్టించారని డాక్టర్ గిడుగు సీతాపతి 'హిస్టరీ ఆఫ్ తెలుగు లిటరేచర్' అనే గ్రంథంలో పేర్కొన్నారు.
- ఆంగ్లంలోని **'లిరికల్ పోయెట్రీ'**నే తెలుగులో **'భావ కవిత్వం'** అని పిలుస్తున్నారు.
- 'లిరిక్' అంటే **'గాన గుణం అమరిన రచన'** అని అర్థం.
- భావ కవులు వియోగ శృంగారానికే ఎక్కు వ ప్రాధాన్యమిచ్చారు.
- తెలుగులో నవ్య కవిత్వానికి కట్టమంచి రామలింగారెడ్డి **'ముసలమ్మ మరణం'** నాందిగా చెప్పవచ్చు.
- భావ కవిత్వానికి నవ్య మార్గ ప్రవక్తగా **కట్టమంచి రామలింగారెడ్డి**ని పిలుస్తారు.
- తెలుగులో నవ్య సాహిత్య యుగానికి **రాయప్రోలు, గురజాడ**ను ఆద్యులుగా చెబుతారు.
- తెలుగులో భావ కవిత్వానికి మూలం **కాల్పనికవాదం**. దీనికి మూల పురుషుడు **రూసో.**
- ఆధునిక కాల్పనికతకు న్యాయనిర్ణేత - **రూసో.**
- ఫ్రెంచ్ సాహిత్యంలో జనించిన **'రొమాంటిసిజమ్'**ను అనుసరించిన కవులనే **'కాల్పనికవాద కవులు'** అంటారు.
- రొమాంటిసిజంనే ఆంగ్ల సాహిత్యంలో లిరికల్ పోయేట్రిగా పిలుస్తారు.
- **'లిరికల్ పోయెట్రీ'**ని తెలుగులో **ఆత్మాశ్రయ కవిత్వం** అంటారు.
- కాల్పనికోద్యమ పితామహునిగా **రూసో**ను (1712-88) పాశ్చాత్యులు అంగీకరించారు.
- రూసో 'న్యూ హెలాయిస్' రచనలో ప్రణయతత్వాన్ని, 'సోషల్ కాంట్రాక్ట్' గ్రంథంలో మానవతావాదాన్ని ప్రతిపాదించారు.
- కాల్పనికోద్యమానికి మూలసూత్రం - **ఆత్మాశ్రయ సిద్ధాంతం.**
- భావకవిత్వోద్యమం మూడు (1910-40) దశాబ్దాల పాటు విలసిల్లింది.

భావ కవిత్వం - నిర్వచనాలు

1. 'కవికి తన్మయజ్యోతి మెఱుపువలె చటాలున ఒక్కసారి మెరయును. దానికి ప్రతిఫలమే ఉత్తమ కవిత లేక భావకవిత' - **వేలూరి శివరామశాస్త్రి** (1929 భారతి పత్రికలో)
2. 'కవి అవినృష్ట వాంఛాంకురము, ఒక అంతర్నిగూఢ తాపము ఒక చిన్న కావ్యంలో ఊదబడినచో అది భావ కవిత్వం' - **విశ్వనాథ సత్యనారాయణ.**
3. 'కవి హృదయంలో తటిల్లత లాగా అప్రయత్నంగా మెరసిపోయిన భావాల అక్షరాకృతి భావ కవిత' - **శ్రీశ్రీ.**
4. 'వస్తు, భావ రచనల్లో భావానికి ప్రాధాన్యత అగ్రతాంబూలమిచ్చిన కవిత భావకవిత్వం' - **సి.నా.రె.**

భావ కవిత్వం - శాఖలు

- డాక్టర్ సి.నారాయణరెడ్డి భావ కవిత్వాన్ని ఆరు శాఖలుగా విభజించారు.
- భావ కవిత్వంలోని ప్రధాన శాఖలు
  1) ప్రకృతి కవిత్వం 2) ప్రణయ కవిత్వం
  3) సంఘ సంస్కరణ కవిత్వం
  4) దేశ భక్తి కవిత్వం
  5) స్మృతి కవిత్వం 6) మర్మ కవిత్వం

సుప్రసిద్ధ భావకవులు - వారి రచనలు

రాయప్రోలు సుబ్బారావు - లలిత, అనుమితి, తృణకంకణము, ఆంధ్రావళి, మధుకలశం, స్నేహలత, కష్టకమల, వనమాల, జడకుచ్చులు మొదలైనవి.

బసవరాజు అప్పారావు - సెలయేటి గానం, ప్రేమతత్వం, బసవరాజు అప్పారావు గీతాలు.

పింగళి - కాటూరి కవులు - తొలకరి, సంక్రాంతి, సౌందర నందనం.

కాటూరి వెంకటేశ్వరరావు - గుడిగంటలు, పౌలస్త్య హృదయం.

దేవులపల్లి కృష్ణశాస్త్రి - కృష్ణపక్షం, ప్రవాసం, ఊర్వశి, పల్లకి, సంస్కర్త మొదలైనవి.

దువ్వూరి రామిరెడ్డి - పానశాల, భగ్నహృదయం, కడపటి వీడ్కోలు, స్వప్నశేషం, నలజారమ్మ అగ్ని ప్రవేశం, కృషీవలుడు, వనకుమారి, జలదాంగన మొదలైనవి.

నండూరి సుబ్బారావు - యెంకి పాటలు

నాయని సుబ్బారావు - సౌభద్రుని ప్రణయ యాత్ర, మాతృగీతాలు, విషాదమోహనం, వేదనా వాసుదేవం, భాగ్యనగర కోకిల మొదలైనవి.

వేదుల సత్యనారాయణశాస్త్రి - దీపావళి, ముక్తఝరి.

అబ్బూరి రామకృష్ణారావు - మల్లికాంబ, జలాంజలి, ఊహాగానం, నదీ సుందరి, ఎర్రగన్నేరు, రసపిపాసి, కాపుపాటలు, మాతృ భూమి, తిక్కన మొదలైనవి.

అడవి బాపిరాజు - శశికళ, గోధూళి, గంగిరెద్దు, వరద గోదావరి, చిగురుటాకులు, గడ్డిపూల పళ్ళెం, తరంగిణి, శిల్పబాల.

విశ్వనాథ సత్యనారాయణ - ఆంధ్రప్రశస్తి, ఆంధ్ర పౌరుషం, వరలక్ష్మి త్రిశతి, శశిదూతం, కిన్నెరసాని, కోకిలమ్మ పెళ్ళి, గిరికుమారుని ప్రేమగీతాలు, భ్రష్టయోగి.

అభ్యుదయ కవిత్వం

సామాజిక సిద్ధాంత బలాన్ని సమన్వయించుకొని వెల్లువెత్తిన తొలి ఆధునిక కవిత్వోద్యమం **అభ్యుదయ కవిత్వం**. ఇది ఆంధ్రదేశంలో 1940 నుంచి 1960 చివర వరకు ఉధృతంగా సాగింది. అభ్యుదయం అనే పదానికి **మంగళం, శుభం** అనే నైఘంటికార్థాలున్నాయి. ఆంగ్లంలోని **'ప్రోగ్రెస్'** అనే పదానికి సమానార్థకంగా తెలుగులో **'అభ్యుదయం'** అనే పదాన్ని వాడుతున్నారు. ప్రస్తుతం ఈ పదానికి **'పురోగమనం, ప్రగతి శీలం, చైతన్యం'** అనే స్థూలార్థాలను గ్రహిస్తున్నాం. తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం శ్రామిక జన పక్షపాతం, వాస్తవికత, పీడితజన పక్షం, నవసమాజ నిర్మాణం మొదలైన అంశాలను ప్రవేశపెట్టింది **అభ్యుదయ కవిత్వమే.**

- సంస్కృతి పరిరక్షణ కోసం 1935లో **'పారిస్'**లో అంతర్జాతీయ రచయితల సదస్సు జరిగింది.
- 1935లో డిసెంబర్‌లో అలహాబాద్‌లో **'ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్'**ను ఏర్పాటు చేశారు.
- 1936 ఫిబ్రవరిలో లండన్ నుంచి వెలువడే **'ది డెయిలీ ట్రిబ్యూన్'** పత్రికలో భారత అభ్యుదయ రచయితల ప్రణాళికను ప్రకటించారు.
- 1936 ఏప్రిల్ 9, 10 తేదీల్లో లక్నోలో **'మున్షీ ప్రేమ్ చంద్'** అధ్యక్షతన అఖిల భారత అభ్యుదయ రచయితల ప్రథమ మహాసభ నిర్వహించారు.
- 1932లో ఆడెన్ తదితర కవులు ఆంగ్లంలో **'న్యూ సిగ్నేచర్స్'** అనే కవితా సంకలనాన్ని వెలువరించారు.
- 1850 దశకంలో వెలువడిన కారల్ మార్క్స్ రచనలు ప్రపంచ వ్యాప్తంగా కవులు, కళాకారుల్లో కొత్త ఆలోచనలు రేకెత్తించాయి.
- తెలుగునాట అభ్యుదయ సాహిత్యోద్యమానికి **మార్క్సిజమే** పునాది. 1943లో **అభ్యుదయ రచయితల సంఘాన్ని** ఏర్పరిచారు.
- 1943లో తెనాలిలో జరిగిన తొలి అభ్యుదయ రచయితల మహాసభలకు **తాపీ ధర్మారావు** అధ్యక్షత వహించారు.
- 1955లో బెజవాడలో **శ్రీశ్రీ** అధ్యక్షతన 5వ మహాసభలు జరిగాయి.
- చిట్టచివరి సమైక్య అభ్యుదయ రచయితల సభలను 1974లో **చాగంటి సోమయాజులు** అధ్యక్షతన ఒంగోలులో నిర్వహించారు.

అభ్యుదయ కవిత్వం - నిర్వచనాలు

1. 'ఊహాలోకాల్లో విహరిస్తున్న ఆధునిక కవిత్వాన్ని భూమార్గం పట్టించిందీ, సామాన్య మానవున్ని సాహిత్యానికి మకుటధారిని చేసిందీ **అభ్యుదయ కవిత్వం**'.
2. 'ధనిక సమాజం మారాలనుకోవడమే అభ్యుదయం' - **దేవులపల్లి కృష్ణశాస్త్రి.**
3. 'చైతన్యమే పర్యవసానంగా కలది అభ్యుదయ సాహిత్యం' - **వేల్చేరు నారాయణరావు.**

అభ్యుదయ కవిత్వం - లక్షణాలు

1. అంతర్జాతీయ దృక్పథంలో మానవాభ్యుదయాన్ని కాంక్షించడం.
2. ఆర్థిక అసమానతలు తొలగించి సామ్యవాద సమాజాన్ని నెలకొల్పడం.
3. పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయడం.
4. వర్ణ, వర్గ రహిత సమ సమాజ స్థాపన.
5. శ్రమ దోపిడీ లేని సమాజం.
6. దేశ పారిశ్రామికీకరణం.
7. నవసమాజ నిర్మాణం.

తెలుగులో అభ్యుదయ కవిత్వ ప్రస్థానం

- తెలుగునాట అభ్యుదయ సాహిత్య మూలవిరాట్ - **శ్రీశ్రీ** అని సి. నారాయణరెడ్డి పేర్కొన్నారు.
- **శ్రీశ్రీ** 1934 ఏప్రిల్ 12న మహాప్రస్థానం గేయాన్ని రాశారు. ఇది ముద్దుకృష్ణ **'జ్వాల'** పత్రికలో మొదటగా ప్రచురితమైంది.
- తెలుగులో వెలువడిన తొలి అభ్యుదయ కవితా సంకలనం **'నయాగరా'**. 1944లో దీన్ని బెల్లం కొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రమణ్యం కలిసి రచించారు.
- **శ్రీశ్రీ** మహాప్రస్థానం సంపూర్ణ కావ్యంగా 1950లో ప్రచురితమైంది.

ప్రసిద్ధ కవులు - అభ్యుదయ రచనలు

శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ):
మహాప్రస్థానం, ఖడ్గ సృష్టి

ఆరుద్ర:
త్వమేవాహం, సినీవాలి,
గాయాలు - గేయాలు

ఆవంత్స సోమసుందర్: వజ్రాయుధం (తెలంగాణ సాయుధ పోరాటం)

కాళోజీ నారాయణరావు: నా గొడవ (అభ్యుదయ కవితా సంపుటాలు)

దాశరథి కృష్ణమాచార్యులు: అగ్నిధార, రుద్రవీణ, పునర్నవం, ఆలోచనాలోచనలు, తిమిరంతో సమరం, మహోంద్రోదయం.

రెంటాల గోపాలకృష్ణ:
సర్పయాగం, సంఘర్షణ

అనిసెట్టి సుబ్బారావు: అగ్నివీణ

కె.వి. రమణారెడ్డి: అడవి,
భువనఘోష, అంగారవల్లరి

సి. నారాయణరెడ్డి: మంటలు - మానవుడు, అక్షర గవాక్షం, విశ్వంభర, ప్రపంచ పదులు, నాగార్జున సాగరం, సినారె గజల్స్.

పురిపండా అప్పలస్వామి: పులిపంజా, అనల పతాకం, సంధ్యావందనం, స్వర్గానికి - నరకానికి.

పఠాభి: ఫిడేలు రాగాల డజన్,
పఠాభి పంచాంగం (1964)

శిష్టా ఉమామహేశ్వరరావు: నవమిచిలుక, విష్ణుధనువు

శ్రీరంగం నారాయణబాబు: మౌనశంఖం, రుధిరజ్యోతి

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆధునిక కవిత్వంలో రాయప్రోలు సుబ్బారావు మొదటగా లేవనెత్తిన ప్రణయ సిద్ధాంతం?
   1) కులపాలికా ప్రణయం
   2) కరుణ విప్రలంభం
   3) అమలిన శృంగారం
   4) విప్రలంభ శృంగారం
2. 'కవి అవినృష్ట వాంఛాంకురం, ఒక అంతర్నిగూఢ తాపం ఒక చిన్న కావ్యంలో ఊదబడితే' అది?
   1) విప్లవ కవిత్వం
   2) అభ్యుదయ కవిత్వం
   3) ఆధ్యాత్మిక కవిత్వం
   4) భావ కవిత్వం
3. 'వేదాంతాలు జీవితాన్నీ, ప్రకృతినీ అవగాహన చేసుకున్నారు; మేం లోకాన్ని, జీవితాన్ని, ప్రకృతినీ కూడా మారుస్తాం' అనే శ్రీ రంగం నారాయణ బాబు మాటలు దేనికి ప్రాతినిధ్యం వహిస్తాయి?
   1) దిగంబర కవిత
   2) అభ్యుదయ కవిత
   3) భావ కవిత
   4) విప్లవ కవిత
4. అభ్యుదయ కవిత్వ ప్రధాన లక్షణం?
   1) వర్గ సామరస్యం
   2) వర్గ సంఘర్షణ
   3) ప్రణయ బోధన
   4) దేశభక్తి ప్రబోధం

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 2.

విద్య, ఉద్యోగ సమాచారం

టీహెచ్‌డీసీలో జూనియర్ ఆఫీసర్ ట్రైనీ పోస్టులు

తెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్(టీహెచ్‌డీసీ).. జూనియర్ ఆఫీసర్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(హోటల్ మేనేజ్‌మెంట్, హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్, కేటరింగ్ టెక్నాలజీ)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 12.02.2025 నాటికి 27 ఏళ్ల ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.29,200 నుంచ రూ.1,19,000.
- **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్ట్ రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** మొత్తం 200 మార్కులకు 200 ప్రశ్నలు ఉంటాయి. తప్పు సమాధానాలకు నెగటివ్ మార్కింగ్ ఉంటుంది. ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం మూడు గంటలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు..** 14.03.2025.
- **వెబ్‌సైట్:** https://thdc.co.in/

ఎన్ఐఓటీ, చెన్నైలో ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషియన్ టెక్నాలజీ(ఎన్ఐఓటీ).. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఇంజనీర్-1, ప్రాజెక్ట్ ఇంజనీర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
- **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ ఇంజనీర్1-02, ప్రాజెక్ట్ ఇంజనీర్ అసిస్టెంట్-02.
- **విభాగాలు:** సివిల్, కోస్టల్, ఓషియన్, హార్బర్ ఇంజనీరింగ్.
- **అర్హత:** డిప్లొమా, బీఈ/బీటెక్(సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు సంబంధిత పని అనుభవం ఉండాలి.
- **వయసు:** ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు 35 ఏళ్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్ అసిస్టెంట్‌కు 50 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు రూ.56,000, ప్రాజెక్ట్ ఇంజనీర్ అసిస్టెంట్‌కు రూ.20,000.
- **ఎంపిక విధానం:** ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులకు ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు. ప్రాజెక్ట్ ఇంజనీర్ అసిస్టెంట్ పోస్టులకు రాతపరీక్ష ద్వారా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు..** 14.03.2025.
- **ఇంటర్వ్యూ తేది:** 27.03.2025.
- **రాతపరీక్ష తేది:** 28.03.2025.
- **వెబ్‌సైట్:** https://www.niot.res.in/

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

క్షీర విప్లవ పితామహుడు ఎవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
జాగ్రఫీ

భారతదేశం- వ్యవసాయం

మనదేశంలోని ఆహార పంటలు మొత్తం పంటల సాగు విస్తీర్ణంలో 75 శాతం. వ్యవసాయ ఉత్పత్తుల్లో వీటి విలువ 50 శాతం. ఆహార పంటలను కాయధాన్యాలు, పప్పు ధాన్యాలుగా విభజించవచ్చు.

1. **కాయధాన్యాలు:** వరి, గోధుమ, జొన్న, మొక్కజొన్న, సజ్జ, రాగి, బార్లీ.
2. **పప్పుధాన్యాలు:** పెసలు, కందులు, మినుములు, ఉలవలు, సెనగలు మొదలైనవి.

వరి: మనదేశంలో వరి ముఖ్యమైన ఆహారపంట. ఇది ప్రధానంగా ఖరీఫ్ కాలానికి చెందిన పంట. కానీ రబీలోనూ పండిస్తున్నారు.

వరి పండించడానికి అనువైన పరిస్థితులు:

1) ఒండలి నేలలు అనుకూలం.
2) వార్షిక వర్షపాతం 150 సెం.మీ. నుంచి 200 సెం.మీ. వరకు ఉండాలి.
3) 22° సెంటీగ్రేడ్ నుంచి 32° సెంటీ గ్రేడుల ఉష్ణోగ్రత ఉండాలి.
4) వ్యవసాయ కూలీల లభ్యత అధికంగా ఉన్న ప్రాంతాలు ఈ పంటకు అను వైనవి.

- వరి ఉత్పత్తిలో ప్రపంచంలో చైనా మొదటి స్థానంలో ఉండగా, భారత్ రెండో స్థానంలో ఉంది.
- భారతదేశంలో ఉత్పత్తి పరంగా పశ్చిమ బెంగాల్ మొదటి స్థానంలో, ఉత్తరప్రదేశ్ రెండో స్థానంలో ఉన్నాయి.
- దేశంలో వరిని అధికంగా ఉత్పత్తి చేసే ప్రాంతం గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతం.

గోధుమ: గోధుమ ప్రధానంగా 'రబీ' కాలపు పంట. శీతాకాలం ఈ పంటకు అనుకూలమైంది. విస్తీర్ణపరంగా, ఉత్పత్తిపరంగా వరి తర్వాత ఇది రెండో ప్రధాన ఆహార పంట.

- గోధుమ ఉత్పత్తిలో చైనా మొదటిస్థానంలో ఉంది. రెండో స్థానంలో భారత్ ఉంది.
- గోధుమ పంట ఉత్పత్తి పరంగా భారత్‌లో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో, పంజాబ్ రెండో స్థానంలో ఉన్నాయి.
- వరి, గోధుమ పంటలకు సంబంధించి భారతదేశంలో ఎక్కువ ఉత్పత్తి 1960వ దశాబ్దంలో (1965 తర్వాత) ప్రారంభమైంది. దీన్నే 'హరిత విప్లవం' అంటారు.

భారతదేశంలో హరిత విప్లవం (1965-66)

పురాతన వ్యవసాయ పద్ధతులకు స్వస్తి పలుకుతూ.. అధిక దిగుబడినిచ్చే వంగడాలు, రసాయనిక ఎరువులు, నీటిపారుదల వసతులను ఉపయోగించి, కొత్త సాంకేతిక పద్ధతులతో చేసే వ్యవసాయాన్ని హరిత విప్లవం (Green



Revolution) అంటారు. దీన్నే సస్యవిప్లవం అని కూడా అంటారు.

- ఇందులో భాగంగా 1965-66లో అధిక దిగుబడులనిచ్చే వంగడాల కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రవేశ పెట్టారు.
- హరిత విప్లవం అనే పదాన్ని మొదటగా వాడిన వ్యక్తి విలియం గాండ్.
- హరిత విప్లవాన్ని మొదటిసారిగా ప్రపంచంలో వ్యాప్తి చేసిన వ్యక్తి నార్మన్ బోర్లాగ్ (మెక్సికో).
- భారత్‌లో హరిత విప్లవాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చిన వ్యక్తి M.S. స్వామినాథన్. ఈయననే భారతదేశ హరిత విప్లవ పితామహుడు అంటారు.
- హరిత విప్లవం వల్ల అధికంగా ప్రయోజనం పొందిన పంటలు వరుసగా..

1. గోధుమ, 2. వరి,
3. జొన్న, 4. మొక్కజొన్న.

- దీనివల్ల తక్కువ ప్రయోజనం పొందిన పంటలు 1. పప్పుధాన్యాలు, 2. నూనెగింజలు.

రెండో హరిత విప్లవం (2006):

2004లో వాజ్‌పేయి ప్రభుత్వం రెండో హరిత విప్లవం గురించి 11వ ప్రణాళికలో పేర్కొన్నప్పటికీ అది అమలు కాలేదు.

- 2006 మే 26న నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ దీన్ని ప్రకటించాడు.
- భారతదేశంలో వర్షపాతం తక్కువగా ఉండే మెట్ట ప్రాంతాల్లో చిరుధాన్యాలను పండిస్తున్నారు. చిరుధాన్యాల్లో ముఖ్యమైనవి.. జొన్నలు, కొర్రలు, సజ్జలు, రాగులు, మొక్కజొన్న.
- ప్రోటీన్లు అధికంగా ఉండే 'లెగుమినేసి' కుటుంబానికి చెందిన పంటలన్నీ పప్పుధాన్యాల కిందకి వస్తాయి. వీటిలో ముఖ్యమైనవి సెనగలు, కందులు, పెసలు, మినుములు.

వాణిజ్య లేదా నగదు పంటలు

భారతదేశంలో నగదు పంటలు మొత్తం పంట విస్తీర్ణంలో 15 శాతం ఆక్రమిస్తూ, ఉత్పత్తిలో 40 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

- పత్తిని 'తెల్లబంగారం' అంటారు.
- భారతదేశంలో ఎక్కువగా పొడుగు గింజ, మధ్యరకం గింజ పత్తిని పండిస్తున్నారు.
- పత్తి ప్రధానంగా నల్లరేగడి నేలలో పండుతుంది.
- భారతదేశంలో అధికంగా రబ్బరు ఉత్పత్తి (దాదాపు 85 శాతం) కేరళలో జరుగుతోంది.
- దేశంలో మొదటిసారిగా తేయాకు సాగుచేసిన ప్రాంతం అసోం.

శ్వేత విప్లవం (White Revolution)

- పాల ఉత్పత్తిలో అధిక దిగుబడులను తీసుకురావడానికి శ్వేత విప్లవాన్ని ప్రవేశ పెట్టారు.
- దీని ముఖ్య ఉద్దేశం.. గ్రామీణ ఉత్పత్తి దారులు, పట్టణ వినియోగదారులను కలపడం.
- ఇందులో భాగంగా 1970లో 'ఆపరేషన్ ఫ్లడ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- శ్వేత విప్లవ పితామహుడు - వర్గీస్ కురియన్
- ప్రస్తుతం ప్రపంచంలో పాల ఉత్పత్తిలో భారతదేశం మొదటి స్థానంలో ఉంది.
- ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ఉత్పత్తిపరంగా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

నీలి విప్లవం (Blue Revolution)

ఇది చేపల ఉత్పత్తిలో పెరుగుదల కోసం చేపట్టిన కార్యక్రమం.

- చేపల పెంపకాన్ని 'పిసికల్చర్' అంటారు.
- చేపల గురించి చేసే అధ్యయనాన్ని 'ఇక్థియాలజీ' అంటారు.
- చేపల ఉత్పత్తిలో ప్రపంచంలో చైనా, జపాన్ తర్వాత భారతదేశం ఉంది.
- పట్టు పురుగుల పెంపకాన్ని 'సెరికల్చర్' అంటారు.
- తేనేటీగల పెంపకాన్ని 'ఎపికల్చర్' అంటారు..

గతంలో అడిగిన ప్రశ్నలు

1. భారతదేశ 'స్పైస్ గార్డెన్'గా పేరు పొందిన రాష్ట్రం ఏది? (డిప్యూటీ జైలర్స్-2012)
1) కేరళ 2) ఆంధ్రప్రదేశ్
3) తమిళనాడు 4) కర్ణాటక
2. కిందివాటిలో ఏ రాష్ట్రం సోయాబీన్‌ను అత్యధికంగా ఉత్పత్తి చేస్తుంది? (డిప్యూటీ జైలర్స్ -2012)
1) బిహార్ 2) మధ్యప్రదేశ్
3) ఉత్తరప్రదేశ్ 4) పశ్చిమ బెంగాల్
3. జతపరచండి.

పంట	ముఖ్య ఉత్పాదక రాష్ట్రం
ఎ. కాఫీ	1. కేరళ
బి. పత్తి	2. గుజరాత్
సి. పెండలం	3. ఆంధ్రప్రదేశ్
డి. పొగాకు	4. తమిళనాడు
ఇ. మిరప	5. కర్ణాటక

(డిప్యూటీ జైలర్స్-2012)
1) ఎ-1, బి-2, సి-3, డి-4, ఇ-5
2) ఎ-4, బి-5, సి-3, డి-2, ఇ-1
3) ఎ-3, బి-5, సి-3, డి-2, ఇ-1
4) ఎ-5, బి-2, సి-1, డి-3, ఇ-4
4. భారతదేశ సహజ సిద్ధ రబ్బరు అవసరాలను ఎక్కువగా తీర్చే రాష్ట్రం ఏది? (డిప్యూటీ జైలర్స్ -2012)
1) కేరళ 2) కర్ణాటక
3) తమిళనాడు 4) ఏదీకాదు
5. ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ భాగంతో పాటు హరిత విప్లవం వల్ల ముందు లబ్ధి పొందిన రాష్ట్రాలు? (ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్-2013)
1) పంజాబ్, హర్యానా
2) పంజాబ్, మహారాష్ట్ర
3) హర్యానా, ఆంధ్రప్రదేశ్
4) మహారాష్ట్ర, కర్ణాటక
6. కిందివాటిలో సిల్క్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేసే రాష్ట్రం? (కానిస్టేబుల్-2012)
1) ఆంధ్రప్రదేశ్ 2) కర్ణాటక
3) తమిళనాడు 4) అసోం
7. భారతదేశంలో అత్యధికంగా జీడిపప్పును పండించే రాష్ట్రం ఏది? (కానిస్టేబుల్-2012)
1) ఆంధ్రప్రదేశ్ 2) అసోం
3) కేరళ 4) కర్ణాటక
8. భారతదేశానికి అత్యధిక విదేశీ మారక ద్రవ్యం దేని ఎగుమతి ద్వారా లభిస్తుంది? (కానిస్టేబుల్-2012)
1) ఇనుము 2) టీ
3) జనపనార 4) పంచదార
9. నీలి విప్లవం అంటే ఏమిటి? (కానిస్టేబుల్-2013)
1) వాణిజ్య పంటల ఉత్పత్తి
2) నీలి మందుల ఉత్పత్తి
3) నీలి లోహ ఉత్పత్తి
4) చేపల ఉత్పత్తి
10. కిందివాటిలో ఏ పంటకు ఒక హెక్టార్‌కు ఎక్కువ నీరు అవసరం? (కానిస్టేబుల్- 2013)
1) చెరకు 2) గోధుమ
3) మొక్కజొన్న 4) బార్లీ
11. హరిత విప్లవానికి కారణమైన వ్యవసాయ శాస్త్రజ్ఞుడు ఎవరు? (జైల్ వార్డెన్-2012)
1) కురియన్ 2) ఎస్.ఎస్. భట్నాగర్
3) శాంతి స్వరూప్ 4) నార్మన్ బోర్లాగ్

సమాధానాలు

1) 1; 2) 2; 3) 4; 4) 1; 5) 1; 6) 3; 7) 3; 8) 2; 9) 4; 10) 1; 11) 4.

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశంలో వరి ఉత్పత్తిలో అగ్రస్థా నంలో ఉన్న రాష్ట్రం ఏది?
1) అసోం 2) పశ్చిమ బెంగాల్
3) ఆంధ్రప్రదేశ్ 4) ఉత్తరప్రదేశ్
2. భారతదేశంలో తేయాకును ఎక్కువగా ఉత్పత్తి చేసే రాష్ట్రం ఏది?
1) ఉత్తరాంచల్ 2) తమిళనాడు
3) అసోం 4) పశ్చిమ బెంగాల్
3. భారత కేంద్రీయ వరి పరిశోధనా సంస్థ ఎక్కడ ఉంది?
1) కటక్ 2) మైసూర్
3) కోల్‌కతా 4) బెంగళూరు
4. గ్రీన్ రివల్యూషన్ ప్రభావం దేనిపై ఎక్కువగా కనిపిస్తుంది?
1) పప్పుధాన్యాలు 2) గోధుమలు
3) వరి 4) నూనె గింజలు
5. క్షీర విప్లవ పితామహుడు ఎవరు?
1) రామన్ కురియన్
2) రామనాథ్ కృష్ణన్
3) వర్గీస్ కురియన్ 4) జె.ఎం. జోసఫ్
6. పట్టు ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉన్న రాష్ట్రం ఏది?
1) కేరళ 2) కర్ణాటక
3) తమిళనాడు 4) మహారాష్ట్ర

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 2; 5) 3; 6) 2.

వివిధ పంటలు - పరిశోధనా సంస్థలు

- జాతీయ వరి పరిశోధనా కేంద్రం - కటక్ (ఒడిశా)
- అంతర్జాతీయ వరి పరిశోధనా కేంద్రం - మనీలా (ఫిలిప్పీన్స్)
- భారత చెరకు పరిశోధనా సంస్థ - లక్నో (ఉత్తరప్రదేశ్)
- సుగంధ ద్రవ్యాల పరిశోధనా కేంద్రం - కాలికట్ (కేరళ)
- కేంద్రీయ పత్తి పరిశోధనా కేంద్రం - నాగపూర్ (మహారాష్ట్ర)
- ఇక్రిసాట్ (International Crops Research Institute for Semi Arid Tropics - ICRISAT) - హైదరాబాద్
- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ - న్యూ ఢిల్లీ
- తేయాకు పరిశోధనా కేంద్రం - జోర్హట్ (అసోం)
- భారత ప్రభుత్వం 2000 జనవరి 28న మొదటిసారిగా 'జాతీయ వ్యవసాయ విధానాన్ని' ప్రకటించింది. ఇందులో భాగంగా 'ఇంద్రధనస్సు' విప్లవాన్ని ప్రకటించింది. ఈ విప్లవంలో మిశ్రమ వ్యవసాయం కూడా ఒక భాగం.

భారతదేశంలో వివిధ రకాల పంటలు - అధికంగా ఉత్పత్తి చేసే రాష్ట్రాలు

పంట	రాష్ట్రాలు
1. వరి	1. పశ్చిమ బెంగాల్ 2. ఉత్తరప్రదేశ్
2. గోధుమ	1. ఉత్తరప్రదేశ్ 2. పంజాబ్
3. జొన్న	1. మహారాష్ట్ర 2. కర్ణాటక
4. రాగి	1. కర్ణాటక 2. తమిళనాడు
5. వేరుసెనగ	1.గుజరాత్ 2. తమిళనాడు
6. పత్తి	1. గుజరాత్ 2.మహారాష్ట్ర
7. జనుము	1. పశ్చిమ బెంగాల్ 2. బిహార్
8. చెరకు	1. ఉత్తర ప్రదేశ్ 2. మహారాష్ట్ర
9. కాఫీ	1. కర్ణాటక 2. కేరళ
10. తేయాకు	1. అసోం 2. పశ్చిమబెంగాల్
11. రబ్బరు	1. కేరళ
12. పాలు	1. ఉత్తరప్రదేశ్ 2. గుజరాత్

Who amongst the five types the fastest?

BANK EXAMS
REASONING

Model Questions

1. In a certain code, PLANT is written as "$@2H©" and YIELD is written as "b64@%". How is "DELAY" written in that code?
1) b4H2% 2) b4@2%
3) %42@b 4) %4@2b
5) None of these
2. How many meaningful English words can be formed with the letters ARILT using each letter only once in that word?
1) None 2) One 3) Two
4) Three 5) More than three
3. D said, "A's father is the only brother of my sister's son." How is A's father related to D?
1) Cousin2) Nephew 3) Aunt
4) Data inadequate
5) None of these

Directions (Q. No. 4-6): The following questions are based on the 5 three-digit numbers given below:
394 632 783 576 895

4. If the positions of the first and the second digit within each number are interchanged, then which of the following will be the second highest number?
1) 632 2) 783 3) 576
4) 895 5) 394
5. If the first and second digits of each of the numbers are added, the resulting sum of which of the following numbers will not be exactly divisible by 3?
1) 895 2) 394 3) 576
4) 632 5) 783
6. If 2 is added to the last digit of each number and then the positions of the first and the third digits are interchanged, which of the following will be the highest number?
1) 576 2) 895 3) 783
4) 394 5) 632
7. If A is coded as 1, B as 3, C as 5 and so on, which of the following is the numerical value of the word "FAZED"?
1) 81 2) 79 3) 77
4) 80 5) None of these
8. Which of the following pairs of words have the same relationship as FAN : HEAT?
1) Water : Drink
2) Light : Night
3) Teach : Student
4) Air : Breathe 5) Food : Hunger
9. Q types faster than R but not as fast as V. T types faster than R. S types faster than V. Who amongst the five types the fastest?
1) V 2) T 3) S
4) Data Inadequate
5) None of these
10. If "B × C" means "B is the daughter of C", "B + C" means "B is the husband of C" and "B – C" means "B is the sister of C", then what does "M + N – P × Q" mean?
1) M is the brother-in-law of Q
2) M is the uncle of Q
3) M is the son-in-law of Q
4) Q is the mother-in-law of M
5) None of these

Directions (Q. No. 11-15): Study the following arrangement care fully and answer the questions given below:
RDAK5BI2M J E N 9 7
UZV1 W3H4FY8 P 6 T G

11. How many such numbers are there in the above arrangement, each of which is immediately preceded by a consonant and immediately followed by a vowel?
1) None 2) One 3) Two
4) Three 5) More than three
12. Which of the following is the eighth to the left of the seventeenth from the left end?
1) M 2) J 3) 8
4) 5 5) None of these



13. Four of the following five are alike in a certain way based on their positions in the above arrangement and so form a group. Which is the one that does not belong to that group?
1) E 9 J 2) Z 1 U 3) H W 4
4) Y 4 8 5) B 2 K
14. Which of the following is the sixth to the right of the nineteenth from the right end?
1) 5 2) Z 3) V
4) 1 5) None of these
15. How many such consonants are there in the above arrangement, each of which is immediately preceded by a number and immediately followed by another consonant?
1) None 2) One 3) Two
4) Three 5) More than three

Directions (Q. No. 16-19): Each of the questions below consists of a question and two statements numbered I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question. Read both the statements and

Give answer:
1) If the data in statement I alone are sufficient to answer the question, while the data in statement II alone are not sufficient to answer the question.
2) If the data in statement II alone are sufficient to answer the question, while the data in statement I alone are not sufficient to answer the question.
3) If the data either in statement I alone or in statement II alone are sufficient to answer the question.
4) If the data given in both the statements I & II together are not sufficient to answer the question.
5) If the data in both the statements I & II together are necessary to answer the question.

16. How is 'never' written in a code language?
I) "never ever go there" is written as "na ja ni ho" in that code language.
II) "go there and come back" is written as "ma ho sa ni da" in that code language.
17. Among M, P, K, J, T and W, who is lighter than only the heaviest?
I) P is heavier than M and T.
II) W is heavier than P but lighter than J who is not the heaviest.
18. What does "$" mean in a code language?
I) "5 $ # 3" means "flowers are really good".
II) "7 # 3 5" means "good flowers are available".
19. How many students are there between Suresh and Mohan in a row of fifty students?
I) Suresh is twelfth from the left end and Mohan is seventeenth from the right end.
II) Suresh is six places away from Jayesh, who is twentieth from the left end.

Key And Explanations

1. Ans: 4

P	L	A	N	T	Y	I	E	D
$	@	2	✳	©	β	6	4	%

\ DELAY Þ %4@2b

2. Ans: 3. TRAIL, TRIAL,
3. Ans: 2. A's father = the only brother of D's sister's son = D's sister's son = D's nephew
4. Ans: 5. Interchanging the first two digits, we get 934, 362, 873, 756 and 985. Of these, 934 is the second highest.
5. Ans: 1. 895 Þ 8 + 9 = 17 is not divisible by 3.
6. Ans: 1. Look for the highest third digit.
7. Ans: 2. In general, n^{th} letter of the alphabet =2n–1 Here, FAZED = 11 + 1 + 51 + 9 + 7 = 79
8. Ans: 5. The first dispels the second.
9. Ans: 4. V > Q > R; T > R; S > V Combining, we get S > V > Q > R and T > R. Hence, either S or T is the fastest.
10. Ans: 3.
```
              Q
              |
M(+) Û N(–)<—>P(–)
```
11. Ans: 1.
12. Ans: 1. 8^{th} to the left of 17^{th} from left = 17 – 8 = 9^{th} from the left = M
13. Ans: 5. In all others, the first and third elements are consecutive ones.
14. Ans: 3. 6^{th} to the right of 19^{th} from the right = 19 – 6 = 13^{th} from the right = V
15. Ans: 4. M, F and T
16. Ans: 4. Only two words are common between I and II.
17. Ans: 5. From I: P > M, T
From II: J > W > P
Combining, we get K > J > W > P > M, T Hence, K is the heaviest and J lighter than only the heaviest.
18. Ans: 5.
From I: 5$#3 = flowers are really good ... (i)
From II: 7#35 = good flowers are available ... (ii)
From I and II: 5#3 = flowers are good ... (iii)
Putting (iii) in (i), we get: $ = really.
19. Ans: 1. **From I:** Suresh = 12^{th} from left
Mohan = 17^{th} from right
\ No. of students between them = 50 – 29 (12+17) = 21
From II: No data about Mohan.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్ డియోఘర్‌లో 20 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్), డియోఘర్‌లో... నాన్ ఫ్యా కల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టుల సంఖ్య: 20.

పోస్టుల వివరాలు: సీనియర్ మెడికల్ ఫిజిసిస్ట్-01, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ఆఫీసర్-01, సీనియర్ ప్రోగ్రామర్-01, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్-01, చీఫ్ ఆప్టోమెట్రిస్ట్/టెక్నికల్ ఆఫీసర్-01, అసిస్టెంట్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ఆఫీసర్-01, సెక్యూరిటీ ఆఫీసర్-01, అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)-01, డైటీషియన్-02, లాండ్రీ మేనేజర్-01, మెడికల్ రికార్డ్ ఆఫీసర్-01, పర్‌ఫ్యూజనిస్ట్-01, ఆప్టోమెట్రిస్ట్-01, టెక్నీషియన్ రేడియో థెరపిస్ట్-01, జూనియర్ ఆడియాలజిస్ట్, స్పీచ్ థెరపిస్ట్-01, డెంటల్ టెక్నీషియన్ (హైజీనిక్)-01, జూనియర్ మెడికల్ రికార్డ్ ఆఫీసర్-01, ఫైర్ టెక్నీషియన్-02.

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఎస్సీ(మెడికల్, ఫిజిక్స్), ఎండీ(బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్), బీఈ/బీటెక్, ఎంసీఏ, బీఎస్సీ, డిప్లొమా, ఎంసీజే, డిగ్రీ, ఇంటర్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: సీనియర్ మెడికల్ ఆఫీసర్, లాండ్రీ మేనేజర్, సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్‌కు 50 ఏళ్లు, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ఆఫీసర్‌కు 21 నుంచి 40 ఏళ్లు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్, చీఫ్ ఆప్టోమెట్రిస్ట్/టెక్నికల్ ఆఫీసర్‌కు 30 నుంచి 45 ఏళ్లు, అసిస్టెంట్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ఆఫీసర్, ఆప్టోమెట్రిస్ట్, పర్‌ఫ్యూజనిస్ట్‌కు 18 నుంచి 30 ఏళ్లు, సెక్యూరిటీ ఆఫీసర్‌కు 18 నుంచి 35 ఏళ్లు, ఫైర్ టెక్నీషియన్‌కు 18 నుంచి 27 ఏళ్లు, మిగతా పోస్టులకు 21 నుంచి 35 ఏళ్లు.

ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిక్రూట్‌మెంట్ సెల్, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, డియోఘర్, దేవిపూర్ క్యాంపస్, రామ్‌సాగర్, డియోఘర్-814152, జార్ఖండ్ చిరునామకు పంపించాలి.

దరఖాస్తులకు చివరితేది: 14.03.2025.

వెబ్‌సైట్: https://www.aiimsdeoghar.edu.in/

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

క్షీర విప్లవ పితామహుడు ఎవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

భారతదేశం- వ్యవసాయం

మనదేశంలోని ఆహార పంటలు మొత్తం పంటల సాగు విస్తీర్ణంలో 75 శాతం. వ్యవసాయ ఉత్పత్తుల్లో వీటి విలువ 50 శాతం. ఆహార పంటలను కాయధాన్యాలు, పప్పు ధాన్యాలుగా విభజించవచ్చు.

1. **కాయధాన్యాలు:** వరి, గోధుమ, జొన్న, మొక్కజొన్న, సజ్జ, రాగి, బార్లీ.
2. **పప్పుధాన్యాలు:** పెసలు, కందులు, మినుములు, ఉలవలు, సెనగలు మొదలైనవి.

వరి: మనదేశంలో వరి ముఖ్యమైన ఆహారపంట. ఇది ప్రధానంగా ఖరీఫ్ కాలానికి చెందిన పంట. కానీ రబీలోనూ పండిస్తున్నారు.

వరి పండించడానికి అనువైన పరిస్థితులు:

1) ఒండలి నేలలు అనుకూలం.
2) వార్షిక వర్షపాతం 150 సెం.మీ. నుంచి 200 సెం.మీ. వరకు ఉండాలి.
3) 22° సెంటీగ్రేడ్ నుంచి 32° సెంటీ గ్రేడుల ఉష్ణోగ్రత ఉండాలి.
4) వ్యవసాయ కూలీల లభ్యత అధికంగా ఉన్న ప్రాంతాలు ఈ పంటకు అను వైనవి.

- వరి ఉత్పత్తిలో ప్రపంచంలో చైనా మొదటి స్థానంలో ఉండగా, భారత్ రెండో స్థానంలో ఉంది.
- భారతదేశంలో ఉత్పత్తి పరంగా పశ్చిమ బెంగాల్ మొదటి స్థానంలో, ఉత్తరప్రదేశ్ రెండో స్థానంలో ఉన్నాయి.
- దేశంలో వరిని అధికంగా ఉత్పత్తి చేసే ప్రాంతం గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతం.

గోధుమ: గోధుమ ప్రధానంగా 'రబీ' కాలపు పంట. శీతాకాలం ఈ పంటకు అనుకూలమైంది. విస్తీర్ణపరంగా, ఉత్పత్తిపరంగా వరి తర్వాత ఇది రెండో ప్రధాన ఆహార పంట.

- గోధుమ ఉత్పత్తిలో చైనా మొదటిస్థానంలో ఉంది. రెండో స్థానంలో భారత్ ఉంది.
- గోధుమ పంట ఉత్పత్తి పరంగా భారత్‌లో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో, పంజాబ్ రెండో స్థానంలో ఉన్నాయి.
- వరి, గోధుమ పంటలకు సంబంధించి భారతదేశంలో ఎక్కువ ఉత్పత్తి 1960వ దశాబ్దంలో (1965 తర్వాత) ప్రారంభమైంది. దీన్నే 'హరిత విప్లవం' అంటారు.

భారతదేశంలో హరిత విప్లవం (1965-66)

పురాతన వ్యవసాయ పద్ధతులకు స్వస్తి పలుకుతూ.. అధిక దిగుబడినిచ్చే వంగడాలు, రసాయనిక ఎరువులు, నీటిపారుదల వసతులను ఉపయోగించి, కొత్త సాంకేతిక పద్ధతులతో చేసే వ్యవసాయాన్ని హరిత విప్లవం (Green



Revolution) అంటారు. దీన్నే సస్యవిప్లవం అని కూడా అంటారు.

- ఇందులో భాగంగా 1965-66లో అధిక దిగుబడులనిచ్చే వంగడాల కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రవేశ పెట్టారు.
- హరిత విప్లవం అనే పదాన్ని మొదటగా వాడిన వ్యక్తి విలియం గాండ్.
- హరిత విప్లవాన్ని మొదటిసారిగా ప్రపంచంలో వ్యాప్తి చేసిన వ్యక్తి నార్మన్ బోర్లాగ్ (మెక్సికో).
- భారత్‌లో హరిత విప్లవాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చిన వ్యక్తి M.S. స్వామినాథన్. ఈయననే భారతదేశ హరిత విప్లవ పితామహుడు అంటారు.
- హరిత విప్లవం వల్ల అధికంగా ప్రయోజనం పొందిన పంటలు వరుసగా..

1. గోధుమ, 2. వరి, 3. జొన్న, 4. మొక్కజొన్న.

- దీనివల్ల తక్కువ ప్రయోజనం పొందిన పంటలు 1. పప్పుధాన్యాలు, 2. నూనెగింజలు.

రెండో హరిత విప్లవం (2006):

2004లో వాజ్‌పేయి ప్రభుత్వం రెండో హరిత విప్లవం గురించి 11వ ప్రణాళికలో పేర్కొన్నప్పటికీ అది అమలు కాలేదు.

- 2006 మే 26న నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ దీన్ని ప్రకటించాడు.
- భారతదేశంలో వర్షపాతం తక్కువగా ఉండే మెట్ట ప్రాంతాల్లో చిరుధాన్యాలను పండిస్తున్నారు. చిరుధాన్యాల్లో ముఖ్యమైనవి.. జొన్నలు, కొర్రలు, సజ్జలు, రాగులు, మొక్కజొన్న.
- ప్రోటీన్లు అధికంగా ఉండే 'లెగుమినేసి' కుటుంబానికి చెందిన పంటలన్నీ పప్పుధాన్యాల కిందకి వస్తాయి. వీటిలో ముఖ్యమైనవి సెనగలు, కందులు, పెసలు, మినుములు.

వాణిజ్య లేదా నగదు పంటలు

భారతదేశంలో నగదు పంటలు మొత్తం పంట విస్తీర్ణంలో 15 శాతం ఆక్రమిస్తూ, ఉత్పత్తిలో 40 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

- పత్తిని 'తెల్లబంగారం' అంటారు.
- భారతదేశంలో ఎక్కువగా పొడుగు గింజ, మధ్యరకం గింజ పత్తిని పండిస్తున్నారు.
- పత్తి ప్రధానంగా నల్లరేగడి నేలలో పండుతుంది.
- భారతదేశంలో అధికంగా రబ్బరు ఉత్పత్తి (దాదాపు 85 శాతం) కేరళలో జరుగుతోంది.
- దేశంలో మొదటిసారిగా తేయాకు సాగుచేసిన ప్రాంతం అసోం.

శ్వేత విప్లవం (White Revolution)

- పాల ఉత్పత్తిలో అధిక దిగుబడులను తీసుకురావడానికి శ్వేత విప్లవాన్ని ప్రవేశ పెట్టారు.
- దీని ముఖ్య ఉద్దేశం.. గ్రామీణ ఉత్పత్తి దారులు, పట్టణ వినియోగదారులను కలపడం.
- ఇందులో భాగంగా 1970లో 'ఆపరేషన్ ఫ్లడ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- శ్వేత విప్లవ పితామహుడు - వర్గీస్ కురియన్
- ప్రస్తుతం ప్రపంచంలో పాల ఉత్పత్తిలో భారతదేశం మొదటి స్థానంలో ఉంది.
- ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ఉత్పత్తిపరంగా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

నీలి విప్లవం (Blue Revolution)

ఇది చేపల ఉత్పత్తిలో పెరుగుదల కోసం చేపట్టిన కార్యక్రమం.

- చేపల పెంపకాన్ని 'పిసికల్చర్' అంటారు.
- చేపల గురించి చేసే అధ్యయనాన్ని 'ఇక్థియాలజీ' అంటారు.
- చేపల ఉత్పత్తిలో ప్రపంచంలో చైనా, జపాన్ తర్వాత భారతదేశం ఉంది.
- పట్టు పురుగుల పెంపకాన్ని 'సెరికల్చర్' అంటారు.
- తేనేటీగల పెంపకాన్ని 'ఎపికల్చర్' అంటారు..

గతంలో అడిగిన ప్రశ్నలు

1. భారతదేశ 'స్పైస్ గార్డెన్'గా పేరు పొందిన రాష్ట్రం ఏది? (డిప్యూటీ జైలర్స్-2012)
   1) కేరళ 2) ఆంధ్రప్రదేశ్
   3) తమిళనాడు 4) కర్ణాటక
2. కిందివాటిలో ఏ రాష్ట్రం సోయాబీన్‌ను అత్యధికంగా ఉత్పత్తి చేస్తుంది? (డిప్యూటీ జైలర్స్ -2012)
   1) బిహార్ 2) మధ్యప్రదేశ్
   3) ఉత్తరప్రదేశ్ 4) పశ్చిమ బెంగాల్
3. జతపరచండి.

పంట	ముఖ్య ఉత్పాదక రాష్ట్రం
ఎ. కాఫీ	1. కేరళ
బి. పత్తి	2. గుజరాత్
సి. పెండలం	3. ఆంధ్రప్రదేశ్
డి. పొగాకు	4. తమిళనాడు
ఇ. మిరప	5. కర్ణాటక

   (డిప్యూటీ జైలర్స్-2012)
   1) ఎ-1, బి-2, సి-3, డి-4, ఇ-5
   2) ఎ-4, బి-5, సి-3, డి-2, ఇ-1
   3) ఎ-3, బి-5, సి-3, డి-2, ఇ-1
   4) ఎ-5, బి-2, సి-1, డి-3, ఇ-4
4. భారతదేశ సహజ సిద్ధ రబ్బరు అవసరాలను ఎక్కువగా తీర్చే రాష్ట్రం ఏది? (డిప్యూటీ జైలర్స్ -2012)
   1) కేరళ 2) కర్ణాటక
   3) తమిళనాడు 4) ఏదీకాదు
5. ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ భాగంతో పాటు హరిత విప్లవం వల్ల ముందు లబ్ధి పొందిన రాష్ట్రాలు? (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్-2013)
   1) పంజాబ్, హర్యానా
   2) పంజాబ్, మహారాష్ట్ర
   3) హర్యానా, ఆంధ్రప్రదేశ్
   4) మహారాష్ట్ర, కర్ణాటక
6. కిందివాటిలో సిల్క్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేసే రాష్ట్రం? (కానిస్టేబుల్-2012)
   1) ఆంధ్రప్రదేశ్ 2) కర్ణాటక
   3) తమిళనాడు 4) అసోం
7. భారతదేశంలో అత్యధికంగా జీడిపప్పును పండించే రాష్ట్రం ఏది? (కానిస్టేబుల్-2012)
   1) ఆంధ్రప్రదేశ్ 2) అసోం
   3) కేరళ 4) కర్ణాటక
8. భారతదేశానికి అత్యధిక విదేశీ మారక ద్రవ్యం దేని ఎగుమతి ద్వారా లభిస్తుంది? (కానిస్టేబుల్-2012)
   1) ఇనుము 2) టీ
   3) జనపనార 4) పంచదార
9. నీలి విప్లవం అంటే ఏమిటి? (కానిస్టేబుల్-2013)
   1) వాణిజ్య పంటల ఉత్పత్తి
   2) నీలి మందుల ఉత్పత్తి
   3) నీలి లోహ ఉత్పత్తి
   4) చేపల ఉత్పత్తి
10. కిందివాటిలో ఏ పంటకు ఒక హెక్టారుకు ఎక్కువ నీరు అవసరం? (కానిస్టేబుల్- 2013)
    1) చెరకు 2) గోధుమ
    3) మొక్కజొన్న 4) బార్లీ
11. హరిత విప్లవానికి కారణమైన వ్యవసాయ శాస్త్రజ్ఞుడు ఎవరు? (జైల్ వార్డెన్-2012)
    1) కురియన్ 2) ఎస్.ఎస్. భట్నాగర్
    3) శాంతి స్వరూప్ 4) నార్మన్ బోర్లాగ్

సమాధానాలు

1) 1; 2) 2; 3) 4; 4) 1; 5) 1; 6) 3; 7) 3; 8) 2; 9) 4; 10) 1; 11) 4.

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశంలో వరి ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రం ఏది?
   1) అసోం 2) పశ్చిమ బెంగాల్
   3) ఆంధ్రప్రదేశ్ 4) ఉత్తరప్రదేశ్
2. భారతదేశంలో తేయాకును ఎక్కువగా ఉత్పత్తి చేసే రాష్ట్రం ఏది?
   1) ఉత్తరాంచల్ 2) తమిళనాడు
   3) అసోం 4) పశ్చిమ బెంగాల్
3. భారత కేంద్రీయ వరి పరిశోధనా సంస్థ ఎక్కడ ఉంది?
   1) కటక్ 2) మైసూర్
   3) కోల్‌కతా 4) బెంగళూరు
4. గ్రీన్ రివల్యూషన్ ప్రభావం దేనిపై ఎక్కువగా కనిపిస్తుంది?
   1) పప్పుధాన్యాలు 2) గోధుమలు
   3) వరి 4) నూనె గింజలు
5. క్షీర విప్లవ పితామహుడు ఎవరు?
   1) రామన్ కురియన్
   2) రామనాథ్ కృష్ణన్
   3) వర్గీస్ కురియన్ 4) జె.ఎం. జోసఫ్
6. పట్టు ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉన్న రాష్ట్రం ఏది?
   1) కేరళ 2) కర్ణాటక
   3) తమిళనాడు 4) మహారాష్ట్ర

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 2; 5) 3; 6) 2.

వివిధ పంటలు - పరిశోధనా సంస్థలు

- జాతీయ వరి పరిశోధనా కేంద్రం - కటక్ (ఒడిశా)
- అంతర్జాతీయ వరి పరిశోధనా కేంద్రం - మనీలా (ఫిలిప్పీన్స్)
- భారత చెరకు పరిశోధనా సంస్థ - లక్నో (ఉత్తరప్రదేశ్)
- సుగంధ ద్రవ్యాల పరిశోధనా కేంద్రం - కాలికట్ (కేరళ)
- కేంద్రీయ పత్తి పరిశోధనా కేంద్రం - నాగపూర్ (మహారాష్ట్ర)
- ఇక్రిసాట్ (International Crops Research Institute for Semi Arid Tropics - ICRISAT) - హైదరాబాద్
- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ - న్యూ ఢిల్లీ
- తేయాకు పరిశోధనా కేంద్రం - జోర్హాట్ (అసోం)
- భారత ప్రభుత్వం 2000 జనవరి 28న మొదటిసారిగా 'జాతీయ వ్యవసాయ విధానాన్ని' ప్రకటించింది. ఇందులో భాగంగా 'ఇంద్రధనస్సు' విప్లవాన్ని ప్రకటించింది. ఈ విప్లవంలో మిశ్రమ వ్యవసాయం కూడా ఒక భాగం.

భారతదేశంలో వివిధ రకాల పంటలు - అధికంగా ఉత్పత్తి చేసే రాష్ట్రాలు

పంట	రాష్ట్రాలు
1. వరి	1. పశ్చిమ బెంగాల్ 2. ఉత్తరప్రదేశ్
2. గోధుమ	1. ఉత్తరప్రదేశ్ 2. పంజాబ్
3. జొన్న	1. మహారాష్ట్ర 2. కర్ణాటక
4. రాగి	1. కర్ణాటక 2. తమిళనాడు
5. వేరుసెనగ	1.గుజరాత్ 2. తమిళనాడు
6. పత్తి	1. గుజరాత్ 2.మహారాష్ట్ర
7. జనుము	1. పశ్చిమ బెంగాల్ 2. బిహార్
8. చెరకు	1. ఉత్తర ప్రదేశ్ 2. మహారాష్ట్ర
9. కాఫీ	1. కర్ణాటక 2. కేరళ
10. తేయాకు	1. అసోం 2. పశ్చిమబెంగాల్
11. రబ్బరు	1. కేరళ
12. పాలు	1. ఉత్తరప్రదేశ్ 2. గుజరాత్

Who amongst the five types the fastest?

BANK EXAMS

REASONING

Model Questions

1. In a certain code, PLANT is written as "$@2H©" and YIELD is written as "b64@%". How is "DELAY" written in that code?
   1) b4H2% 2) b4@2%
   3) %42@b 4) %4@2b
   5) None of these
2. How many meaningful English words can be formed with the letters ARILT using each letter only once in that word?
   1) None 2) One 3) Two
   4) Three 5) More than three
3. D said, "A's father is the only brother of my sister's son." How is A's father related to D?
   1) Cousin2) Nephew 3) Aunt
   4) Data inadequate
   5) None of these

Directions (Q. No. 4-6): The following questions are based on the 5 three-digit numbers given below:
394 632 783 576 895

4. If the positions of the first and the second digit within each number are interchanged, then which of the following will be the second highest number?
   1) 632 2) 783 3) 576
   4) 895 5) 394
5. If the first and second digits of each of the numbers are added, the resulting sum of which of the following numbers will not be exactly divisible by 3?
   1) 895 2) 394 3) 576
   4) 632 5) 783
6. If 2 is added to the last digit of each number and then the positions of the first and the third digits are interchanged, which of the following will be the highest number?
   1) 576 2) 895 3) 783
   4) 394 5) 632
7. If A is coded as 1, B as 3, C as 5 and so on, which of the following is the numerical value of the word "FAZED"?
   1) 81 2) 79 3) 77
   4) 80 5) None of these
8. Which of the following pairs of words have the same



relationship as FAN : HEAT?
   1) Water : Drink
   2) Light : Night
   3) Teach : Student
   4) Air : Breathe 5) Food : Hunger
9. Q types faster than R but not as fast as V. T types faster than R. S types faster than V. Who amongst the five types the fastest?
   1) V 2) T 3) S
   4) Data Inadequate
   5) None of these
10. If "B × C" means "B is the daughter of C", "B + C" means "B is the husband of C" and "B – C" means "B is the sister of C", then what does "M + N – P × Q" mean?
    1) M is the brother-in-law of Q
    2) M is the uncle of Q
    3) M is the son-in-law of Q
    4) Q is the mother-in-law of M
    5) None of these

Directions (Q. No. 11-15): Study the following arrangement carefully and answer the questions given below:
RDAK 5 B I 2M J E N97
UZV1 W 3H4 F Y8 P 6 TG

11. How many such numbers are there in the above arrangement, each of which is immediately preceded by a consonant and immediately followed by a vowel?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three
12. Which of the following is the eighth to the left of the seventeenth from the left end?
    1) M 2) J 3) 8
    4) 5 5) None of these
13. Four of the following five are alike in a certain way based on their positions in the above arrangement and so form a group. Which is the one that does not belong to that group?
    1) E 9 J 2) Z 1 U 3) H W 4
    4) Y 4 8 5) B 2 K
14. Which of the following is the sixth to the right of the nineteenth from the right end?
    1) 5 2) Z 3) V
    4) 1 5) None of these
15. How many such consonants are there in the above arrangement, each of which is immediately preceded by a number and immediately followed by another consonant?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three

Directions (Q. No. 16-19): Each of the questions below consists of a question and two statements numbered I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question. Read both the statements and

Give answer:
1) If the data in statement I alone are sufficient to answer the question, while the data in statement II alone are not sufficient to answer the question.
2) If the data in statement II alone are sufficient to answer the question, while the data in statement I alone are not sufficient to answer the question.
3) If the data either in statement I alone or in statement II alone are sufficient to answer the question.
4) If the data given in both the statements I & II together are not sufficient to answer the question.
5) If the data in both the statements I & II together are necessary to answer the question.

16. How is 'never' written in a code language?
    I) "never ever go there" is written as "na ja ni ho" in that code language.
    II) "go there and come back" is written as "ma ho sa ni da" in that code language.
17. Among M, P, K, J, T and W, who is lighter than only the heaviest?
    I) P is heavier than M and T.
    II) W is heavier than P but lighter than J who is not the heaviest.
18. What does "$" mean in a code language?
    I) "5 $ # 3" means "flowers are really good".
    II) "7 # 3 5" means "good flowers are available".
19. How many students are there between Suresh and Mohan in a row of fifty students?
    I) Suresh is twelfth from the left end and Mohan is seventeenth from the right end.
    II) Suresh is six places away from Jayesh, who is twentieth from the left end.

Key And Explanations

1. Ans: 4

P	L	A	N	T	Y	I	E	D
$	@	2	✷	©	β	6	4	%

\ DELAY Þ %4@2b

2. Ans: 3. TRAIL, TRIAL,
3. Ans: 2. A's father = the only brother of D's sister's son = D's sister's son = D's nephew
4. Ans: 5. Interchanging the first two digits, we get 934, 362, 873, 756 and 985. Of these, 934 is the second highest.
5. Ans: 1. 895 Þ 8 + 9 = 17 is not divisible by 3.
6. Ans: 1. Look for the highest third digit.
7. Ans: 2. In general, n^{th} letter of the alphabet =2n–1 Here, FAZED = 11 + 1 + 51 + 9 + 7 = 79
8. Ans: 5. The first dispels the second.
9. Ans: 4. V > Q > R; T > R; S > V Combining, we get S > V > Q > R and T > R. Hence, either S or T is the fastest.
10. Ans: 3.
```
             Q
             |
M(+) Û N(–)<—>P(–)
```
11. Ans: 1.
12. Ans: 1. 8^{th} to the left of 17^{th} from left = 17 – 8 = 9^{th} from the left = M
13. Ans: 5. In all others, the first and third elements are consecutive ones.
14. Ans: 3. 6^{th} to the right of 19^{th} from the right = 19 – 6 = 13^{th} from the right = V
15. Ans: 4. M, F and T
16. Ans: 4. Only two words are common between I and II.
17. Ans: 5. From I: P > M, T
    From II: J > W > P
    Combining, we get K > J > W > P > M, T Hence, K is the heaviest and J lighter than only the heaviest.
18. Ans: 5.
    From I: 5$#3 = flowers are really good ... (i)
    From II: 7#35 = good flowers are available ... (ii)
    From I and II: 5#3 = flowers are good ... (iii)
    Putting (iii) in (i), we get: $ = really.
19. Ans: 1. **From I:** Suresh = 12^{th} from left
    Mohan = 17^{th} from right
    \ No. of students between them = 50 – 29 (12+17) = 21
    From II: No data about Mohan.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్, డియోఘర్‌లో 20 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్), డియోఘర్‌లో... నాన్ ఫ్యా కల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టుల సంఖ్య: 20.

పోస్టుల వివరాలు: సీనియర్ మెడికల్ ఫిజిసిస్ట్-01, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ఆఫీసర్-01, సీనియర్ ప్రోగ్రామర్-01, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్-01, చీఫ్ ఆప్టోమెట్రిస్ట్/టెక్నికల్ ఆఫీసర్-01, అసిస్టెంట్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ఆఫీసర్-01, సెక్యూరిటీ ఆఫీసర్-01, అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)-01, డైటీషియన్-02, లాండ్రీ మేనేజర్-01, మెడికల్ రికార్డ్ ఆఫీసర్-01, పర్ఫ్యూజనిస్ట్-01, ఆప్టోమెట్రిస్ట్-01, టెక్నీషియన్ రేడియో థెరపిస్ట్-01, జూనియర్ ఆడియాలజిస్ట్, స్పీచ్ థెరపిస్ట్-01, డెంటల్ టెక్నీషియన్ (హైజీనిక్)-01, జూనియర్ మెడికల్ రికార్డ్ ఆఫీసర్-01, ఫైర్ టెక్నీషియన్-02.

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఎస్సీ(మెడికల్, ఫిజిక్స్), ఎండీ(బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్), బీఈ/బీటెక్, ఎంసీఏ, బీఎస్సీ, డిప్లొమా, ఎంసీజే, డిగ్రీ, ఇంటర్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: సీనియర్ మెడికల్ ఆఫీసర్, లాండ్రీ మేనేజర్, సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్‌కు 50 ఏళ్లు, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ఆఫీసర్‌కు 21 నుంచి 40 ఏళ్లు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్, చీఫ్ ఆప్టోమెట్రిస్ట్/టెక్నికల్ ఆఫీసర్‌కు 30 నుంచి 45 ఏళ్లు, అసిస్టెంట్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ఆఫీసర్, ఆప్టోమెట్రిస్ట్, పర్ఫ్యూజనిస్ట్‌కు 18 నుంచి 30 ఏళ్లు, సెక్యూరిటీ ఆఫీసర్‌కు 18 నుంచి 35 ఏళ్లు, ఫైర్ టెక్నీషియన్‌కు 18 నుంచి 27 ఏళ్లు, మిగతా పోస్టులకు 21 నుంచి 35 ఏళ్లు.

ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిక్రూట్‌మెంట్ సెల్, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, డియోఘర్, దేవిపూర్ క్యాంపస్, రామ్‌సాగర్, డియోఘర్-814152, జార్ఖండ్ చిరునామకు పంపించాలి.

దరఖాస్తులకు చివరితేది: 14.03.2025.

వెబ్‌సైట్: https://www.aiimsdeoghar.edu.in/